

'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 261

మంగళవారం 4-6-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



మెక్సికోలో కొత్త చరిత్ర

అధ్యక్ష పీఠంపై షీన్‌బామ్.. తొలి మహిళగా రికార్డు -6లో



నమీబియా గెలుపు 'సూపర్'

టి20 వరల్డ్‌కప్‌లో ఉత్కం'టై' పోరులో ఒమన్‌పై నమీబియా విజయం -12లో



ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు విరుద్ధం

ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నమైన ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ నేత సోనియా గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



విశ్వసనీయత ఎంత?

ఎన్డీఏ అధికారం చేపట్టడం ఖాయమంటున్న ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయతపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అనుమానం వ్యక్తంచేశారు.

వివరాలు 6లో ▸



ఆస్తులు జప్తు చేయండి

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సహా ఇతర నిందితుల ఆస్తులు జప్తు చేయాలని కోర్టును ఈడీ కోరింది.

వివరాలు 14లో ▸



టాలీవుడ్ నటి హేమ అరెస్టు

బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీ కేసులో నటి హేమను సోమవారం బెంగళూరు సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు.

వివరాలు 14లో ▸

ఉత్కంఠకు నేడే తెర

21 రోజుల నిరీక్షణ తర్వాత వెల్లడి కానున్న ఎన్నికల ఫలితాలు

నేటి మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో స్పష్టత

- 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థుల పోటీ
- వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ
- బీజేపీ, జనసేనలతో కలిసి కూటమిగా బరిలోకి దిగిన టీడీపీ
- ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు
- ఉదయం 8 గంటల నుంచే ఈవీఎంల లెక్కింపు ప్రారంభం
- ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు.. 45 వేల మంది పోలీసులు, 67 కంపెనీల సాయుధ బలగాల వినియోగం
- పోలింగ్ కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో పహారా



మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం

సాక్షి, అమరావతి: ఓటర్ల తీర్పు వెల్లడికి కౌంట్ డౌన్ ప్రారంభమైంది. మరి కొద్ది గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఫలితాలపై గత 21 రోజులుగా రాష్ట్ర ప్రజలు, రాజకీయ పార్టీల్లో నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్లను, ఆ తర్వాత 8.30 గంటల నుంచి ఈవీఎంలలో నిక్షిప్తం అయిన ఓట్లను లెక్కిస్తారు. ఇప్పటికే విడుదలైన మెజార్టీ సర్వేల ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వైఎస్సార్‌సీపీ రెండోసారి అధికారం చేపట్టనుందని తేల్చాయి. గత నెల 13వ తేదీన రాష్ట్ర అసెంబ్లీకి, లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరిగింది. అయితే దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించడం, శనివారంతో చివరి దశ పోలింగ్ ముగియడంతో ఫలితాల కోసం జూన్ 4 వరకు వేచి చూడాల్సి వచ్చింది. నేటి మధ్యాహ్నానికి ఫలితాలపై స్పష్టత వస్తుంది. అయితే ఈవీఎం కంట్రోల్ యూనిట్ల ఓట్ల లెక్కింపు పూర్తి అయినప్పటికీ, ప్రతి నియోజకవర్గంలో ఐదు వీవీప్యాట్‌లలోని స్లిప్‌లను కూడా చివర్లో లెక్కించాల్సి ఉంటుంది. అందువల్ల అధికారికంగా ఫలితాల ప్రకటనకు కొంత జాప్యం అవుతుంది.

తొలి ఫలితం కొవ్వూరు, నరసాపురం

రాష్ట్రంలో మొత్తం 4.13 కోట్ల మంది ఓటర్లు ఉండగా, ఇందులో ఈవీఎంల ద్వారా 3.33 కోట్ల మంది, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 5.15 లక్షల మంది

మిగతా 2వ పేజీలో ▶

టిక్.. టిక్.. టిక్..

- మోదీ 3.0నా, ఇండియా కూటమా?
- సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడే

6 లో

64.2 కోట్ల మంది..

సార్వత్రిక ఎన్నికల్లో ఓటెత్తిన పౌరులు



- ఇది ప్రపంచ రికార్డ్.. ఓటర్లకు సెల్యూట్: సీఈసీ రాజీవ్‌కుమార్
- ఈ సంఖ్య జీ7 దేశాల ఓటర్ల కంటే 1.5 రెట్లు ఎక్కువని వెల్లడి
- 2019తో పోలిస్తే రీపోలింగ్ సంఖ్య గణనీయంగా తగ్గిందని ప్రకటన
- తొలిసారిగా కౌంటింగ్‌కు ముందే ప్రెస్‌మీట్

6లో

మన పార్టీ కార్యకర్తలు గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారు

ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలందరూ గొప్ప పోరాట స్ఫూర్తిని చాటారని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కౌంటింగ్ ప్రక్రియలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ.. ప్రజలు మనకు వేసిన ప్రతి ఓటునూ మన పార్టీ ఖాతాలోకి వచ్చేలా అప్రమత్తంగా వ్యవహరించి మన పార్టీకి అఖండ విజయం చేకూరుస్తారని ఆశిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు సోమవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.

- సాక్షి, అమరావతి

జోరుగా విత్తన పంపిణీ

- ఖరీఫ్‌కు 6.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం
- అందుబాటులో 6.50 లక్షల క్వింటాళ్లు
- ఆర్బీకేల్లో 3.16 లక్షల క్వింటాళ్లు నిల్వ
- 40 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట, లక్ష క్వింటాళ్ల వేరుశనగ విత్తనం విక్రయం
- గిరిజన ప్రాంతాల్లో 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలు
- 15వ తేదీ నుంచి మిగిలిన విత్తనాల పంపిణీ

3 లో

దాడి మీ కళ్లకు కనిపించలేదా?

- రాయి విసిరాడా.. లేదా? సీఎంకు తగిలిందా.. లేదా?
- ఒక సీఎంపైకి రాయి విసరడం తప్పా.. కాదా?
- నిస్సిగ్గుగా ఈ విషయాలను వదిలేసి రాయి విసిరిన వాడికి వత్తాసా? హత్య చేసేందుకే పదునైన రాయితో దాడి చేశారన్న పోలీసులు
- పూర్తి ఆధారాలతో నిందితుడు సతీశ్ పాత్ర నిర్ధారించారు
- ఏ నిందితుడైనా తప్పు వెంటనే ఒప్పుకుంటాడా?
- ఈ మాత్రం కనీస పరిజ్ఞానం లేకుండా రామోజీ వత్తాసు

10 లో

రాష్ట్రంలో రూ.483.15 కోట్ల నగదు, సొత్తు స్వాధీనం

ఇందులో రూ.170 కోట్ల నగదు.. రూ.61.66 కోట్ల విలువైన మద్యం, రూ.35.97 కోట్ల డ్రగ్స్..

- రూ.186.17 కోట్ల విలువైన ఆభరణాలు.. రూ.29.34 కోట్ల విలువైన ఉచితాలు స్వాధీనం
- వీటికి సంబంధించి 11,249 కేసులు నమోదు
- కోడ్ ఉల్లంఘనలపై 1,270 కేసులు
- ఎన్నికల హింసలో ఇద్దరు మృతి.. 912 మందికి గాయాలు
- సి-విజిల్ ద్వారా 24,557 ఫిర్యాదులు.. ఇందులో 95 శాతం వంద నిమిషాల్లో పరిష్కారం
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఈ ఏడాది జనవరి 1 నుంచి ఈనెల 2 వరకు రూ.483.15 కోట్ల విలువైన నగదు ఇతర సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లతోపాటు ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా చేపట్టిన చర్యలను సోమవారం సచివాలయంలో ఆయన మీడియాకు వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా రూ.170 కోట్ల నగదు, రూ.61.66 కోట్ల విలువైన లిక్కర్, రూ.35.97 కోట్ల విలువైన డ్రగ్స్, రూ.186.17 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.29.34 కోట్ల విలువైన ఉచితాల వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. వీటన్నింటికీ సంబంధించి 11,249 కేసులను, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి 1,270 కేసులను నమోదు చేసినట్లు మీనా తెలిపారు. ఇక ఎన్నికల హింసలో ఇద్దరు మృతిచెందగా 912 మందికి గాయాలయ్యాయన్నారు. ఈ హింస సందర్భంగా రూ.1,19,13,650 కోట్ల విలువైన

మిగతా 3వ పేజీలో ▶

జూలై 28న గ్రూప్-2 మెయిన్స్



- రేపటి నుంచి పరీక్ష సెంటర్, పోస్టు, జోనల్ ఆప్షన్స్ నమోదు
- 899 పోస్టుల భర్తీకి గత ఏడాది డిసెంబర్ 7న నోటిఫికేషన్
- ఫిబ్రవరి 25న ప్రిలిమ్స్.. ఏప్రిల్ 10న ఫలితాల ప్రకటన
- 1:100 చొప్పున అభ్యర్థులకు అవకాశం
- మెయిన్స్‌కు 92,250 మంది అర్హత

14 లో

రూ. 14 లక్షల కోట్లు

ఒక్కరోజులో పెరిగిన మదుపర్ల సంపద

- కేంద్రంలో మళ్లీ ఎన్డీఏ ప్రభుత్వమే వస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో కదం తొక్కిన స్టాక్ మార్కెట్
- 2,507 పాయింట్ల పోల్‌వాల్ట్.. కొత్త రికార్డ్ 76,469కు సెన్సెక్స్
- నిఫ్టీ 733 పాయింట్ల హైజంప్.. చరిత్రాత్మక గరిష్టం 23,264కు



బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి కేంద్రంలో మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయనుందనే ఎగ్జిట్ పోల్స్ అంచనా స్టాక్ మార్కెట్‌కు కొత్త జోష్‌నిచ్చింది. అటు క్యూ4 జీడీపీ అంచనాలను మించి 7.8 శాతం వృద్ధి సాధించడం మార్కెట్‌కు ఉత్సాహాన్నిచ్చింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ సోమవారం 3.4 శాతం లాభాలతో కొత్త శిఖరాలకు పరుగులు తీశాయి. సెన్సెక్స్ ఏకంగా 2,507 పాయింట్లు ర్యాలీ చేసి చరిత్రాత్మక గరిష్టం 76,469 వద్ద నిలిచింది! నిఫ్టీ సైతం 733 పాయింట్లు జంప్ చేసి సరికొత్త రికార్డ్‌తో 23,264 వద్ద ముగిసింది. సోమవారం ఇన్వెస్టర్ల సంపద రూ. 14 లక్షల కోట్లు పెరిగింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో ట్రేడవుతున్న లిస్టెడ్ కంపెనీల విలువ విడిగా 5 ట్రిలియన్ డాలర్లను అధిగమించింది!! - 13లో

పోలింగ్ తర్వాత ఈవీఎంలను మార్చేశారు



- ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ భగేల్ తీవ్ర ఆరోపణలు
- నేను పోటీ చేసిన రాజ్‌నంద్‌గావ్‌లో జరిగింది
- చాలా లోక్‌సభ స్థానాల్లోనూ ఇలాగే చేశారు
- ఈసీకి ఫిర్యాదు చేస్తా

6 లో



కేవలం పెళ్లి కాలేదు కాబట్టి చిన్నవాడని అనుకుంటున్నార్సార్!!

చురుగ్గా విస్తరిస్తున్న నైరుతి

రెండు రోజుల్లో రాష్ట్రమంతా వ్యాపించే అవకాశం

- కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాలు
- నేడు, రేపు అక్కడక్కడా భారీ వర్షాలు



సాక్షి, విశాఖపట్నం/అమరావతి: రాష్ట్రంలోకి ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. ఇప్పటికే రాయలసీమ, నెల్లూరులోకి ప్రవేశించిన రుతుపవనాలు సోమవారం కోస్తాంధ్రలోని కృష్ణా, ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల వరకు, పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. రానున్న రెండు మూడు రోజుల్లో ఇవి కోస్తాంధ్రలోని మిగిలిన ప్రాంతాలకు వ్యాపించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. మరోవైపు పశ్చిమ మధ్య, నైరుతి బంగాళాఖాతంలో దక్షిణ కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు తీరాలకు ఆనుకుని ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఆవరించి ఉంది. ఇది ఎత్తుకు వెళ్లే కొద్దీ నైరుతి వైపు వంగి ఉంది. నైరుతి రుతుపవనాలు, ఆవర్తనం ఫలితంగా రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మంగళవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం..

మిగతా 10వ పేజీలో ▶

వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం

సంబరాలకు సిద్ధం కండి..

- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల పిలుపు
- ఎన్నికల సంఘాన్ని మేనేజ్ చేసి అధికారులను భయపెట్టాలని చంద్రబాబు ప్రయత్నం
- అందుకే కౌంటింగ్ సమయంలో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఏజెంట్లకు దిశానిర్దేశం
- గెలుపొందినట్లు డిక్లరేషన్ ఫారం ఇచ్చాకే కౌంటింగ్ కేంద్రం నుంచి వెలుపలికి రావాలని సూచన
- కళ్లెదుట ఘోర పరాజయం కన్పిస్తోంది కాబట్టే చంద్రబాబు మౌనం



- పోస్టల్ బ్యాలెట్లపై దేశవ్యాప్తంగా ఒక రూల్.. రాష్ట్రంలో మరో రూలా? ఇదెక్కడి న్యాయం?
- ఇండియా టుడే–యాక్సిస్ మై ఇండియా వంటి జాతీయ మీడియా ఎగ్జిట్ పోల్స్ చూసి జనం నవ్వుకుంటున్నారు
- టీడీపీ–జనసేన–బీజేపీలకు వచ్చే సీట్లు, ఓట్ల శాతమే ఇందుకు నిదర్శనం

2 లో

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు



- టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు
- శాసనమండలిలో ప్రభుత్వ విప్ విక్రాంత్ ఫిర్యాదు
- విచారణలో రుజువు కావడంతో ఆయన సభ్యత్వాన్ని రద్దుచేసిన మండలి చైర్మన్

3 లో



ఎన్టీఆర్ జిల్లా నిమ్రా ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రం



కౌంటింగ్ కేంద్రంలో సిద్ధమైన సామగ్రి





కౌంటింగ్ కేంద్రం వద్ద సీఆర్పీఎఫ్ భద్రతా సిబ్బంది

ఉత్కంఠకు నేడే తెర

▶ మొదటి పేజీ తరువాయి

ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలు, వృద్ధులు అత్యధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా రికార్డు స్థాయిలో 81.8 శాతం ఓటింగ్ నమోదైంది. 175 అసెంబ్లీ స్థానాలకు 2,387 మంది, 25 లోక్‌సభ స్థానాలకు 454 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఓట్ల లెక్కింపు కోసం 33 చోట్ల 401 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ తర్వాత కొన్ని చోట్ల హింసాత్మక సంఘటనలు చేటు చేసుకోవడంతో, ఓట్ల లెక్కింపు సందర్భంగా అటువంటి సంఘటలను పునరావృతం కాకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు 111 అసెంబ్లీ స్థానాల్లో 5 - 6 గంటల్లోనే పూర్తి కానుంది. 61 నియోజకవర్గాల్లో 6 - 8 గంటలు, మూడు నియోజకవర్గాల్లో 9 - 10 గంటల సమయం పట్టనుంది. పార్లమెంటు ఫలితాలకు సంబంధించి 13 రౌండ్లు ఉన్న రాజమండ్రి, నరసాపురం ఫలితాలు తొలుత వెల్లడి కానుండగా, 27రౌండ్ల లెక్కింపు ఉన్న అమలాపురం ఫలితం ఆలస్యంగా రానుంది. అసెంబ్లీ విషయానికొస్తే ఐదు గంటల్లోపే తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, నరసాపురం ఫలితాలు.. ఆలస్యంగా భీమిలి, పాణ్యం ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ఒంటరిగా సిద్ధం

వైఎస్సార్‌సీపీ ఎవరితో పొత్తు లేకుండా ఒంటరిగానే 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసింది. తెలుగుదేశం పార్టీ జనసేన, బీజేపీలతో జట్టు కట్టి కూటమిగా పోటీలో నిలిచింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం పేరుతో ముందస్తుగా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోగా, తెలుగుదేశం పార్టీ సీట్ల పంపకం, అభ్యర్థుల ఎంపికపై సిగపట్లు పడుతూ ప్రచారంలో వెనుకబడ్డారు. టీడీపీ 144 అసెంబ్లీ, 17 పార్లమెంటు స్థానాల్లో, భారతీయ జనతాపార్టీ ఆరు పార్లమెంటు, 10 అసెంబ్లీ.. జనసేన రెండు పార్లమెంటు, 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో సామాన్యులను అభ్యర్థులుగా నిలబెట్టగా, తెలుగుదేశం పార్టీ పొత్తులు పెట్టుకొని తమ పార్టీకి చెందిన అభ్యర్థులను బీజేపీ, జనసేనల్లోకి పంపి అభ్యర్థులుగా నిలబెట్టింది.

ఫలితాలు ఇలా తెలుసుకోవచ్చు..

ఎన్నికల సరళిని, ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియచేసేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. లెక్కింపులో ఒక రౌండు పూర్తి కాగానే ఆ ఫలితాలను కౌంటింగ్ సెంటర్ వద్ద మైక్‌లో వెల్లడించడంతో పాటు, మీడియా ప్రతినిధులకు కనపడే విధంగా డిస్‌ప్లే బోర్డులను కూడా ఏర్పాటు చేసింది. ప్రతి రౌండు ఫలితాలను సువిధా యాప్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. నియోజకవర్గ ఫలితాలతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల ఫలితాలను తెలుసుకోవడానికి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను, యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. https://results.eci.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చు. దీంతోపాటు 'ఓటర్స్ హెల్ప్‌లైన్' అనే యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా ఎన్నికల ఫలితాల సరళిని తెలుసుకోవచ్చు.

25,209 మంది సిబ్బంది: ముఖేష్ కుమార్ మీనా

రాష్ట్రంలో 175 అసెంబ్లీ స్థానాల్లో 2,387 మంది, 25 పార్లమెంటు స్థానాల్లో 454 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. సోమవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు కోసం 25,209 మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపును పర్యవేక్షించడానికి 119 మంది కేంద్ర అబ్జర్వర్లు ఇప్పటికే రాష్ట్రానికి చేరుకున్నారన్నారు. పార్లమెంటు స్థానాలకు తొలుత 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభించి, 8.30 తర్వాత ఈవీఎంల లెక్కింపును కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌లో డిక్లరేషన్ ఫారంపై రిటర్నింగ్ అధికారి నియమించిన అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం ఉంటే సరిపోతుందని, దీనిపై ఇక ఎటువంటి అభ్యంతరాలను అనుమతించమని స్పష్టం చేశారు. ఈసారి అత్యధిక సంఖ్యలో పోస్టల్ బ్యాలెట్లు నమోదు కావడంతో 25 చోట్ల నాలుగు రౌండ్లు కూడా లెక్కింపు జరగనుందన్నారు. ప్రతి 500 ఓట్లు ఒక రౌండ్‌గా లెక్కిస్తామని, ఇది సుదీర్ఘ ప్రక్రియ కావడంతో ఒక్కో రౌండ్ పూర్తి కావడానికి కనీసం రెండున్నర గంటల సమయం పడుతుందని చెప్పారు. అదే ఈవీఎంల లెక్కింపులో ప్రతి రౌండు సగటున 25 నిమిషాల నుంచి 30 నిమిషాల్లో పూర్తవుతుందన్నారు. లెక్కింపు ప్రారంభమైన అయిదు గంటల్లోనే మెజార్టీ నియోజకవర్గాల ఫలితాలు వెల్లడవుతాయని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద 45,000 పోలీసు సిబ్బందితో పాటు 67 కంపెనీల సాయుధ బలగాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో కూడా నిఘా పెట్టామని, లోపల ఈవీఎంల తరలింపు నుంచి ఓట్ల లెక్కింపు మొత్తం వీడియో చిత్రీకరణ చేస్తామన్నారు. ఏజెంట్లు తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలని, దురుసుగా వ్యవహరిస్తే ఎన్నికల నిబంధన 54 కింద కౌంటింగ్ హాల్ నుంచి బయటకు పంపిస్తామని స్పష్టం చేశారు. రీ కౌంటింగ్ కోరితే దానికి గల స్పష్టమైన కారణాలను లిఖిత పూర్వకంగా ఇవ్వాలన్నారు. ఆ కారణాలతో ఆర్వో ఏకీభవిస్తేనే రీ కౌంటింగ్‌కు అనుమతిస్తారని చెప్పారు. కౌంటింగ్ హాళ్లలోకి మొబైల్ ఫోన్లను అనుమతించరని స్పష్టం చేశారు. కౌంటింగ్ తర్వాత అభ్యర్థి గెలిచినట్లు ఫారం 20 ఇవ్వడానికి కనీసం గంట- గంటన్నర పడుతుందని, అప్పటి వరకు అభ్యర్థి వేచి ఉండాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం మద్యం అమ్మకాలపై నిషేధం విధించామని తెలిపారు.

కౌంటింగ్ ముంగిట మరో కుట్ర

- పోలీస్ కంట్రోల్ రూమ్‌లో 'పచ్చ'ఖాకీ
- వివాదాస్పద పోలీసు అధికారి ఏఆర్ దామోదర్‌కు హఠాత్తుగా కీలక పోస్టింగ్
- పోలీసు ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ బాధ్యతలు అప్పగింత
- టీడీపీ విధ్వంసకాండకు కొమ్ముకాసేందుకేనా!?
- విస్మయం కలిగిస్తున్న ఈసీ, పోలీసు ఉన్నతాధికారుల నిర్ణయం



సాక్షి, అమరావతి: కీలకమైన ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసు శాఖ వివాదాస్పద నిర్ణయం తీసుకోవడం విస్మయపరుస్తోంది. చంద్రబాబు ఒత్తిడికి ఎన్నికల కమిషన్ (ఈసీ), రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు తలొగ్గి వ్యవహరిస్తున్నారన్నది మరోసారి స్పష్టమైంది. అత్యంత వివాదాస్పద పోలీసు అధికారిగా గుర్తింపు పొందిన ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ (పీటీసీ) ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు హఠాత్తుగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని ఈ కంట్రోల్ రూమ్ బాధ్యతలు అప్పగించడం గమనార్హం. అదీ పంజాబ్ ఎన్నికల పరిశీలకుడిగా వెళ్లిన ఆయన పోలింగ్ ముగిసిన తరువాత వ్యక్తిగత పనులపై సెలవులో ఉన్నారు. సెలవులో ఉన్న దామోదర్‌ను హఠాత్తుగా పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని.. కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తించాలని ఉత్తర్వులు జారీచేయడం వెనుక ఏదో పెద్ద గూడుపుఠాణి ఉందన్నది స్పష్టమవుతోంది.

టీడీపీకి వీర విధేయుడు..

2007 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ దామోదర్ అత్యంత వివాదాస్పద అధికారిగా గుర్తింపు పొందారు. ప్రధానంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా వైఎస్సార్‌సీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేసి టీడీపీలో చేరడంలో కీలకపాత్ర పోషించిన రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు ఆయన అత్యంత సన్నిహితుడు. వారి మధ్య బంధుత్వం కూడా ఉందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు, ఏబీ వెంకటేశ్వరరావు అండతో ఆయన అడ్డగోలుగా వ్యవహరించారు. పశ్చిమ గోదావరి జిల్లా అదనపు ఎస్పీగా ఆయన వివాదాలకు కేంద్ర బిందువయ్యారు. ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక నాన్ కేడర్ ఎస్పీ అయినప్పటికీ దామోదర్‌ను 2019 సంవత్సరంలో ఎన్నికల కోసమని విజయనగరం జిల్లా ఎస్పీగా నియమించారు. వైఎస్సార్‌సీపీ పటిష్టంగా ఉన్న విజయనగరం జిల్లాలో టీడీపీకి అనుకూలంగా వ్యవహరించేందుకే ఆయనకు ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. అనుకున్నట్లుగానే 2019 ఎన్నికల పోలింగ్ రోజున టీడీపీ రౌడీమూకలు కర్రలు, కత్తులతో బీభత్సం సృష్టించి కురుపాం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని బంధించాయి. దాదాపు నాలుగు గంటలపాటు టీడీపీ రౌడీమూకలు స్వైర విహారం చేసినా పోలీసులు, ఎస్పీగా ఉన్న దామోదర్ సైతం పట్టించుకోలేదు. సరికదా అదనపు బలగాలను కూడా అక్కడికి పంపించలేదు. అప్పట్లో విశాఖపట్నం డీఐజీ స్పందించి అదనపు బలగాలను కురుపాం పంపించడంతో నాలుగు గంటల తరువాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అదీ దామోదర్ అసమర్థ, నిర్లక్ష్యపూరిత ట్రాక్ రికార్డ్.

అలాంటి అధికారికి కంట్రోల్ రూమ్ బాధ్యతలా?

ఎన్నికల విధుల్లో ఉద్దేశపూర్వకంగా అంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఆర్ దామోదర్‌కు ప్రస్తుతం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్ బాధ్యతలు అప్పగించారు. డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, ఈసీకి నోడల్ అధికారిగా ఉన్న అదనపు డీజీ (శాంతి, భద్రతలు) శంకబ్రాత బాగ్చీ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా రాష్ట్రంలో హింసాత్మక సంఘటనలు చెలరేగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం, ఎక్కడైనా విధ్వంసకర సంఘటనలు జరిగితే వెంటనే పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం, అందుకోసం జిల్లా ఎస్పీలకు తగిన ఆదేశాలు జారీచేయడం ఆయన బాధ్యత. అంటే.. డీజీపీ తరఫున జిల్లా ఎస్పీలకు ఆయనే ఆదేశాలు జారీ చేస్తారు. 2019 ఎన్నికల్లో హింసాత్మక సంఘటనలను అడ్డుకోవడంలో విఫలమైన ఆయన ప్రస్తుతం కంట్రోల్ రూమ్ బాధ్యతలను ఎలా నిర్వహించగలరని డీజీపీ, అదనపు డీజీ భావించారో అర్థంకావడంలేదు. టీడీపీకి అనుకూలంగా వ్యవహరించేందుకే దామోదర్‌కు ఈ బాధ్యతలు అప్పగించారా అనే సందేహాలు బలపడుతున్నాయి. ఇటీవల పోలింగ్ రోజున పల్నాడు నుంచి అనంతపురం జిల్లా వరకు టీడీపీ గూండాలు విధ్వంసానికి పాల్పడ్డాయి. అదే రీతిలో కౌంటింగ్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా దాడులు, దౌర్జన్యానికి కుట్ర పన్నుతున్నాయని నిఘా వర్గాలు ఇప్పటికే వెల్లడించాయి. అయినాసరే.. టీడీపీకి అనుకూల అధికారిగా గుర్తింపు పొందిన దామోదర్‌కు కంట్రోల్ రూమ్ బాధ్యతలు అప్పగించడం వెనుక పక్కా కుట్ర ఉన్నట్లుగా స్పష్టమవుతోంది. టీడీపీ విధ్వంసకాండకు కొమ్ముకాసేందుకు.. టీడీపీ గూండా మూకలపై కఠిన చర్యలు తీసుకోకుండా ఎస్పీలను నిలువరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు వర్గాలే వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం.

వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలి

- ఉ.6 గంటలకల్లా లెక్కింపు కేంద్రం దగ్గర ఉండాలి
- ఫారం-17 సీ కాపీని తీసుకెళ్లాలి
- పోటీలో ఉన్న అభ్యర్థులందరి ప్రతి ఓటునూ కరెక్టుగా నోట్ చేసుకోవాలి
- ఏదైనా తప్పు కన్పిస్తే అక్కడే ఉన్న ఆర్వోకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి
- వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధి కొమ్మసాని శ్రీనివాసులరెడ్డి



సాక్షి, అమరావతి: కౌంటింగ్ సమయంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ప్రతినిధి, హైకోర్టు న్యాయవాది కొమ్మసాని శ్రీనివాసులరెడ్డి సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఆయన ఏమన్నారంటే..

- ఉ.6 గంటలకల్లా ఏజెంట్లు కౌంటింగ్ హాల్ దగ్గర ఉండాలి. ఫారం-17 సీ కాపీని తీసుకెళ్లాలి.
- పోటీలో ఉన్న అభ్యర్థులందరి ప్రతి ఓటు కరెక్టుగా నోట్ చేసుకోవాలి. ఏదైనా తప్పు కన్పిస్తే వెంటనే అక్కడే ఉన్న ఆర్వోకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి.
- అనారోగ్యం, ఇతర కారణాలతో బయటకు వచ్చేవారు రిటర్నింగ్ అధికారికి చెప్పి బయటకు రావాలి. ఒకసారి బయటకొస్తే లోపలికి రానివ్వరని గమనించాలి.
- స్వతంత్ర అభ్యర్థులకు పోలైన ఓట్లను కూడా జాగ్రత్తగా నోట్ చేసుకోవాలి.
- ఏజెంట్లు ప్రతి రౌండ్ తర్వాత షీట్‌పై సంతకం చేసే ముందు మన పార్టీ అభ్యర్థి ఓట్లు మాత్రమే కాకుండా, టీడీపీ-జనసేన-బీజేపీ, ఇతర అభ్యర్థులకు పోలైన ఓట్లను స్పష్టంగా సరిచూసుకోవాలి. తేడా ఉన్నట్లుగా గుర్తిస్తే మరొకమారు కౌంటింగ్ చేయమని కోరాలి. అన్ని సరిపోయినప్పుడే సంతకం చేయాలి.
- కౌంటింగ్ ఏజెంట్లతో అభ్యర్థి టచ్‌లో ఉంటూ అక్కడ ఏదైనా అవాంతరాలు ఎదురైతే, కౌంటింగ్ ఏజెంట్‌తో కానీ, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌తో కానీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. అక్కడ పరిష్కారం కాకపోతే వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకురావాలి.
- ఏదైనా తప్పు జరుగుతోంది అని కౌంటింగ్ కేంద్రంలో గుర్తిస్తే చక్కటి లాజిక్‌తో ఆర్వోకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి.
- రిజెక్ట్ అయిన పోస్టల్ బ్యాలెట్ కంటే తక్కువ మార్జిన్ వచ్చి ఉంటే మళ్లీ పోస్టల్ బ్యాలెట్స్‌ని లెక్కించమని కోరే అధికారం అభ్యర్థికి, కౌంటింగ్ ఏజెంట్‌కి ఉంది.
- పోస్టల్ ఓట్లను సంబంధిత ఫారంలో నింపి అభ్యర్థి, అబ్జర్వర్ కూడా చూసి సంతకం చేసిన తర్వాత ఆ రౌండ్ ఫలితం ప్రకటిస్తారు.
- కౌంటింగ్ పూర్తయి డిక్లరేషన్ ఫామ్ ఇచ్చేవరకు కౌంటింగ్ హాల్‌లో అభ్యర్థి ఉండాలి.

దిగుబడులు పెంచుతున్న రైతు 'బడులు'

ఉత్తమ యాజమాన్య పద్ధతులపై ఏడాది పొడవునా శిక్షణ

- 6నుంచి 17 శాతం తగ్గిన సాగు వ్యయం
- 9 నుంచి 20 శాతం మేర పెరిగిన దిగుబడులు
- ఆక్వాలో హెక్టార్‌కు 5-7 శాతం మేర తగ్గిన ఉత్పత్తి వ్యయం
- 10 శాతానికి తగ్గిన యాంటీబయోటిక్స్ వినియోగం
- 15-20 శాతం మేర పెరిగిన పాల దిగుబడి
- పాడి పశువుల్లో 20 శాతం వ్యాధుల నియంత్రణ

సాక్షి, అమరావతి: నాణ్యమైన దిగుబడులే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా ఏడాది పొడవునా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించేందుకు పొలం బడులు.. పట్టు దిగుబడులు పెంచేందుకు పట్టుబడులు, ఉద్యాన రైతుల కోసం తోట బడులు, ఆక్వా రైతుల కోసం మత్స్య సాగు బడులు, పాడి రైతుల కోసం పశు విజ్ఞాన బడులు నిర్వహిస్తోంది. 'ఈ-ఫార్మర్స్ ఫీల్డ్ స్కూల్స్' ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు ఉత్పత్తుల్లో నాణ్యతతో పాటు దిగుబడులు కూడా గణనీయంగా పెరిగాయి. ఆక్వా ఉత్పత్తుల్లో మితిమీరిన విషపూరిత రసాయనాలు (యాంటీబయోటిక్స్) వినియోగానికి బ్రేకులు పడ్డాయి. పాల దిగుబడులు గణనీయంగా పెరిగాయి. ఈ ఐదేళ్లలో సుమారు 10 లక్షల మందికి పైగా రైతులకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వగలిగింది.

వ్యవసాయ, ఉద్యాన పంటల్లో..

వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో విత్తు నుంచి కోతల వరకు 14 వారాల పాటు క్షేత్ర ఆధారిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. సమగ్ర సస్యరక్షణ, పోషక, నీటి, కలుపు యాజమాన్య పద్ధతులతోపాటు కూలీల ఖర్చును తగ్గించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. సమగ్ర పంట నిర్వహణ పద్ధతుల్ని పాటించడం ద్వారా సాగు వ్యయం 6 నుంచి 17 శాతం ఆదా కాగా.. 9 నుంచి 20 శాతం మేర దిగుబడులు పెరిగాయని రైతులు చెబుతున్నారు. ఉదాహరణకు ఎకరాకు వరిలో 275 కేజీలు, మొక్కజొన్నలో 300 కేజీలు, పత్తిలో 45 కేజీలు, వేరుశనగలో 169 కేజీలు, అపరాల్లో 100 కేజీల అదనపు దిగుబడులు సాధించారు. అలాగే పట్టు సాగుబడుల ద్వారా పట్టుగూళ్ల ఉత్పాదకత ప్రతి వంద గుడ్లకు 60 కేజీల నుంచి 77 కేజీలకు పెరిగింది.



ఆక్వా ఉత్పత్తుల్లో తగ్గిన యాంటీబయోటిక్స్ వినియోగం

సర్టిఫై చేసిన సీడ్, ఫీడ్ అందించే లక్ష్యంతో అప్సడా, సీడ్ ఫీడ్ యాక్టుల్ని తీసుకురావడంతోపాటు రూ.50.30 కోట్లతో 35 ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్‌లను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన సీడ్ ఫీడ్ అందుబాటులోకి తీసుకొచ్చింది. నాణ్యమైన ఆక్వా దిగుబడులు సాధించడం ద్వారా యాంటీబయోటిక్స్ వినియోగాన్ని మరింత తగ్గించే లక్ష్యంతో ఆర్బీకేల ద్వారా నిర్వహిస్తున్న మత్స్య సాగుబడులు సత్ఫలితాలిస్తున్నాయి. మితిమీరిన యాంటీబయోటిక్స్ వినియోగం వల్ల అమెరికా, చైనా సహా యూరప్, మధ్య ఆసియా దేశాలు గతంలో మన ఆక్వా ఉత్పత్తులను తిరస్కరించేవి. మత్స్య సాగుబడుల ద్వారా ఇస్తున్న శిక్షణ ఫలితంగా యాంటీబయోటిక్స్ శాతం గణనీయంగా తగ్గించగలిగారు. గతంలో 37.5 శాతం నమోదైన యాంటీబయోటిక్స్ అవశేషాలు ప్రస్తుతం 5-10 శాతం లోపే ఉంటున్నాయని చెబుతున్నారు. ఉత్పత్తి ఖర్చులు 5-7 శాతం తగ్గడంతోపాటు దిగుబడులు సైతం 10-15 శాతం మేర పెరిగినట్టు గుర్తించారు. గడచిన ఐదేళ్లలో ఏపీ నుంచి రొయ్యల కన్‌సైన్‌మెంట్లను తిప్పిపంపిన ఘటనలు చోటుచేసుకోకపోవడమే ఇందుకు నిదర్శనం.

పశువుల్లో తగ్గిన వ్యాధులు

మరోపక్క ఆర్బీకేల ద్వారా నిర్వహిస్తున్న పశు విజ్ఞాన బడుల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలనలో మూగ, సన్న జీవాలకు సీజన్‌లో వచ్చే వ్యాధులు 20-30 శాతం మేర తగ్గాయని గుర్తించారు. ఈనిన 3 నెలలకే ఎద లక్షణాలు గుర్తించి కృత్రిమ గర్భధారణ చేయించడం వల్ల ఏడాదికో దూడను పొంది పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోగలుగుతున్నారు. దూడలు పుట్టుక మధ్య కాలం తగ్గడంతో లీటరున్నరకు పైగా పాల దిగుబడి (15-20 శాతం) పెరిగిందని, ఆ మేరకు రైతుల ఆదాయం పెరిగిందని గుర్తించారు. దూడ పుట్టిన నాటినుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకుని వాటిని అవలంబించడం ద్వారా దూడల్లో మరణాల రేటు 15 శాతం, సకాలంలో పశు వైద్య సేవలందించడం వల్ల 10 శాతం మేర పశువుల మరణాలు తగ్గినట్టు గుర్తించారు.

హెక్టార్‌కు 4 టన్నుల దిగుబడి

నేను 12 హెక్టార్లలో ఆక్వా సాగు చేస్తున్నా. ఆర్బీకే ద్వారా ఎంపిక చేసుకున్న నాణ్యమైన సీడ్ వేశా. మత్స్య సాగుబడుల్లో చెప్పిన సాగు విధానాలు పాటించా. సిఫార్సు చేసిన ప్రోబయోటిక్స్, ఇమ్యునోస్టిమ్యులెంట్స్‌ను మాత్రమే వినియోగించా. గతంలో తెగుళ్ల నివారణ కోసం హెక్టార్‌కు రూ.80 వేల నుంచి రూ.లక్ష ఖర్చు పెడితే ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు మించి ఖర్చవలేదు. గతంలో హెక్టార్‌కు 3నుంచి 3.2 టన్నుల దిగుబడి రాగా.. ఇప్పుడు 4 టన్నుల దిగుబడితో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు అదనపు ఆదాయం వచ్చింది.

–పి.లక్ష్మీపతిరాజు, కరప, తూర్పు గోదావరి జిల్లా

పశువిజ్ఞాన బడులతో ఎంతో మేలు

మా గ్రామంలో 26 మంది రైతులు 3,600 గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాం. రోగాలొస్తే తప్ప పశువైద్యుల దగ్గరకు వాటిని తీసుకెళ్లే వాళ్లం కాదు. తరచూ వ్యాధుల బారిన పడుతూ మృత్యువు పాలయ్యేవి. తగిన బరువు తూగక ఆర్థికంగా నష్టపోయే వాళ్లం. పశువిజ్ఞాన బడుల వల్ల క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తుండటంతో వ్యాధులు, మరణాల రేటు తగ్గింది. సబ్సిడీపై ఇస్తున్న పచ్చిమేత, సమీకృత దాణాను తీసుకోగలుగుతున్నాం. సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక బరువును పొంది అధిక లాభాలను ఆర్జిస్తున్నాం.

– బమ్మిడి అప్పలరాజు, తొడగువానిపాలెం, విశాఖ జిల్లా

సంబరాలకు సిద్ధంకండి

వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయం

పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తుందని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఎన్నికల సంఘం మంగళవారం ఓట్ల లెక్కింపు చేపడుతుందని.. వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని, ఉ.10.30 గంటల నుంచి సంబరాలకు సిద్ధంకావాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం సజ్జల మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. ఇండియా టుడే-మై యాక్సిస్ ఎగ్జిట్ పోల్స్ బోగస్ అంటూ కొట్టిపారేశారు. ఆ సంస్థ జనసేన, బీజేపీకి ఎగ్జిట్ పోల్స్‌లో ఇచ్చిన స్థానాలు, ఓట్ల శాతమే అందుకు నిదర్శనమన్నారు. ఆ ఎగ్జిట్ పోల్స్‌లో 21 స్థానాల్లో పోటీచేసిన జనసేనకు ఏడు శాతం ఓట్లు వస్తాయని పేర్కొన్నారని.. ఈ లెక్కన ఒక్కో శాసనసభ స్థానంలో జనసేన అభ్యర్థికి 61 శాతం ఓట్లు రావాల్సి ఉంటుందని.. ఇది సాధ్యమయ్యే పనేనా? అంటూ ప్రశ్నించారు. బీజేపీ వ్యూహంలో భాగంగా దక్షిణాదిలో నాలుగు సీట్లు ఎక్కువ వచ్చినట్లు చూపించే ప్రయత్నంలో ఇది భాగమని చెప్పారు. బీజేపీ కూటమిలో టీడీపీ భాగస్వామి కాకపోయి ఉంటే.. ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా ఈ రీతిలో ఎగ్జిట్ పోల్స్ వెల్లడించేదే కాదన్నారు. స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్టుపై రాష్ట్రంలో అసలు చర్చే జరగలేదని.. దానివల్ల టీడీపీకి ప్రజల్లో సానుభూతి వచ్చిందని ఆ సంస్థ పేర్కొనడం విడ్డూరమన్నారు. టైమ్స్ నౌ, దైనిక్ భాస్కర్ సహా రాష్ట్రంలోని పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న సంస్థలు నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధిస్తున్నట్లు తేల్చాయని సజ్జల గుర్తుచేశారు. ఆ సంస్థలు ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొన్న స్థానాల కంటే వైఎస్సార్‌సీపీ అధిక స్థానాల్లో విజయం సాధిస్తుందని స్పష్టంచేశారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వైఎస్సార్‌సీపీ కౌంటింగ్ ఏజెంట్లందరూ అప్రమత్తంగా ఉండాలని సజ్జల పిలుపునిచ్చారు. సంయమనంతో వ్యవహరిస్తూ.. వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి వచ్చిన ఒక్క ఓటు కూడా పోకుండా అభ్యర్థి ఖాతాలో పడేలా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. కౌంటింగ్ పూర్తయి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపొందినట్లు డిక్లరేషన్ తీసుకునే వరకు కౌంటింగ్ కేంద్రం నుంచి కదలవద్దని సజ్జల కోరారు.

టీడీపీ విజ్ఞప్తి మేరకే ఆ సడలింపులు

ఇక పోస్టల్ బ్యాలెట్ విషయంలో ఎన్నికల సంఘం సడలింపులను సుప్రీంకోర్టు కొట్టేసినంత మాత్రానా వాళ్లు చేసింది తప్పు తప్పు కాకుండా పోదన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ నిబంధనలను సడలించడంలో ఆంతర్యమేమిటని.. పోస్టల్ బ్యాలెట్ల అంశంలో దేశవ్యాప్తంగా ఒక రూలూ.. రాష్ట్రంలో మరో రూలా? ఇదెక్కడి న్యాయమంటూ ఆయన ప్రశ్నించారు. టీడీపీ నేతల విజ్ఞప్తి మేరకు పోస్టల్ బ్యాలెట్ నిబంధనలను సడలించడం విడ్డూరంగా.. అనుమానాస్పదంగా ఉందని.. అందుకే ఆ అంశంపై న్యాయపోరాటం చేశామని సజ్జల చెప్పారు. తన శక్తి ఇంత ఉందని ఒక రౌడీ ఎలాగైతే రౌడీయిజం చేసి అందరినీ భయపెడతాడో చంద్రబాబూ కూడా బీజేపీతో పొత్తు కుదిరాక ఎన్నికల సంఘాన్ని అడ్డుపెట్టుకుని అధికారులను బదిలీలు చేయిస్తూ యంత్రాంగంపై పట్టు సాధించే ప్రయత్నం చేశారని విమర్శించారు. చంద్రబాబుకు భయపడి కొందరు అధికారులు టీడీపీకి అనుకూలంగా ప్రవర్తించేందుకు అవకాశముందని.. అందుకే ఓట్ల లెక్కింపులో ఏజెంట్లను అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎలా ఉన్నామో అధికారంలో ఉన్నప్పుడు కూడా అంతే బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని.. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తున్నామని సజ్జల గుర్తుచేశారు. గత ఎన్నికల సమయంలో అధికారంలో ఉన్న బాబు.. ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లి సీఈఓను బెదిరించారని గుర్తుచేశారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా కళ్లెదుట ఘోరపరాజయం కన్పిస్తుండటంవల్లే ఆయన నిశ్శబ్దంగా ఉన్నారని.. ఓటమికి మానసికంగా సిద్ధమవుతున్నారంటూ ఎద్దేవా చేశారు.

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి

- ఉదయం 6కల్లా లెక్కింపు కేంద్రం దగ్గర ఉండాలి
- కౌంటింగ్ ఏజెంట్లకు సజ్జల దిశానిర్దేశం

'ఈ ఎన్నికల్లో మనం పక్కాగా గెలుస్తున్నాం.. అయినా కౌంటింగ్‌లో మన పార్టీ తరఫున ఏజెంట్లుగా ఉంటున్న మీరు అప్రమత్తంగా ఉండాలి'.. అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ మళ్లీ రెండోసారి ప్రభుత్వం ఏర్పాటుచేయబోతోందని.. వైఎస్ జగన్ రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారని ఆయన చెప్పారు. ఏజెంట్లు ఉ.6 గంటలకల్లా కౌంటింగ్ హాల్ దగ్గర కచ్చితంగా ఉండాలని.. హాల్‌లో కౌంటింగ్ ప్రారంభం సమయం నుంచి ముగింపు దశ వరకు చాలా చురుగ్గా ఉండాలన్నారు. అదే సమయంలో సంయమనం పాటిస్తూ ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఖచ్చితంగా కౌంట్ అయ్యేలా చూస్తూ, లెక్కింపు న్యాయబద్ధంగా సజావుగా సాగేలా ప్రయత్నం చేయాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఒక్క ఓటు కూడా పోకుండా పాజిటివ్‌గా పార్టీ అకౌంట్‌లో పడేవిధంగా జాగ్రత్త వహించాలని.. కౌంటింగ్ పూర్తయి డిక్లరేషన్ తీసుకునే వరకు కూడా అక్కడ నుంచి ఎవరూ కదలొద్దన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం కౌంటింగ్ ఏజెంట్లతో జూమ్ ద్వారా సజ్జల సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వారికి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విశ్రాంత ఆర్టీఓ ప్రభాకర్‌రెడ్డి, లీగల్ సెల్ ప్రతినిధులు మలసాని మనోహర్‌రెడ్డి, కొమ్మసాని శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

98.89 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తి

- కొత్తగా 6,960 మందికి ఇంటి వద్దే పింఛను
- వారి బ్యాంకు ఖాతాల్లో ఇబ్బందులతో అధికారుల నిర్ణయం

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా 98.89 శాతం మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, వివిధ రకాల చేతి వృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఈ నెల పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు సెర్ప్ అధికారులు తెలిపారు. డీబీటీ రూపంలో పింఛను డబ్బు బ్యాంకులో జమ చేసిన వారిలో 6,960 మంది బ్యాంకు ఖాతాల్లో ఇబ్బందులు రావడంతో వారికి బదిలీ చేసిన పింఛను డబ్బులు వెనక్కి వచ్చాయని, వీరందరికీ సోమవారం నుంచి ఇంటి వద్దే పింఛను డబ్బు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల (జూన్) 1వ తేదీ నుంచి మొత్తం 65,30,838 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ. 1,939.35 కోట్లు విడుదల చేసింది. వీరిలో 47,67,773 మందికి పింఛను సొమ్మును డీబీటీ రూపంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు అధికారులు చెప్పారు. 17,63,065 మందికి ఇంటి వద్ద పంపిణీ చేయాలని నిర్ణయించారు. వీరిలో 16,90,945 మందికి పంపిణీ పూర్తయినట్టు వివరించారు. బ్యాంకులో డబ్బు జమ చేసిన లబ్ధిదారులతో కలిపి సోమవారం సాయంత్రం వరకు మొత్తం 64.58 లక్షల మందికి రూ. 1,919.07 కోట్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

సోషల్ మీడియాలో బెదిరింపులు, దూషణలపై కఠిన చర్యలు

- గ్రూప్ అడ్మిన్‌లు కూడా బాధ్యులే
- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

సాక్షి, అమరావతి: ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో వేధింపులు, బెదిరింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'కౌంటింగ్ తరువాత అంతు చూస్తాం' అంటూ కొన్ని అసాంఘిక శక్తులు సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ బెదిరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అటువంటివారిని ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. వారిపై ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేయడంతోపాటు రౌడీషీట్లు తెరవడం, పీడీ చట్టం ప్రయోగించడం తదితర కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అటువంటి బెదిరింపు, దూషణల పోస్టులు పెట్టేలా ప్రోత్సహించేవారిపైన కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బెదిరింపులు, దూషణల పోస్టులను వాట్సాప్ డీపీలుగా పెట్టుకోవడం, సోషల్ మీడియాలో షేర్ చేయడం కూడా శిక్షార్హమేనని తెలిపారు. అటువంటి పోస్టులను గ్రూప్ అడ్మిన్‌లు ప్రోత్సహించకూడదని.. అందుకు వారు కూడా బాధ్యులవుతారని తెలిపారు. అన్ని సోషల్ మీడియా పోస్టులపై పోలీసుల నిఘా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

జస్టిస్ నందా రికార్డు
తెలంగాణ
ఒకేరోజు అత్యధిక తీర్పులు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందా ఒకేరోజు రికార్డు స్థాయిలో తీర్పులు చెప్పారు. వేసవి సెలవుల తర్వాత సోమవారం కోర్టు పునఃప్రారంభమైంది. జస్టిస్ నందా ధర్మాసనం ముందు 136 పిటిషన్లు లిస్ట్ కాగా, 76 వేర్వేరు పిటిషన్లపై తీర్పులు వెలువరించారు. జస్టిస్ నందా ఈ తీర్పులన్నిటినీ కోర్టు హాల్‌లోనే చెప్పడం గమనార్హం.

తెలంగాణ సచివాలయం ప్రధాన ద్వారం మూత

- ఆగ్నేయంలో ఉండటంతో వాస్తుదోషమని భావన
- ఇకపై పశ్చిమ గేట్ నుంచి వచ్చి ఈశాన్య గేట్‌నుంచి వెళ్లనున్న సీఎం కాన్వాయ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సచివాలయం ప్రధాన ద్వారాన్ని ఇకపై వినియోగించరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రధాన ద్వారం ఆగ్నేయం వైపు ఉండటంతో వాస్తు దోషమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు సచివాలయం ప్రధాన ద్వారం గుండానే రాకపోకలు జరిపేవారు. అయితే ఇకపై సీఎం కాన్వాయ్ పశ్చిమ ద్వారం నుంచి లోపలికి ప్రవేశించాలని, ఈశాన్య గేట్ నుంచి బయటకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఆరో అంతస్తు నుంచి తొమ్మిదో అంతస్తుకు మార్పు చేయాలని నిర్ణయించారని వచ్చిన వార్తలను మాత్రం సీఎం కార్యాలయ వర్గాలు తోసిపుచ్చాయి. ఇప్పటి వరకు అలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించాయి. అయితే, 9వ అంతస్తులో కొత్తగా సీఎం చాంబర్‌ను ఏర్పాటు చేయడానికి పనులు ప్రారంభించినట్టు చర్చ జరుగుతోంది.

ఫ్యాను గాలి వీచింది..

వైఎస్సార్‌సీపీదే విజయం



'సాక్షి' టీవీ చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టీకరణ

- సీఎం జగన్ అందించిన సంక్షేమం, సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా మారింది: ఆరా మస్తాన్
- 126 స్థానాలకంటే వైఎస్సార్‌సీపీకి అధికంగా వస్తాయి: ఆత్మసాక్షి మూర్తి
- సీఎం జగన్ చేసిన మంచికి కృతజ్ఞతలు చెబుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేశారు: రేస్ కిశోర్
- అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకూ ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపే : ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్ ఇంద్ర నీల్

సాక్షి, అమరావతి: రాష్ట్రమంతా ఫ్యాను గాలి ఉధృతంగా వీచిందని, ఓటర్లలో అధిక శాతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని, ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ప్రముఖ సెఫాలజిస్టులు స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో 50 శాతం కంటే ఎక్కువ ఓట్లతో అత్యధిక శాసన సభ, లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయమని తేల్చి చెప్పారు. 'సాక్షి' టీవీ సోమవారం రాత్రి నిర్వహించిన చర్చలో ప్రముఖ సెఫాలజిస్టులు 'ఆరా' మస్తాన్, 'ఆత్మసాక్షి' మూర్తి, 'రేస్' కిషోర్, 'ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్' ఇంద్రనీల్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ సానుకూల ఓటుతో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వస్తోందని వారంతా స్పష్టం చేశారు.

నేను చెప్పిన 104 స్థానాల కంటే వైఎస్సార్‌సీపీకి అధికంగా వస్తాయి

గత ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి అధికారంలోకి వచ్చింది. ఐదేళ్లపాటు అధికారంలో ఉంది. ఈసారి కూడా అంతే స్థాయి ఓట్లతో మళ్లీ ఘనవిజయం సాధించి, అధికారంలోకి రాబోతోందన్నది మా సర్వేలో వెల్లడైంది. సీఎం వైఎస్ జగన్ గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటి గుమ్మం వద్దకే అందించడం గ్రామీణ ప్రాంతాల ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. వారిపై పెను ప్రభావం చూపింది. అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించడం వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా మారింది. సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాధికారత సాధించిన మహిళలు 56 శాతం వైఎస్సార్‌సీపీకి మద్దతుగా ఓట్లు వేశారు. టీడీపీ కూటమితో పోల్చితే వైఎస్సార్‌సీపీకి మహిళలు 13 నుంచి 14 శాతం అధికంగా ఓట్లు వేశారు. మహిళల ఓటింగ్ శాతం పెరగడం వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా మారింది. వృద్ధాప్య పెన్షన్‌ను నాలుగు దశల్లో రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచి ఇవ్వడం, ఇంటి వద్దకే రేషన్ అందించడం ద్వారా వృద్ధులకు సీఎం జగన్ జీవనభద్రత కల్పించారు. ఇది వైఎస్సార్‌సీపీకి సానుకూలంగా మారింది.



ఎన్నికల్లో సీఎం జగన్ తాను చేసింది చెప్పి, అధికారంలోకి వస్తే తాను ఏం చేస్తానో చెబుతూ పాజిటివ్ ప్రచారం చేస్తే.. చంద్రబాబు నెగెటివ్ ప్రచారాన్ని చేశారు. ఇది టీడీపీ కూటమికి ప్రతిబంధకంగా మారింది. సీఎం జగన్ అమలు చేసిన సామాజిక న్యాయం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా మారింది. నేను చెప్పిన 104 స్థానాలకంటే అత్యధిక స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం. ఇండియా టుడే - యాక్సిస్ మై ఇండియా ఎగ్జిట్ పోల్స్‌ను సబ్ కాంట్రాక్టుకు ఇచ్చిన సంస్థకు రాజకీయ నేపథ్యం ఉండటం వల్ల అది శాస్త్రీయంగా చేయలేదు. దాని గురించి ఇంతకన్నా చెప్పను.

– 'ఆరా' మస్తాన్

సీఎం జగన్ పాజిటివ్ ప్రచారానికి ప్రజలు సానుకూలంగా స్పందించారు



గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 142కు పైగా శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తుందని చెప్పాం. అదే ఫలితాలు వచ్చాయి. 18 రాష్ట్రాల్లో మేం నిర్వహించిన సర్వేలు నిజమయ్యాయి. సైకో పోవాలి.. సైకిల్ రావాలి, ఇదేం ఖర్మ రాష్ట్రానికి అనే నినాదాలతో టీడీపీ నెగెటివ్ ప్రచారం చేసి సెల్ఫ్ గోల్ చేసుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తును ప్రజలు అవకాశవాద పొత్తుగా భావించారు. అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పి ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపడంలో టీడీపీ కూటమి విఫలమైంది. ఐదేళ్ల సంక్షేమ పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రజలకు మంచి చేసిన సీఎం వైఎస్ జగన్.. మళ్లీ అధికారంలోకి వస్తే మరింత మంచి చేస్తానంటూ చేసిన పాజిటివ్ ప్రచారం పట్ల ప్రజలు సానుకూలంగా స్పందించారు. నేను సర్వేలో చెప్పిన 126 స్థానాలకంటే అధిక స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఖాయం.

– 'ఆత్మసాక్షి' మూర్తి

వైఎస్సార్‌సీపీకి 120 సీట్లకంటే ఎక్కువే వస్తాయి..



సంక్షేమం అభివృద్ధి పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచికి కృతజ్ఞతలు చెబుతూ ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసినట్లు మా సర్వేలో వెల్లడైంది. టీడీపీ కూటమి మొదటి నుంచి నెగెటివ్ ప్రచారానికే పరిమితమైంది. మేనిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో కూడా టీడీపీ కూటమి విఫలమైంది. ఇది కూటమిని తీవ్రంగా దెబ్బతీసింది. సానుకూల ఓటుతో వైఎస్సార్‌సీపీ 120 స్థానాల కంటే అధిక స్థానాల్లో విజయం సాధించడం ఖాయం.

– రేస్ కిశోర్

గ్రామీణ, పట్టణ ప్రాంతాలూ వైఎస్సార్‌సీపీ వైపే



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపు నిలబడ్డారు. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి ఆధునీకరించి, ఇంగ్లిష్ మీడియంలో పిల్లలకు చదువులు చెప్పడం అగ్రవర్ణాలనూ ఆకట్టుకుంది. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు సీఎం జగన్ లబ్ధి చేస్తుంటే.. రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చుతున్నారంటూ టీడీపీ, ఇతర విపక్షాలు విమర్శించడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. అనంతపురం నుంచి శ్రీకాకుళం వరకూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపు మొగ్గు చూపారు. వైఎస్సార్‌సీపీ 120 స్థానాలకంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధించి, మళ్లీ అధికారంలోకి రావడం తథ్యం.

– ఫస్ట్ స్టెప్ సొల్యూషన్స్ ఇంద్ర నీల్

ఎమ్మెల్సీ రఘురాజుపై అనర్హత వేటు

- టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీకి వ్యతిరేక కార్యకలాపాలు
- ఆయన సభ్యత్వాన్ని రద్దుచేసిన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్టు సాక్ష్యాలు బట్టబయలైన నేపథ్యంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై అనర్హత వేటు పడింది. ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేస్తూ, ఆ స్థానం ఖాళీ అయిందని పేర్కొంటూ సోమవారం మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు ఆదేశాలు జారీచేశారు. ఈ ఆదేశాలను ప్రభుత్వ గెజిట్‌లో ప్రచురించారు. ప్రత్యర్థి పార్టీ టీడీపీతో కుమ్మక్కై వైఎస్సార్‌సీపీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపైన, పార్టీ నాయకులపైన అనుచిత వ్యాఖ్యలు చేశారని శాసనమండలిలో ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్ మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. స్వయంగా హాజరై దీనిపై వివరణ ఇవ్వాలని నాలుగుసార్లు నోటీసులు పంపించినా రఘురాజు డుమ్మాకొట్టారు. మూడునెలల కిందటే రఘురాజు భార్య, ఎస్.కోట వైస్ ఎంపీపీ ఇందుకూరి సుబ్బలక్ష్మి అలియాస్ సుధారాజు టీడీపీ నేత లోకేశ్ సమక్షంలో ఆ పార్టీ కండువా వేయించుకున్నారు. టీడీపీ ఎస్.కోట అభ్యర్థి కోళ్ల లలితకుమారితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. రఘురాజు దంపతుల నివాసంలోనే టీడీపీ ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. మరోవైపు కోళ్ల లలితకుమారికి, ఎస్.కోట టికెట్ కోసం విఫలయత్నం చేసిన గొంప కృష్ణకు మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైదరాబాద్‌లో లోకేశ్ సమక్షంలో జరిగిన పంచాయితీలో మండల టీడీపీ నాయకులతో కలిసి రఘురాజు పాల్గొన్నారు. ఇలా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దుచేయాలని ప్రభుత్వ విప్ విక్రాంత్ ఫిర్యాదు చేశారు. రఘురాజు 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో స్థానిక సంస్థల కోటాలో వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2027 వరకు పదవీ కాలం ఉన్నా పార్టీ వ్యతిరేక కలాపాలకు పాల్పడటంతో ఆయన సభ్యత్వం రద్దయింది.

వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం



- 94, 95 వద్ద ఆగదు.. 123 స్థానాలకు పైగానే గెలుచుకుంటుంది
- గతంలో వచ్చిన స్థానాల కంటే 10 సీట్లు పెరిగినా ఆశ్చర్యం లేదు
- పరిపూర్ణానంద స్వామి

హిందూపురం/ కాకినాడ రూరల్: 'రాష్ట్రంలో జగన్ కావాలనే వర్గం, జగన్ దిగిపోవాలనే వర్గం మధ్య మాత్రమే ఎన్నికలు జరిగాయి. పార్టీల మధ్య కాదు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ఘన విజయం ఖాయం. నాకున్న సమాచారం మేరకు జగన్ 123 అసెంబ్లీ స్థానాలకు పైగానే గెలుస్తారు' అని హిందూపురం నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామి అన్నారు. సోమవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో మీడియాతో మాట్లాడారు. 'ఎగ్జిట్‌పోల్స్‌లో ఎవరు ఎన్ని రకాలుగా చెప్పినా కొన్ని సర్వేలు మాత్రం ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించాయి. అందులో 'ఆరా' మస్తాన్ సర్వే ఒకటి. ఆరా చాలా క్రెడిబిలిటీ ఉన్న సంస్థ. గతంలో పలుసార్లు చాలా స్పష్టంగా సర్వే ఫలితాలు ఇచ్చింది. మస్తాన్ ఇంటర్వ్యూలలో చెప్పిన తీరు, విషయాలు చూస్తే.. ఆయన కొంత ఒత్తిడిలో వైఎస్సార్‌సీపీకి తక్కువ సీట్లు చూపించినట్లు కనిపించింది. 94, 95కు పైగా సీట్లు వస్తాయని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తుందనే ధోరణిలో మస్తాన్ చెప్పారు. కానీ వాస్తవ పరిస్థితులను చూస్తే వైఎస్సార్‌సీపీ గెలుపు 94, 95 స్థానాల వద్ద ఆగదు. 123 స్థానాలకు పైగా గెలిచే అవకాశముంది. గతంలో వచ్చిన స్థానాల కంటే పది స్థానాలు పెరిగినా ఆశ్చర్యం లేదు. మహిళా ఓటింగ్ శాతం పెరిగిందని ఆరా సర్వే సంస్థ చెప్పిన తర్వాతే.. మిగిలిన అన్ని సర్వే సంస్థలూ మహిళల ఓట్లే కీలకమన్న అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నాయి. దీన్ని బట్టి ఆరా మస్తాన్ ఎంత నిశితంగా పరిశీలన చేశారో అర్థం చేసుకోవచ్చు. హిందూపురంలో కూడా ఒక కొత్త పరిణామాన్ని చూస్తారు. ఈసారి ప్రత్యామ్నాయానికి ఓటు వేద్దామన్న ధోరణి కనిపించింది. నేను ఏ పార్టీ తరఫున మాట్లాడటం లేదు. ఎవరి పక్షమూ కాదు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా నా అభిప్రాయం వెల్లడిస్తున్నా' అని పరిపూర్ణానంద స్వామి చెప్పారు.

రాష్ట్రంలో రూ.483.15 కోట్ల నగదు, సొత్తు స్వాధీనం

▶ మొదటి పేజీ తరువాయి

ఆస్తి నష్టం జరిగిందన్నారు. 1,03,461 మందిని బైండోవర్ చేశామని.. అలాగే, సమస్యలు, అల్లర్లు సృష్టించే 551 మందిని గుర్తించి చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

తొలిసారిగా 1,985 ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్..

ఇదిలా ఉంటే.. సి-విజిల్ ద్వారా 24,557 ఫిర్యాదులు రాగా అందులో 95 శాతం ఫిర్యాదులను 100 నిమిషాల్లోనే పరిష్కరించినట్లు ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. పోలింగ్ అనంతరం హింసను నివారించేందుకు రాష్ట్రంలో తొలిసారిగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించామని.. సమస్యాత్మకమైన 1,985 ప్రాంతాలను గుర్తించి అక్కడ సోదాలు నిర్వహించారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 1,200 సోదాలు నిర్వహించడం ద్వారా 4,595 వాహనాలను, 1,269 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు 153 మందిపై కేసులు నమోదుచేశామని ఆయన వివరించారు. పోలింగ్ అనంతరం సమస్యలను, అల్లర్లను సృష్టించే 12,639 మందిని గుర్తించి సీఆర్‌పీసీ కింద బైండోవర్ చేసినట్లు మీనా తెలిపారు.

జోరుగా విత్తన పంపిణీ

ఖరీఫ్‌కు 6.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం



ఏలూరు జిల్లా తుక్కులూరు ఆర్బీకే వద్ద రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

- అందుబాటులో 6.50 లక్షల క్వింటాళ్లు
- ఆర్బీకేల్లో 3.16 లక్షల క్వింటాళ్లు
- 15వ తేదీ నుంచి మిగిలిన విత్తనాల పంపిణీ

సాక్షి, అమరావతి: నైరుతి వచ్చేసింది. తొలకరి మొదలైంది. ఖరీఫ్ సాగు ఊపందుకుంటోంది. ఎన్నికల కోడ్ కారణంగా ఈసారి కాస్త ఆలస్యంగా ప్రారంభమైన విత్తనాల పంపిణీ ఇప్పుడు జోరందుకుంటోంది. ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలతో పాటు వేరుశనగ విత్తనాల పంపిణీ జోరుగా సాగుతోంది. గిరిజన జిల్లాల్లో వరి విత్తన పంపిణీ ప్రారంభమైంది. ఈ నెల 15 వ తేదీ నుంచి మిగిలిన జిల్లాల్లో వరి, ఇతర విత్తనాల పంపిణీకి ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ, వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తున్నాయి. సీజన్ ఏదైనా స్థానిక లభ్యతనుబట్టి సాగు విస్తీర్ణంలో 30 శాతం విత్తనాన్ని సబ్సిడీపై రైతులకు అందిస్తుంటారు. సబ్సిడీ విత్తనం కోసం చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పడరాని పాట్లు పడేవారు. రోజుల తరబడి బారులు తీరి ఎదురు చూసేవారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితి మారింది. గడిచిన ఐదేళ్లుగా సీజన్‌కు ముందుగానే నాణ్యమైన, సర్టిఫై చేసిన విత్తనాన్ని ఆర్బీకేల ద్వారా గ్రామాల్లోనే అందించడంతో రైతుల కష్టాలకు తెరపడింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో 85.65 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానంగా 39.07 లక్షల ఎకరాల్లో వరి, 14.80 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 14.67 లక్షల ఎకరాల్లో పత్తి, 8.35 లక్షల ఎకరాల్లో అపరాలు సాగు చేయనున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం 6,31,742 క్వింటాళ్ల విత్తనం అవసరం కాగా, 6,50,160 క్వింటాళ్లు అందుబాటులో ఉంది. 2.99 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాన్ని 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నారు. పెసర, మినుము, కంది విత్తనాలను 30 శాతం సబ్సిడీపై ఇస్తున్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు కొర్ర, రాగి, అండుకొర్రలు వంటి విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నారు. జాతీయ ఆహార ధాన్యాల భద్రత పథకం అమలవుతున్న జిల్లాల్లో కిలోకి రూ.10 చొప్పున, ఇతర జిల్లాల్లో కిలోకి రూ.5 చొప్పున రాయితీతో వరి విత్తనాలు సరఫరా చేస్తున్నారు. ఏజెన్సీ జిల్లాల్లో మాత్రం 90 శాతం సబ్సిడీపై వరితో సహా అన్ని రకాల విత్తనాలను పంపిణీ చేస్తున్నారు. వీటిలో ఇప్పటికే 3,15,928 క్వింటాళ్ల విత్తనాన్ని ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచారు. 48,177 క్వింటాళ్ల పచ్చిరొట్ట, 2 లక్షల క్వింటాళ్ల వేరుశనగ, 67,617 క్వింటాళ్ల వరి, 84 క్వింటాళ్ల చిరుధాన్యాలు, కందులు, మినుములు, 50 క్వింటాళ్ల పెసర, రాజ్మా, నువ్వులు విత్తనాలను సిద్ధం చేశారు.

విత్తనం కోసం 3.76 లక్షల మంది రైతులు నమోదు

ఆర్బీకేల ద్వారా విత్తనాలు కావాల్సిన రైతుల వివరాలను అన్ని జిల్లాల్లో నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు 2,46,997 క్వింటాళ్ల విత్తనాల కోసం 3,75,583 మంది రైతులు ఆర్బీకేల్లో వివరాలు నమోదు చేసుకున్నారు. ఇప్పటివరకు 40 వేల క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 1,04,200 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల పంపిణీ పూర్తయింది.

సరిపడా విత్తన నిల్వలు

గతేడాది మాదిరిగానే సర్టిఫై చేసిన నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాన్ని ఆర్బీకేల ద్వారా పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికే పచ్చిరొట్టతో పాటు వేరుశనగ విత్తనం పంపిణీ జోరుగా సాగుతోంది. మిగిలిన విత్తనాలను జూన్ 15వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నాం.

– ఎం.శివప్రసాద్, ఎండీ, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ

ఏజెన్సీలో 7వేల క్వింటాళ్ల పంపిణీ

గిరిజన ప్రాంతాల్లో గతంలో ఏటా 2, 3 వేల క్వింటాళ్లకు మించి విత్తనాలను పంపిణీ చేయలేదు. ఈసారి రికార్డు స్థాయిలో 90 శాతం సబ్సిడీ విత్తనాల పంపిణీ జరుగుతోంది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ ఏడాది 7 వేల క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధం చేశారు. డిమాండ్‌ను బట్టి మరింత పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

బెంగళూరులో కుండపోత

జూన్‌లో ఒక్కరోజులో 133 ఏళ్లలో ఎన్నడూలేనంతటి వర్షం



టౌన్‌హాల్ కూడలిలో భారీ వర్షంలో వాహనాలు



బెంగళూరు బసవనగుడిలో కారుపై కూలిన చెట్టు

బెంగళూరు: ఎండ ప్రచండంతో చెమటలు కక్కుతున్న బెంగళూరువాసులను వరుణుడు తడిపి ముద్దచేశాడు. బెంగళూరులో జూన్ రెండో తేదీన 111 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ అధికారులు సోమవారం ప్రకటించారు. బెంగళూరులో గత 133 ఏళ్లలో జూన్ నెలలో ఒక్కరోజులో ఇంతటి వర్షపాతం నమోదవడం ఇదే తొలిసారి అని భారత వాతావరణ శాఖ బెంగళూరు విభాగంలోని శాస్త్రవేత్త ఎన్.పువియరాసన్ చెప్పారు. జూన్ ఒకటి, రెండో తేదీల్లో కలిపి మొత్తంగా 140.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది జూన్ నెల మొత్తంలో కురవాల్సిన సగటు 110.3 మిల్లీమీటర్లను మించిందని పేర్కొన్నారు. చివరిసారిగా 1891 జూన్ 16వ తేదీన బెంగళూరులో ఇంతటి భారీ వర్షపాతం నమోదైంది. కుండపోత వర్షం ధాటికి జయనగర్‌సహా నగరంలో చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. చాలా చోట్ల చెట్లు కూలాయి. ఆదివారం రాత్రి ట్రినిటీ మెట్రో స్టేషన్ ట్రాక్‌పై ఒక చెట్టు పడటంతో ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. '' నైరుతి రుతుపవనాలు కర్ణాటకలో మరింతగా విస్తరించాయి. దీంతో జూన్ 5వ తేదీదాకా పలు జిల్లాల్లో యెల్లో అలర్ట్‌ను ప్రకటించాం. దక్షిణ కన్నడ, తీర ప్రాంతాలు, ఉత్తర కర్ణాటక, బెంగళూరు(రూరల్, అర్బన్), హసన్, మైసూరు, తుమకూరులలో వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలు పడొచ్చు'' అని బెంగళూరు వాతావరణ శాఖ అధిపతి సీఎస్ పాటిల్ చెప్పారు.

తెలంగాణ


వాన కురిస్తే వజ్రాల వేట

అప్పలనరసింహాపురంలో వజ్రాల వేట!

నేలకొండపల్లి: వర్షాలు కురుస్తుండటంతో తెలంగాణలోని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురంలో వజ్రాల కోసం జోరుగా వేట మొదలైంది. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ప్రజలతో గ్రామంలో సందడి నెలకొంది. గ్రామానికి సోమవారం ప్రత్యేక వాహనాల్లో పలువురు చేరుకోగా.. ఏపీలోని జగ్గయ్యపేట మండలానికి ఓ యువకుడికి వజ్రం దొరికింది. దీని విలువ దాదాపు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుందని అంచనా. ముందుగానే అక్కడ మకాం వేసిన దళారులు వ్యాపారులకు సమాచారం ఇచ్చి వారి వద్దకు తీసుకెళ్లారు. కాగా, సోమవారం మరికొందరికి కూడా విలువైన వజ్రాలు లభించినట్లు తెలుస్తోంది. వజ్రాల వేటలో నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం రూరల్, చింతకాని, బోనకల్ ప్రాంతాల వారు పాల్గొన్నారు.



ఓ మహిళకు దొరికిన వజ్రాలు



కింద పడటమే వైఫల్యం కాదు. పడ్డచోటే నిలిచిపోతేనే అది వైఫల్యం అవుతుంది.
– సోక్రటీస్

సాక్షి
మంగళవారం, 4 జూన్ 2024

సంబరాలు... సవాళ్ళు...

దేశవ్యాప్తంగా ఎన్నికలు ముగిశాయి. ఇక, కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. వరుసగా మూడోసారి కూడా మోదీ సారథ్యంలోని బీజేపీయే పగ్గాలు చేపడుతుందని అంచనాలు వినిపిస్తున్న వేళ ఓట్ల లెక్కింపుతో అసలైన ఫలితాలు ఇవాళ రానున్నాయి. అయితే, ఎన్నికలు ముగింపు దశలో ఉండగానే జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) గత శుక్రవారం వెలువరించిన దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) గణాంకాలు ఆసక్తికరమైన చర్చ రేపుతున్నాయి. జీడీపీ వృద్ధి దాదాపు 7.8 శాతం ఉండవచ్చని తొలుత అందరూ భావించినా, వాస్తవంలో అది 8.2 శాతానికి చేరింది. అంతకు ముందు ఏడాది (2022–23) సాధించిన 7 శాతంతో పోలిస్తే ఇది గణనీయమైన మెరుగుదల. పైగా, వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాలుగా మన ఆర్థిక వ్యవస్థ 7 శాతం, అంతకు మించి పెరిగిందన్న మాట. దీంతో ప్రపంచంలో అత్యంత వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తోందని నిపుణుల మాట. ఇది విశేషమే... కాదనలేం. కానీ, ఈ ఏడాది కూడా ఇదే పురోగతిని నిలబెట్టుకోవడానికి ఏం చేయాలి? అలాగే, దేశాన్ని వేధిస్తున్న నిరుద్యోగం తదితర సమస్యల మాటేమిటి?

నిజానికి, దేశ వాస్తవిక జీడీపీ ఇటు అధికారిక, అటు ప్రైవేట్ అంచనాలన్నిటినీ అధిగమించి ఆశ్చర్యపరిచింది. కోవిడ్ దెబ్బ కొట్టిన తర్వాత, అందులోనూ ప్రపంచమంతా నత్తనడక నడుస్తున్నప్పుడు వృద్ధిలో ఈ రకమైన గణాంకాలు వచ్చాయంటే, అనేక ఆటుపోట్లను భారతీయ గృహవ్యవస్థ, వ్యాపారాలు తట్టుకొని దృఢంగా నిలబడడమే కారణం. అలాగే, ప్రధానంగా నిర్మాణ, వస్తూత్పత్తి రంగాల పుణ్యమా అని కూడా గడచిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో మన ఆర్థికవ్యవస్థ అనుకున్న దాని కన్నా మెరుగైన వృద్ధిని సాధించినట్టు విశ్లేషణ. ప్రైవేట్ పెట్టుబడులు వేగం పుంజుకోకున్నా, ప్రాథమిక వసతి సౌకర్యాల కల్పనలో ప్రభుత్వ పెట్టుబడులు ఆర్థిక వృద్ధిలో సింహభాగానికి కారణమని చెబుతున్నారు. కేంద్రంలో కొత్త ప్రభుత్వం వచ్చాక ప్రైవేట్ పెట్టుబడులు పెరుగుతాయని భావిస్తున్నారు. మొత్తం మీద వచ్చే సర్కారుకు ఈ అంకెలు, ఇటీవల భారతీయ రిజర్వ్ బ్యాంక్ బదలాయించిన మిగులు నిధుల లాంటివి కొంత సౌకర్యాన్నిచ్చే అంశాలు. అక్కడ నుంచి సమతూకం నిండిన ఆర్థికాభివృద్ధి వైపు ఎలా నడిపించాలన్నది కీలకమైన అంశం.


గమనిస్తే... ఆర్థిక వృద్ధిలో మెరుగుదల ఏడేళ్ళ పాటు నిదానంగా సాగింది. దానికి కొత్త ఊపునిచ్చేందుకు మోదీ సర్కార్ ఏటా రైల్వే, రోడ్లు, పట్టణ రవాణా, వాటర్‌వర్క్స్, రక్షణ ఉత్పత్తులపై ఏటా రూ. 11 లక్షల కోట్లు ఖర్చు పెడుతోంది. దీనివల్ల లక్షలాది ఉద్యోగాలు రావాలి. కానీ, వాస్తవ పరిస్థితులు మాత్రం కొంత భిన్నంగా ఉన్నాయి. దేశంలో నిరుద్యోగ సమస్య ఇప్పటికీ ప్రబలంగా కనిపిస్తోంది. దానికి తోడు ఆర్థిక వ్యత్యాసం, ద్రవ్యోల్బణం సామాన్యుల్ని వేధిస్తున్నాయి. ఉదాహరణకు భవన నిర్మాణ రంగంలో నూటికి 80 మంది ఉండే నైపుణ్య రహిత కార్మికుల సగటు రోజు వారీ కూలీ సైతం అనేక రాష్ట్రాల్లో జాతీయ సగటు కూలీ కన్నా తక్కువే ఉందని విశ్లేషణలు తేల్చాయి. మహిళా శ్రామికుల కూలీలైతే మరీ కనాకష్టం. ప్రభుత్వ లెక్కల ప్రకారమే... మన దేశ తలసరి ఆదాయం, మరో మాటలో నికర జాతీయ ఆదాయం 2014–15లో రూ.72,805 ఉండేది. అది కేవలం 3.83 శాతం వార్షిక చక్రవృద్ధి రేటుతో 2022–23లో రూ.98,374కు చేరింది. వాస్తవిక ద్రవ్యోల్బణ ప్రభావాన్ని గనక పరిగణనలోకి తీసుకుంటే, ఈ వృద్ధి రేటు అసలైతే ఇంకా తక్కువే ఉంటుంది. అది అటుంచితే – విద్య, ఆరోగ్యం, ప్రజారవాణా, కాలుష్యం వగైరా అంశాల్లో సగటు జనాభా జీవన ప్రమాణాలు మెరుగుపడలేదు. సరికదా ఇంకా దిగజారాయి. అదే విషాదం.

ఇంకా చెప్పాలంటే, ప్రపంచంలోని అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరణ అనే నినాదంలో గర్వించడానికి తగిన అంశాలు కొన్నే కనిపిస్తున్నాయి. ప్రపంచ దేశాల తలసరి ఆదాయం జాబితాలో 2018లో మనం 153వ స్థానంలో ఉండేవాళ్ళం. అప్పటితో పోలిస్తే, మనం మెరుగుపడి 144వ స్థానానికి చేరాం. కానీ, ఇప్పటికీ మనం అడుగునే ఉన్నామని మర్చిపోలేం. సాధించిన కొద్దిపాటి మెరుగుదల దేశ ప్రజల్ని దారిద్ర్యం నుంచి బయటపడేయడానికి చాలదు. నాణ్యమైన జీవన ప్రమాణాలకూ సరిపోదు. 2029 నాటికి గానీ మన దేశం తలసరి ఆదాయంలో ఉజ్బెకిస్తాన్, పాపువా న్యూ గినియా, అంగోలా లాంటి దేశాలను అధిగమించలేదని గుర్తించాలి. కాబట్టి, కొత్త ప్రభుత్వానికి తన ముందున్న సవాలేమిటో స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

భారత జనాభాలో ఇప్పటికీ అధిక శాతం గ్రామీణ, బస్తీ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. వారి కష్టనష్టాలు, జీవన పరిస్థితులు స్టాక్ మార్కెట్ల విజృంభణను చూసి చప్పట్లు కొట్టే వర్గాలకు పెద్దగా తెలియవు. తాజా ఎన్నికల దయతో నిరుద్యోగం, ఆర్థిక అసమతౌల్యం, ద్రవ్యోల్బణం లాంటివి మళ్ళీ కనీసం చర్చకైనా వచ్చాయి. 'గ్రామీణ ప్రాంతాల్లోని దురవస్థల' ప్రస్తావన జరిగింది. అందుకే, గడచిన నాలుగు త్రైమాసికాలను కలిపి తీసిన ఆఖరి లెక్కలు పైకి సంతోషం రేపుతున్నా, క్షేత్రస్థాయిలోని ఇలాంటి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే కష్టమే. ఇప్పటి లెక్కలతో తృప్తిపడి, ఉదాసీనంగా వ్యవహరించకుండా సవాళ్ళను ఎదుర్కొంటూ ముందడుగు వేయాలి. అందుకోసం ఆర్థిక విధానాలను నిర్ణయించే ప్రభుత్వ యంత్రాంగం దీర్ఘకాలిక దృష్టితో వ్యవహరించాలి. ప్రజల నైపుణ్యాలను పెంచి, వారిని మరింత ఉద్యోగార్హులుగా తీర్చిదిద్దడంపై దృష్టిపెట్టాలి. అందుకు తగ్గ సంస్కరణలు చేపట్టాలి. అప్పుడే ఏటికేడు ఈ వృద్ధి అంకెలు స్థిరపడతాయి. సామాన్యుల జీవితాలు నిలబడతాయి. లేదంటే 'వికసిత భారత్' మాటల్లో, లెక్కల్లోనే మిగిలిపోతుంది.

మండేలా పార్టీకి ఎందుకీ ఎదురుదెబ్బ?

విశ్లేషణ



టంకశాల అశోక్

1994లో స్థాపితమైనప్పటినుంచీ 30 ఏళ్లపాటు అప్రతిహతంగా దక్షిణాఫ్రికాను ఏలిన 'ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్'(ఏఎన్‌సీ) తొలిసారి పూర్తి మెజారిటీని అందుకోలేకపోయింది. ఇప్పటికీ అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీ అదే అయినప్పటికీ(400కు 159) క్రమంగా తగ్గుతున్న ఓట్ల శాతం ప్రజల్లో పెరుగుతున్న నిరాదరణకు రుజువు. వర్ణ వివక్షకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ నెల్సన్ మండేలా నెలకొల్పిన ఈ పార్టీ ప్రభుత్వాల అధినేతల అవినీతి, అసమర్థ పాలన ప్రజల్లో అసంతృప్తికి కారణమయ్యాయి. ఒకప్పుడు మొత్తం ఆఫ్రికాలోనే మొదటి స్థానంలో ఉండిన ఆర్థిక వ్యవస్థ నైజీరియా తర్వాత రెండవ స్థానానికి పడిపోయింది. ఈ పరిణామాలను గమనించినప్పుడు ఈరోజున ఏఎన్‌సీ తన మెజారిటీని కోల్పోవటంలో ఆశ్చర్యం కనిపించదు.

దక్షిణాఫ్రికాలో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ) పార్టీ ఓటమి ఆశ్చర్యంగా తోచవచ్చుగానీ, ముందుగా ఊహించనిదేమీ కాదు. శ్వేతజాతీయుల వర్ణ వివక్ష వ్యవస్థ (అపార్థీడ్) మీద సుదీర్ఘ ఉద్యమం విజయవంతమైన తర్వాత 1994లో అధికారానికి వచ్చిన ఏఎన్‌సీ, తన వైఫల్యాల కారణంగా ప్రజాదరణను కోల్పోవటం ఒక దశాబ్ద కాలమైనా తిరగకముందే మొదలైంది. ఇప్పటికి సరిగ్గా 16 సంవత్సరాల క్రితం 2003 జూన్‌లో నేను దక్షిణాఫ్రికాను సందర్శించే నాటికే ఈ అసంతృప్తి వివిధ వర్గాలలో కనిపించసాగింది. కానీ ఆ తర్వాత మరొక అయిదేళ్లు జీవించి ఉండిన నెల్సన్ మండేలా గానీ, తన ఉద్యమ సహచరులుగా పోరాటాలు జరిపి ప్రభుత్వ నాయకత్వాలలోకి వచ్చినవారు గానీ పరిస్థితిని సరిదిద్దలేదు. దేశాధ్యక్ష పదవిని 1999లో వదులుకున్న మండేలా ఏకాంత జీవితంలోకి వెళ్ళిపోగా, ప్రభుత్వాలను నడిపినవారు అవినీతి మార్గాలను పట్టారు. ఉద్యమ కాలంలో హామీ ఇచ్చిన జనరంజక పాలనను, సంస్కరణలను కాగితాలపై తప్ప ఆచరణలో చూపించింది స్వల్పం. అందుకు ప్రజల నిరసన కనిపించటం కొంతకాలం క్రితమే మొదలుకాగా, ఇపుడది 30 ఏళ్ళలో మొదటిసారిగా అసలు మెజారిటీయే కోల్పోయింది.

దక్షిణాఫ్రికా గురించి బయటికి బాగా ప్రచారం పొందిన సమస్య వర్ణ వివక్ష. అటు వివక్ష తెల్లవారు పాలించిన ఇతర ఆఫ్రికన్ వలస దేశాలలో కూడా ఉండగా, ఇక్కడ దానిని చట్టబద్ధంగా వ్యవస్థీకృతం చేశారు. అదే సమయంలో దేశంలోని భూమి, గనులు, పరిశ్రమలు, వ్యాపారాలు, ఉద్యోగాల వంటి సమస్త వనరులు తెల్లవారి అధీనంలోనే ఉండిపోయాయి. అటువంటి స్థితిలో, అపార్థీడ్ వ్యవస్థ రద్దయినప్పటికీ ఈ వనరులపై తెల్లవారి ఆధిపత్యం పోయి, ఆర్థిక సంస్కరణలు జరిగి, నల్లవారికి తమ జనాభాకు తగినట్లు అవకాశాలు లభిస్తే తప్ప పేదరికం పోదు, అపార్థీడ్ వ్యతిరేక పోరాటానికి నిజమైన సార్థకత లభించదు. వాస్తవానికి ఉద్యమకాలంలో ఈ లక్ష్యాలన్నీ ఏఎన్‌సీ అజెండాలో ఉన్నవే. ఆ పార్టీపై తమ సొంత ఆలోచనలతో పాటు వివిధ ప్రజాస్వామిక దేశాలు, సోషలిస్టు దేశాల అభ్యుదయ భావాల ప్రభావాలు ఉండేవి. కానీ అధికారానికి వచ్చిన అనంతరం ఎక్కువ కాలం గడవకుండానే పరిస్థితులు మరొకవిధంగా మారసాగాయి. నిర్మొహమాటంగా చెప్పుకోవాలంటే మండేలా స్వయంగా అధ్యక్షునిగా ఉండిన 1994–99 కాలంలో సైతం ప్రభుత్వ బాధ్యులలో పలువురి తీరు మారటం, మండేలా తన మెతకదనం వల్ల నిస్సహాయునిగా మిగిలిపోవటం జరిగింది. ఆయన తన శేష జీవితం అయిదేళ్లు ఒంటరిగా గడపటం అందువల్లనేనన్నది కొందరి పరిశీలకుల అభిప్రాయం.

అపార్థీడ్ వ్యవస్థ రద్దయిన మాట నిజం. అందువల్ల నల్లవారు స్వేచ్ఛగా తిరగగలగటంతో పాటు బీచ్‌లు, క్లబ్బులు, హోటళ్ల వంటి ప్రదేశాలలోకి వారి ప్రవేశంపై నిషేధాలు తొలగిపోయాయి. పోలీస్ నిర్బంధాలు లేని కొత్త పరిస్థితులు ఏర్పడ్డాయి. నల్లవారి పిల్లలకు విద్యావకాశాలు లభించటం మొదలైంది. కొంత వైద్యం, చదువులతో పాటు ఉద్యోగాలలో రిజర్వేషన్లు వచ్చాయి. నల్లవారికి తెల్లవారు తమ వ్యాపారాలలో చిన్న చిన్న ఉద్యోగాలు ఇవ్వసాగారు. అపార్థీడ్‌తో పాటు తమ రాజ్యం పోయిందనీ, అందువల్ల కొన్ని రాజీలు తప్పవనీ వారికి అర్థమైంది. నల్లవారు కూడా కొద్దిస్థాయిలో వ్యాపారాలు మొదలుపెట్టారు. పెద్ద హోదా గల ప్రభుత్వ ఉద్యోగాలు కొన్నింటిని తెల్లవారికి, నల్లవారికి మధ్య రొటేట్ చేయసాగారు. ఈ మార్పులు నల్లవారిలో ఒక చిన్న మధ్యతరగతి సృష్టికి అవకాశం కల్పించాయి. ఈ విధంగా వారికి క్రమంగా ఆత్మవిశ్వాసం రావటం మొదలైంది. అపార్థీడ్ రద్దువల్ల ఇప్పుడు రాజకీయాధికారమంతా తమదే కావటం సరేసరి.



ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ సారథి, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసా

ఇటువంటివి సానుకూల పరిణామాలని వేరే చెప్పనక్కరలేదు. కానీ ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన విషయాలు మూడున్నాయి. ఒకటి, యథాతథంగా నల్లవారి సమస్యలతో, వారి జనాభాతో పోల్చినపుడు ఈ మార్పులు చాలా స్వల్పం. రెండవది, మొదట చెప్పుకున్నట్లు ఆర్థిక వనరులన్నీ, ఆర్థిక కార్యకలాపాలన్నీ అత్యధిక భాగం తెల్లవారి అధీనంలోనే ఉండిపోవటం. ఉదాహరణకు నేనక్కడ ఉండినపుడు చూసిన అధికారిక ప్రచురణల ప్రకారం, గ్రామీణ భూములు నల్లవారి నుంచి తెల్లవారి చేతిలోకి అపార్థీడ్ రద్దయిన తర్వాత సైతం ఇంకా బదిలీ అవుతూనే ఉన్నాయి. నల్లవారికి తమ వ్యవసాయం కోసం ఎటువంటి సహాయాలు లభించకపోవటం, గ్రామాలలో ఇతరత్రా ఉపాధి అవకాశాలు సన్నగిల్లటంతో వారు భూములు అమ్ముకొని, పొట్ట పోసుకునేందుకు నగరాలకు తరలిపోతున్నారు. నేను స్టెల్లెన్ బాష్ అనే నగరం వద్ద గల ఒక షాంటీ టౌన్‌ను చూశాను. నగరంలో నల్లవారు రోజంతా పనులు చేసుకుని సాయంత్రానికి వెళ్లిపోయి ఉండే ప్రాంతాన్ని షాంటీ టౌన్ అంటారు. అక్కడ అన్ని నివాసాలు, ఆ ప్రాంతం చుట్టు కట్టే కంచె అన్నీ ఇనుప రేకులతోనే. కొన్ని వేలమంది నివసిస్తారు. స్టెల్లెన్ బాష్‌కు దక్షిణాఫ్రికాలో గాంధీజీ కార్యకలాపాలతోనూ సంబంధం ఉండేది. ఇటువంటి టౌన్‌షిప్‌లు గతంలోనూ ఉండగా, అపార్థీడ్ ముగిసిన తర్వాత ఇంకా పెరుగుతున్నాయి. నల్లవారు అధికారానికి వచ్చిన తర్వాత, టూరిజానికి ప్రోత్సాహం పేరిట ఒక్కొక్క కంపెనీకి వేలకు వేల హెక్టార్లు స్థానిక తెల్లవారికి, విదేశీయులకు దీర్ఘకాలపు లీజుకు అప్పగించారు. ఆ భూములన్నీ స్థానిక తెగలవి. వారు భూములు కోల్పోయి ఈ కంపెనీలలో కూలీలుగా పని చేస్తున్నారు. ఇది నా ప్రత్యక్షానుభవం. దేశానికి ఉత్తర ప్రాంతాలలో విస్తారమైన భూములు ఆ విధంగా నల్లవారికి నష్టమయ్యాయి. నేను చూసిన ఉదాహరణ ఇండియాకు చెందిన విజయ్ మాల్యా 20,000 ఎకరాలకు పైగా భూమిలో నిర్వహిస్తున్న మబూలా లాడ్జ్ రిసార్ట్. దాని వివరాలు అనేకం ఉన్నా ఇక్కడ అప్రస్తుతం.

ఇక మూడవ విషయం, ప్రభుత్వ నేతల అదుపులేని అవినీతి. అది చాలదన్నట్లు అసమర్థ పాలన. వీరంతా ఉద్యమ కాలపు అగ్రనేతలే. రెండు ఉదాహరణలు చూడండి. స్వయంగా మండేలా భార్య విన్నీ మండేలా ఉద్యమకాలం నుంచే అవినీతికి పాల్పడి, అపార్థీడ్ రద్దు తర్వాత జైలుకు వెళ్లింది. ప్రస్తుత అధ్యక్షుడు సిరిల్ రామఫోసాకు ముందు అధ్యక్షుడిగా ఉండిన జేకబ్ జుమా కూడా జైలుకు వెళ్లినవాడే. ఇతర పదవులలో ఉన్నవారి సంఖ్యకు లెక్కలేదు. ప్రస్తుత అధ్యక్షుడు వ్యక్తిగతంగా అవినీతిపరుడు కాకున్నా ఆ సమస్యను అరికట్టలేదు. మొత్తంమీద వీరందరి అసమర్థ పాలన కారణంగా విద్యుత్, మంచి నీళ్ల, విద్యావైద్యాలు, తీవ్ర నిరుద్యోగం, వివిధ పౌర సదుపాయాల సమస్యలు పెరగటం మొదలైంది. ఆర్థిక వ్యవస్థ కూడా బలహీనపడుతుండటం వల్ల, ఒకప్పుడు మొత్తం ఆఫ్రికాలోనే మొదటి స్థానంలో ఉండిన వ్యవస్థ కొన్నేళ్ల క్రితమే నైజీరియా తర్వాత రెండవ స్థానానికి పడిపోయింది. ఈ పరిణామ క్రమాలను గమనించినపుడు ఈరోజున ఏఎన్‌సీ తన మెజారిటీని కోల్పోవటంలో ఆశ్చర్యం కనిపించదు.

ఏఎన్‌సీ ఓట్లశాతం 57.5 (2019) నుంచి 40.2కు తగ్గింది. 400 బలం గల నేషనల్ అసెంబ్లీలో సీట్ల సంఖ్య 230 నుంచి 159కు పడిపోయింది. కనుక ఇతరులతో పొత్తు తప్పదు. రెండవ స్థానంలో గల డెమోక్రటిక్ అలయన్స్ తెల్లవారిది. అందువల్ల విధానాల సమస్య ఉంటుంది. మూడవ స్థానంలో గల మాజీ అధ్యక్షుడు జేకబ్ జుమా(ఏఎన్‌సీ తరఫున దేశాధ్యక్షుడిగా ఉండిన జుమా మద్దతుతో కొత్త పార్టీ ఏర్పడింది) అవినీతి కేసులో జైలుకు వెళ్లినవాడు. అనగా, ప్రభుత్వ ఏర్పాటుకు పొత్తులు కూడా సమస్య కానున్నాయన్నమాట. అంతిమంగా తేలుతున్నది దక్షిణాఫ్రికా ప్రజల సమస్యలు సమీప భవిష్యత్తులో తీరేవి కాదని!

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఆగదు పోరు



ఎగ్జిట్ ఫలితాలు దిగ్భ్రమకు గురిచేస్తున్నాయి. నమ్మశక్యంగా లేవు. మనం గొంతెత్తాం, పోరాడాం. మా నాన్నలాంటి సీనియర్ సిటిజన్ మనుమల్ని చైతన్యవంతం చేయడానికి రోడ్ల మీద తిరిగాడు. రాహుల్ గాంధీ, ఆయన సహచరులు వేలాది మైళ్లు నడిచారు. ఏమైనా ఈ స్ఫూర్తి కొనసాగుతుంది.

– రాఖీ త్రిపాఠీ, అసోసియేట్ ప్రొఫెసర్

ఆధునికత బాటలో...



తన పాఠశాల పాఠ్య పుస్తకాల్లోంచి చాలా వరకు పాలస్తీనా మ్యాపును సౌదీ అరేబియా తొలగించిందని వార్త. అలాగే జిహాద్ మీద ఉన్న హింసాత్మక వివరణలను కూడా! చూస్తుంటే సౌదీ అరేబియా, యూఏఈ పాలకులు తమ మతంలోంచి ఛాందస వాదాన్ని ఏరివేయడంలో కృతనిశ్చయులుగా ఉన్నట్టున్నారు.

– అరవింద్ విర్‌మానీ, ఆర్థికవేత్త

తింటే చాలదు, వండాలి!



ఇండియాలోని ప్యాకేజ్డ్ ఫుడ్ ప్రపంచంలోనే అత్యంత నాసిరకమైనది. ప్రపంచవ్యాప్తంగా నాలుగు లక్షల ఉత్పత్తుల మీద చేసిన ఒక అధ్యయనం ఇండియాలోని ప్యాకెజ్డ్ ఫుడ్‌లో అధిక మొత్తంలో చక్కెర, ఉప్పు ఉన్నట్టు కనుగొంది. ఇంట్లో తినడం, ఇంట్లో వండుకుని తినడం – రెండూ వేర్వేరని గమనించండి.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

ప్రాక్టికల్ మనుషులు



ప్రతి సంవత్సరం నేను సోకాల్డ్ మూడో ప్రపంచ దేశాలు, ప్రత్యేకించి అర్మేనియా, ఉక్రెయిన్‌లో ఒక్క నెలైనా గడుపుతాను. వాళ్లు ఎప్పుడూ యుద్ధభయంలో ఉంటారు. అయినప్పటికీ వాళ్లు ఈ పాశ్చాత్య దేశాల్లో ప్రతిదానికీ మూలుగుతూవుండే వాళ్లలా ప్రవర్తించరు.

– కాన్‌స్టంటిన్ కిసిన్, సెటైరిస్ట్

సరైన నిర్ణయం



జూన్ 4 మధ్యాహ్నం నుంచి పశ్చిమ బెంగాల్‌లో హింస మొదలవుతుంది. ఇది తెలిసే ఎన్నికల కమిషన్ 40 వేలకు పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలను రప్పిస్తోంది. విపరీతమైనదే, కానీ సరైన నిర్ణయం.

– సందీపన్ దేవ్, కాలమిస్ట్

ఇన్ బాక్స్

ఆదివాసీ జీవితాల్లో వెన్నెల

స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకెళ్లిన యోధునిగా కన్నా... అమాయక ఆదివాసీల సముద్ధారకునిగా వెన్నెలకంటి రాఘవయ్య ప్రసిద్ధులు. సంచార గిరిజనుల గురించీ, వారి సమస్యల గురించీ దాదాపు ఇరవైకి పైగా విశిష్ట గ్రంథాలు రాశారాయన. నెల్లూరు జిల్లా కోవూరు తాలూకాలోని శింగపేట గ్రామంలో ఆయన 1897 జూన్ 4న జన్మించారు. 1946 వరకు భారతదేశంలో గిరిజనుల పట్ల శాపంగా మారిన అతి భయంకరమైన, క్రూరమైన 'క్రిమినల్ ట్రైబ్స్ ఆక్ట్–1871'ను రద్దు చేయించడంలో రాఘవయ్యది ప్రధాన పాత్ర. బ్రిటిష్‌వాళ్లు ఈ దేశ సంపదను దోచుకోవడానికి అవసరమైన రోడ్లు వేయడానికి, బ్రిడ్జ్‌లు కట్టడానికి, రైల్వే ట్రాక్‌లు నిర్మించడానికి, తమ బానిసలుగా పని చేయడానికి... గిరిజనులను దొంగలు, దోపిడీ దారులుగా చిత్రీకరించింది ఈ చట్టం. వారి మీద నాన్ బెయిలబుల్ సెక్షన్‌లు సృష్టించి వారిని ప్రభుత్వ బానిసలుగా మార్చింది ఈ చట్టం. తప్పు చేసినా, చెయ్యకపోయినా తండాలు, సంఘాల్లో ఉండే కొన్ని సంచార ఆదివాసీ తెగలవారు వారం వారం వెళ్లి పోలీస్ స్టేషన్‌లో వేలి ముద్రలు వేసి రావాలి. ఈ చట్టం వలన ఈ గిరిజనులను ఊళ్లలోకి రానిచ్చే వారు కాదు. రాఘవయ్య పోరాట ఫలితంగా 1947లో ఈ చట్టాన్ని తొలగించారు.



రాఘవయ్య 'ఆది ఆంధ్ర సంఘా'న్ని స్థాపించి యానాదులు, ఎరుకలు, లంబాడీలు, చెంచులు, కోయలు, బుడబుక్కల వంటి సంచార జాతులను సమీకరించి, సంఘటితం చేసి వారిలో అనేక మార్పులకు కారణం అయ్యారు.

ముఖ్యంగా చెట్టుకొకరు, పుట్టకొకరు విసిరేసినట్లు కాల్వల పక్కన, చెరువుల పక్కన, పొలాల్లో గుడిసెలు వేసుకుని మిగిలిన సమాజంతో సంబంధం లేకుండా వెలివేసినట్లు బ్రతుకుతున్న యానాదులకు కాలనీలు నిర్మించారు. వారి పిల్లలు చదువుకునేందుకు పాఠశాలలు, బాలబాలికలకు వేర్వేరు హాస్టళ్ళు నిర్మించి విద్యను అందించడంలో మరువరాని కృషి చేశారు.

ఆదిమ జాతి సేవక్ సంఘ్ సభ్యులైన థక్కర్ బాపాతో కలిసి హాస్టళ్ళు నడపడంతో పాటు, మైదాన ప్రాంత ప్రజలు గిరిజనుల పట్ల చేస్తున్న మోసాలను అరికట్టడంలోనూ, చైతన్య పరచడంలోనూ, పని మనుషుల కోసం గిరిజనుల పిల్లల్ని అమ్మే ఆచారాన్ని రూపు మాపడంలోనూ రాఘవయ్య చేసిన కృషి అంతా ఇంతా కాదు. అటువంటి ప్రజాసేవకుడు 1981, నవంబరు 24న తుదిశ్వాస విడిచినా, ఆయన సేవలు అజరామరం. ఆయన స్ఫూర్తి అనంతం. ఆయన చూపిన స్పృహను మనమూ కొనసాగించాలి.

– సామల కిరణ్ । 99511 72002
(నేడు వెన్నెలకంటి రాఘవయ్య జయంతి)

స్నేహం... బాలు చేవ్రాలు!

సందర్భం




డా॥ పైడిపాల

తెలుగు జాతి గర్వించదగిన గాన గంధర్వునిగా, బహుముఖ కళా పారీణునిగా బాలును ఎరగని వాళ్ళుండరు. ఆయన నేపథ్య గాయకునిగా, అద్వితీయునిగా రాణించిన కాలంలో సాటి గాయకుల కెవరికీ అవకాశాలు రాకుండా చేస్తున్నారని కొందరు అసూయాపరులు ఆరోపణలు చేసినా, 'పాడుతా తీయగా' కార్యక్రమ వీక్షకులను బాలు వ్యక్తిత్వం, హృదయ సంస్కారం ముగ్ధుల్ని చేశాయి. ఆయన అంతరంగం స్నేహ పారిజాతమని ఆ పరిమళాల్ని శ్వాసించి పరవశించిన ఆత్మీయ మిత్రులకు మాత్రమే తెలుసు.

మాంగల్య బంధం కంటే స్నేహబంధం పటిష్ఠమైనదనీ, అది ఎప్పటికీ ఇగిరిపోని గంధం అనీ బాలు అభిప్రాయపడేవారు. స్నేహం చేసేముందు అవతలి వ్యక్తి గురించి పూర్తిగా తెలుసుకోవాలనీ, స్నేహం కుదిరిన తర్వాత మిత్రునిలో లోపాలు బయటపడినా వాటిని సరిదిద్దాలి కాని ఏకంగా ఆ బంధాన్ని తెంచుకోకూడదనీ బాలు స్నేహ ధర్మానికి భాష్యం చెప్పేవారు. కేవలం మాటలకే పరిమితం కాకుండా నిజ జీవితంలో స్నేహాన్ని ఒక పవిత్ర బంధంగా, పారాయణ గ్రంథంగా పాటించిన మనస్వి ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం.

బాలు ఎవరికీ అందనంత ఎత్తుకు ఎదిగినా, ఎక్కి వచ్చిన నిచ్చెన మెట్లనూ, చిన్న నాటి నేస్తాలనూ మర్చిపోలేదు. అందుకు ఆయన కృతజ్ఞతా పూర్వకంగా చేయి అందించిన బీవీ మురళి, ఎమ్ విఠల్‌రావు, వై కామేశ్వర రావు, శ్యామ్, డా॥ వై.దివాకర్ వంటి సహచరులు ప్రత్యక్ష సాక్షులు. 1964లో మద్రాసు ఆంధ్రా క్లబ్‌లో జరిగిన లలిత సంగీతం పాటల పోటీలో పాల్గొనడానికి బాలు ఇష్టపడకపోయినా... చెప్పకుండా ప్రవేశ రుసుము చెల్లించి బాలుకి ప్రథమ బహుమతి రావడానికీ, కోదండపాణి వంటి వారి దృష్టిలో పడటానికీ కారకుడు; 1966 డిసెంబరు 15వ తేదీన 'విజయా గార్డెన్స్'లో తన మొట్టమొదటి సినిమా పాట రికార్డింగ్‌కు సైకిలు మీద తోడుగా వచ్చి ప్రోత్సహించిన తన రూమ్మేట్ బీవీ మురళిని కోదండపాణి ఆడియో లాబ్‌లో ఆడియో అసిస్టెంట్‌గా నియమించడమే కాకుండా ఎన్నో వేదికల మీద అతని సహాయాన్ని గుర్తు చేసుకునే వారు. రంగస్థలం మీద సహ నటులైన శ్యామ్‌ను స్టూడియో మేనేజర్ గానూ, వై. కామేశ్వరరావును 'పాడతా తీయగా'లో అసిస్టెంట్ గానూ, కొన్ని చిత్రాలలో నటుడి గానూ అవకాశాలు కల్పించి వారి ఉపాధికి తోడ్పడ్డారు. విఠల్‌ను పీఏగా పెట్టుకోవడమే కాకుండా తన ఇంటికి దగ్గర్లో అతనికో ఇల్లు కట్టించడంతో పాటు అనేక విధాలుగా ఆదుకున్నారు. 'ఈటీవీ' వారి వార్షికోత్సవ సంగీత కార్యక్రమంలో తను మెచ్చిన రాంప్రసాద్‌ను 'పాడుతా తీయగా' కార్యక్రమానికి పరిశోధకునిగా చివరి వరకు కొనసాగించారు.



బాలు స్నేహ ప్రీతి బాల్యమిత్రులకే పరిమితం కాలేదు. స్టూడియో నిర్మాణానికి సహకరించిన ప్రాణమిత్రుడు బిల్డర్ రాధాకృష్ణన్ ఆకస్మికంగా జూన్ 1వ తేదీన చనిపోతే ఆనాటి నుంచి బాలు తన పుట్టినరోజును (జూన్ 4వ తేదీ) అట్టహాసంగా జరుపుకోవడం మానేశారు. ఎమ్వీఎల్, వై. కామేశ్వరరావు వంటి ఆప్తమిత్రుల అవసాన దశలలో వారిని బతికించడానికి హాస్పిటల్స్‌కు సంబంధించిన మొత్తం ఖర్చులను భరించారు. ఎమ్వీఎల్ చనిపోయిన తరువాత కూడా అతని స్నేహ బృందాన్నీ, నూజివీడునూ మర్చిపోకుండా అనేక స్మారక కార్యక్రమాలకు హాజరయిన స్నేహశీలి, ఆత్మ బంధువు బాలు.

1990లో మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా పరిచయమైన ఈ వ్యాసకర్త సిద్ధాంత గ్రంథం 'తెలుగు సినిమా పాట చరిత్ర'ను అయాచితంగా, ఐచ్ఛికంగా స్పాన్సర్ చేసి ప్రచురించడమే కాకుండా దానికి విస్తృత ప్రాచుర్యాన్ని కలిగించారు బాలు. స్వల్ప పరిచయం స్నేహంగా మారడానికీ, ఈ వ్యాసకర్తకు సినీగేయ సాహిత్య పరిశోధకునిగా గుర్తింపు రావడానికీ బాలు సహృదయతే కారణం. నంది పురస్కారాల నందుకున్న వ్యాసకర్త రెండు సిద్ధాంత గ్రంథాలనూ స్పాన్సర్ చేసిన బాలు స్నేహ వాత్సల్యాన్ని ఈ రచయిత మర్చిపోలేడు. వెన్నెలకంటి ప్రతిభను గుర్తించి అతనిని సినీరంగంలో ప్రోత్సహించడం, డా॥ పీఎస్ గోపాలకృష్ణ రచనలు 'మన ఘంటసాల', తన జీవిత చరిత్ర 'జీవన గానాలు'కు బాసటగా నిలవడం బాలు ఉత్తమాభిరుచికి నిదర్శనాలు.


1993 ఫిబ్రవరిలో హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో ఘంటసాల విగ్రహావిష్కరణ సందర్భంగా లక్షలు వెచ్చించి మద్రాసు చిత్ర పరిశ్రమలోని తన మిత్రులందరినీ హైదరాబాద్‌కు తరలించి సత్కరించడం బాలు మైత్రీ యానంలో ఓ మైలురాయి.

బాలుది బాలుడి మనస్తత్వం. ఆ విషయాన్ని ఘంటసాల విగ్రహావిష్కరణ సభలో అతని కన్నీళ్లు రుజువు చేశాయి. బాలు సంగీత సత్కార వేదికల మీద ఎన్నో సార్లు తన అంతిమ క్షణాల గురించి ప్రస్తావించేవారు. తనను నూరేళ్ల వరకు మృత్యువు సమీపించదనీ, మళ్లీ తనకు జన్మంటూ ఉంటే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంగానే పుట్టాలనీ, అప్పుడు కూడా తన మిత్రులు, అభిమానులు తనతో ఉండాలని కోరుకుంటున్నాననీ అనేవారు. పసి మనస్సును తలపించే ఆ మహోన్నత మూర్తి పుట్టినరోజున ఆయన ఆత్మకు అంజలి ఘటిద్దాం. అంతటి మహనీయుని సమకాలికులుగా పుట్టినందుకు, ఆయన స్నేహ సంపదను పంచుకున్నందుకు జన్మ ధన్యమైందని గర్విద్దాం.

వ్యాసకర్త సినీగేయ పరిశోధకులు । 99891 06162
(నేడు ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జయంతి)

మొర వినేవాడు

కష్టాలు మనలను కమ్మేసినప్పుడు మనసు అతలాకుతలం అవుతుంది. మనోధైర్యం సడలిపోతుంది. మన బాధను, మనో వేదనను పంచుకునేందుకు ఒకరు కావాలనిపిస్తుంది. మన వారనుకునే వారికి మన గోడు చెప్పుకుంటాం. కొంచెం ఊరట చెందుతాం. ఆ సమయంలో భగవంతుడు ఎప్పటి కన్నా బాగా గుర్తుకువస్తాడు. దైవం ఒక్కడే మన మొర వినేవాడు, బాధ తీర్చేవాడు అనే నమ్మకంతో మన వేదన నివేదిస్తాం. తోటి మనుషులతో పూర్తిగా చెప్పుకోలేని బాధను నిస్సంకోచంగా దైవానికి మొర పెట్టుకుంటాం.



భాగవతం అష్టమ స్కంధంలోని గజేంద్ర మోక్షం ఘట్టంలో గజరాజు సరస్సులో క్రీడించే సమయంలో ఆ మడుగులో ఒక మొసలి గజరాజును ఒడిసి పట్టుకుంటుంది. ఏనుగూ, మొసలీ ఒకదాన్ని మించి ఒకటి ఓడించాలని పోరాటం చేశాయి. ఏనుగు పోరాడి పోరాడి అలసిపోయింది. 'ఇంక నాకు సాధ్యం కాదు. నేను ఎవరిని ప్రార్థించాలి? నన్ను ఎవరు కాపాడతారు? దిక్కులేని నా మొర వినే పుణ్యాత్మునికి నమస్కరిస్తాను' అంటుంది. ఆ పుణ్యాత్ముడు ఎవరు? భగవంతుడే! 'అందరి పట్ల సమభావం కలవాడూ, దుర్జనుల చేత చిక్కిన సజ్జనులను సాయపడేవాడూ, దీనుల మొర వినేవాడూ నా మొరను వింటాడు' అంటుంది.

నీవు తప్ప నాకు దిక్కు లేదు; ఆదుకొమ్మని నిండు మనసుతో ప్రార్థిస్తే భగవంతుడు ఉన్నవాడు ఉన్నట్లే వచ్చేస్తాడని అనటానికి గజేంద్ర మోక్ష పద్యాలే ప్రబల నిదర్శనం. భయంతో స్వాధీనం తప్పి కాపాడమన్న గజేంద్రుని మొర విన్నాడు. తక్షణమే వచ్చి గజేంద్రుని కాపాడాడు. ఈ మొర అనే పదం ఈ ఘట్టంలో చాలా సార్లు కనిపిస్తుంది.

మొర అంటే ఆర్తితో ప్రార్థించటం. మొరలో వేదన ఉండాలి. భక్తి, నమ్మకం ఉండాలి. అప్పుడే మన కష్టాలూ, బాధలూ తొలగుతాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** బ.త్రయోదశి రా.9.03 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** భరణి రా.10.05 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** ఉ.8.26 నుండి 9.57 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.56 వరకు తదుపరి రా.10.50 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** సా.5.36 నుండి 7.09 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.

క్లుప్తంగా...

బాలాంజనేయుడికి కనకాంబరాలతో అర్చన

- తిరుమలలో వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

తిరుమల: తిరుమలలో హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆంజనేయ స్వామి జన్మ స్థలమైన ఆకాశగంగలో అంజనాదేవి, బాలాంజనేయస్వామి ఆలయంలో సోమవారం స్వామి వారికి కనకాంబరం, సింధూర వర్ణ గన్నేరు పుష్పాలతో విశేష సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహన రంగాచార్యులు అంజనాద్రి, ఆకాశగంగ ఆంజనేయస్వామి వారి జన్మస్థలం, స్వామి వారి వైభవాన్ని వివరించారు. అనంతరం స్వామి వారికి పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహించారు.

మద్యం బాటిళ్లు పట్టివేత



మద్యం, బీరు బాటిళ్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీఎస్పీ రవికుమార్

చంద్రగిరి (తిరుపతి జిల్లా): కర్ణాటక నుంచి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు ఓ టెంపో వాహనంలో వెళ్తున్న మత్స్యకారుల నుంచి 29 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారివద్ద రెండు కత్తులు ఉండడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ మేరకు సోమవారం ఇన్‌చార్జ్ డీఎస్పీ రవికుమార్ మీడియాకు వివరాలను వెల్లడించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్త సత్రం గ్రామానికి చెందిన సుమారు 13 మంది మత్స్యకారులు బతుకుదెరువు కోసం గత పదేళ్లుగా కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు హార్బర్‌లో ఖాదర్ అనే వ్యక్తికి చెందిన బోటులో వేటకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. రెండు నెలల క్రితం మంగళూరుకు వెళ్లిన జాలర్లు పనులు ముగించుకుని టెంపో ట్రావెలర్ వాహనంలో సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో జాలర్లు 29 మద్యం బాటిళ్లు, 26 టిన్ బీర్లు, రెండు డ్రమ్ముల్లో ఎండు చేపలు, మూడు బాక్సుల్లో పచ్చి చేపలు, పనస కాయలతో పాటు రెండు కత్తులను తీసుకొచ్చారు. పనపాకం టోల్ ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో మద్యంతో పాటు ఇతర వస్తువులను గుర్తించి విచారణ నిమిత్తం స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే జాలర్లు, వారి బంధువుల కోసం మద్యం తీసుకెళ్తున్నట్లు విచారణలో తేలింది. త్వరలోనే వారి గ్రామంలో తిరునాళ్ల జరగనున్న నేపథ్యంలో మంగళూరులో రెండు కత్తులను కొనుగోలు చేసినట్లు తెలిపారు. కాగా కొందరు రౌడీ మూకలు కౌంటింగ్ నేపథ్యంలో హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు వచ్చినట్లు సోషల్ మీడియా, కొన్ని చానళ్లు (సాక్షి టీవీ కాదు) దుష్ప్రచారానికి తెగబడ్డాయి. ఇలాంటి వదంతులను నమ్మవద్దని డీఎస్పీ రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

‘ఆపరేషన్’ సిజేరియన్



రాష్ట్రంలో అవసరం లేని సిజేరియన్ ఆపరేషన్ల కట్టడికి వైద్య శాఖ చర్యలు

- విచ్చలవిడిగా సిజేరియన్లు చేసిన ఆస్పత్రులపై దృష్టి
- సగానికి పైగా సిజేరియన్లు అవసరం లేనివని తేల్చిన అధికారులు
- ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లోని 104 ఆస్పత్రులకు నోటీసులు
- నోటీసులకు వివరణ ఇచ్చిన ఆస్పత్రులు
- ఈ ఆసుపత్రులపై చర్యలకు ఉపక్రమిస్తున్న అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించి, సహజ ప్రసవాలను పెంచేందుకు వైద్య శాఖ కృషి చేస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) మార్గదర్శకాల ప్రకారం మొత్తం ప్రసవాల్లో సిజేరియన్‌లు 10 నుంచి 15 శాతానికి మించకూడదు. కాగా, 2023–24లో రాష్ట్రంలో ఏడు లక్షలకు పైగా ప్రసవాలు జరగ్గా, వీటిలో 4.48 లక్షల ప్రసవాలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేశారు. వీటిలో 50 శాతం మేర సిజేరియన్ ఆపరేషన్లు ఉన్నాయి. వీటిలో చాలా వరకు అవసరం లేకపోయినా చేసిన సిజేరియన్ ఆపరేషన్లే. ఇలాంటి ప్రసవాలు చేసిన ఆస్పత్రులపై వైద్య శాఖ చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా వంద శాతం సిజేరియన్లు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోని 104 నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీటికి ఆ ఆస్పత్రుల యాజమాన్యాలు ఇప్పటికే వివరణ ఇచ్చాయి. సాధారణ ప్రసవం చేయడానికి వీల్లేని పరిస్థితుల్లో గర్భిణులు ఆస్పత్రులకు రావడం వల్లే సిజేరియన్ ఆపరేషన్లు చేసినట్లు అన్ని ఆస్పత్రులు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అదే విధంగా తొలి కాన్పు సిజేరియన్ ఉండటం వల్ల రెండో కాన్పు కూడా సిజేరియన్ చేశామన్నారు. ఆస్పత్రులు ఇచ్చిన వివరణలను వైద్య శాఖ అధికారులు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆస్పత్రులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నారు.

కర్నూలులో అత్యధికంగా సిజేరియన్లు

2023–24లో రాష్ట్రవ్యాప్తంగా 3.28 లక్షలు సిజేరియన్ ప్రసవాలు జరిగాయి. సిజేరియన్ ఆపరేషన్లలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఈ జిల్లాలో 23,500 సిజేరియన్‌లు జరగ్గా, వీటిలో 16,678 ప్రైవేటు ఆస్పత్రుల్లో చేశారు. 20,059 సిజేరియన్‌లతో పశ్చిమ గోదావరి రెండో స్థానంలో, 19,855తో అనంతపురం మూడో స్థానంలో ఉన్నాయి.

45 శాతం అనవసరమే

సిజేరియన్ ప్రసవాలను నియంత్రించడంలో భాగంగా 2022 ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య రాష్ట్రవ్యాప్తంగా 62 ఆస్పత్రుల్లో 278 ఆపరేషన్లపై వైద్య శాఖ ఆడిట్ నిర్వహించింది. వీటిలో 155 సిజేరియన్‌లు (55 శాతం) గర్భిణుల ఆరోగ్య పరిస్థితి, ఇతర కారణాలతో అవసరం మేరకే చేసినట్లు తేలింది. మరో 72 కేసుల్లో (26 శాతం) అవసరం లేకపోయినా సిజేరియన్ ఆపరేషన్లు చేసినట్టు ఆధారాలతో తేలింది.. మిగిలిన 53 కేసుల్లో (19 శాతం) సిజేరియన్‌కు అవసరమైన ఆధారాలు ఏమీ లేనట్టు తేలింది. అంటే 45 శాతం సిజేరియన్లు అవసరం లేకుండానే చేసినట్లు తేలింది.

- ప్రైవేట్ ఆస్పత్రులు సిజేరియన్ల వైపు మొగ్గు చూపడానికి కారణాలు
- సాధారణ ప్రసవంతో పోలిస్తే సిజేరియన్‌కు ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం ఇస్తున్న ఫీజు ఎక్కువగా ఉండటం
- సాధారణ ప్రసవం చేయాలంటే కొన్ని గంటల సమయం పడుతుంది. ఈ క్రమంలో గర్భిణి, కడుపులోని బిడ్డ ఆరోగ్య పరిస్థితిని వాకబు చేస్తూ ఉండాలి. ఇందుకోసం ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిపుణులైన నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండరు.
- సాధారణ ప్రసవానికి ప్రయత్నిస్తున్న సమయంలో కొన్ని సందర్భాల్లో సిజేరియన్ చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఈ క్రమంలో చిన్నపాటి నర్సింగ్ హోమ్‌లు, ఆస్పత్రులకు ప్రత్యేకంగా 24/7 అనస్తీషియా వైద్యుడు అందుబాటులో లేకపోవడం.
- యువ వైద్యుల్లో సాధారణ ప్రసవాలు చేయడానికి తగినంత అనుభవం, ఆత్మవిశ్వాసం లేకపోవడం.
- సిజేరియన్ ప్రసవం వల్ల కలిగే సమస్యలను వివరించి, సాధారణ ప్రసవానికి సిద్ధపడేలా గర్భిణి, కుటుంబ సభ్యులను కౌన్సెలింగ్ చేసే ప్రయత్నం కూడా చేయకపోవడం.

మంగినపూడి బీచ్‌లో యువకుడి గల్లంతు

ఆపస్మారక స్థితికి మరో యువకుడు



అపస్మారక స్థితిలో ఉన్న సాయిని ఒడ్డుకు చేర్చిన పోలీసులు

కోనేరు సెంటర్ (మచిలీపట్నం): కృష్ణా జిల్లా మంగినపూడి బీచ్‌లో ఓ యువకుడు గల్లంతయ్యాడు. మరో యువకుడు కెరటాల తాకిడికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బందరు రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన మసిముక్కు భాను సోమవారం స్నేహితులతో కలిసి మంగినపూడి బీచ్‌కు వచ్చాడు. స్నేహితులంతా కలిసి స్నానం చేస్తుండగా అలలు ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. భానుతో పాటు స్నేహితులు అలల తాకిడికి నీటిలో మునిగిపోయారు. తోటి పర్యాటకులతో పాటు విధులు నిర్వహిస్తున్న పోలీసులు యువకులను కాపాడే ప్రయత్నం చేశారు. ఏడుగురిని ఒడ్డుకు చేర్చగా.. భాను అప్పటికే అలల తాకిడికి కనిపించకుండాపోయాడు. సాయి అనే మరో యువకుడు నీరు తాగేయటంతో ప్రాణాపాయ స్థితిలో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సాయిని ఒడ్డుకు చేర్చిన పోలీసులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. భాను కోసం పోలీసులు సముద్రం వెంబడి ఎంత గాలించినా ప్రయోజనం లేకపోయింది.

ఇంధనం సంరక్షణకు ‘పాట్’ పడుతున్న ఏపీ

పరిశ్రమలో ఇంధన సామర్థ్యం, సాంకేతికత అభివృద్ధికి పెర్ఫార్మ్, అచీవ్ ట్రేడ్ పథకం అమలు



- రాష్ట్రంలో ఇప్పటి వరకూ పూర్తయిన మూడు ‘పాట్’ సైకిల్స్
- పాట్ సైకిల్–3 వరకు 1.16 మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వెలెంట్ (ఎంటీఓఈ) ఇంధనం ఆదా
- ఎనర్జీ ఎఫిషియన్సీ పాలసీతో ఏటా 16,875 మిలియన్ యూనిట్లు ఆదా లక్ష్యం
- పాట్ అమలులో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్న రాష్ట్రం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పారిశ్రామిక రంగంలో ఇంధన సామర్థ్యాన్ని పెంపొందించడం, సమర్థవంతంగా ఇంధన వ్యయాన్ని తగ్గించడం, కర్బన ఉద్గారాలను కట్టడి చేయడం వంటి లక్ష్యాలను సాదించడంలో భాగంగా, పెర్ఫార్మ్, అచీవ్, ట్రేడ్ (పాట్) పథకం ద్వారా భారీ పరిశ్రమల్లో ఇంధన సామర్థ్యం, సాంకేతికతను ప్రవేశ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోంది. పాట్ సైకిల్–3 వరకు 1.16 మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వెలెంట్ (ఎంటీఓఈ) ఇంధనాన్ని రాష్ట్రం ఆదా చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎనర్జీ ఎఫిషియన్సీ పాలసీని కూడా రూపొందించింది. ఈ పాలసీ వల్ల ఏటా 16,875 మిలియన్ యూనిట్లు (మొత్తం డిమాండ్‌లో 25.6 శాతం) ఆదా అవుతుందని, వాటి విలువ రూ.11,779 కోట్లుకు పైగానే ఉంటుందని అంచనా. తద్వారా దాదాపు 14.34 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గే అవకాశం ఉంది.

ప్రయోజనాలు ఎన్నో..

ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవటం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయటమే కాకుండా పారిశ్రామిక ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించవచ్చు. తద్వారా ఉత్పత్తుల నాణ్యత పెరుగుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ‘పాట్’ పథకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. నూతన ఇంధన సామర్థ్య సాంకేతికత సహాయంతో తక్కువ విద్యుత్‌తో ఎక్కువ పారిశ్రామిక ఉత్పత్తి సాధించడంపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పిస్తోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) ఆధారిత పరికరాలను సమకూరుస్తోంది. రాష్ట్రంలో 65 ఎంఎస్ఎంఈల్లో వీటిని అమర్చింది. ఇవి విద్యుత్ వినియోగాన్ని, యంత్రాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తగిన సూచనలు అందించడం ద్వారా ఇంధన ఆదాకు దోహదపడుతున్నాయి. దీంతో సరిపెట్టకుండా పాట్ పథకం కింద లక్ష్యాలను సాధించిన పరిశ్రమలకు ఇంధన పొదుపు సర్టిఫికెట్లను బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) ద్వారా అందిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇలా 4 లక్షలకు పైగా సర్టిఫికెట్లను అందించింది. వీటిని మార్కెట్లో విక్రయించడం ద్వారా ఆయా పరిశ్రమలు ఆర్థిక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. భారీ పరిశ్రమల్లో ప్రత్యేకంగా విద్యుత్ క్యాప్టివ్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే నిరంతర విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. దీనివల్ల పరిశ్రమలు విద్యుత్‌పై చేసే వ్యయం తగ్గుతుంది.

ఆదర్శంగా నిలుస్తున్న ఏపీ

2030 నాటికి దేశ వ్యాప్తంగా 1 బిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించాలని, 2070 నాటికి వాటిని అసలు లేకుండా చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్య సాధనలో ఏపీ చురుకైన పాత్ర పోషిస్తోంది. 65 సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో ఐఓటీ ఆధారిత ఎనర్జీ ఎఫిషియన్సీ డెమోన్‌స్ట్రేషన్ ప్రాజెక్టుల అమలు, న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఇంధన సామర్థ్య చర్యలు, పెర్ఫార్మ్, అచీవ్ – ట్రేడ్ (పాట్)లో పథకంలో 1.160 మిలియన్ టన్నుల చమురుకు సమానమైన ఇంధన పొదుపు, స్థానిక సంస్థల్లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలు వంటి కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా ఏపీకి గుర్తింపుతెచ్చాయి.

మరోవైపు పరిశ్రమలలో ఆధునిక విధానాల్లో ఇంధనాన్ని సక్రమంగా వినియోగించే సాంకేతికతను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాట్ పథకాన్ని అమలు చేస్తోంది.

అంతర్జాతీయ అథ్లెట్ కడియాల కన్నుమూత



కడియాల (ఫైల్)

తెనాలి: గుంటూరు జిల్లా కొలవెరానికి చెందిన ప్రఖ్యాత క్రీడాకారుడు, అథ్లెటిక్ కోచ్, పురావస్తు పరిశోధకుడు, కడియాల వెంకటేశ్వరరావు (75) సోమవారం గ్రామంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ (హైదరాబాద్) అధ్యక్షునిగా పనిచేశారు. కొలవెరం గ్రామంలోని అథ్లెటిక్ అసోసియేషన్‌లో సాధన చేసి క్రీడా రంగంలోకి అడుగుపెట్టిన వెంకటేశ్వరరావు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక బహుమతులు సాధించారు. హైజంప్‌లో విద్యార్థి దశలోనే అద్భుత ప్రావీణ్యం ప్రదర్శించారు. తెనాలి, హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీల్లో హైజంప్, పోల్ వాల్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. 1971–75 వరకు జరిగిన రాష్ట్ర అథ్లెటిక్ పోటీలో సరికొత్త రాష్ట్ర రికార్డు నెలకొల్పారు. 1969లో జలంధర్‌లో జరిగిన జాతీయ అథ్లెటిక్ పోటీల్లో పోల్‌వాల్ట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి స్వర్ణం గెలిచారు. అనేక జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో బహుమతులను సాధించారు. పాటియాలాలోని ఎన్ఐఎస్‌లో శిక్షణ పొందారు. నైజీరియాలో క్రీడాశిక్షకునిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థలో అథ్లెటిక్ కోచ్‌గా, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌గా, డిప్యూటీ డైరెక్టర్‌గా వివిధ స్థాయిల్లో బాధ్యతలు నిర్వర్తించారు. 2003లో విశాఖలో జరిగిన నేషనల్ గేమ్స్‌కు టెక్నికల్ కన్వీనర్‌గా వ్యవహరించారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రథమ ఆఫ్రో–ఏషియన్ గేమ్స్‌లో స్పోర్ట్స్ అథారిటీ, ఆంధ్రప్రదేశ్ తరఫున ఫుట్‌బాల్‌కు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఉద్యోగం నుంచి రిటైరయ్యాక జాతీయ/అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని విజయాలు సాధించారు. 2001లో ఆస్ట్రేలియాలో జరిగిన 14వ ప్రపంచ వెటరన్ అథ్లెటిక్ మీట్‌లో హైజంప్‌లో 50 ప్లస్ విభాగంలో నాలుగో స్థానాన్ని సాధించారు.

స్వస్థలం కొలవెరంలో విశ్రాంత జీవనం గడుపుతూ వెంకటేశ్వరరావు పురావస్తు పరిశోధనపై దృష్టి సారించారు. రాష్ట్రంలోని మల్లెపాడు దిబ్బ ఇనుప యుగపు స్థావరమే కాకుండా బౌద్ధ క్షేత్రమని, పల్నాడు జిల్లా కారంచేడు మండలం వెలుపలనున్న నిలువెత్తు రాక్షసబండ (మన్‌హిర్)ను ఈ తరానికి పరిచయం చేశారు. మంచికల్లు వద్ద పురా మానవుల శిలా లేఖనాలను గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాల్లో పాండవుల మెట్టపై ఇనుప యుగపు సమాధుల నాటి అత్యంత అరుదైన కట్టడ అవశేషాలను కనుగొన్నారు. శాలిహుండంకు అవతలి వైపున జగతిపాడు అనే బౌద్ధస్థావరాన్ని ఆయన వెలుగులోకి తీసుకొచ్చారు. ఎక్కడ పురావస్తు తవ్వకాలు జరుగుతున్నా, కట్టడ మరమ్మతులు చేస్తున్నా వెళ్లి సూచనలు చేశారు. కొండవీడు కోటపై అనేక పరిశోధనలు జరిపి.. అనేక చారిత్రక విశేషాలను వెలుగులోకి తీసుకొచ్చారు. పురావస్తు పరిశోధకులకు సహకారం అందించి, అనేక చరిత్ర సభల్లో పరిశోధక పత్రాలను ప్రచురించిన వెంకటేశ్వరరావు మృతి పూడ్చలేనిదని తెనాలికి చెందిన పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి సంతాపం ప్రకటించారు.

నమ్మకంగా పిలిచి దారుణంగా కొట్టారు..

- తమ మేనకోడలి వెంట పడొద్దన్నందుకు ఓ యువకుడి దౌర్జన్యం
- యువతి మేనమామ, ఆయన కుమారుడిపై కర్రలతో దాడి
- వీడియో వైరల్




సుబ్రహ్మణ్యంపై దాడి చేసి కొడుతున్న రోహిత్, అతడి మిత్రులు

ఒంగోలు టౌన్: ఓ ప్రేమికుడు బరితెగించాడు. తమ అమ్మాయి వెంట తిరగొద్దని హెచ్చరించిన బాలిక మేనమామపై దాడికి తెగబడ్డాడు. దాడి చేసిన వీడియో ఆలస్యంగా బయటపడి సోమవారం వైరల్ కావడంతో ఈ ఘటన సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం .. ఒంగోలు నగరం సంజయ్‌గాంధీ కాలనీకి చెందిన ఓ బాలిక, నగరంలోని కేశవస్వామిపేటకు చెందిన రోహిత్ కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. బాలిక నగరంలోని ఓ కాలేజీలో ఇంటర్ చదువుకుంటోంది. రోహిత్ వంట పనులు చేస్తుంటాడు. గత నెల 24వ తేదీ ప్రేమికులిద్దరు ఫేస్ బుక్‌లో ఫొటోలు షేర్ చేసుకున్నారు. ఇదికాస్త బాలిక మేనమామ పూజల దేవాకు తెలిసింది. ఆగ్రహానికిలోనైన దేవా వెంటనే రోహిత్ వద్దకు వెళ్లి తమ అమ్మాయితో తిరిగితే బాగుండదని హెచ్చరించి వచ్చాడు. ఇది మనసులో పెట్టుకున్న రోహిత్ మరుసటి రోజు మే 25వ తేదీ సాయంత్రం అమ్మాయి విషయం మాట్లాడుకుందాం రమ్మని దేవాకు ఫోన్ చేసి పిలిచాడు. మిత్రులతో కలిసి ఒక పథకం ప్రకారం నమ్మకాన్ని కలిగించాడు. అతడి మాటలు నమ్మిన దేవా తన కుమారుడు సుబ్రహ్మణ్యంతో కలిసి శర్మ కాలేజీ వద్దకు వచ్చాడు. అప్పటికే తప్పతాగి ఉన్న రోహిత్ బృందం దేవాతో వాగ్వాదానికి దిగింది. ఇద్దరి మధ్యా మాటామాటా పెరిగింది. ఒక్కసారిగా దేవా మీద దాడికి దిగాడు. తండ్రిని కొడుతుండగా అడ్డొచ్చిన దేవా కుమారుడు సుబ్రహ్మణ్యంనూ కర్రలతో దారుణంగా కొట్టారు. గాయపడిన సుబ్రహ్మణ్యంను జీజీహెచ్‌కు తరలించారు. ఈ దాడిలో సుబ్రహ్మణ్యం కంటికి గాయమైంది. అదేరోజు దేవా ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఎన్నికల హడావుడిలో పడిపోయిన పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకోలేదు. సోమవారం ఘటన తాలుకు వీడియో వైరల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు ఉలిక్కిపడ్డారు. వెంటనే నిందితులను అరెస్టు చేయాలని ఆదేశాలిచ్చారు. ఘటన జరిగి వారం దాటడంతో నిందితులు చల్లగా జారుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను గాలిస్తున్నట్లు సీఐ షేక్ అలీ సాహెబ్ చెప్పారు.

రైతులకు మేలైన విత్తనాలు అందించండి

- ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచండి
- మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలి
- ఎక్కడైనా నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పదు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి సమీక్ష



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని రైతులకు మేలైన విత్తనాల పంపిణీకి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్–2024 సబ్సిడీ, సబ్సిడీయేతర విత్తనాల సరఫరాపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. రైతులకు వరి, వేరుశనగ, పత్తి తదితర విత్తనాలను సకాలంలో అందించాలని ఆదేశించారు. రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో వీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. విత్తనాల సరఫరాను వ్యవసాయ శాఖ అధికారులు మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా నకిలీ, మొలకెత్తని విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తున్నట్లు లేదా చేసినట్టు ఫిర్యాదులు వస్తే సకాలంలో స్పందించి.. బాధ్యులైన సరఫరాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలన్నీ పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. వరి విత్తనాలు 2.24 లక్షల క్వింటాళ్ల అవసరం ఉండగా.. 2.35 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే 67.61 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను ఆర్బీకేలతో పాటు పలుచోట్ల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వేరుశనగ విత్తనాలు 2.99 లక్షల క్వింటాళ్లు అవసరం కాగా.. 3.5 లక్షల క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అందులో 1.4 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రైతులకు 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే 26.6 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలు అవసరమవ్వగా.. ఇప్పటికే యుఎస్ అగ్రిసీడ్స్, తులసి, నూజివీడు, వేద, కావేరి, రాశి, కోహినూర్ తదితర కంపెనీలకు చెందిన 13.69 లక్షల ప్యాకెట్లు, ఇతర రకాలకు చెందిన 4.58 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. సబ్సిడీయేతర విత్తనాలను కూడా ఆర్బీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఎక్కడైనా నకిలీ, మొలకెత్తని విత్తనాలను విక్రయించినట్లు తెలిస్తే.. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ శాఖ గ్రామ స్థాయి వరకు పటిష్ట నిఘా పెట్టిందన్నారు. గతేడాది ఇలాంటి ఫిర్యాదులకు సంబంధించి 6 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ద్వివేది చెప్పారు. సమావేశంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ శివప్రసాద్, జేడీ విడివి కృపాదాస్, మేనేజర్ జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు జింకలు మృత్యువాత



జాతీయ రహదారిపై జింకల కళేబరాలు

జే.పంగులూరు/ఆత్మకూరు రూరల్: బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం భగవాన్‌రాజు పాలెం సమీపంలోని పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు జింకలు మృతిచెందిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో కొండలు, సుబాబుల్ తోటలు ఎక్కువగా ఉండటంతో జింకలు తిరుగుతుంటాయి. రాత్రి సమయంలో జాతీయ రహదారిపైకి వచ్చిన జింకలను ఒంగోలు వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు జింకల మృతదేహాలను స్వాధీనం చేసుకుని ఒంగోలు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. వేటపాలెం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వై.జాన్సన్ సిబ్బందితో వచ్చి జింకల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ముప్పవరం పశువైద్య అధికారి మల్లేశ్వరి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం నాగరాజుపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో జింకల కళేబరాలను దహనం చేశారు.

దుప్పల మందపై కుక్కల దాడి

నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని ముష్టపల్లె గ్రామంలోకి సోమవారం దారితప్పి వచ్చిన దుప్పులపై ఊర కుక్కలు దాడి చేశాయి. ఐదు దుప్పులతో కూడిన మంద అడవి నుంచి దారితప్పి ముష్టపల్లె గ్రామంలోకి ప్రవేశించింది. వీటిని గమనించిన ఊర కుక్కలు వాటిని తరుముతూ దాడి చేశాయి. ఈ దాడిలో ఒక దుప్పి కూన (మగది) అక్కడికక్కడే మరణించగా.. మరోదుప్పిని మెడ కొరికి చంపబోతుండగా గ్రామస్తులు గమనించి కుక్కలను తరమడంతో అది ప్రాణాలు దక్కించుకుంది. మరో మూడు దుప్పులు గాయపడినప్పటికీ కుక్కలను తప్పించుకుని అడవిలోకి పారిపోయాయి. సమాచారం తెలియడంతో బైర్లూటి రేంజర్ జగన్‌మోహన్‌రావు సిబ్బందిని గ్రామానికి పంపి గాయపడిన దుప్పికి చికిత్స అందించి వన్యప్రాణి చికిత్స కేంద్రానికి తరలించారు. మరణించిన దుప్పికి పోస్టుమార్టం చేసి దహనం చేశారు.



కుక్కల దాడిలో గాయపడిన దుప్పి

తెలంగాణ

మంచినీటి ట్యాంక్‌లో మృతదేహం

నల్లగొండ టూటౌన్: మంచినీటివాటర్‌ట్యాంక్‌లో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. నల్లగొండ పాతబస్తీతోపాటు ఇందిరమ్మ కాలనీకి తాగునీటి సరఫరా జరిగే మున్సిపల్ వాటర్‌ట్యాంక్ ఇదే కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. మృతదేహం పాత బస్తీకి చెందిన ఆవుల వంశీకృష్ణదిగా గుర్తించారు. వంశీకృష్ణ వాటర్ ట్యాంక్‌లో ఎప్పుడు పడిపోయాడో అన్న విషయంపై స్పష్టత లేదు. మంచినీటిలో దుర్వాసన వస్తుందని స్థానికుల సమాచారంతో మున్సిపల్ సిబ్బంది వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి చూడగా మృతదేహం కనిపించినట్టు తెలిసింది.

నీరు తాగిన ప్రజల ఆందోళన

నల్లగొండ పట్టణంలోని 26, 27, 28 వార్డు ల్లోని కాలనీలకు, 12వ వార్డులో కొంతభాగం వరకు ఈ ట్యాంకు నుంచే తాగునీటి సరఫరా జరుగుతోంది. గతంలో నాగార్జున సాగర్‌లోని వాటర్ ట్యాంక్‌లో కోతులు మృతి చెందిన సంఘటన మరువకముందే నల్లగొండలోని ఈ ఘటన వెలుగు చూడడంతో కలకలం రేగింది.

జూన్ ఒకటిన ట్యాంక్ తనిఖీ చేశాం: కలెక్టర్

వాటర్‌ట్యాంక్‌ను గత నెల 30, ఈ నెల ఒకటవ తేదీన మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేసిన తర్వాతనే నీటిని విడుదల చేశారని నల్లగొండ కలెక్టర్ హరిచందన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పుడు వాటర్ ట్యాంక్‌లో మృతదేహం లేదని, సోమవారం ఉదయం ట్యాంక్ శుభ్రం చేయడానికి మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేయగా శవం కనిపించిందన్నారు. దీనిపై ప్రాథమిక వైద్య విచారణలో మృతదేహం రెండు, మూడు రోజులదని, అక్కడక్కడా గాయాలు ఉన్నట్టు గుర్తించారని తెలిపారు. ట్యాంక్ ద్వారా తాగునీటి సరఫరా అవుతున్న 50 ఇళ్ల వద్దకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెళ్లారని, ఇప్పటి వరకు ఎవరికీ.. ఎలాంటి అనారోగ్య సమస్యలు రాలేదని తెలిపారు.

మెక్సికోలో కొత్త చరిత్ర



- అధ్యక్ష పీఠంపై షేన్‌బామ్
- తొలి మహిళగా రికార్డు

మెక్సికో సిటీ: మెక్సికో చరిత్ర సృష్టించింది. ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అంతా ఊహించినట్టుగానే అధికార మోరెనా వామపక్ష కూటమి అభ్యర్థి క్లాడియా షేన్‌బామ్ (61) ఘనవిజయం సాధించారు. 200 ఏళ్ల స్వతంత్ర మెక్సికో చరిత్రలో దేశ అధ్యక్ష పీఠమెక్కనున్న తొలి మహిళగా రికార్డు సృష్టించారు. యూదు మూలాలున్న తొలి ప్రెసిడెంట్ కూడా ఆమే కానున్నారు! షేన్‌బామ్‌కు ఇప్పటికే దాదాపు 60 శాతం ఓట్లు లభించినట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ''ప్రత్యర్థులిద్దరూ నాకిప్పటికే ఫోన్ చేసి అభినందించారు. ఓటమిని అంగీకరించారు. దేశానికి తొలి అధ్యక్షురాలిని కాబోతున్నా'' అంటూ చిరునవ్వులు చిందించారు. ''ఇది నేను ఒంటరిగా సాధించిన విజయం కాదు. తల్లులు మొదలుకుని కూతుళ్లు, మనవరాళ్ల దాకా దేశ మహిళలందరి విజయమిది'' అన్నారు. విపక్ష కూటమి మహిళకే అవకాశమిచ్చింది. రెండు ప్రధాన పార్టీల నుంచీ మహిళలే తలపడటమూ మెక్సికో చరిత్రలో ఇదే తొలిసారి. విపక్ష కూటమి అభ్యర్థి సోచిల్ గాల్వెజ్‌కు 28 శాతం, మరో ప్రత్యర్థి జార్జ్ అల్వారిజ్ మైనేజ్‌కు 10 శాతం ఓట్లు వచ్చినట్టు ఈసీ పేర్కొంది. షేన్‌బామ్ నూతన చరిత్ర లిఖిస్తున్నారంటూ అధ్యక్షుడు ఆండ్రెజ్ మాన్యుయెల్ లోపెజ్ ఆబ్రేడర్ అభినందించారు. ఆరేళ్ల పదవీకాలంలో ఆయన పలు చరిత్రాత్మక నిర్ణయాలతో ప్రజల మనసు గెలుచుకున్నారు. షేన్‌బామ్ విజయంలో లోపెజ్ పాపులారిటీదే ప్రధాన పాత్ర. ఒకసారికి మించి అధ్యక్ష పదవిలో కొనసాగేందుకు మెక్సికో రాజ్యాంగం అనుమతించదు. దాంతో ఆయన రెండోసారి బరిలో దిగలేకపోయారు. 2018లో లోపెజ్ గెలిచినప్పటి మాదిరిగా ఈసారి ప్రజల్లో పెద్దగా హర్షాతిరేకాలు వ్యక్తం కాకపోవడం విశేషం. అధ్యక్ష పదవితో పాటు పాటు 9 రాష్ట్రాల గవర్నర్లు, 128 మంది సెనేటర్లు, 500 మంది కాంగ్రెస్ ప్రతినిధులు, వేలాది మేయర్లు, స్థానిక సంస్థల ప్రతినిధి పదవులకు కూడా ఎన్నికలు జరిగాయి. వాటి ఫలితాలపై ఆసక్తి నెలకొంది. మొత్తం 32 గవర్నర్ పదవుల్లో మెరేనా పార్టీకి 23 ఉన్నాయి.

లా డాక్టోరా...

షేన్‌బామ్ విద్యార్హతలు అన్నీ ఇన్నీ కావు. ఎనర్జీ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ చేశారు. అందుకే ఆమెను అభిమానులు ముద్దుగా 'లా డాక్టోరా' అని పిలుచుకుంటారు. పర్యావరణవేత్తగా చాలా పేరుంది. నోబెల్ శాంతి బహుమతి పొందిన ఐరాస పర్యావరణ శాస్త్రవేత్తల బృందంలో షేన్‌బామ్ సభ్యురాలు. రాజధాని మెక్సికో సిటీ మేయర్‌గా చేసిన తొలి మహిళ కూడా ఆమే. షేన్‌బామ్ తాత, అమ్మమ్మ హిట్లర్ హోలోకాస్ట్ హింసాకాండను తప్పించుకోవడానికి యూరప్ నుంచి మెక్సికో వలస వచ్చారు. షేన్‌బామ్ మెక్సికో సిటీలోనే పుట్టారు. 2000లో రాజకీయ అరంగేట్రం చేశారు.

షేన్‌బామ్‌కు సవాళ్లెన్నో...

షేన్‌బామ్ అక్టోబర్ 1న అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్నారు. ఆమెకు సవాళ్ల స్వాగతమే లభించనుంది. మహిళలపై హింసకు మెక్సికో ప్రపంచంలోనే పెట్టింది పేరు. ఈ సమస్యను రూపుమాపాల్సి ఉంది. సంక్షేమ పథకాలతో లోపెజ్ బాగా ఆకట్టుకున్నా అడ్డూ అదుపూ లేదని వ్యవస్థీకృత హింస, గ్యాంగ్ వార్లు, డ్రగ్ ట్రాఫికింగ్, పెట్రో ధరల పెరుగుదల తదితరాల కట్టడికి పెద్దగా చేసిందేమీ లేదన్న అసంతృప్తి ప్రజల్లో బాగా ఉంది. వీటిపై కొత్త అధ్యక్షురాలు దృష్టి పెట్టాలని వారు భావిస్తున్నారు. ప్రస్తుత పథకాలన్నింటినీ కొనసాగిస్తూనే దేశాన్ని పీడిస్తున్న అన్ని సమస్యలనూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తానని షేన్‌బామ్ ప్రకటించారు. ఏ తారతమ్యాలూ లేకుండా ప్రజలందరినీ ఒకేలా చూస్తానన్నారు.

టిక్.. టిక్.. టిక్

మోదీ 3.0నా, ఇండియా కూటమా?

- సార్వత్రిక ఎన్నికల ఫలితాలు నేడే
- ఏపీ, ఒడిశా అసెంబ్లీ ఫలితాలు కూడా
- ఉదయం 8 నుంచి కౌంటింగ్ షురూ
- మధ్యాహ్నానికల్లా స్పష్టత వచ్చే అవకాశం



న్యూఢిల్లీ: దేశమంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న క్షణాలు రానేవచ్చాయి. 80 రోజులకు పైగా ఏడు విడతల్లో సాగిన సుదీర్ఘ సార్వత్రిక ఎన్నికల క్రతువు తుది దశకు చేరింది. మంగళవారం ఫలితాలు వెలువడనున్నాయి. కేంద్రంలో బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొట్టి నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా నెహ్రూ రికార్డును సమం చేస్తారా? లేదంటే కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి అనూహ్యమేమైనా చేసి చూపించనుందా? సర్వత్రా ఆసక్తి కలిగిస్తున్న ఈ ప్రశ్నలకు మరికొన్ని గంటల్లో సమాధానం లభించనుంది. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశాల్లో అసెంబ్లీ స్థానాలకు కూడా ఓట్ల లెక్కింపు జరగనుంది. ఏకగ్రీవమైన సూరత్ మినహా 542 లోక్‌సభ స్థానాలు, ఏపీలో 175, ఒడిశాలో 147 అసెంబ్లీ స్థానాల్లో విజేతలెవరో తేలనుంది. కౌంటింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఏర్పాట్లన్నీ పూర్తి చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ మొదలవుతుంది. మధ్యాహ్నానికల్లా ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశముంది. ఎన్డీఏ హ్యాట్రిక్ ఖాయమని శనివారం వెలువడ్డ ఎగ్జిట్ పోల్స్ ముక్త కంఠంతో పేర్కొనడం, విపక్ష కూటమి వాటిని తిరస్కరించడం తెలిసిందే. ఎన్నడూ లేని స్థాయిలో ఈ దఫా పోలింగ్ అనంతరం కూడా కేంద్ర ఎన్నికల సంఘంపై, ఈవీఎంలపై విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. ఎగ్జిట్ పోల్స్‌ను 'మోదీ మీడియా పోల్'గా అభివర్ణించాయి. ఎగ్జిట్ పోల్స్ ముసుగులో అసలు ఫలితాలు ఎలా ఉండాలో అధికార యంత్రాంగానికి మోదీ స్పష్టమైన సంకేతాలిస్తున్నారంటూ దుయ్యబట్టాయి. ఈసీ స్వతంత్ర ప్రతిపత్తిని, దేశ ఎన్నికల ప్రక్రియను న్యూనత పరిచేందుకు విపక్షాలు మతిలేని ప్రయత్నాలు చేస్తున్నాయంటూ అధికార బీజేపీ ఎదురుదాడికి దిగింది. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగియాన్న ఆరోపణలకు ఆధారాలుంటే ఇవ్వాలంటూ విపక్షాలను కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ నిలదీశారు! దాంతో పోలింగ్ ప్రక్రియ జూన్ 1నే ముగిసినా రాజకీయ వేడి మాత్రం అలాగే కొనసాగింది. ఈ నేపథ్యంలో అందరి కళ్లూ కౌంటింగ్‌పైనే కేంద్రీకృతమయ్యాయి...

హోరాహోరీ పోరు...

ఈసారి ఎన్నికలు అత్యంత హోరాహోరీగా సాగాయి. ప్రచారం ముందెన్నడూ లేనివిధంగా ప్రధానంగా మతం, కులాల ప్రాతిపదికగా సాగింది. వరుసగా మూడో విజయం కోసం బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమి సర్వశక్తులూ ఒడ్డగా, పదేళ్ల మోదీ పాలనకు తెర దించడమే లక్ష్యంగా విపక్షాలు కాంగ్రెస్ సారథ్యంలో ఇండియా కూటమిగా బరిలో దిగాయి. బీజేపీ తరఫున మోదీ అన్నీ తానై ప్రచారం చేశారు. కాంగ్రెస్ వస్తే సంపద పన్ను తదితరాల పేరిట జనం ఆస్తులు లాక్కుంటుందని ప్రతి ఎన్నికల సభలోనూ ఆరోపణలు గుప్పించారు. చివరికి హిందూ స్త్రీల మెళ్లో పుస్తెలనూ లాక్కుంటారన్నారు. విపక్షాలు కూడా గట్టిగానే ఎదురు దాడికి దిగాయి. ముస్లింలకు మతాధారిత రిజర్వేషన్లను రద్దు చేస్తామన్న బీజేపీ ప్రకటనను అందిపుచ్చుకున్నాయి. రిజర్వేషన్లను మొత్తానికే ఎత్తేస్తారని, రాజ్యాంగాన్నే సమూలంగా మార్చేస్తారని ఊరూ వాడా హోరెత్తించాయి. దాంతో ప్రచార పర్వం ఆసాంతం అక్షరాలా కురుక్షేత్రాన్ని తలపించింది. ఎన్డీఏకు 400 పై చిలుకు, బీజేపీకి సొంతగానే 370 స్థానాలొస్తాయని మోదీ, ఆ పార్టీ నేతలు పేర్కొనగా; ఇండియా కూటమికి 295 స్థానాలు ఖాయమని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్‌గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో మెజారిటీకి 272 సీట్లు అవసరం.


ఆ సీట్లపై ఆసక్తి...

ఈసారి పలు లోక్‌సభ స్థానాల్లో ఫలితాలపై ఎనలేని ఆసక్తి నెలకొంది. వాటిలో టాప్‌లో ఉన్నది రాహుల్‌గాంధీ పోటీ చేసిన రాయ్‌బరేలీ అంటే అతిశయోక్తి కాదు. యూపీలో గాంధీల కంచుకోట అమేథీలో 2019లో ఆయన తొలిసారి ఓటమి చవిచూడటం తెలిసిందే. ఈసారి మరో కంచుకోట రాయ్‌బరేలీలో నెగ్గుతారా లేదా అన్నది ఆసక్తికరం. సిట్టింగ్ స్థానమైన కేరళలోని వయనాడ్‌లో కూడా సీపీఐ అభ్యర్థి అన్నీ రాజా నుంచి రాహుల్ గట్టి పోటీ ఎదుర్కొన్నారు. అక్కడి ఫలితంపైనా ఉత్కంఠే నెలకొంది. మాజీ సీఎంలు భూపేశ్ భగేల్, చరణ్‌జీత్‌సింగ్ చన్నీ, ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ కూతుళ్లు మీసా భారతి, రోహిణీ ఆచార్య, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సులే గెలుస్తారో లేదో చూడాలి.

పోలింగ్ తర్వాత ఈవీఎంలను మార్చేశారు

భగేల్ తీవ్ర ఆరోపణలు

- నేను పోటీ చేసిన రాజ్‌నంద్‌గావ్‌లో జరిగింది
- చాలా స్థానాల్లో ఇలాగే చేశారు
- ఈసీకి ఫిర్యాదు చేస్తామన్న ఛత్తీస్ మాజీ సీఎం



న్యూఢిల్లీ: పోలింగ్ ప్రక్రియ ముగిసి ఫలితాల వెల్లడికి సర్వం సిద్ధమైనా ఎన్నికల సంఘంపై, ఈవీఎంల పనితీరుపై విపక్షాల ఆరోపణల పరంపర కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో కాంగ్రెస్ నేత, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్ సోమవారం రాత్రి తీవ్ర ఆరోపణలు చేశారు. తాను పోటీ చేసిన రాజ్‌నంద్‌గావ్ లోక్‌సభ స్థానంలో పోలింగ్ ముగిశాక పలుచోట్ల ఏకంగా ఈవీఎంలనే మార్చేశారని పేర్కొన్నారు! ''పలు బూత్‌ల్లో ఈవీఎం బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ల సీరియల్ నంబర్లు పోలింగ్ తర్వాత మారిపోయాయి. ఫామ్ 17సీలో పొందుపరిచిన సమాచారమే ఇందుకు రుజువు. దీని వల్ల వేలాది ఓట్లు ప్రభావితమవుతాయి'' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇందుకు సాక్ష్యాలంటూ ఈవీఎంల తాలూకు తొలి నంబర్లు, మారిన నంబర్లతో కూడిన వివరాలను పోస్ట్ చేశారు. ''ఇలా మార్చిన ఈవీఎం నంబర్ల తాలూకు జాబితా చాలా పెద్దది. అందరికీ తెలియాలని చిన్న జాబితా మాత్రమే పోస్ట్ చేస్తున్నా'' అని తెలిపారు. ''ఇది చాలా సీరియస్ అంశం. ఇలా నంబర్లను ఎందుకు మార్చాల్సి వచ్చింది?'' అని ఈసీని ఉద్దేశించి భగేల్ ప్రశ్నించారు. చాలా లోక్‌సభ స్థానాల నుంచి ఇలాంటి ఫిర్యాదులే వస్తున్నాయి. దీనిపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ఫిర్యాదు చేస్తున్నాం. నంబర్లను ఏ పరిస్థితుల్లో మార్చాల్సి వచ్చిందో ఈసీ బదులివ్వాల్సిందే. దీనివల్ల ఆయా స్థానాల్లో ఎన్నికల ఫలితంపై ప్రభావం పడితే అందుకు ఎవరిది బాధ్యత?'' అంటూ మండిపడ్డారు. పోలింగ్ అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా దేశవ్యాప్తంగా 150 జిల్లాల కలెక్టర్లకు నేరుగా ఫోన్ చేసి బెదిరింపులకు దిగారంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆదివారం ఆరోపించడం తెలిసిందే. పుకార్లు వ్యాప్తి చేయొద్దని, రుజువులుంటే ఇవ్వాలని సీఈసీ రాజీవ్‌కుమార్ స్పందించారు.

మాకొచ్చే సీట్లు ఇవిగో

- జాబితా వెల్లడించిన కాంగ్రెస్ వర్గాలు
- ఇండియా కూటమికి 295 ఖాయమని ధీమా

న్యూఢిల్లీ: ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై కాంగ్రెస్, విపక్షాలతో కూడిన ఇండియా కూటమి ఆగ్రహజ్వాలలు చల్లారడం లేదు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని దాదాపుగా శనివారం విడుదలైన సర్వేలన్నీ పేర్కొనడం తెలిసిందే. ఎన్డీఏ హీన పక్షం 350 స్థానాలు దాటుతాయని అవి తెలిపాయి. ఇండియా కూటమికి 92 నుంచి గరిష్ఠంగా 200 లోపే వస్తాయని ఎగ్జిట్ పోల్స్ చెప్పడంపై కూటమి పార్టీలన్నీ తీవ్రంగా మండిపడ్డాయి. తమ అంచనా ప్రకారం ఇండియా కూటమికి 295 సీట్లు ఖాయమని, ఎన్డీఏకు 235 లోపే వస్తాయని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే మూడు రోజులుగా పదేపదే చెబుతున్నారు. పలు రాష్ట్రాల్లో ఇండియా కూటమి సాధించబోయే లోక్‌సభ స్థానాల సంఖ్యను కూడా కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

రాష్ట్రం	ఇండియా కూటమి గెలిచే స్థానాలు	రాష్ట్రం	ఇండియా కూటమి గెలిచే స్థానాలు
ఉత్తరప్రదేశ్ (80)	40	జార్ఖండ్ (14)	10
తమిళనాడు (39)	39	మధ్యప్రదేశ్ (29)	7
బిహార్ (40)	25	రాజస్తాన్ (25)	7
మహారాష్ట్ర (48)	24	హరియాణా (10)	7
పశ్చిమబెంగాల్ (42)	24	ఛత్తీస్‌గఢ్ (11)	5
కేరళ (21)	20	ఢిల్లీ (7)	4
కర్నాటక (28)	16	పుదుచ్చేరి (1)	1
పంజాబ్ (13)	13	చండీగఢ్ (1)	1

నోట్: బ్రాకెట్లోనివి ఆయా రాష్ట్రాల్లోని మొత్తం స్థానాలు

ఓటర్లకు వందనం

సార్వత్రిక ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటేసి ప్రపంచ రికార్డ్ సృష్టించారు

- 2019తో పోలిస్తే రీపోలింగ్ సంఖ్య గణనీయంగా తగ్గింది
- కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ వ్యాఖ్య
- తొలిసారిగా కౌంటింగ్‌కు ముందే ప్రెస్‌మీట్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో మొత్తంగా 64.2 కోట్ల మంది భారతీయ పౌరులు ఓటు హక్కును వినియోగించుకుని నూతన ప్రపంచ రికార్డును సృష్టించారని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ ప్రకటించారు. దేశ చరిత్రలో తొలిసారి ఓట్ల లెక్కింపునకు ముందు తోటి కమిషనర్లతో సహా సీఈసీ సోమవారం ఢిల్లీలో పత్రికాసమావేశం ఏర్పాటుచేసి పలు అంశాలపై మాట్లాడారు.

జమ్మూకశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి జమ్మూకశ్మీర్‌లో నాలుగు దశాబ్దాల చరిత్రలో తొలిసారిగా గరిష్ఠంగా 58.58 శాతం పోలింగ్ నమోదైంది. కశ్మీర్ లోయలో గరిష్ఠంగా 51.05 శాతం రికార్డయింది. సెప్టెంబర్ 30లోపు జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించింది. అందుకే అక్కడ త్వరలోనే అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ బాధ్యతలు తలకెత్తుకుంటాం. ఇవి నిజంగా అత్యంత సంతృప్తికరమైన క్షణాలు అని అన్నారు.

జీ7 దేశాల ఓటర్ల కంటే 1.5 రెట్లు ఎక్కువ

'' 31.2 కోట్ల మంది మహిళలుసహా 64.2 కోట్ల మంది ఓటేశారు. ఈ సంఖ్య జీ7 దేశాల ఓటర్ల కంటే 1.5 రెట్లు ఎక్కువ. 27 యురోపియన్‌యూనియన్ దేశాల ఓటర్ల కంటే 2.5 రెట్లు ఎక్కువ. ఈ ఎన్నికల్లో పాల్గొన్న ఓటర్లందరికీ అభినందనలు'' అంటూ సీఈసీ వేదికపై లేచి నిలబడి ఓటర్లకు అభినందనలు తెలిపారు. ''ఎన్నికల సిబ్బంది జాగ్రత్త, అప్రమత్తత వల్లే తక్కువ చోట్ల మాత్రమే రీపోలింగ్ చేపట్టాల్సి వచ్చింది. 2019లో 540 చోట్ల రీపోలింగ్ జరిగితే ఈసారి 39 మాత్రమే జరిగాయి'' అని పేర్కొన్నారు.

మా గురించి మాట్లాడుకోరు

'' 1.5 కోట్ల పోలింగ్, భద్రతా సిబ్బంది పోలింగ్ పర్వంలో పాల్గొన్నారు. 4 లక్షల వాహనాలను వినియోగించాం. 135 ప్రత్యేక రైళ్లలో సిబ్బంది, బలగాలను తరలించాం. 1,692 సార్లు హెలికాప్టర్లను వాడాం. కరెన్సీ కట్టలు, ఉచిత తాయిలాలుగా పంపిణీచేస్తున్న వస్తువులు, మద్యం, మత్తుపదార్థాలు సహా రూ.10,000 కోట్లు సీజ్‌చేశాం. ఇంత చేస్తే ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధూల జాడ లేదంటూ 'లాపతా జెంటిల్‌మెన్' అని మీమ్స్ వేస్తున్నారు. మేం ఎక్కడికీ పోలేదు. మీ ముందే ఉన్నాంకదా. ఎప్పుడూలేనంతగా ఎన్నికలవేళ 100 పత్రికా ప్రకటనలు, అద్వైజరీలతో అందర్నీ చైతన్యపరిచాం. మమ్మల్ని చూశాకైనా 'లా పతా జెంటిల్‌మెన్ ఆర్ బ్యాక్' అని మీమ్స్ మారుస్తారేమో. విరబూసిన పువ్వులనే చూస్తారుగానీ తోటమాలిని ఎవరూ పట్టించుకోరు. ప్రజాస్వామ్యంలో గెలుపుఓటములనే అందరూ పట్టించుకుంటారుగానీ సమర్థవంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించిన మా గురించి ఎవరూ మాట్లాడుకోరు'' అని అన్నారు.



విలేకరుల సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్

దమ్ముంటే నిరూపించండి

'' ఎన్నికలను విదేశీ శక్తులు ప్రభావితం చేసే ప్రమాదముందని, వాటిని అడ్డుకునేందుకు మేం ఎప్పుడో సిద్ధమయ్యాం. తీరాచూస్తే ఇక్కడి విపక్షాలే అనవసర ఆరోపణలు చేస్తున్నాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రభావితం చేయనున్నారని రిటర్నింగ్ అధికారులపై విపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. దమ్ముంటే మీ ఆరోపణలను సాక్ష్యాధారాలతో నిరూపించండి. పుకార్లు వ్యాపించజేసి అనుమాన మేఘాలు కమ్ముకునేలా చేయకండి. రిటర్నింగ్ అధికారులుగా పనిచేసే జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్‌లపై మీరు చేస్తున్న ఆరోపణలను నిరూపిస్తే కౌంటింగ్‌కు ముందే వారిపై కఠిన చర్యలకు మేం సిద్ధం' అని అన్నారు.

ఎన్నికల తర్వాత హింసనూ అడ్డుకుంటాం

'' ఎన్నికల కోడ్ ముగిసినా సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలు కొనసాగుతాయి. ఫలితాలు వచ్చాక ఎన్నికల తర్వాత హింసను అడ్డుకునే లక్ష్యంగా తొలిసారిగా ఈ పద్ధతిని అమలుచేస్తున్నాం. ఎన్నికల వేళ ఘర్షణ ఘటనలు చోటుచేసుకున్న పశ్చిమ బెంగాల్, మణిపూర్, ఆంధ్రప్రదేశ్‌సహా పలు రాష్ట్రాల్లోని సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మొహరిస్తాం. రాష్ట్రాలు, కేంద్ర పరిశీలకుల సూచనలు, సలహాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం. ఏపీ, బెంగాల్‌లలో ఓట్ల లెక్కింపు తర్వాత 15 రోజులపాటు, యూపీ, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌లో రెండు రోజులపాటు బలగాలు కొనసాగుతాయి'' అని సీఈసీ వివరించారు.

ఎలక్షన్ బీట్

ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు విరుద్ధంగా ఉంటాయి: సోనియా

న్యూఢిల్లీ: ఇటీవల వెల్లడైన లోక్‌సభ ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నమైన ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు. డీఎంకే దిగ్గజం, దివంగత ఎం.కరుణానిధి శత జయంతి సందర్భంగా సోమవారం ఢిల్లీలోని డీఎంకే కార్యాలయానికి విచ్చేసి ఆయనకు సోనియా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎగ్జిట్ పోల్స్‌పై సోనియా మాట్లాడారు. '' ఫలితాలపై మేం పూర్తి ఆశావహ దృక్పథంతో ఉన్నాం. ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు విరుద్ధంగా వస్తాయని భావిస్తున్నాం. జూన్ 4వ తేదీదాకా ఫలితాలు వెల్లడయ్యేదాకా మనందరం వేచి ఉండాల్సిందే. ఏమౌతుందో చూద్దాం'' అని వ్యాఖ్యానించారు. మోదీ మూడోసారి ప్రధాని అవుతారని, ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని పలు ఎగ్జిట్ పోల్స్ వెల్లడించిన నేపథ్యంలో కాంగ్రెస్ సహా విపక్షాల 'ఇండియా' కూటమి ఆ ఎగ్జిట్ పోల్స్‌ను ఊహాత్మకమైనవిగా కొట్టిపారేశాయి. 'ఇవి ఎగ్జిట్ పోల్స్ కావు. మోదీ మీడియా పోల్స్' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడం తెల్సిందే.

ఎగ్జిట్ పోల్స్‌లో విశ్వసనీయత ఎంత?

ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యలు

లక్నో: ఎన్డీఏ కూటమి అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమంటూ ఫలితాలిచ్చిన పలు ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయతపై సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అనుమానం వ్యక్తంచేశారు. సోమవారం లక్నోలో పత్రికాసమావేశంలో ఆయన మాట్లాడారు. ''ఎన్‌డీఏ సంపూర్ణ మెజారిటీతో విజయం సాధిస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు చూస్తుంటే అనుమానమొస్తోంది. వీటిని ఎలా విశ్వసించాలి?. ఫలితాల వెల్లడివేళ బీజేపీ అనుకూల వాతావరణాన్ని సృష్టించేందుకు ఎగ్జిట్ పోల్స్ ప్రయత్నిస్తున్నాయి' అని ఆరోపించారు.

ఎస్‌కేఎం శాసనసభాపక్ష నేతగా తమాంగ్

గ్యాంగ్‌టక్: సిక్కిం క్రాంతికారీ మోర్చా(ఎస్‌కేఎం) శాసనసభా పక్ష నేతగా ప్రేమ్ సింగ్ తమాంగ్ ఎన్నికయ్యారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో ఆ పార్టీ అసెంబ్లీలోని 32 సీట్లకు గాను 31 సీట్లను కైవసం చేసుకోవడం తెల్సిందే. ఆదివారం రాత్రి సీఎం తమాంగ్ అధికార నివాసంలో జరిగిన శాసనసభాపక్ష సమావేశానికి మొత్తం 31 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎస్‌కేఎం సెక్రటరీ జనరల్ అరుణ్ ఉప్రెటి శాసనసభా పక్ష నేతగా తమాంగ్ పేరును ప్రతిపాదించగా ఎమ్మెల్యే సోనమ్ లామా బలపరిచారు. అనంతరం ఎమ్మెల్యేలతో కలిసి తమాంగ్ గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను కలిశారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు.

ఓట్ల లెక్కింపు వేళ బీజేపీ నేతల భేటీ

నడ్డా నివాసంలో సమావేశానికి అమిత్ షా, రాజ్‌నాథ్, బీఎల్ సంతోష్ హాజరు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పనితీరు, మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపునకు చేపట్టాల్సిన చర్యలపై బీజేపీ అగ్ర నేతలు చర్చించారు. సోమవారం బీజేపీ చీఫ్ జేపీ నడ్డా నివాసంలో జరిగిన సమావేశానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, సీనియర్ నేత బీఎల్ సంతోష్ తదితరులు హాజరయ్యారు. పోలింగ్ శాతం, బలాలు, బలహీనతలపై విశ్లేషించారు. అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే మీడియాతో మాట్లాడారు. 'లోక్‌సభ ఎన్నికలపైన, కొన్ని రాష్ట్రాల్లో పార్టీ బలాలు, బలహీనతలపై సమీక్ష జరిపాం. ఓటింగ్ శాతం, కొన్ని చోట్ల తక్కువ ఓటింగ్ నమోదుకు కారణాలపై సమగ్రంగా చర్చించాం. రాష్ట్రాల్లో కౌంటింగ్ సన్నాహాలు, అలాగే ఫలితాలు వెలువడ్డాక విజయోత్సవాల నిర్వహణపైనా చర్చించాం. హరియాణాలో బీజేపీ పరిస్థితి బాగాలేదని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. త్వరలో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నడ్డా, అమిత్ షా మాజీ సీఎం ఖట్టర్‌తో ప్రత్యేకంగా చర్చించారు' అని తావ్డే తెలిపారు.

హిమాచల్‌లో సుఖు సర్కార్ సేఫ్!

- ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల రాజీనామాలకు ఆమోదం
- 68 మంది అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 34

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో రాజకీయ అస్థిరతకు తాత్కాలికంగా తెరపడింది. ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు ప్రభుత్వం ఊపిరిపీల్చుకుంది. ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు కే.ఎల్.ఠాకూర్, హోషియార్ సింగ్, ఆశిష్ శర్మలు మార్చి 22న రాజీనామా చేయగా, స్పీకర్ కుల్దీప్‌సింగ్ పథానియా సోమవారం వాటిని ఆమోదించారు. తొలుత కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన ఈ ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేలు.. ఫిబ్రవరిలో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ చేశారు. బీజేపీ అభ్యర్థి హర్ష్ మహజన్ గెలుపునకు దోహదపడ్డారు. మెజారిటీ ఉండి కూడా కాంగ్రెస్ తమ అభ్యర్థి అభిషేక్ మను సింఘ్వీని గెలిపించుకోలేకపోయింది. అప్పటి నుంచి బీజేపీ హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి పావులు కదుపుతోంది. ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడగా.. వారు బీజేపీలో చేరి ఆ పార్టీ గుర్తుపై ఉప ఎన్నికల్లో పోటీచేశారు. మంగళవారం ఫలితాలు వెలువడనున్నాయి. హిమాచల్ అసెంబ్లీ బలం 68 కాగా... తొమ్మిది మంది పోను ప్రస్తుతం 59గా ఉంది. కాంగ్రెస్‌కు 34 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 25 మంది సభ్యులున్నారు. మంగళవారం వెలువడే ఉప ఎన్నికల ఫలితాల్లో ఆరింటికి ఆరు స్థానాలు బీజేపీ నెగ్గినా వారి బలం 31 మాత్రమే అవుతుంది. ఈ పరిస్థితుల్లో గనక ముగ్గురు స్వతంత్ర ఎమ్మెల్యేల బలం కూడా తోడైతే బీజేపి 34కు చేరుకునే అవకాశాలుండేవి. అలా కాకుండా సరిగ్గా ఫలితాలకు ముందు రోజు ముగ్గురు ఎమ్మెల్యేల రాజీనామాలను స్పీకర్ ఆమోదించడంతో మళ్లీ ఉప ఎన్నికలు జరిగి ఫలితాలు వచ్చేదాకా సుఖు ప్రభుత్వం కొంతకాలం ఊపిరిపీల్చుకున్నట్లే. అదీ మళ్లీ తాజాగా ఫిరాయింపులేవీ జరగకుండా ఉంటే!

కశ్మీర్‌లో లష్కరే కీలక కమాండర్ హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో పుల్వామా జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా కీలక కమాండర్ రియాజ్ దార్ అలియాస్ సత్తార్ హతమయ్యాడు. కశ్మీర్ వ్యాలీ ఆపరేషనల్ కమాండర్‌గా వ్యవహరించే ఇతడి మృతి దక్షిణ కశ్మీర్‌లో లష్కరేకు కోలుకోలేని దెబ్బగా భద్రతా దళాలు పేర్కొన్నాయి. సోమవారం కార్డన్ సెర్చ్ సందర్భంగా ఉగ్రవాదులు దాగున్న ఇంటికి నిప్పంటుకుంది. ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. ఒకరిని లష్కరే తోయిబా కశ్మీర్ వ్యాలీ ఆపరేషనల్ కమాండర్ రియాజ్ దార్ అలియాస్ సత్తార్‌గా, మరొకరిని రయీస్ దార్‌గా గుర్తించారు. 2015 నుంచి లష్కరేలో పనిచేస్తున్న సత్తార్‌కు గ్రనేడ్ దాడులు, లక్షిత హత్యలు వంటి 20కి పైగా ఉగ్ర ఘటనలతో సంబంధముంది. కొన్నేళ్లుగా బలగాల కళ్లుగప్పి తిరుగుతున్న సత్తార్ పై రూ.10 లక్షలు, రయీస్‌పై రూ.5 లక్షల రివార్డున్నట్టు కశ్మీర్ ఐజీపీ వీకే బిర్ది చెప్పారు.

జూలై-సెప్టెంబర్‌కల్లా లా నినో

60 శాతం అవకాశాలు ఉన్నాయన్న ప్రపంచ వాతావరణ సంస్థ

న్యూఢిల్లీ: రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, అసాధారణ వాతావరణ పరిస్థితులను మోసుకొచ్చిన 2023-24 ఎల్‌నినో సీజన్ ఈసారి జూలై-సెప్టెంబర్‌కల్లా లా నినోగా మారొచ్చని ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యూఎంఓ) తాజా కబురు చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూ వరసగా 11వ నెల(ఏప్రిల్) అత్యుష్ణ నెలగా రికార్డులకెక్కింది. సముద్రజలాల ఉపరితల ఉష్ణోగ్రతలూ గత 13 నెలలుగా అత్యధిక స్థాయిల్లో నమోదవుతున్నాయని డబ్ల్యూఎంఓ పేర్కొంది. మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్ర ఉపరితల జలాలు వేడిగా ఉండటంతో సంభవించే ఎల్‌నినో పరిస్థితులే దీనంతటికీ కారణమని డబ్ల్యూఎంఓ తెలిపింది. అడవుల నరికివేత, కాలుష్యం వంటి మానవ కార్యకలాపాలకు తోడు హరిత వాయువులు ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా నిలిచాయి. ఇంకా కొనసాగుతున్న ఎల్‌నినో కారణంగా భారత్, పాకిస్తాన్‌సహా దక్షిణాసియాలోని కోట్లాది మంది జనం దారుణమైన వేడిని చవిచూశారు. అయితే జూలై-సెప్టెంబర్‌కల్లా ఎల్‌నినో తగ్గిపోయి లా నినో వచ్చేందుకు 60 శాతం అవకాశముందని, ఆగస్ట్-నవంబర్ కల్లా అయితే 70 శాతం అవకాశముందని డబ్ల్యూఎంఓ తాజాగా అంచనావేసింది. ఈసారి మళ్లీ ఎల్‌నినో పుంజుకునే అవకాశాలు లేవని తేల్చిచెప్పింది. ఎల్‌నినో కారణంగా భారత్‌లో వర్షపాతం భారీగా తగ్గిపోవడం, లా నినో కారణంగా విస్తారంగా వర్షాలు కురవడం తెల్సిందే. ఆగస్ట్-సెప్టెంబర్ కల్లా భారత్‌లో లా నినో పరిస్థితులు ఏర్పడి చక్కటి వర్షాలు కురుస్తాయని ఇటీవల భారత వాతావరణ శాఖ అంచనావేయడం విదితమే. భారత్‌లో 52 శాతం సాగుభూమి వర్షాధారితం కావడంతో భారతరైతులకు వర్షాలకు అవినాభావ సంబంధం ఏర్పడింది. '' 2023 జూన్ నుంచి ప్రపంచవ్యాప్తంగా ప్రతి నెలా రికార్డు ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. మహాసముద్ర జలాల ఉపరితల ఉష్ణోగ్రతలది వచ్చే నెలల్లో కీలక భూమిక' అని డబ్ల్యూఎంఓ ఉప ప్రధాన కార్యదర్శి కో బారెట్ అన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం : 4 : జూన్ : 2024

బెంగళూరులో నిషేధాజ్ఞలు

యశవంతపుర: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా బెంగళూరు నగరంలో నేడు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పోలీసు శాఖ నిషేధాజ్ఞలను జారీ చేసింది. ప్రజలు ఎవరూ గుంపులుగా చేరటం, విజయోత్సవాలు, ఊరేగింపు, సభలు జరుపుకోవడం వంటివి నిషేధించినట్లు నగర పోలీస్ కమిషనర్ బీ దయానంద తెలిపారు. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు నగరంలో మద్యం అమ్మకాలను నిషేధించారు. నగరంలో 2,400 మందికిపైగా పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తారు. ఓట్ల లెక్కింపు జరిగే వసంతనగర మౌంట్ కార్మెల్ కాలేజీ, విఠల్ మల్యా రోడ్డులోని సెయింట్ జోసెఫ్ ఇండియన్ హైస్కూల్, జయనగరలోని ఎస్ఎస్ఎంఆర్వి కాలేజీ చుట్టుపక్కల గట్టి భద్రత కల్పించారు. గొడవల నివారణ కోసం పెద్దసంఖ్యలో కేంద్ర బలగాలను కూడా మోహరించారు.

న్యూస్‌రీల్

తమ్ముని చేతిలో అన్న హతం

మైసూరు: చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేటె తాలూకాలోని చౌడహళ్ళి గ్రామంలో సొంత అన్నను తమ్ముడు చాకుతో పొడిచి చంపాడు. నిందితుడు కుమార్‌ను గుండ్లుపేటె పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తన భార్యతో అన్న ప్రసాద్ అక్రమ సంబంధం పెట్టుకున్న విషయం తెలుసుకున్న కుమార్.. పద్ధతి మార్చుకోవాలని అన్న ను అనేకసార్లు హెచ్చరించాడు. కానీ వారి ప్రవర్తనలో మార్పు రాక పోవడంతో ఆదివారం సాయంత్రం అన్నతో గొడవపడి కత్తితో విచ్చలవిడిగా పొడిచాడు. తీవ్ర గాయాలతో ప్రసాద్ అక్కడికక్కడే చనిపోయాడు. తరువాత పరారైన నిందితున్ని పోలీసులు గాలించి అరెస్టు చేశారు.

కట్న వేధింపులకు అబల బలి

మైసూరు: భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం పెడుతున్న వేధింపులను భరించలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. చామరాజనగర జిల్లాలోని కొళ్ళేగాల తాలూకా టిసి హుండి గ్రామంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. టిసి హుండికి చెందిన కవిత (37) అనే మహిళను సమీపంలోని బీసలవాడి గ్రామానికి చెందిన చేతన్‌కి ఇచ్చి 2022లో పెళ్లి జరిపించారు. కొంత బంగారం, ఇతర కట్న కానుకలు ఇచ్చారు. పుట్టింటి నుంచి మరో రూ. 2 లక్షలు తేవాలని భర్త చేతన్, అత్త సిద్దాజమ్మ, మామ సోమయ్య, మరిది కృష్ణమూర్తి, ఇతర బంధువులు ఆమెను పీడించసాగారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన కవిత ఇటీవల పుట్టింటికి వచ్చింది. ఆదివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. కొళ్ళేగాల పోలీసులు కేసు నమోదు చేశారు.

మండ్యలో భారీ భద్రత



మండ్య: మండ్య లోక్‌సభ స్థానం ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ ఏర్పడింది. జేడీఎస్ మాజీ సీఎం కుమారస్వామి ఇక్కడి నుంచి పోటీలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి స్టార్ చంద్రు తలపడ్డారు. ఎవరిది గెలుపని జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడి నుంచి స్వతంత్ర ఎంపీగా ఉన్న సుమలత అంబరీశ్ సర్వ ప్రయత్నాలు చేసినా బీజేపీ టికెట్ దక్కలేదు. మండ్య నగరంలో ఉన్న మండ్య విశ్వ విద్యాలయంలో కౌంటింగ్ జరగనుంది. సోమవారం పెద్దసంఖ్యలో పోలీసులు చేరుకుని ఏర్పాట్లపై చర్చించారు.

క్షుద్రపూజలు చేయించలేదు

- కుమారస్వామి వెల్లడి

దొడ్డబళ్లాపురం: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఉన్నట్టే తమకూ దేవుడు ఉన్నాడని, అబద్ధాలు చెబుతూ, కుట్రలకు పాల్పడేవారిని ఆ దేవుడే శిక్షిస్తాడని మాజీ సీఎం కుమారస్వామి అన్నారు. బెంగళూరులో సోమవారంనాడు పార్టీ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి తాను భైరవి యాగం చేయిస్తున్నానన్న డీకే శివకుమార్ ఆరోపణలపై మండిపడ్డారు. నరం లేని నాలుక ఏమైనా మాట్లాడుతుందని, దాని నీచమైన బుద్ధి వదలదని దుయ్యబట్టారు. తాను ఇటీవల విశ్రాంతి కోసం కబిని హిన్నీరుకు వెళ్తే క్షుద్రపూజలు చేయడానికి కేరళకు వెళ్లానని దుష్ప్రచారం చేశారన్నారు. జంతు బలులిచ్చి పూజలు చేయించడం తనకు తెలియదన్నారు. తమ కుటుంబాన్ని సర్వనాశనం చేయడానికి డీకే కంకణం కట్టుకున్నారని ఆరోపించారు.

అనుమానం పెనుభూతమై..



శిల్ప(ఫైల్)



శిల్ప మృతదేహం

బెళుగుప్ప: ఉరవకొండ నియోజకవర్గం బెళగుప్ప మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన శిల్ప (28) అనే వివాహిత మెట్టినింట్లో వేధింపులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. కర్ణాటకలో చిత్రదుర్గం జిల్లాకు చెందిన శిల్పకు బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన మంజునాథతో 10 ఏళ్ల క్రితం వివాహం అయింది. కొన్నాళ్లు కాపురం సజావుగా సాగింది. మంజునాథ బేల్దారిగా పనిచేసేవాడు. కొంతకాలంగా భర్తతో పాటు అత్తమామలు శిల్పను అనుమానిస్తూ సతాయించడంతో గొడవలు జరుగుతున్నాయి. ఆవేదన చెందిన శిల్ప ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. భర్త చూసి కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ చనిపోయింది. భర్త, అత్తమామల వేధింపుల వల్లే తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి లక్ష్మీదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎవరిదో విజయ పతాక



కర్ణాటకతో పాటు దేశవ్యాప్తంగా నిర్వహించిన 18వ లోక్‌సభ ఎన్నికలలో కన్నడనాట ఏ పార్టీ ఆధిక్యం సాధిస్తుంది?, ఎవరు మట్టి కరుస్తారు?, ప్రజా తీర్పు ఏమిటీ అనే ప్రశ్నలకు మరికొన్ని గంటల్లో సమాధానం లభించబోతోంది. ఎక్కువ సీట్ల కోసం హస్తం, బీజేపీ హోరాహోరీగా తలపడ్డాయి.



ఓటరు మదిలో ఏముందో ఎవరికి ఎరుక?, కలబుర్గిలో ఓటర్లు

- అత్యధిక సీట్లపై బీజేపీ, కాంగ్రెస్ గురి
- గత ఎన్నికల్లో బీజేపీకి 25, హస్తానికి- 1
- ఈసారి ఫలితాలపై కాంగ్రెస్‌లో ఆశలు
- రాష్ట్రంలో ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

బనశంకరి: బెంగళూరుతో పాటు రాష్ట్రమంతటా ఓట్ల లెక్కింపు టెన్షన్ నెలకొంది. ఈవీఎంలలో నిక్షిప్తమైన అభ్యర్థుల జాతకాలు బయటపడబోతున్నాయి. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 26, మే 7న రెండు విడతల్లో పోలింగ్ జరగడం తెలిసిందే. ఓటర్లు కాంగ్రెస్ సర్కారు గ్యారంటీ పథకాలకు మొగ్గు చూపారా? లేక ప్రధాని నరేంద్ర మోదీకి జై కొట్టారా? అనేది బహిర్గతం కానుంది. మంగళవారం ఉదయం 8 గంటలకు అంతటా ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ముందుగా పోస్టల్ ఓట్లను లెక్కించిన తరువాత ఈవీఎంలోని ఓట్ల సంగతి చూస్తారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత పూర్తిస్థాయిలో జయాపజయాలు వెల్లడి కానున్నాయి.

ఎగ్జిట్ పోల్స్‌లో బీజేపీ హవా

- ఎగ్జిట్‌పోల్స్ సర్వేల ప్రకారం ఈసారి కూడా రాష్ట్రంలో బీజేపీ హవా కొనసాగనుంది.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కనీవినీ ఎరుగని స్థాయిలో 25 ఎంపీ సీట్లను కైవసం చేసుకుంది. ఒకటి కాంగ్రెస్, ఒకటి జేడీఎస్, మండ్యలో స్వతంత్ర అభ్యర్థి గెలిచారు. కాషాయానికి అదే స్థాయి విజయం ఈసారి కూడా దక్కేనా? అన్నది అనుమానంగానే ఉంది.
- గత 2023 మేలో శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆశలో ఉంది.
- 1999 నుంచి జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హస్తం పార్టీ డబుల్ డిజిట్‌ను దాటలేదు. కానీ ఈసారి 14 నుంచి 20 సీట్లు గెలిచి విజయశంఖం పూరించాలని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. కానీ చాలా సర్వేల్లో కాంగ్రెస్ సీట్లు రెండెంకెలు దాటవని పేర్కొన్నాయి.

బీజేపీ కూటమి లక్ష్యం



రాష్ట్రంలో మొదటిసారిగా జేడీఎస్ తో బీజేపీ పొత్తు పెట్టుకొని ఎన్నికల్లోకి దిగింది. గత ఎన్నికలకంటే ఈసారి అధిక సీట్లు సాధిస్తామనే భావనలో ఉంది. సర్వేల్లో కూటమికి 20 కి పైగా స్థానాలు లభిస్తాయని తెలిపారు. ఏది ఏమైనా మరికొన్ని గంటల్లో ప్రజా తీర్పు తేటతెల్లం కానుంది.



ఢిల్లీలోని దేశ పార్లమెంటు



దావణగెరెలో లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి

ఏడీజీపీ, డీఎస్పీలపై కేసు నమోదుకు ఆదేశం

యశవంతపుర: ప్రైవేట్ వ్యక్తులపై అనవసరంగా కేసులు నమోదు చేస్తున్నారంటూ ఏడు మంది పోలీసు అధికారులపై కేసులు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశించింది. డీఎస్పీలు ప్రకాశ్‌రెడ్డి, విజయ్ హడగలి, ఉమా ప్రశాంత్, ఎంకె తిమ్మయ్య, సీఐలు ఎస్ఆర్ వీరేంద్రప్రసాద్, మంజునాథ్ హొగార్, అలాగే అదనపు డీజీపీ సీమంతకుమార్ సింగ్‌లపై కేసు నమోదు చేసి విచారించాలని ఆదేశించడం సంచలనమైంది. వివరాలు.. అవినీతి ఆరోపణల కేసులో బీడీఏ అధికారి వద్ద స్వాధీనం చేసుకున్న డైరీలో ఉన్న రెండు మొబైల్ నంబర్ల ఆధారంగా ప్రైవేట్ వ్యక్తులపై కేసులు నమోదు చేయడం ప్రారంభించారు. తనకు సంబంధం లేకున్నా అవమానం కలిగించే కేసులో ఇరికించారని ఒక వ్యక్తి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న పై డీఎస్పీలు, సీఐ, అదనపు డీజీపీపై కేసులు నమోదు చేసి విచారించాలని ఆదేశించింది.

నాగేంద్రను రాజీనామా కోరలేదు : సీఎం

శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలిలో స్కామ్‌కు సంబంధించి మంత్రి నాగేంద్రను తాము రాజీనామా కోరలేదని సిద్దరామయ్య స్పష్టం చేశారు. మంత్రి నాగేంద్ర బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని, అందుకోసమే సీఎం రాజీనామా చేయించటం లేదని బీజేపీ నాయకుడు కోటా శ్రీనివాస్ వ్యాఖ్యలపై సీఎం సోమవారం స్పందించారు. ఈ కుంభకోణానికి సంబంధించి సిట్‌ను ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు ఎలాంటి నివేదిక రాలేదన్నారు. అదే సమయంలో మంత్రి నాగేంద్ర నుంచి తాము ఎలాంటి వివరణ కోరలేదన్నారు. నివేదిక వచ్చేంత వరకు వేచి ఉంటామన్నారు. నాగేంద్ర రాజీనామాకు బీజేపీ ఈ నెల 6 వరకు గడవు ఇచ్చిన విషయంపై స్పందించిన ముఖ్యమంత్రి, వారెవరు తమకు గడువు ఇచ్చేందుకని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలున్నదే అన్యాయానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలి. అయితే అపద్దాలు చెప్పుకొంటూ పోరాటం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కనీసం 15 నుండి 20 లోక్‌సభ స్థానాలను గెలుపొందనుందని చెప్పారు.

• ఉద్యాననగరి కకావికలం



ఆదివారం రాత్రి బెంగళూరులో కుండపోత కురిసింది. ఆ ధాటికి గాంధీ బజార్‌లో కారుపై కూలిన చెట్టు



విద్యాపీఠ కూడలిలో కూలిన పెద్ద చెట్టు



గాంధీ బజార్‌లో షాపుల సెల్లార్లలో వాన నీరు



గాంధీబజార్‌లోనే రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

ఎగువసభకు 11 మంది ఏకగ్రీవమే!

- ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలు
- కాంగ్రెస్-7, బీజేపీ- 3, జేడీఎస్-1 పోటీ



ఎమ్మెల్సీ అభ్యర్థులతో సీఎం, డిప్యూటీ సీఎంలు

శివాజీనగర: విధానసభ నుంచి విధానపరిషత్‌లో 11 స్థానాలకు జూన్ 13న జరుగనున్న ఎన్నికలకు కాంగ్రెస్ నుంచి 7, బీజేపీ నుండి ముగ్గురు, జేడీఎస్ నుండి ఒక అభ్యర్థి సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఆయా పార్టీల ఎమ్మెల్యేల బలాల ఆధారంగా వీరంతా ఏకగ్రీవంగా ఎన్నిక కావటం తథ్యం. నామినేషన్ల దాఖలుగా సోమవారమే ఆఖరి రోజు. మొత్తం 11 స్థానాలకు 11 మంది అభ్యర్థులే పోటీలో ఉన్నందున ఏకగ్రీవంగా ఎన్నికవుతారు, దీనివల్ల పోలింగ్ జరిపే అవసరం ఉండదు.

సీఎం కుమారునికి చాన్స్

కాంగ్రెస్ నుంచి సీఎం సిద్దరామయ్య కుమారుడు యతీంద్ర, చిన్ననీటిపారుదల మంత్రి బోసురాజు, సీఎం రాజకీయ కార్యదర్శి కే.గోవిందరాజు, ఐవాన్ డిసోజ, బిల్కీస్ బాను, జగదేవ గుత్తేదార్, వసంత కుమార్‌లు పోటీలో నిలిచారు. విధానసౌధలో వీరి నామినేషన్ల కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులు వీరే

బీజేపీలో 3 స్థానాలకు మాజీ మంత్రి సీ.టీ.రవి, ప్రస్తుత ఎమ్మెల్సీ రవికుమార్, మాజీ ఎమ్మెల్యే ఎంజీ మూళె నామినేషన్లు సమర్పించారు. మాజీ సీఎం యడియూరప్ప, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై.విజయేంద్రతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు. ఇక జేడీఎస్ నుంచి జవరాయగౌడ నామినేషన్ సమర్పించారు. హెచ్.డీ.కుమారస్వామి పాల్గొన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు జూన్ 6 వరకు గడువు ఉంది. అదేరోజు ఎన్నికైన అభ్యర్థులను ప్రకటిస్తారు.

సిద్దు, కుమార ఎదురుపడినవేళ

విధానపరిషత్ ఎన్నికల్లో అభ్యర్థుల నామినేషన్ సమర్పణ కోసం విధానసౌధకు వచ్చిన సీఎం సిద్దరామయ్య, జేడీఎస్ నేత హెచ్.డీ.కుమారస్వామి ముఖాముఖి ఎదురు పడ్డారు. విధానసభ కార్యదర్శి చాంబర్ బయట సీఎం సిద్దరామయ్య నిలబడి ఉండగా, నామినేషన్ సమర్పించి కుమారస్వామి బయటికి వచ్చారు. ఆ సమయంలో ఉభయులూ నమస్కరించుకొన్నారు. ఎమ్మెల్యే జీటీ దేవేగౌడను సీఎం కరచాలనం చేసి పలకరించారు. కొందరు జేడీఎస్ ఎమ్మెల్యేలు కూడా సీఎంను ఆత్మీయంగా పలకరించారు. ప్రస్తుతం పెన్‌డ్రైవ్ కేసులతో సిద్దు, కుమార మధ్య వాతావరణం వేడెక్కినందున పలకరించుకోలేదు.

నిధుల స్కాంకు సీఎందే బాధ్యత

శివాజీనగర: మహర్షి వాల్మీకి కార్పొరేషన్‌లో నిధుల దుర్వినియోగానికి మంత్రి నాగేంద్రను నిందించటం కంటే ఆర్థికశాఖను కలిగిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య బాధ్యత వహించాలని మాజీ సీఎం కుమారస్వామి అన్నారు. ఆయన విధానసౌధలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...ఆత్మహత్య చేసుకున్న అధికారి మంత్రి పేరు రాయలేదు. ఇలాంటి సమయంలో ఏ మంత్రిపై చర్యలు తీసుకుంటారు. అన్ని అభివృద్ధి మండళ్లలో ఇలానే అవినీతి జరిగిందని సమాచారం ఉందన్నారు. ఈ అక్రమాల్లో యూనియన్ బ్యాంక్ సైతం ఉండటంతో విచారణ సీబీఐ పరిధిలోకి వస్తుంది. అయితే ప్రభుత్వం సిట్‌ను నియమించడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆత్మహత్య చేసుకున్న చంద్రశేఖర్ ఇంటి నుండి పెన్‌డ్రైవ్, ల్యాప్‌టాప్‌లను కొందరు తీసుకెళ్లారు, అవి ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు.

మచ్చ లేని మానవత

- నిరుపేద బాలింతకు ముస్లిం జంట సేవలు



ముస్లిం దంపతులను సన్మానిస్తున్న బెళగావి పోలీసులు

హుబ్లీ: ఏదైనా పనిచేసి పెట్టాలంటే సొంత కుటుంబసభ్యులే విసుక్కుంటారు. కానీ బెళగావి జిల్లాలో బాలింత మహిళకు ముస్లిం దంపతులు సపర్యలు చేసి అండగా నిలిచారు. వివరాలు.. గత నెల 14న జిల్లాలోని గోకాక్ తాలూకా దండాపుర గ్రామానికి చెందిన నిరుపేద శాంతవ్వ అనే గర్భిణి బెళగావి జిల్లా ఆస్పత్రిలో బిడ్డను ప్రసవించింది. ఆ సమయంలో బాలింతకు మతి తప్పిపోయింది. శిశువును చూసుకునే ఆలోచన కూడా లేదు. గోకాక్ తాలూకా కోన్నూరకు చెందిన షమ రిజ్వాన్ చెల్లెలు సదరు బాలింత బెడ్ పక్కనే అడ్మిట్ అయ్యింది. చెల్లిని చూడడానికి వచ్చిన షమ శాంతవ్వ దుస్థితిని గమనించి వారంరోజుల పాటు తల్లీ బిడ్డ ఆలనాపాలన చూసింది. శాంతవ్వ డిశ్చార్జి అయిన తరువాత ఇంటికి తీసుకెళ్లి 40 రోజుల పాటు సపర్యలు చేశారు. ఈలోగా శాంతవ్వ మామూలు మనిషి అయ్యింది. కోలుకున్న తల్లీబిడ్డలను బెళగావి మార్కెట్ ఏరియా పోలీసులు సొంత ఊరికి పంపించారు. ఇంత సేవ చేసినందుకు షమ, ఆమె భర్తను పోలీసులు ఘనంగా సత్కరించారు.

విందు వికటించి ఆస్పత్రిపాలు

మైసూరు: మైసూరు నగరంలో ఒక ఇంటిలో జరిగిన గృహ ప్రవేశం వేడుకల్లో భోజనం చేయగా 50 మందికి పైన అస్వస్థతకు గురయ్యారు. మార్బళ్ళిలో గత 31వ తేదిన ఒక ఇంటి గృహ ప్రవేశం జరిగింది. ఇందులో సుమారు 300 మందికి విందు ఆరగించారు. కానీ 50 మందికి పైన వాంతులు, విరేచనాలకు గురి కావడంతో ఆస్పత్రిలో చేరారు. శివమ్మ (65) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ చనిపోయింది.

బెంగళూరులో పాముల గోల

- 110 ప్రాంతాల్లో అధిక బెడద



యశవంతపుర: అల్లంత దూరంలో పాము కనబడగానే గుండెల్లో బెదురు వస్తుంది. అదే పాము ఇంట్లోకి వస్తే ఇంకేమైనా ఉందా? బెంగళూరులో వర్షాలు ప్రారంభం కాగా వాన నీరు ఇళ్లలోకి వస్తున్నాయి. ఆ నీటితో పాటు పాములు కూడా వస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారు. బొమ్మనహళ్లి, బ్యాటరాయనపుర, దాసరహళ్లి, మహదేవపుర, రాజరాజేశ్వరి నగర ప్రాంతాలలో పాములు వాననీటిలో తిరగటం కనిపించింది. 110 ప్రాంతాల్లో నాగుపాము, చుక్కల పాము, రక్తపింజర, నీటిపాములు వీధుల్లోకి వస్తున్నట్లు బీబీఎంపీ వన్య జీవి సంరక్షణ బృందం అధికారులు తెలిపారు. పాములు వచ్చాయని రోజూ తమకు ఫోన్ కాల్స్ వస్తున్నట్లు అధికారులు తెలిపారు. యలహంక, బొమ్మనహళ్లి ప్రాంతాల నుంచి ఎక్కువ కాల్స్ ఉన్నాయి. అయితే సహాయవాణికి ఫోన్ చేసినా సిబ్బంది త్వరగా రావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

హెల్ప్ లైన్‌కు కాల్ చేయండి

ఇది పాముల సంతానవృద్ధి కాలం కావడంతో ఖాళీ స్థలాలు, పొదలలో పాము పిల్లలు ఎక్కువైనట్లు వన్యజీవి రక్షణ బృందం సభ్యుడు ప్రసన్నకుమార్ తెలిపారు. పాములు కనపడితే బీబీఎంపీ సహాయవాణి 1533, కర్ణాటక అటవీశాఖ సహాయవాణి-1926, బీబీఎంపీ వన్యజీవి సహాయవాణి 99027 94711 నంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు మనవి చేశారు.

కదిలిన పట్టభద్ర, టీచర్ ఓటర్లు



సోమవారం మండ్యలో.. పోలింగ్ సెంటర్‌లో ఉపాధ్యాయులు



మైసూరులో ఓటు వేశామంటున్న టీచర్లు

- 6 ఎమ్మెల్సీ సీట్లకు పోలింగ్

శివాజీనగర: విధానపరిషత్‌లో మూడు పట్టభద్రుల, మూడు ఉపాధ్యాయ నియోజకవర్గాలకు కలిపి 6 స్థానాలకు సోమవారం ప్రశాంతంగా పోలింగ్ సాగింది. బెంగళూరు పట్టభద్రుల నియోజకవర్గం, ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం, నైరుతీ పట్టభద్రుల నియోజకవర్గం, ఆగ్నేయ ఉపాధ్యాయుల నియోజకవర్గం, నైరుతీ ఉపాధ్యాయుల నియోజకవర్గం, దక్షిణ ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు ఉదయం 8 గంటల నుండి పోలింగ్ ఆరంభం కాగా, పట్టభద్ర, ఉపాధ్యాయ ఓటర్లు ఉత్సాహంతో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు.

పోటీలో 78 మంది

ఈ 6 నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్, స్వతంత్రులు కలిపి మొత్తం 78 మంది అభ్యర్థులు పోటీ చేశారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి 40 శాతం పోలింగ్ జరిగింది. ఈ అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జూన్ 6న జరిపి ఫలితాలను ప్రకటిస్తారు. అధికార కాంగ్రెస్ 6 చోట్లా పోటీ చేయగా, బీజేపీ-జేడీఎస్ పొత్తు వల్ల 4 చోట్ల బీజేపీ, 2 సీట్లలో జేడీఎస్ పోటీలో నిలిచాయి.

మండ్యలో పోలింగ్

మండ్య: దక్షిణ విభాగం ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానం పోలింగ్‌లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం నుంచే ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటు వేశారు. క్యూలో ఓపికగా నిలబడ్డారు. మండ్య నగర సభ, తాలూకా ఆఫీసులో పోలింగ్ సాగింది.



మండ్యలో పోలింగ్ కేంద్రంలో టీచర్లు

ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్

- నెలన్నర రోజుల ఉత్కంఠకు నేడు తెర
- అన్ని ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం



ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



కౌంటింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

కోలారు: లోక్‌సభ అభ్యర్థుల భవితవ్యం నేడు తేలనుండగా ఫలితాలపై ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో గుండెదడ మొదలైంది. సోమవారం ప్రకటించిన ఎగ్జిట్‌పోల్ అంచనాలతో జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు మంచి హుషారులో ఉండగా కాంగ్రెస్ కార్యకర్తలు డీలా పడ్డారు. ఫలితాలపై ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థుల్లో కూడా ఉత్కంఠ నెలకొంది. 4వ తేదీ ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుండగా మొదట పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్దనే ఓటు వేసిన వయో వృద్ధుల ఓట్ల కౌంటింగ్, అనంతరం ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. మధ్యాహ్నం 2 గంటల కల్లా దాదాపుగా ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. పోలింగ్ అనంతరం ఈవీఎం బాక్సులను నగరంలోని బాలుర డిగ్రీ కళాశాల గదుల్లో భద్రపరిచారు. కౌంటింగ్ కేంద్రంలో కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం పూర్తి చేసింది. కౌంటింగ్ కేంద్రం చుట్టూ, లోపల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సోమవారం జిల్లాధికారి, జిల్లా ఎన్నికల అధికారి అక్రంపాషా కౌంటింగ్ కేంద్రానికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద నిషేధాజ్ఞలు

లోక్‌సభ పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలను డిగ్రీ కళాశాల స్ట్రాంగ్ రూంల్లో భద్రపరిచారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి కౌంటింగ్ కోసం 17 గదులు, 120 టేబుళ్లను, 414 మంది సిబ్బందిని నియమించారు. ప్రతి టేబుల్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు కౌంటింగ్‌కు తగినంత సిబ్బందిని ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బందిని మినహాయించి ఎవరినీ అనుమతించరు. కౌంటింగ్ కేంద్రం చుట్టూ 100 మీటర్ల వరకు 144 సెక్షన్ విధించారు. ఎస్పీ ఎం నారాయణ నేతృత్వంలో కౌంటింగ్ కేంద్రం వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థను కల్పించారు. బీఎస్‌ఎఫ్, పారా మిలటరీ, రిజర్వు పోలీస్, సివిల్ పోలీసులను భద్రత కోసం నియమించారు. విజేత అభ్యర్థులకు స్థలంలోనే ప్రమాణ పత్రాలను అందిస్తారు. విజేత అభ్యర్థులు విజయోత్సవాలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం వంటి వాటిని నిషేధించారు. కౌంటింగ్‌కు ముందు రోజు నుంచి జిల్లాలో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించారు. కాగా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ అభ్యర్థిగా మల్లేష్‌బాబు, కాంగ్రెస్ అభ్యర్థిగా కేవీ గౌతంతో పాటు మొత్తం 15 మంది అభ్యర్థుల భవితవ్యం ఓట్ల లెక్కింపుతో తేలనుంది.

క్లుప్తంగా

సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు

హొసపేటె: కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు సోమవారం విజయనగర జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. విజయనగర జిల్లాలో మొత్తం 18,233 మంది ఓటర్లు ఉండగా జిల్లాలోని 6 తాలూకాల్లోని 21 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించగా, మహిళలు, పురుషులు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. హొసపేటె నగరంలో చిత్తవాడిగి ప్రభుత్వ పీబీఎస్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటర్లు ఓటు వేశారు. ప్రతి ఎన్నికల పోలింగ్ బూత్‌ల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శృతి పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు.

6న శాంతి హోమం

హుబ్లీ: ధార్వాడ ఉదయ్ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో లోక కళ్యాణార్థం శనేశ్వర జయంతి శుభ సందర్భంగా ఈనెల 6న ఉదయం 9 గంటలకు పండిత్ రామాచార్ అధ్యాపక్ నేతృత్వంలో శాంతి హోమం జరగనుంది. మకర, కుంభ, మీన, తులా, కర్కాటక రాశుల భక్తులు స్త్రీ శని, శాంతి హోమ ప్రయోజనం పొంది దోష పరిహారం చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 9448775299 నెంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కదం తొక్కిన కార్యకర్తలు



కలబురిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌కేజీ, యూకేజీలను కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. సోమవారం కలబుర్గి డివిజనల్ విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించే కార్యకర్తలకు ఇప్పటికే ఎల్‌కేజీ, యూకేజీ బోధనకు సంబంధించిన శిక్షణ ఇచ్చారన్నారు. అయినా ప్రభుత్వం కళ్యాణ కర్ణాటకలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

మోకాళ్ల నొప్పులకు చికిత్స శిబిరం

హుబ్లీ: నగరంలోని పాత హుబ్లీ హెగ్గేరిలోని ఆయుర్వేదిక్ వైద్య కళాశాల ఆస్పత్రిలో మోకాళ్ల నొప్పులు, మోకాళ్లు పట్టుకోవడం, వాపు లేక వాపు వల్ల బాధలు పడుతున్న రోగులకు అవసరమైన చికిత్సా శిబిరం సోమవారం ప్రారంభం అయింది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం ద్వారా పంచకర్మ విభాగం సేవలు పొందవచ్చు. ఈ నెల 8 వరకు ఆసక్తి గల రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు డాక్టర్ శిల్పాశ్రీని 6361046045 అనే నెంబర్‌లో సంప్రదించాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ ప్రశాంత్ ఓ ప్రకటనలో కోరారు.

విక్రయ కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

బళ్లారిఅర్బన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే దిశలో వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం విత్తన, సాగు పరికరాల విక్రయ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. జిల్లాలో ఇంతవరకు 92 విక్రయ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేపట్టారు. 71 విక్రయ కేంద్రాల బాధ్యులకు నోటీసులను జారీ చేశారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు తదితరాల నమూనాలను సదరు ప్రయోగాలయానికి పంపించారు. జిల్లా వ్యవసాయ శాఖ జేడీ తిరుమలేష మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొరత లేదన్నారు. రైతులు సాగు పరికరాలను అధీకృత విక్రేతల నుంచి కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు, రసీదులు తీసుకోవాలని ఆయన సూచించారు.

నేటి కౌంటింగ్‌కు ఆంక్షలు అమలు

హొసపేటె: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు- 2024 కౌంటింగ్ కోసం జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఆర్‌పీసీ-1973 సెక్షన్- 144 ప్రకారం విజయనగర జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిషేధాజ్ఞల అమలుకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లాధికారి దివాకర్ తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత కూడా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని తెలిపారు. జిల్లా అంతటా అమలులో ఉండే ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్-188 ప్రకారం ప్రాసిక్యూట్ చేస్తారన్నారు. అయితే కౌంటింగ్, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బంది ఈ ఉత్తర్వు వర్తించదని తెలిపారు.

సమన్వయంతో పనిచేయండి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ తుషార్

బనశంకరి: హెబ్బాళ వద్ద గల ఎన్‌హెచ్‌ఏఐ రోడ్డులో బీబీఎంపీ, బీడీఏ, జలమండలి, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సమన్వయంతో పనిచేసి రోడ్లు జలమయం కాకుండా చూడాలని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అధికారులకు సూచించారు. ఆదివారం కురిసిన భారీ వర్షానికి యలహంక వలయంలో జలమయమైన ప్రాంతాలను సోమవారం కమిషనర్ తుషార్, అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం మాట్లాడారు. హెబ్బాళ జంక్షన్‌లో రోడ్డుపై నీరు నిల్వకుండా రాజకాలువలో సజావుగా నీరు ప్రవహించడానికి బీడీఏ ఆధ్వర్యంలో 1200 ఎంఎం పైపు అమర్చారని ప్రస్తుతం ఈస్థలంలో మెట్రో పనులు జరుగుతుండటంతో వర్షపునీరు వెళ్లడానికి అమర్చిన పైపు బ్లాక్ కావడంతో నీరు రాజకాలువలో వెళ్లడం సాధ్యం కాలేదన్నారు. బీడీఏ అధికారులు తక్షణం మెట్రో అధికారులతో మాట్లాడి పైపులైను సరిదిద్ది రాజకాలువ లోకి నీరు సజావుగా ప్రవహించేలా చూడాలని సూచించారు. టెలికాం లేఔట్ జలమయం కావడాన్ని పరిశీలించిన తుషార్ అక్కడ నీరు సజావుగా వెళ్లడానికి రాజకాలువను వెడల్పు చేయాలని అధికారులకు సూచించారు.

అంగట్లో అంగన్‌వాడీ పాలపాడి ప్యాకెట్లు

- తుమకూరు జిల్లాలో బాగోతం



అంగడి వద్ద పాల పొడి పాకెట్ ను పరిశీలిస్తున్న సీడీపీఓ

పావగడ: క్షీర భాగ్యం పథకం కింద బాలింతలు, చిన్నారుల పౌష్టికత కోసం ప్రభుత్వం ఎంతో ఖర్చుపెట్టి అందించే పాల పొడిని కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు అంగట్లో అమ్మి సొమ్ము మింగేస్తున్నారు. ఈ ఉదంతం సోమవారం వెలుగులోకి వచ్చింది. తుమకూరు జిల్లా పావగడ తాలూకాలోని వైఎన్ హొసకోటె పట్టణం ఎంజీ రోడ్డులో గౌరిశంకర్ షాపు, ఎస్‌కేపీటీ రోడ్డు లోని భూమా శ్రీనివాస్ షాపులో అంగన్‌వాడీలో బాలింతలు, పిల్లలకు అందజేసే పాల పొడి ప్యాకెట్లను అక్రమంగా అమ్ముతున్నట్లు తెలిసి సీడీపీఓ సునీత మామూలు మహిళలా తనిఖీలకు వెళ్లారు. గౌరి శంకర్ దుకాణంలో ఓ కస్టమర్‌లా పాలపొడి పాకెట్‌ను కొనుగోలు చేసింది. అది మార్చి నెలలో క్షీర భాగ్య పథకం కింద అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన పాల పొడి పాకెట్ అని వెల్లడైంది. ఆమె వ్యాపారిని విచారించగా కొంతమంది అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు పాల పొడి పొకెట్లను అందిస్తారని, వాటిని తాము అధిక ధరలకు విక్రయిస్తామని చెప్పేశాడు. దీంతో పేదలకు అందాల్సిన పాలపొడి పక్కదారి పట్టినట్లు తేలింది.

చర్యలు తీసుకుంటాం

ఈ అక్రమాలకు ఒడి గట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలపై చర్యలు చేపడతామని సీడీపీఓ సునీత విలేకరులకు తెలిపింది. ఇదిలా ఉంటే వైఎన్ హొసకోటె చుట్టు పక్కల ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కొంత మంది కార్యకర్తలు పాల పొడినే కాకుండా ఇతర వివిధ సరుకులు కూడా దుకాణాలకు అక్రమంగా విక్రయిస్తున్నారని ఆర్టీఐ కార్యకర్తల వేదిక జిల్లా అధ్యక్షుడు లక్ష్మణమూర్తి ఆరోపించారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారుల వైఫల్యంతోనే ఇలాంటి అక్రమాలు జరుగుతున్నాయని పలువురు గ్రామస్థులు ఆరోపించారు.

ప్రశాంతంగా విధాన పరిషత్ ఎన్నికలు



బళ్లారిలో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ సతీష్



బళ్లారిలో ఓటేసిన స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

- చల్లబడిన వాతావరణం, 6న ఓట్ల లెక్కింపు
- అక్కడక్కడ వర్షంతో పోలింగ్‌కు అంతరాయం

సాక్షి,బళ్లారి: ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం విధాన పరిషత్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం పరిధిలోని బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, యాదగిరి, కలబురిగి, బీదర్ అనే ఏడు జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడు జిల్లాల పరిధిలో మొత్తం 1,40,427 మంది ఓటర్లు ఉండగా, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు జరిగిన పోలింగ్‌లో దాదాపు 70శాతం పైగా పట్టభద్రులు తమ ఓటు వేశారు. వాతావరణంలో కూడా మార్పులు రావడంతో ఎండల తీవ్రత తగ్గిపోవడంతో చల్లని వాతావరణంలో ఓటర్లు ఉల్లాసంగా బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడక్కడ వర్షాలు కూడా రావడంతో ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేందుకు అవాంతరాలు కూడా ఏర్పడ్డాయి. బళ్లారి జిల్లా వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ముగ్గురి మధ్యే పోటాపోటీ

ఈశాన్య పట్టభద్ర నియోజకవర్గ పరిధిలో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్, స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డిల మధ్య గట్టి పోటీ నెలకొంది. ముగ్గురు అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల రోజున కూడా తమ తమ మద్దతుదారులతో ఓటును వేయించుకునేందుకు వారి వారి మద్దతుదారులు పోటీ పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రధాన పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు, కార్యకర్తలతో పాటు స్వతంత్ర అభ్యర్థికి చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా టెంట్లు వేసుకుని ఓటర్లకు చీటీలు రాసిస్తూ తమకే ఓటు వేయాలని అభ్యర్థించడం కనిపించింది. బళ్లారి నగరంలో జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, విధాన పరిషత్ సభ్యుడు వై.ఎం.సతీష్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు శాంతియుతంగా జరగడంతో ఈనెల 6వ తేదీన కలబుర్గిలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే పట్టభద్రులకు ఆయా పార్టీలకు చెందిన వారు ప్రలోభాలకు గురి చేశారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ తమకు ఓటు వేయాలని కోరడం చర్చనీయాంశంగా మారింది.

అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో పోటీ

మండ్య: రాజకీయ నాయకులు అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో గెలిచి రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని దక్షిణ విభాగం ఉపాధ్యాయ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి వాటాల్ నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...ప్రస్తుతం జరుగుతున్న మండలి ఎన్నికల్లో బహిరంగంగానే డబ్బులు పంపిణీ చేసి ఓట్లు వేయించుకుంటున్నారని ఆరోపించారు. అభ్యర్థి నీతి, నిబద్ధతను గుర్తించి ఓట్లు వేయాలని అన్నారు.

కుండపోత వర్షం.. పంటలు జలావృతం



హంపీ రహదారిలో నిల్వ చేరిన వర్షం నీరు



ఉప్పొంగిన వాగులో చిక్కుకొన్న ట్రాక్టర్

హొసపేటె: నగరంలో ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి పంట పొలాల్లోకి నీరు చేరింది. రాత్రి 1 గంట నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగర శివార్లలో ఉన్న రాయర చెరువు కింద ఉన్న వందలాది ఎకరాల్లో పండించిన అరటి, చెరుకు, మొక్కజొన్నతో పాటు ఇతర పంటల్లోకి వర్షపు నీరు చేరి జలావృతమైంది. పొలాల్లో ఉన్న పంటలు నీట మునిగాయి. కష్టపడి సాగు చేసిన పంటల్లోకి వర్షపు నీరు చేరడంతో రైతన్న కంగు తిన్నాడు. అదే విధంగా భారీ వర్షానికి హంపీ వైపునకు వెళ్లే దారిలో ఉన్న కడ్డిరాంపురంలో వర్షం నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.



కారిగనూరు సమీపంలో పొంగిపొర్లిన వాగు



రాయర చెరువులో నీట మునిగిన పంటలు

శతాయుషికి సన్మానం



వీసీ రాజును సన్మానిస్తున్న దృశ్యం

శివాజీనగర: నగరంలో శ్రీరామచంద్ర క్రెడిట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ వ్యవస్థాపకుడు, తెలుగు విజ్ఞాన సమితి క్రియాశీల సభ్యుడు వీసీ రాజు 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో వారి కుటుంబ సభ్యులు ఆయన శతమాన ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన శ్రీకృష్ణదేవరాయ కళామందిరం నిర్మాణానికి ఒక లక్ష రూపాయలను విరాళమిచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారని సమితి అధ్యక్షుడు ఏ.రాధాకృష్ణరాజు ప్రశంసించారు. సమితి సభ్యులు కే.గంగరాజు, సీ.ఏ.వరదరాజు తదితరులు వీసీ రాజును సన్మానించారు.

శాంతియుతంగా పరిషత్ ఎన్నికల పోలింగ్



బ్యాలెట్ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

తుమకూరు: నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఆగ్నేయ విభాగం ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కుక్క కాటుపై నిర్లక్ష్యం వద్దు



చైతన్యం కల్పిస్తున్న డీహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు

బళ్లారిఅర్బన్: పెంపుడు కుక్క, వీధి కుక్కలు కరిచిన వెంటనే నిర్లక్ష్యం చూపకుండా సబ్బు నీరుతో గాయాన్ని, కొరికిన భాగాన్ని శుభ్రంగా కడిగి ఆ వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రేబిస్ టీకాను వేయించుకోవాలని డీహెచ్‌ఓ డాక్టర్ వై.రమేష్‌బాబు తెలిపారు. సోమవారం బండిహట్టి నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వట్టప్పకేరి ప్రాంతంలో ఆయన క్షేత్ర పరిశీలన చేసి ప్రజలకు చైతన్యం కలిగించారు. పెంపుడు ప్రాణులు కొరికినప్పుడు రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా కుక్కలు కొరకడం వల్ల ఎక్కువ శాతం రోగాలు వ్యాపిస్తాయని, నిర్లక్ష్యం చూపకుండా టీకా తీసుకొని ప్రాణాలను కాపాడుకోవాలని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో 36 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయన్నారు. వైద్యాధికారులు డాక్టర్ యాస్మిన్, ఈశ్వర్ హెచ్ దాసప్పనవర్, సిబ్బంది, ఆశా కార్యకర్తలు భువనేశ్వరి, గిరిజా పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

ఆగ్నేయ ఉపాధ్యాయ ఎన్నికలు శాంతియుతం

- 95.82 శాతం పోలింగ్ నమోదు



ఓటు వేయడానికి క్యూలైన్లో నిలబడిన ఉపాధ్యాయులు

కోలారు: తాలూకాలో ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ఓటు వేశారు. 95.82 శాతం ఓట్లు పోలయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆరు తాలూకాల్లోను పోలింగ్ ప్రశాంతంగా నడిచింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 4360 మంది ఓటర్లకు గాను 2297 మంది పురుషులు, 2063 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ప్రధాన పార్టీల అభ్యర్థుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులు ఉపాధ్యాయుల వద్ద ఓట్లను అభ్యర్థించడం కనిపించింది.

మహిళా కళాశాలలో మధ్యాహ్న భోజనం



తుమకూరు: తుమకూరు నగరంలోని బీహెచ్ రోడ్డులో ఉన్న సిద్ధగంగా మహిళా కళాశాలలో నిత్య దాసోహ నిధి ట్రస్ట్ ఆధ్వర్యంలో తత్వ ఫౌండేషన్ సహకారంతో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని సోమవారం సిద్ధగంగా విద్యాసంస్థల కార్యదర్శి టీకే నంజుండప్ప ప్రారంభించారు. అంతకు ముందు ఆయన శివకుమారస్వామి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దక్షిణామూర్తి, డాక్టర్ డీ.ఎస్. యోగీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికలో 96.5 శాతం పోలింగ్



ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రూపా శశిధర్



ఓటు వేయాలని కోరుతున్న ఎంపీ మునిస్వామి

కేజీఎఫ్ : ఆగ్నేయ ఉపాధ్యాయ నియోజకవర్గ పరిషత్ ఎన్నికల్లో కేజీఎఫ్ తాలూకా పరిధిలో 96.5 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. పరిషత్ ఎన్నికల్లో తమ అభ్యర్థుల విజయం కోసం కంకణం కట్టుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థుల నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రం వద్దనే నిలబడి ఓటర్లను ఓటు అభ్యర్థించడం కనిపించింది. ఉదయం 8 గంటల నుంచే పోలింగ్ జోరుగా ప్రారంభమైంది. ఓటర్లు ఒక్కొక్కరే వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి డి టి శ్రీనివాస్ తరఫున ఎమ్మెల్యే రూపా శశిధర్ పోలింగ్ కేంద్రం వద్దనే ఉండి ఓటు వేయవలసిందిగా ఉపాధ్యాయులకు విన్నవించారు. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి వైఏ నారాయణస్వామి తరఫున ఎంపీ ఎస్ మునిస్వామి కూడా అక్కడే ఉండి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయవలసిందిగా అభ్యర్థించారు. తాలూకాలో మొత్తం 693 మంది ఓటర్లు ఉండగా, 669 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా కరగ మహోత్సవం



కరగను తలపై ధరించిన పూజారి శ్రీనివాస్

మాలూరు : తాలూకాలోని రాజేనహళ్లి గ్రామానికి చెందిన పురాతన శ్రీ ద్రౌపతమ్మ దేవి, ధర్మరాయస్వామి ఆలయంలో కరగ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మాస్తి ఫిర్కా రాజేనహళ్లి గ్రామంలోని శ్రీ ధర్మరాయస్వామి కరగ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గత నాలుగు రోజుల నుంచి కరగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. కరగ పూజారి శ్రీనివాస్ తలపై కరగ మోసుకుని చేసిన నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పోతలరాజు, భరత పూజారి వేద మంత్రాలను పఠించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో కరగ తిరిగి మళ్లీ ఆలయం వద్దకు చేరుకుంది.

రోడ్డు నియమాల పాటింపు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లాధికారి అక్రంపాషా

కోలారు: ప్రతి ఒక్కరూ రహదారి నియమాలను తూచ తప్పకుండా పాటించాలని జిల్లాధికారి అక్రంపాషా తెలిపారు. సోమవారం తన కార్యాలయ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలు అధికంగా జరిగే జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్రవాహనాలపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణిస్తే కఠిన చర్యలకు ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై జరిమానా విధించాలి లేదా లైసెన్సులను రద్దు చేయాలన్నారు. ప్రమాదాల్లో కార్మికులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల వరకు పరిహారం, గాయపడిన కార్మికులు 15 రోజులకు పైగా ఆస్పత్రిలో చికిత్స పొందితే వారికి రూ.50 వేల పరిహారం అందిస్తారన్నారు. కేజీఎఫ్ ఎస్పీ శాంతరాజ్ మాట్లాడుతూ గత మూడేళ్లుగా కేజీఎఫ్ పోలీస్ జిల్లా వ్యాప్తిలో జాతీయ రహదారిపై 38 ప్రమాదాలు జరిగాయన్నారు. వీటిలో 16 మంది మరణించారన్నారు. జాతీయ రహదారినిపై స్పీడోమీటర్లు, అలవర్చాలన్నారు. అదనపు జిల్లా ఎస్పీ రవిశంకర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జగదీష్, రవాణా అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నయనానందకరం యక్షగానం



బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలోని ఆరేహళ్లిలోని ఏజీఎస్ లేఔట్‌లో స్థానిక అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంధ్యా సౌరభ కార్యక్రమంలో భాగంగా కళా కదంబా ఆర్ట్స్ సెంటర్ బృందం, హలసినహళ్లికి చెందిన నరసింహ శాస్త్రి బృందం కళాకారులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రదర్శించిన యక్షగాన నాటకం అందరిని అలరించింది. కార్యక్రమంలో నిత్యాగౌడ, వర్ణ శెట్టి, స్వర్ణశెట్టి, అన్విత, సోమాయాజి, నిశ్చిత, వర్ణిక నావడ, అనిష్ సోమాయాజి, తేజష్ గౌడల ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటకం విశేషంగా ఆకట్టుకుంది.

యువతికి వేధింపులు, యువకుడిపై దాడి

మైసూరు: తనను ప్రేమించాలని ఓ యువతిని వేధిస్తున్న యువకుడిపై యువతి బంధువులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన చామరాజనగర తాలూకా బూదిపడగ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కిశోర్ మూకన పాళ్యకు చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. తరచూ వెంటపడుతుండటంతో పలుమార్లు హెచ్చరించారు. ప్రతిఘటించడంతో కర్రలు, వేటకొడవళ్లతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన కిశోర్‌ను ఆస్పత్రికి తరలించారు. చామరాజనగర రామసముద్ర పోలీసులు కసు నమోదు చేశారు.

ఇసుక వాహనాలు సీజ్



శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను భూవిజ్ఞాన శాఖ అధికారులు దాడులు చేసి సీజ్ చేశారు. అధికారి నవీన్ కుమార్ నేతృత్వంలో సిబ్బంది తాలూకాలోని బేదరహళ్లి, పిళ్లంగెరెతో పాటు హొసనగర తాలూకాలోని రిప్పన్ పేటె పరిధిలో ఏకకాలంలో దాడులు చేసి జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లు స్వాధీనం చేసుకుని ఆయా పరిధుల్లోని పోలీస్ స్టేషన్లలో అప్పగించి కేసు నమోదు చేశారు.

దేవాలయంలో చోరీ

దొడ్డబళ్లాపురం: దేవాలయం తాళం పగలగొట్టి లోపల జొరబడ్డ దుండగులు రూ.2.50 లక్షల విలువైన ఆభరణాలు, నగదు దోచుకున్న సంఘటన హాసన్ తాలూకా బీ.కాటేహళ్లిలో చోటుచేసుకుంది. గ్రామంలోని పంచముఖ ఆంజనేయస్వామి, సుబ్రమణ్య, నవగ్రహ దేవాలయాల్లో వెండి ఆభరణాలు, వెండి కిరీటం, హుండీ నగదు దోచుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి



శివమొగ్గ: శివమొగ్గ జిల్లాలో లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని సహ్యాద్రి కళాశాల భవంలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ప్రతి శాసనసభ నియోజకవర్గ పరిధిలో 14 టేబుళ్లు చొప్పున ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

పితృ కార్యాలను భక్తి శ్రద్ధలతో చేయాలి



బొమ్మనహళ్లి: పితృదేవతల రుణం తీర్చుకునే క్రమంలో పితృ కార్యాలను క్రమం తప్పకుండా భక్తి శ్రద్ధలతో ఆచరించాలని న్యాయమూర్తి కుమార్ తెలిపారు. ఆయన సోమవారం బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ తాలూకా చందాపురలోని సహృదయ విప్ర బృందం పదాధికారులు ఏర్పాటు చేసిన ధార్మిక భవన నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. విప్ర కుల బంధువులు బ్రహ్మచర్యం నుంచె ప్రారంభం కావడం జరుగుతుందని, అప్పటి నుంచి ఈ లోకాన్ని వీడి వరకు రోజు గాయత్రి పఠనం చేయాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. గాయత్రి జపం పఠించిన వారిలో జ్ఞాపకశక్తి, తేజస్సు పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎకెబీఎంఎస్ డైరెక్టర్ నరసింహ స్వామి, దేవాలయం ట్రస్టీ హెచ్‌ఎస్ అశ్వత్థ నారాయణ కుమార్, విప్ర విశ్వ పరిషత్ అధ్యక్షుడు రాఘ రఘునాథ్, సుదర్శన్, సహృదయ విప్రసంఘం అధ్యుడు ఎన్.ఎస్.రామకృష్ణ కార్యదర్శి సూర్య నారాయణ దీక్షిత్, ఎకెబిఎంఎస్ రాష్ట్ర సమితి సభ్యుడు రవి శాస్త్రి ప్రభు, నాగేంద్ర, దీపక్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సిలికాన్ సిటీలో కుండపోత

- భారీ వర్షంతో బెంగళూరు విలవిల
- మునిగిన రోడ్లు, వందలాదిగా కూలిన చెట్లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- 133 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన వర్షం

బనశంకరి: రాష్ట్ర రాజధాని బెంగళూరును కుంభవృష్టి ముంచెత్తింది. గత కొద్ది రోజులుగా నైరుతి రాకతో వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం సాయంత్రం ఆకస్మిక వర్షం కుదిపేసింది. గాలివానగా ప్రారంభమై నగర వ్యాప్తంగా కొన్ని గంటల పాటు కుండపోతగా కురిసింది. వందలాది వృక్షాలు కూలిపోయాయి. మెట్రో సంచారానికి విఘాతం ఏర్పడింది. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. అదే విధంగా కార్లు, ఆటోలు, బైక్‌లు ధ్వంసమయ్యాయి. ముగ్గురు గాయపడ్డారు. అండర్‌పాస్‌లో పెద్ద ఎత్తున నీరు చేరింది. 38 ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి నుంచి ఉరుములు పిడుగులతో కూడిన వర్షంతో ఆనేకల్, చందాపుర, హెబ్బగోడి, ఎలక్ట్రానిక్‌సిటీ చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బెల్లందూరులో అపార్టుమెంటులోకి డ్రైనేజీ నీరు చేరడంతో అక్కడ విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ఉవ్వెత్తున వర్షపు నీరు, స్తంభించిన ట్రాఫిక్ :
బెంగళూరు–మైసూరు జాతీయ రహదారి బసవనపుర వద్ద భారీ పరిమాణంలో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

రికార్డు వర్షం :
ఆదివారం సాయంత్రం బెంగళూరు నగరంలో కురిసిన భారీవర్షం జూన్‌లో కురిసేవర్షం ఒకేరోజు కురవడంతో రికార్డు సృష్టించింది. 133 ఏళ్ల క్రితం కురిసిన వర్షం రికార్డును బద్దలు కొట్టింది. 1891 జూన్ 18న బెంగళూరులో 24 గంటల్లో 101.6 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. ఇప్పటివరకు అదే రికార్డు. ఆదివారం కురిసిన వర్షం ఈ రికార్డును బద్దలు కొట్టింది. బెంగళూరు హంపినగరలో 101 మి.మీ, విద్యాపీఠ 88 మి.మీ, కాటన్‌పేటే 87 మి.మీ, మారుతి మందిర వార్డు 83 మి.మీ, హొరమావు 80 మి.మీ, కొడిగేహళ్లి 79 మి.మీ, కొట్టిగేపాళ్య 77 మి.మీ, సంపింగిరామనగర 71 మి.మీ, చామరాజపేటే 71 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. కుంభవృష్టి వర్షానికి నగర రోడ్లు జలమయంగా మారాయి.



వర్షపు నీటిలో వాహనదారుల అవస్థలు



పీణ్యాలో కారు చెట్టు మీద పడటంతో నిస్సాహాయంగా చూస్తున్న దంపతులు

మెట్రో సంచారం పునః ప్రారంభం
వర్షం ధాటికి బెంగళూరు మెట్రో సంచారానికి ఆదివారం అంతరాయం ఏర్పడింది. ఇందిరానగర, ఎంజీ.రోడ్డు మధ్య మెట్రో వంతెనపై చెట్టు కూలిపోయింది. దీంతో మెట్రో సంచారానికి అంతరాయం తలెత్తింది. బెంగళూరు నడిబొడ్డున ప్రాంతమైన ఎంజీ రోడ్డు మెట్రోస్టేషన్‌లో ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బయట భారీ వర్షం కురుస్తుండటం మరోపక్క మెట్రో రైలు సంచారం నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం యథాప్రకారం మెట్రో సంచారం ప్రారంభమైంది.

సీఎం ఇంటి ముందు కుంగిన రోడ్డు
ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉంటున్న రోడ్డులో వారం క్రితమే తారురోడ్డు వేశారు. ఆదివారం కురిసిన వర్షానికి రోడ్డు కుంగిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు బ్యారికేడ్లు అమర్చారు.

మరో ఐదురోజుల పాటు వర్షాలు
బెంగళూరు నగరం మరో ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం నుంచి 6 తేదీ వరకు రెండురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో వాతావరణశాఖ ఎల్లో అలర్ట్ ప్రకటించింది. గత రెండురోజుల్లో బెంగళూరులో సాధారణం కంటే భారీ వర్షం కురిసింది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : డీసీఎం
నైరుతి రుతుపవనాలు నేపథ్యంలో బీబీఎంపీతో పాటు సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించామని డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ తెలిపారు. అకస్మాత్తుగా భారీ గాలితో కూడిన వర్షం కురవడంతో ఇబ్బందులు తలెత్తాయని దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.



మ్యాన్‌హోల్‌ను తెరుస్తున్న బీబీఎంపీ కార్మికుడు



ఒరిగిన విద్యుత్ స్తంభం, చెట్టుపడి నుజ్జైన కారు



కూలిన చెట్లను తొలగిస్తున్న పాలికె కార్మికులు



కబ్బన్ పార్కులో కూలిన చెట్టు

ఎమ్మెల్సీ టికెట్లలో సిద్దు హవా

- తనయునికి పదవి

శివాజీనగర: విధాన పరిషత్ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో సీఎం సిద్దరామయ్య కొడుకు యతీంద్రతో పాటు సిఫార్సు చేసిన ముగ్గురికి అవకాశం లభించింది. మిగతా నాలుగు స్థానాల్లో హైకమాండ్ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేయగా, డీ.కే.శివకుమార్ సూచించిన ఒక్కరికి కూడా అవకాశం దక్కింది. ఉత్తర కర్ణాటకకు ఎక్కువ సీట్లు దక్కాయి. సిద్దరామయ్య, హైకమాండ్ నాయకులు తమకు కావాల్సిన వారికి ఉదారంగా సీట్లు ఇచ్చుకున్నారని గుసగుసలున్నాయి. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అనుచరులు నిరాశకు గురైనట్లు తెలిసింది. ఎమ్మెల్సీ పదవుల కోసం సుమారు 80 మంది గట్టిగా ప్రయత్నాలు సాగించారు. అయితే సీఎం, ఢిల్లీ నేతలు తమదైన లెక్కాచారంలో ఎంపిక నిర్వహించారు. బీజేపీవి కుటుంబ రాజకీయాలు అని విమర్శించే కాంగ్రెస్ నేతలు ఈసారి కుటుంబ సభ్యులకు సీట్లు ఇప్పించుకోవడానికి పోటీలు పడ్డారు.

కుమార్తె ప్రేమ వివాహం.. తల్లి ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందని మనస్తాపంతో తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెలమంగల పట్టణంలో చోటుచేసుకుంది. అంజనా నగర్ నివాసి లక్ష్మమ్మ (45) ఆత్మహత్య చేసుకున్న మహిళ. ఇటీవలే ఈమె కుమార్తె ఒక యువకుడిని ప్రేమించి ఇల్లు వదిలి వెళ్లిపోయింది. ఆరోజు నుండి తీవ్ర మనస్తాపానికి గురైన లక్ష్మమ్మ సోమవారం నెలమంగల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ముందు ఉన్న పార్కులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నెలమంగల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సనాతన ధర్మానికి విశిష్ట గౌరవం



మైసూరు: సనాతన ధర్మానికి ప్రపంచంలో ఎక్కడకు వెళ్లిన విశిష్ట గౌరవం ఉందని మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠానికి చెందిన పీఠాధిపతి శ్రీ సుబుంద్రేంద్ర తీర్థ స్వామీజీ అన్నారు. మైసూరు నగరంలోని కృష్ణమూర్తి పురంలో ఉన్న శ్రీ వ్యాసతీర్థ విద్యాపీఠంలో సోసలె శ్రీ వ్యాసరాజ మఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీమన్ న్యాయ సుధా మంగళ మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం భక్తులను ఆశీర్వదించి మాట్లాడుతూ... విద్యార్థులు నిర్భయంగా సంస్కృతంలో సులభంగా విషయాలను అనువాదం, వ్యాఖ్యానం చేయవచ్చని, భవిష్యత్‌లో విద్వాంసులు కావచ్చని అన్నారు.

పోలీస్ అధికారి రాజేశ్ సేవలు మరవలేము

బొమ్మనహళ్లి: ఎస్‌ఎస్‌ఎల్‌సీ పరీక్షల్లో ఒకసారి ఫెయిల్ అయిన యువత అనేక మంది ఇక తాము పాస్ కాలేమని తప్పుడు దారుల్లో వెళ్తున్న యువతను చేరదీసి వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పించి పోలీసు అధికారి రాజేశ్ చేస్తున్న సేవలు మరచిపోలేమని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని బొమ్మనహళ్లి బండెపాళ్య పరిధిలోని ఐటీఐ లేఔట్‌లో సుభోదిని పాఠశాల ఆవరణంలో ఇటీవల పదో తరగతిలో ఫెయిల్ అయిన ఎంతో మంది విద్యార్థులకు ఉత్తమ శిక్షణకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. అసిస్టెంట్ పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎల్‌వై రాజేశ్ ప్రైవేట్ స్కూళ్లకు చెందిన కొంతమంది ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారు పాస్ కావడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ రాజేశ్ మాట్లాడుతూ...మూడేళ్లుగా అనేక మంది పదో తరగతి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంతో వారు పాస్ అయ్యారని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు.



సీఎం నిర్ణయానికి కట్టుబడి ఉంటా

దొడ్డబళ్లాపురం: వాల్మీకి అభివృద్ధి మండలి అధికారి ఆత్మహత్య విషయంలో మంత్రి నాగేంద్రపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఎటువంటి చర్యలు తీసుకున్నా అందుకు తాను కట్టుబడి ఉంటానని మంత్రి హెచ్‌కే పాటీల్ అన్నారు. సోమవారం బెంగళూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ఆదివారం జరిగిన మ్మెల్యేల సమావేశంలో అనేక విషయాలు చర్చించామన్నారు. వాటిలో మంత్రి బీ నాగేంద్రకు సంబంధించి కూడా చర్చించామన్నారు. ఇక ఏ నిర్ణయం సీఎం, డీసీఎం తీసుకుంటారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్ లెక్కలు తారుమారు అవుతాయన్నారు. కాంగ్రెస్ 16పైగా లోక్‌సభ స్థానాల్లో గెలుస్తుందన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



పశు వైద్యశాలకు పాడి ఆవులను తీసుకు వచ్చిన దృశ్యం

గౌరిబిదనూరు: పాడి రైతులు పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని, టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని పశు వైద్యుడు డాక్టర్ మారుతి తెలిపారు. తాలూకా ముద్దలోడు గ్రామంలో సోమవారం జరిగిన పశువుల ఆరోగ్య పరీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువులకు వచ్చే వ్యాధులను సకాలంలో గుర్తించి తగిన వైద్య చికిత్స ఇప్పించాలని, అప్పుడే పాల దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 48 పశువులకు చికిత్స చేశారు. శిబిరంలో పశు వైద్యులు కాంతరాజు, వెంకటేశబాబు, మురళీధర్, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి రూ. 10 లక్షలు టోపీ

మైసూరు: సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసగిస్తునే ఉన్నారు. ఓ వ్యక్తి నుంచి రూ. 10.36 లక్షలు దోచుకున్నారు. బాధితుడు మైసూరు తాలూకా దేవనూరుకు చెందిన పునీత్ కుమార్. పునీత్ మొబైల్ వాట్సాప్‌కు ఒక మెసేజ్ వచ్చింది. షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని అందులోని సారాంశం. దీంతో ఆశకు పోయిన పునీత్ వారిని సంప్రదించి వారు సూచించిన ఖాతాలకు విడతల వారీగా రూ. 10.36 లక్షలు బదలీ చేశాడు. అనంతరం అక్కడి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నిలువునా మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

దంపతుల పరస్పర ఫిర్యాదులు

యశవంతపుర: దంపతుల పరస్పర ఫిర్యాదులపై గిరినగర పోలీసులు కేసు నమోదు చేశారు. తనను హత్య చేస్తానని బెదిరించాడని రైటర్స్ కాలనీ ఫస్ట్‌స్టేజీకి చెందిన శిల్ప ఫిర్యాదుతో భర్త వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. భర్త వెంకటేశ్ కూడా భార్యపై ఫిర్యాదు చేశాడు. వెంకటేశ్ తండ్రికి అనారోగ్యం కారణంగా సుజాత అనే మహిళను నియమించారు. అనంతరం కొద్ది రోజులకు వెంకటేశ్ సుజాతతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. తరువాత భార్య శిల్పను వేధించటం ప్రారంభించారు. సుజాత మాటలను విన్న వెంకటేశ్ తనను వేధిస్తున్నట్లు శిల్ప తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

ద్రౌపతిదేవికి విశేష పూజలు

హోసూరు: హోసూరు సమీపంలోని ముదుగానపల్లి గ్రామంలో వెలసిన గ్రామదేవత ద్రౌపతి ఆలయంలో గత రెండురోజులుగా విశేష పూజలు జరిగాయి. అగ్నిగుండ మహోత్సవం జరిపించారు. కోలారు జిల్లా బంగారుపేటకు చెందిన భక్తులచే పూలకరగ మహోత్సం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి పి. బాలక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డుపై వీలింగ్, నలుగురిపై కేసు

యశవంతపుర: బెంగళూరు పూర్వ ట్రాఫిక్ విభాగం పరిధిలో బైక్‌లపై ప్రమాదకరంగా వీలింగ్ చేస్తున్న నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాణసవాడి 100 అడుగుల రోడ్డులో బైక్‌లపై వీలింగ్ చేస్తుండగా పోలీసులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కగ్గదాసపుర మెయిన్‌రోడ్డులో, కేఆర్ పుర మేడహళ్లి మెయిన్ రోడ్డులో, మహదేవపుర గ్రాఫైట్ ఇండియా మెయిన్‌రోడ్డులో, హెచ్‌ఎఎల్ వర్తూరు మెయిన్‌రోడ్డులో వీలింగ్ చేస్తున్న యువకుల బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఉప కమిషనర్ డాక్టర్ కే వంశీకృష్ణ తెలిపారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

యశవంతపుర: గుర్తు తెలియని వాహనం ఢీకొని బైకిస్టు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి యశవంతపుర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ప్రమాదంలో మహలక్ష్మీ లేఔట్ నివాసి కిరణ్ (22) మృతి చెందాడు. బీఈఎల్ వద్ద తన స్నేహితుడితో మాట్లాడి బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అరెస్ట్: నిషేధిత ఈ సిగరెట్లు, రీఫిల్ లిక్విడ్‌ను అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణంపై ఇందిరానగర పోలీసులు దాడి చేసి మేనేజర్‌ను అరెస్ట్ చేశారు. దక్షిణ కన్నడ జిల్లా బంట్వాళ తాలూకాకు చెందిన మోహ్మద్ సాదిక్ (32)ను పోలీసులు అరెస్ట్ చేయగా, దుకాణం యజమాని ఖాదర్ ఆసీఫ్ (42) పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరు ఇందిరానగర 8వ క్రాస్‌లో నివాసం ఉంటున్నారు. హెచ్‌ఎఎల్ మూడో స్టేజీలో గిఫ్ట్‌షాప్ నడుపుతున్నారు. ఇక్కడ నిషేధిత ఈసిగరెట్లు అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు.

పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త



పాఠశాల వద్ద చెత్తకుప్ప

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరిలోని ప్రభుత్వ బాలికల ఉన్నతోన్నత పాఠశాల వద్ద చెత్త పేరుకుపోవడంతో ఆ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతోందని, వెంటనే చెత్తను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సూళగిరి ప్రభుత్వ బాలికల ఉన్నతోన్నత పాఠశాలలో సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థినులు చదువుతున్నారు. పాఠశాల చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలు ఇళ్లలో వెలువడే వ్యర్థాలను తీసుకువచ్చి ఆ ప్రాంతంలో పడేస్తున్నారు. ఈ ప్రాంతంలో చెత్తకుప్పలు పేరుకుపోతున్నా పారిశుద్ధ కార్మికులు తొలగించడంలేదని, స్థానికులు బీడీవో అధికారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని, దీంతో దోమలు, ఈగలు పెరిగిపోయి ప్రజలు అనారోగ్యం బారినపడుతున్నారని అన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకుని చెత్తను తొలగించాలన్నారు.

హోసూరు వార్తలు..

బైక్ దొంగల పట్టివేత



సీజ్ చేసిన బైక్‌లు

హోసూరు: హోసూరు ప్రాంతంలో గత కొద్ది రోజులుగా ద్విచక్రవాహనాలు దోపిడీలకు గురవుతున్నట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన డీఎస్పీ బాబు ప్రశాంత్ దొంగలను పట్టుకొనేందుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేసి దోపిడీకి గురైన 8 బైక్‌లను స్వాధీనపరుచుకొని ఇద్దరు దొంగలను అరెస్ట్ చేశారు. ఈ బైక్‌ల విలువ సుమారు రూ. 10 లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

వరద కాలువ కట్టరెందుకో?



నిలిపివేసిన పనులు

క్రిష్ణగిరి: సూళగిరి– ఉద్దనపల్లి రోడ్డులోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద కాలువ ఏర్పాటు పనులు నత్తనడకన సాగుతుండడంపై ఆ ప్రాంత రైతులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. సూళగిరి పట్టణంలోని ఉద్దనపల్లి రోడ్డులో యూనియన్ స్థాయి వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయానికి పక్క భవనం నిర్మించినా వినియోగానికి వీలులేకపోయింది. వర్షాకాలంలో కార్యాలయం చుట్టూ నీరు నిండిపోయి రైతులు, అధికారులు లోనికి వెళ్లలేకపోతున్నారు. కార్యాలయం చుట్టూ కాల్వలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ. 2 కోట్ల నిధులను మంజూరు చేసింది. గత మూడు నెలల క్రితం పనులను ప్రారంభించారు. కానీ పనులను నిలిపివేశారు. అధికారుల నిర్లక్ష్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

వీధి కుక్కలను నివారించండి



పట్టణంలో రోడ్లపై సంచరిస్తున్న వీధికుక్కలు

క్రిష్ణగిరి: సూళగిరి పట్టణంలో వీధికుక్కల దాడులు పెరిగిపోయాయని, వాటిని నియంత్రించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలో ఓ వీధిలో ఏకంగా 30 కుక్కలు సంచరిస్తున్నాయని, తరచూ ఇళ్ల ముందు ఆటలాడుకునే పిల్లలను వెంబడించి దాడి చేసి కరుస్తున్నాయని, దీంతో పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారని అన్నారు.

గాలివాన బీభత్సం



విరిగిపోయిన ఓ చెట్టు



కూలిన స్తంభం, ఎగిరిపోయిన రేకులు

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకా అత్తిముగం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం వీచిన బలమైన గాలులకు విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోయాయి. అత్తిముగం సమీపంలోని వడ్రపాళ్యం ప్రాంతంలో గాలులతో కూడిన వర్షం కురిసింది. ఒక చెట్టు పికప్‌వ్యాన్‌పై కూలడంతో ఆ వాహనం ధ్వంసమైంది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో అక్కడ కరెంటు సరఫరా నిలిచిపోయింది. వడివేలు, శివప్ప, శంకర్, నారాయణప్ప, ఆనంద్, వెంకటేష్, క్రిష్ణప్పలకు చెందిన ఇళ్ల పైకప్పులు ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఇళ్లలో ఉన్నవారు బయటకెళ్లడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ఇళ్లు కోల్పోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

ప్రకృతి ఒడిలో ఆలయం



మారియమ్మ ఆలయం



ఆలయం చుట్టూ ప్రకృతి సౌందర్యం

హోసూరు: చుట్టూ దట్టమైన అడవులు. ప్రకృతి సౌందర్యాలతో ప్రజలను ఆకట్టుకొనే ప్రదేశంలో వెలసిన గ్రామదేవత మారియమ్మకు పూజలు నిర్వహిస్తే కోరిన కోర్కెలు తీరుస్తుందని ఈ ప్రాంత ప్రజల ప్రగాఢ నమ్మకం. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో జరిగే జాతరలో అమ్మవారు పూని అర్చకుడు వచ్చి ఏడాదిలో వర్షాలు, పంటలు, పశు సంతతి, ప్రజలకు కలిగే మంచి చెడుల గురించి వివరిస్తారు. పూజారి చెప్పినవి సంపూర్ణంగా జరిగి తీరుతాయని ప్రజలంటున్నారు. అంచెట్టి తాలూకా హొగేనక్కల్ మార్గంలోని మంచుకొండపల్లి గ్రామంలో వెలసిన చారిత్రక ప్రసిద్ధి పొందిన గ్రామదేత మారియమ్మ ఆలయం. ఈ ఆలయం హోసూరు, డెంకణీకోట, అంచెట్టి తాలూకాల ప్రజలకు తెలియనివారంటూ లేరు. ప్రతి రోజూ ఆలయానికి ఈ ప్రాంత ప్రజలే కాక కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికెళ్లి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొంటూరు. ఆలయాన్ని పర్యాటక శాఖ గుర్తించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భక్తులు, ప్రజలు కోరారు.

ఘనంగా కరుణానిధి జయంతి



హోసూరులో కరుణానిధికి పుష్పాంజలి



సూళగిరిలో కరుణ జయంతిలో నేతలు

హోసూరు, కెలమంగలం, క్రిష్ణగిరి: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి దివంగత కరుణానిధి 101 జయంతిని క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా డీఎంకే నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ ఆదేశాల మేరకు హోసూరు కార్పొరేషన్ మేయర్ ఎస్.ఏ. సత్య అధ్యక్షతన సోమవారం ఉదయం పట్టణంలోని తాలూకా కార్యాలయం వద్ద ఉన్న అన్నావిగ్రహం వద్ద జయంత్యుత్సవాలను ఆచరించారు. కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి సమర్పించారు. కార్యక్రమంలో ఉపమేయర్ ఆనందయ్య, డీఎంకే కార్పొరేటర్లు, డీఎంకే డీఎంకే నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కెలమంగలం బస్టాండులో డీఎంకే నాయకులు కరుణానిధి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. సూళగిరి రౌండాణా వద్ద డీఎంకే నాయకులు, కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించి స్వీట్లు పంచిపెట్టారు.



కెలమంగలం బస్టాండులో..

క్లుప్తంగా...

కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



సీతమ్మధార (విశాఖ ఉత్తర): కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయం నుంచి కౌంటింగ్ ఏజెంట్లతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. కౌంటింగ్ ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఏజెంట్లు నిర్ణీత సమయంకంటే ముందే కౌంటింగ్ సెంటర్లకు చేరుకోవాలని చెప్పారు. ఎగ్జిట్ పోల్స్ గురించి ఎవరూ పట్టించుకోవాల్సిన పనిలేదన్నారు. మహిళలు, వృద్ధులు జగనే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. 175 మంది అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుస్తారన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఏజెంట్ విజేతను ప్రకటించేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపులో ఏదైనా పొరపాటును గమనిస్తే వెంటనే రిటర్నింగ్ అధికారికి లిఖిత పూర్వకంగా తెలపాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును చాలా జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ప్రత్యర్థులు ఏ చిన్న గొడవకు ప్లాన్ చేసినా సహనంగా ఉండాలని, అక్కడే ఉన్న ఆర్వోకి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎస్ఆర్ షాపింగ్ మాల్ అధినేత గోపీనాథ్‌రెడ్డి, నాయకుడు సత్తి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిపక్షాల ఆనందం కోసమే ఆ సర్వేలు


- అవి పెత్తందార్లు చేయించినవే..
- రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్



రాజమహేంద్రవరం సిటీ: ప్రతిపక్షాల ఆనందం కోసమే పెత్తందార్లు కొన్ని సంస్థలతో ఎగ్జిట్ పోల్ సర్వేలు చేయించారని, వాటిల్లో శాస్త్రీయత లేదని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్‌సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొన్ని సర్వే సంస్థలు, అలాగే నేషనల్ మీడియా పేరుతో నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్‌లో ఎక్కడా పారదర్శకత కనిపించలేదని విమర్శించారు. ఒక పార్లమెంటు నియోజకవర్గంలో 300 శాంపిల్స్ మాత్రమే తీసుకుని, అదే ప్రామాణికమన్నట్టు ఎలా ఎగ్జిట్ పోల్స్ ప్రకటించారో అర్థం కావడం లేదన్నారు. ఒక అసెంబ్లీ నియోజకవర్గంలోనే మూడు వేలకు పైగా శాంపిల్స్ తీసుకున్నా.. ఒక అంచనాకు రావడం కష్టమవుతుందని చెప్పారు. ఎన్ని ఎగ్జిట్ పోల్ సర్వేలు వచ్చినా, ఏ విధంగా ప్రకటించినా రాష్ట్రంలో కచ్చితంగా వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. ఇది తన సొంత అభిప్రాయం మాత్రమే కాదని, ప్రజలందరి మనసులో ఇదే కోరిక ఉందని తెలిపారు. సీఎం జగన్ తన సంక్షేమ పాలనతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు, అభివృద్ధి చేసి చూపారని కొనియాడారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా ఆయనను అడ్డుకోవడం ఎవ్వరి తరమూ కాదన్నారు. సీఎం జగన్‌ను మహిళలు తమ సొంత అన్నలా భావిస్తారన్నారు. కొన్ని గంటల్లోనే ప్రతిపక్షాలు ఆశ్చర్యపోయే ఫలితాలు రానున్నాయని వెల్లడించారు.

కౌంటింగ్ ఏజెంట్లు జాగ్రత్తగా ఉండాలి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: టీడీపీ కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఏ అనుమానం ఉన్నా వెంటనే ఆర్వోకు ఫిర్యాదు చేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు సూచించారు. కూటమి కౌంటింగ్ ఏజెంట్లతో సోమవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఏజెంట్లు నిర్దేశిత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లాలని చెప్పారు. అన్ని రౌండ్లు పూర్తయ్యే వరకు ఎవరూ బయటకు రాకూడదన్నారు. కంట్రోల్ యూనిట్ నంబరు ప్రకారం సీల్‌ను ప్రతి ఏజెంట్ సరి చూసుకోవాలని, ప్రతి ఒక్కరూ 17–సీ ఫారం దగ్గర ఉంచుకుని పోలైన ఓట్లను, కౌంటింగ్‌లో వచ్చిన ఓట్లను సరి చూసుకోవాలని తెలిపారు. అన్ని రౌండ్లు పూర్తయ్యాక పోలైన ఓట్లకు, కౌంటింగ్‌లో వచ్చిన ఓట్లలో తేడాలు ఉంటే వీవీ ప్యాట్‌లు లెక్కిస్తారని తెలిపారు. ఇదిలా ఉండగా చంద్రబాబు చాలా రోజుల తర్వాత సోమవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి వచ్చారు. పలువురు ముఖ్య నాయకులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.

నేడు మంగళగిరిలోని జనసేన ఆఫీసుకు పవన్

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మంగళవారం మంగళగిరిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రానున్నారు. ఆయన పార్టీ కార్యాలయం నుంచి రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సరళిని పర్యవేక్షిస్తారని జనసేన వర్గాలు తెలిపాయి.

దాడి మీ కళ్లకు కనిపించలేదా?

రాయి విసిరాడా.. లేదా? సీఎంకు తగిలిందా.. లేదా?

ఒక సీఎం పైకి రాయి విసరడం తప్పా.. కాదా?

నిస్సిగ్గుగా ఈ విషయాలను వదిలేసి రాయి విసిరిన వాడికి వత్తాసా?



సాక్షి, అమరావతి : ఎన్నికల ప్రచారంలో ఉన్న సీఎం జగన్‌పైకి జనం మధ్య నుంచి రాయి విసరడం.. అది సీఎం కనుబొమ్మపై తగలడం.. కుట్లు పడటం .. కళ్లెదుటే కనిపిస్తున్నా, చంద్రబాబు, గురివింద రామోజీ మాత్రం తప్పును ఒప్పు చేయాలని పడరాని పాట్లు పడుతున్నారు. నిస్సిగ్గుగా దోషులను వెనకేసుకొస్తున్నారు. తప్పును తప్పు అని చెప్పే ధైర్యం లేక దుష్ప్రచారానికి మరోమారు తెర లేపారు. 2018లో పాదయాత్ర సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విశాఖపట్నం విమానాశ్రయంలో హత్యాయత్నం జరిగినప్పుడు, ఇటీవల ఎన్నికల ప్రచారంలో చోటుచేసుకున్న ఘటన విషయంలో చంద్రబాబు, రామోజీలు వక్రీకరణే లక్ష్యంగా బరితెగించారు. సీఎం జగన్‌పైకి రాయి విసిరిన కేసులో నిందితుడు వేముల సతీశ్ బెయిల్‌పై విడుదలైన తర్వాత చంద్రబాబు పలుకులు వల్లించి తాను టీడీపీ గూటి చిలుకనని చెప్పకనే చెప్పాడు. ఆ కట్టుకథను పచ్చ మీడియా ప్రముఖంగా ప్రచురించడం ద్వారా ఈ కుట్ర అంతా తమ పర్యవేక్షణలో సాగుతోందని రామోజీరావు స్పష్టం చేశారు. సీఎం జగన్‌ను హత్య చేసేందుకు పక్కా పన్నాగంతో పదునైనా రాయితో దాడికి పాల్పడ్డారని పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిరూపించారు. వైద్య నిపుణులు కూడా శాస్త్రీయంగా విశ్లేషించారు. కానీ పోలీసులు తనకు తుపాకీ గురిపెట్టి మరీ అభియోగాలను ఒప్పుకోవాలని బెదిరించారని సతీశ్ చెప్పడం పచ్చ నాటకంలో ఓ భాగం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో, పోలీసులు ఈసీ పరిధిలో ఉన్నప్పుడు ఈ దాడి జరిగింది. అయినా పచ్చ మీడియా ఈ కేసును పక్కదారి పట్టించేందుకు ఇంతగా యత్నిస్తోందంటే.. ఈ హత్యాయత్నం వెనుక కుట్రదారుల పాత్రను మరుగున పరిచేందుకేనని స్పష్టమవుతోంది.

పన్నాగం ప్రకారమే హత్యాయత్నం

సీఎం జగన్‌ను హత్య చేయాలన్న కుట్రదారుల పన్నాగాన్ని వేముల సతీష్ అమలు చేశాడు. ఇందులో భాగంగా ఏప్రిల్ 13న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 'మేమంతా సిద్ధం' యాత్ర విజయవాడలోని అజిత్ సింగ్ నగర్‌లోకి ప్రవేశించక ముందే సతీష్ అక్కడికి చేరుకున్నాడు. ఆ ప్రాంతానికి సమీపంలో ఉన్న బ్రిడ్జ్ వద్ద పదునైన సిమెంట్ కాంక్రీట్ రాయిని ఎంపిక చేసుకుని తన ప్యాంట్ జేబులో వేసుకుని మరీ వివేకానంద స్కూల్ వద్దకు వచ్చాడు. మరి కొంతమందితో కలసి అక్కడ మాటు వేశాడు. ఆ రోజు రాత్రి 8.04 గంటలకు సీఎం జగన్ తన వాహనంపై నిలబడి యాత్ర నిర్వహిస్తూ అక్కడికి చేరుకున్నారు. ఆ వెంటనే సతీష్ ఆ రాయిని బలంగా సీఎం వైఎస్ జగన్‌పైకి గురిచూసి విసిరారు. సీఎం తలలో సున్నిత భాగంపై దాడి చేయడం ద్వారా ఆయన్ను హత్య చేయాలన్న కుట్రదారుల పన్నాగాన్ని అమలు చేసేందుకే సతీష్ ఆ దాడికి పాల్పడ్డాడు. అదృష్టవశాత్తు ఆ రాయి సీఎం జగన్ తలపై సున్నిత భాగంలో కాకుండా ఎడమ కన్ను పైభాగంలో తగలడంతో ప్రాణాపాయం తప్పింది.

సాంకేతిక ఆధారాలతో నిర్ధారణ

ముఖ్యమంత్రి జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తులో పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. పరిసర ప్రాంతాల్లో సీసీ టీవీ ఫుటేజీలు, సీఎం బస్సు చుట్టూ ఏర్పాటు చేసిన కెమెరాల్లో రికార్డ్ అయిన దృశ్యాలు, స్థానికులు తమ సెల్ ఫోన్లో తీసిన వీడియోలు, కాల్ డేటా తదితర ఆధారాలను విశ్లేషించారు. ఆ ఆధారాలన్నీ హత్యాయత్నం కుట్రలో ఏ1 వేముల సతీష్, ఏ 2ల పాత్రను నిర్ధారించాయి. అనంతరం పోలీసులు ఏప్రిల్ 17 సాయంత్రం 5 గంటలకు ప్రధాన నిందితుడు వేముల సతీష్‌ను విజయవాడ రాజరాజేశ్వరి పేటలోని కేజీఎఫ్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇద్దరు ప్రత్యక్ష సాక్షుల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా అతడి కదలికలపై నిఘా పెట్టి అదుపులోకి తీసుకున్న అనంతరం మధ్యవర్తుల సమక్షంలో అరెస్ట్ చేశారు. నిందితుడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సతీష్ ఇంట్లో సోదాలు జరిపి హత్యాయత్నానికి పాల్పడిన రోజు అతడు ధరించిన దుస్తులను స్వాధీనం చేసుకున్నారు.

కణతపై తగిలి ఉంటే ప్రాణాపాయమే..

పదునైన కాంక్రీట్ రాయితో సీఎం జగన్ కణతపై దాడి చేయాలన్నదే నిందితుడు సతీశ్ లక్ష్యమన్నది స్పష్టమైంది. పదునైన రాయి కణతపై తగిలినా తల వెనుక భాగంలో తగిలినా ప్రాణాపాయం సంభవించేదని వైద్య నిపుణులు తేల్చి చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ – న్యూరో సైన్స్ (నిమ్‌హాన్స్– బెంగళూరు)లో న్యూరాలజీ విభాగాధిపతిగా డాక్టర్ కేవీఆర్ శాస్త్రితోపాటు పలువురు ప్రముఖ వైద్య నిపుణులు ఆ విషయంలో ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. కణత భాగంలో ఎముక సున్నితంగా ఉంటుంది. పదునైన రాయి బలంగా తగిలితే ఆ ఎముక విరిగి లోపలే ఉండిపోయేది. ఆ ఎముక లోపల మెదడు భాగానికి గుచ్చుకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లేది. ఎడమ కణత భాగంలోనే పెద్ద రక్తనాళం ఉంటుంది. అది తెగి భారీగా రక్తస్రావం అయ్యేది. తద్వారా కుడి చేయి చచ్చుబడటం, మాట పడిపోయే ప్రమాదానికి దారి తీసేది. మెదడులోనే రక్తస్రావమైనా, మెదడుకు రక్త సరఫరాలో ఇబ్బంది కలిగినా, ప్రాణాపాయం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సీఎం వైఎస్ జగన్ కుడివైపు ఉన్న ప్రజలను చూసి అభివాదం చేస్తూ ఉండటంతో ఎడమ వైపు నుంచి బలమైన రాయితో దాడి చేశారు. ఆ కాంక్రీట్ రాయి తల వెనుక కింద భాగంలో తగిలి ఉంటే మెదడుకు తీవ్ర గాయమయ్యేది. మెదడులో రక్తస్రావం అయి ప్రాణాలకు ముప్పు వాటిల్లేది. అదృష్టవశాత్తు అది ఎడమ కనుబొమ్మపై భాగంలో తగలడంతో తీవ్ర గాయంతో సరిపోయింది.

కుట్రదారుల పాత్ర కప్పిపుచ్చేందుకే..

సీఎం జగన్‌పై హత్యయత్నం కేసులో తెరవెనుక కుట్రదారుల పాత్రపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయడంతో చంద్రబాబు, ఈనాడు రామోజీరావు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికే గుర్తించిన ఏ 2తోపాటు తెర వెనుక ఉన్న ప్రధాన కుట్రదారుల పాత్రను నిగ్గు తేల్చాల్సి ఉందని పోలీసులు న్యాయస్థానానికి నివేదించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అందుకోసం మరి కొందరు సాక్షులను విచారించడంతోపాటు సాంకేతికపరమైన డేటాను మరింత విశ్లేషించాల్సి ఉందన్నారు. కీలక వ్యక్తుల సహకారం లేకుండా ఈ కుట్రను ఇంత పకడ్బందీగా అమలు చేయడం సాధ్యం కాదని పోలీసులు చెబుతున్నారు. దాంతో ఈ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి రానున్నట్లు స్పష్టమవడంతో చంద్రబాబు హడలిపోతున్నారు. అందుకే పోలీసులపైనే తిరిగి అసత్య ఆరోపణలు చేసే కుట్రకు తెరతీశారు. తద్వారా పోలీసులు ఆత్మరక్షణలో పడి ఈ కేసులో కుట్రదారుల పాత్రపై దర్యాప్తు చేయకుండా మిన్నకుండిపోయేలా చేయాలన్నది వారిద్దరి లక్ష్యం. అందుకే పోలీసులు తన తలకు తుపాకి గురిపెట్టి అభియోగాలను ఒప్పుకోవాలని బెదిరించారని, లేకపోతే తన తల్లిదండ్రులను కూడా చంపేస్తామని బెదిరించారని నిందితుడు వేముల సతీశ్‌తో చెప్పించారు. తాము చెప్పినట్టు చెబితే రూ.2 లక్షలు ఇస్తామని పోలీసులు చెప్పారన్నాడు. సతీష్.. తాము చెప్పినట్టు చెప్పడంతో రామోజీరావు తన పత్రికలో ఆ విషయాన్ని ప్రముఖంగా ప్రచురించారు. అసలు ప్రధాన నిందితుడు తాను హత్యాయత్నం చేశానని ఎప్పుడైనా అంగీకరిస్తాడా..!? ఏదో అబద్ధం చెప్పి దర్యాప్తును పక్కదారి పట్టించాలనే యత్నిస్తాడు. మరి ఆ మాత్రం తెలియకుండా ఈనాడు రామోజీరావు సతీశ్ చెప్పిన కట్టుకథను అంత ప్రముఖంగా ప్రచురించడం విడ్డూరం. తద్వారా ఆ కట్టుకథ వెనుక తామే ఉన్నామని చెప్పకనే చెబుతోంది.

న్యాయస్థానంలో ఆ రోజు ఎందుకు చెప్పలేదు?

చంద్రబాబు పన్నాగం బెడిసికొట్టింది. న్యాయస్థానంలో ప్రవేశపెట్టినప్పుడు నిందితుడు సతీశ్ న్యాయమూర్తి వద్ద ఆ విషయాలు ఎందుకు చెప్పలేదని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. నిజంగా పోలీసులు ఆ విధంగా బెదిరించి ఉంటే న్యాయమూర్తి ఎదుటే చెప్పేందుకు నిందితుడికి అవకాశం ఉంది. కానీ ఆ రోజు చెప్పనే లేదు. బెయిల్‌పై విడుదలయ్యాక బయటకు వచ్చి టీడీపీ అనుకూల మీడియా ముందే ఆ ఆరోపణలు చేయడం గమనార్హం. అంటే పోలీసులు నిందితుడు సతీశ్‌ను ఆ విధంగా బెదిరించలేదన్నది సుస్పష్టం. అదంతా టీడీపీ పన్నాగమేనన్నది తేటతెల్లమవుతోంది.

ఈసీ ఆధ్వర్యంలోనే పోలీసుల దర్యాప్తు

టీడీపీ, ఈనాడు రామోజీరావు ఉద్దేశపూర్వకంగా విస్మరించిన మరో అంశం... సీఎం జగన్‌పై హత్యాయత్నం కేసును పోలీసులు ఈసీ పర్యవేక్షణలో నిర్వహించారు. ఎందుకంటే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే రాష్ట్రంలో పోలీసులతో పాటు మొత్తం అధికార వ్యవస్థ అంతా ఈసీ ఆధీనంలోకి వెళ్లిపోయింది. ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ పాత్ర ఏమీ లేదు. ఈ కేసు దర్యాప్తును పోలీసులు ఎప్పటికప్పుడు ఈసీకి నివేదిస్తున్నారు. ఈసీ వ్యక్తం చేస్తున్న సందేహాలను పోలీసులు నివృత్తి చేస్తూ మరీ దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిందితుడు సతీశ్ ద్వారా పోలీసులపై టీడీపీ ఆరోపణలు చేయించడం అంటే ఈసీనే నిలదీస్తున్నట్టుగా భావించాల్సి వస్తుంది. నిందితుడు సతీశ్ ఈసీనే నిందించాలిగానీ పోలీసులను కాదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

2018లోనూ ఇదే దుష్ప్రచార కుట్ర

పాదయాత్ర నిర్వహిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై 2018లో విశాఖపట్నం విమానాశ్రయంలో హత్యాయత్నం కేసును కూడా టీడీపీ, పచ్చ మీడియా ఇదే రీతిలో వక్రీకరించేందుకు యత్నించడం గమనార్హం. టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరికి చెందిన ఫ్యూజన్ రెసారెంట్‌లో పనిచేసే జనుపల్లి శ్రీనివాస్ అరచేతిలో పట్టేంత పదునైన కత్తితో వైఎస్ జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేంద్ర ప్రభుత్వ బలగాల ఆధీనంలో ఉండే విమానాశ్రయంలోకి శ్రీనివాస్‌ను ప్రవేశపెట్టడం వెనుక అప్పటి టీడీపీ ప్రభుత్వం పక్కా కుట్ర ఉందన్నది స్పష్టమైంది. అప్పట్లో కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజే ఉన్నారు. దాంతో ఈ హత్యాయత్నం వెనుక తమ కుట్ర ఎక్కడ బయటపడుతుందోనని భావించిన టీడీపీ వెంటనే ఆ ఉదంతాన్ని వక్రీకరించేందుకు యత్నించింది. పోలీసులు కనీసం కేసు నమోదు చేయకపోతే వైఎస్ జగన్‌కు సానుభూతి తీసుకురావడం కోసమే ఆయన అభిమాని అయిన జనుపల్లి శ్రీనివాస్ ఈ దాడికి పాల్పడ్డారని చెప్పడం గమనార్హం. చంద్రబాబు ఆదేశాలతో అప్పటి డీజీపీగా ఉన్న ఆర్పీ ఠాకూర్ హడావుడిగా విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి, అదే అసంబద్ధ వాదనను వినిపించడం విభ్రాంతికరం. కానీ టీడీపీ దుష్ప్రచారం బెడిసికొట్టింది. వైఎస్ జగన్‌ను హత్య చేసేందుకే ఆ దాడికి పాల్పడ్డారన్నది తేటతెల్లమైంది. అయినా సరే చంద్రబాబు, రామోజీ తీరు మార్చుకోలేదు. నాడు, నేడు కూడా వక్రీకరణలు, కుట్రలే వారి రాజకీయంగా స్పష్టమవుతోంది.

ఎన్నికల పిటిషన్ ద్వారా సవాల్ చేయండి

ఈసీ పోస్టల్ బ్యాలెట్ నిబంధనలపై సుప్రీం కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో ఈసీ సడలించిన నిబంధనలపై ఎన్నికల పిటిషన్ ద్వారా సవాల్ చేసుకోవచ్చని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సుప్రీంకోర్టు సూచించింది. ఏపీలో పోస్టల్ బ్యాలెట్ నిబంధనలను సడలించడాన్ని సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. వైఎస్సార్‌సీపీ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ.. మే 30న పోస్టల్ బ్యాలెట్ నిబంధనలను సవరిస్తూ ఈసీ సర్క్యులర్ జారీ చేసిందన్నారు. ఇది ఒక్క ఏపీకి మాత్రమే వర్తింపజేస్తున్నారన్నారు. పోస్టల్ బ్యాలెట్లు ఎన్నికల ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉందని తెలిపారు. ఈసీ తాజా సర్క్యులర్ ప్రకారం పోస్టల్ బ్యాలెట్ కోసం అభ్యర్థించే ఫారం 13ఏ లో ధ్రువీకరణ అధికారి పేరు, హోదా లేకపోయినా కేవలం సంతకంతో ఆమోదించవచ్చని ఉందన్నారు. ఈ నిబంధన వల్ల సంతకం ఎవరు చేశారు, అది వాస్తవమైనదేనా అనేది నిర్ధారించడం కష్టం అవుతుందని, తద్వారా ఘర్షణలకు దారి తీసే ప్రమాదం ఉందని వివరించారు. పోస్టల్ ఓటరు అయితే పేరు ఇవ్వడంతోపాటు అటెస్ట్ చేసి, స్టాంప్ వేసి వెరిఫై చేయాల్సి ఉంటుందని, సంతకం ఒక్కటీ కాదని వివరించారు. ఈ సమయంలో జస్టిస్ అరవింద్‌కుమార్ జోక్యం చేసుకొని అటెస్టేషన్ అంటే ఇతర అటెస్టేషన్ల మాదిరిగానే ఉంటుందా అని ప్రశ్నించగా.. అవునని సింఘ్వి సమాధానమిచ్చారు. మంగళవారం పోస్టల్ బ్యాలెట్లు లెక్కించే సమయంలో స్టాంపు లేని బ్యాలెట్లను మినహాయించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే మధ్యంతర సర్క్యులర్ జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఎన్నికల నియమావళికి అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్‌లు కచ్చితంగా లెక్కించాలని కోరారు. ఏదో హడావుడిగా నిర్లక్ష్యంగా గీసిన దాన్ని సంతకంగా వ్యవహరించకూడదని, ఆ అధికారి సంతకం వద్ద సీల్, స్టాంపు ఉండాలని సింఘ్వి తెలిపారు. వాదనలు విన్న అనంతరం ఈ కేసు వాస్తవాలు పరిశీలిస్తే ఎలాంటి మెరిట్ కనిపించడం లేదంటూ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఫలితాలు వెల్లడించిన అనంతరం ఎన్నికల పిటిషన్ ద్వారా సవాల్ చేసుకోవడానికి పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తున్నట్లు తెలిపింది.

అది అధికారిక వీడియో కాదు

- మాచర్ల ఘటనపై సుప్రీంకోర్టుకు తెలిపిన పిన్నెల్లి న్యాయవాది
- కౌంటింగ్ కేంద్రంలోకి ఎమ్మెల్యే వెళ్లకూడదని సుప్రీంకోర్టు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసినట్లుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో అధికారికమైనది కాదని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈవీఎం ధ్వంసం కేసులో ఎమ్మెల్యే పిన్నెల్లికి హైకోర్టు మధ్యంతర రక్షణ కల్పించడాన్ని సవాల్ చేస్తూ, పిన్నెల్లి వల్ల ప్రాణహాని ఉందంటూ నంబూరి శేషగిరిరావు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను సోమవారం జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారించింది. తొలుత, శేషగిరిరావు తరఫు న్యాయవాది కొన్ని ఫొటోలు, వీడియో ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ వీడియోలపై వికాస్ సింగ్ అభ్యంతరం తెలిపారు. ఈ వీడియో ఎన్నికల సంఘం ద్వారా టెలికాస్ట్ కాలేదని, వీడియో, ఫొటోగ్రాఫ్‌లు అధికారికం కాదని వికాస్ సింగ్ చెప్పారు. ఈ సమయంలో జస్టిస్ అరవింద్‌కుమార్ జోక్యం చేసుకొని.. 'ఫొటోలు విస్మరిస్తాం. ఎనిమిది మంది బూత్‌లోకి ప్రవేశించిన తర్వాత ఈవీఎం, వీవీ ప్యాట్ రెండింటినీ ధ్వంసం చేశారని ఫిర్యాదు చెబుతున్న వాస్తవం. దీని పరిస్థితి ఏమిటి' అని ప్రశ్నించారు. ఎవరు చొరబడ్డారు అనేది తన ప్రశ్న అని వికాస్ సింగ్ అన్నారు. పది రోజుల తర్వాత రెండో ఎఫ్ఐఆర్‌లో ఎమ్మెల్యే పేరు చేర్చారని తెలిపారు. వాదనలు విన్న అనంతరం... 'మాచర్ల నియోజకవర్గానికి చెందిన కౌంటింగ్ స్టేషన్‌లోకి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రవేశించడానికి వీల్లేదు. పిన్నెల్లి పెండింగ్ పిటిషన్లను హైకోర్టు ఈ నెల 6న పరిష్కరించాలి. గతంలో మధ్యంతర బెయిలు విషయంలో హైకోర్టు అబ్జర్వేషన్లు ప్రభావం చూపరాదు' అని చెబుతూ ధర్మాసనం విచారణను ముగించింది.

మేం జోక్యం చేసుకోం

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిటిషన్‌పై సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: చంద్రగిరి నియోజకవర్గంలోని నాలుగు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలన్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఫారం 17ఏ, ఇతరత్రా డాక్యుమెంట్లు మరోసారి స్క్రూటీ్న చేయాలని, నాలుగు చోట్ల రీపోలింగ్ జరపాలంటూ మోహిత్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ఈ అంశాలు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని మోహిత్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది ఆదిత్య సోంధి తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అప్రజాస్వామికంగా పోలింగ్ జరిగిందని ఆరోపించారు. భౌతిక దాడులు, ట్యాంపరింగ్ జరిగాయన్నారు. హైకోర్టు తీర్పు ఇంకా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదన్నారు. వాదనల అనంతరం.. వాస్తవాలకు సంబంధించి చాలా ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయని, అయితే ఇందులో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోబోదని ధర్మాసనం స్పష్టం చేస్తూ పిటిషన్‌పై విచారణను ముగించింది.

సందట్లో సైబర్ వల

- ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- ఇదే అదనుగా రంగంలోకి సైబర్ నేరగాళ్లు
- ఎగ్జిట్ పోల్ రిజల్ట్ పేరుతో ఫోన్లకు లింకులు
- వాటిని ఓపెన్ చేస్తే చాలు ఖాతాలు ఖాళీ



సాక్షి, అమరావతి: ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్న తరుణంలో సైబర్ నేరగాళ్లు రంగంలోకి దిగారు. ఎగ్జిట్ పోల్ రిజల్ట్ పేరుతో ఫోన్లకు లింక్ పంపిస్తున్నారు. ఎవరైనా ఆతృతతో ఆ లింక్‌ను ఓపెన్ చేస్తే ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతున్న ఎన్నికల ఫలితాల చర్చల ఆధారంగా ఆయా సోషల్ మీడియా గ్రూపులను సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేశారు. నకిలీ సర్వేలతో కూడిన లింకులను అందులో పోస్ట్ చేస్తున్నారు. ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.. ఏ పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందనే సమాచారాన్ని తెలుసుకోవాలనుకునే వారు వెంటనే వాటిని తెరుస్తున్నారు. ఇంకేముంది వెంటనే వారి ఫోన్ హ్యాక్ అవుతోంది. ఆపై పర్సనల్ డేటా, బ్యాంక్ అకౌంట్ వివరాలను హ్యాక్ చేసి.. ఆయా వ్యక్తుల బ్యాంక్ ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారు. ముఖ్యంగా బెట్టింగులకు పాల్పడుతున్న వారు ఈ తరహా మోసాలకు గురవుతున్నారు. తాము బెట్టింగ్ వేసిన పార్టీ, అభ్యర్థి గెలుపోటముల గురించి పదేపదే తెలుసుకోవడంలో భాగంగా వారు తమకు కనిపించే ప్రతి ఎగ్జిట్ పోల్ లింకును తెరిచి చూస్తున్నారు. అదే వారి కొంప ముంచుతోంది. అయితే.. మోసపోయిన వారు ఆ విషయాన్ని బయటకు చెప్పలేకపోవడం కూడా సైబర్ నేరగాళ్లకు కలిసివస్తోంది. తాము మోసపోయామని చెబితే బెట్టింగ్ వేసిన విషయం కూడా బయటకు వస్తుందనే భయంతో బాధితులు మిన్నకుండిపోతున్నారు.

అప్రమత్తం చేస్తున్న బాధితులు

ఇలా మోసపోయిన వారిలో కొందరు మరొకరికి ఇలా జరగకూడదని భావించి.. సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే అలాంటి లింకులను చూసి మోసపోవద్దని, వాటిని ఎవరూ తెరవద్దని పోస్టులు పెడుతూ అప్రమత్తం చేస్తున్నారు. సోమవారం సోషల్ మీడియాలో ఈ విషయంపై రాష్ట్రవ్యాప్తంగా విపరీతంగా ప్రచారం జరిగింది. కాగా.. మంగళవారం ఫలితాలు వెలువడే వరకూ ఇలాంటి ఫేక్ లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగం పోలీసులు హెచ్చరిస్తున్నారు.

చురుగ్గా విస్తరిస్తున్న నైరుతి

▶ మొదటి పేజీ తరువాయి

శ్రీసత్యసాయి, వైఎస్సార్ జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. అలాగే బుధవారం విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పల్నాడు, నెల్లూరు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గురువారం పార్వతీపురం మన్యం, అల్లూరి, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని వివరించింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు సంభవిస్తాయని, గంటకు 30–40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

నంద్యాలలో కుంభవృష్టి

రుతుపవనాల ప్రభావంతో రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. అనేక చోట్ల ఆకాశం మేఘావృతమై ఉండటంతో ప్రజలు ఎండల నుంచి ఉపశమనం పొందుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సోమవారం ఉదయం 3.50–4 గంటల మధ్య మొదలైన వర్షం 8.30 గంటల వరకు కురిసింది. నంద్యాల జిల్లాలో ఉరుములు, మెరుపులతో కుంభవృష్టి, కర్నూలు జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. అత్యధికంగా ఎమ్మిగనూరులో 69.2 మి.మీ., నంద్యాల జిల్లా బనగానపల్లిలో అత్యధికంగా 178.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లా జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ. కాగా.. ఒక్కరోజులోనే 56.7 మి.మీ. వర్షం కురిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వర్షాలు విస్తారంగా కురిశాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉరుములు, మెరుపులతో వర్షం మొదలై తెల్లవార్లూ మోస్తరు నుంచి భారీగా కురిసింది. అనంతపురం జిల్లాలోని 31 మండలాల పరిధిలో ఏకంగా 31.7 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ మండలంలో 91 మి.మీ., బెళుగుప్ప 84.2 మి.మీ., కణేకల్లు 80 మి.మీ., గుత్తి 62.6 మి.మీ. మేర భారీ వర్షం కురిసింది. మిగిలిన మండలాల్లోనూ మోస్తరు వర్షపాతం నమోదైంది. భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు ప్రవహించాయి. శ్రీసత్యసాయి జిల్లాలోని 18 మండలాల్లో వర్షాలు కురిశాయి. అత్యధికంగా కనగానపల్లి మండలంలో 43.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. బత్తలపల్లిలో 29.2 మి.మీ., తాడిమర్రిలో 28.4 మి.మీ., గుడిబండలో 23.2 మి.మీ., రొళ్లలో 22.2 మి.మీ., ఎన్‌పీ కుంట 19.2 మి.మీ., కదిరిలో 18.2 మి.మీ., ధర్మవరంలో 12.4 మి.మీ., తనకల్లు మండలంలో 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 10 –1.2 మి.మీ. మధ్య వర్షపాతం నమోదైంది.


అనూష అత్రీ, భావని సింగ్, ఖుషీ సింగ్, వశిఖా మెహతా

ఎండకు గొడుగు పట్టారు

మండుతున్న ఎండల్లో రోడ్డు మీద పుచ్చకాయ ముక్కలు కనిపిస్తే వెంటనే ఆగిపోతాం.ఓ కప్పు తాజా పుచ్చకాయ ముక్కలు తిని సేదదీరుతాం. ఇంటి నుంచి బయటకు వచ్చిన పని పూర్తి చేసుకుని తిరిగి ఇల్లు చేరేలోపు ఏర్పడే అవసరం అది. మరి అదే ఎండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భానుడి ప్రకోపాన్ని భరిస్తూ పుచ్చకాయ ముక్కల మ్ముకునే వ్యక్తి పరిస్థితి ఏంటి? 52.9 డిగ్రీలకు చేరిన ఎండలో ఎన్ని పుచ్చకాయలు తింటే అతడికి సాంత్వన దొరుకుతుంది. తనకు, తన తల మీద నాట్యమాడుతున్న సూర్యుడికి మధ్య ఏ అడ్డూ లేదు. వర్షా కాలంలో మొక్కజొన్న కండెలు కాలుస్తూ, ఎండాకాలంలో పండ్ల ముక్కలమ్ముకుంటూ... బతుకు బండి ఈడ్చడానికి ఏ ఎండకా గొడుగు పట్టే తనకు గొడుగుపట్టేదెవరు? ఎండనే గొడుగు చేసుకుని బతుకీడుస్తున్న ఇలాంటి వాళ్లకు గొడుగులు పంచుతున్నారు ఢిల్లీలోని నలుగురు యువతులు అనూష అత్రీ, భావని సింగ్, ఖుషీ సింగ్, వశిఖా మెహతా.'సమాజంలో సహాయం అవసరమైన వాళ్లు అనేక మంది ఉన్నారని కరోనా సమయంలో తెలిసింది' అంటూ తమ సేవా ప్రస్థానాన్ని వివరించారు.

'సేవ' అవసరం ఉంది!

''మా సర్వీస్ కరోనా సమయంలో మాస్కులు పంచడంతో మొదలైంది. కరోనా కరాళనృత్యం చేస్తున్న రోజుల్లో కూడా శ్రామికులు కొంత మంది మాస్కు కూడా లేకుండా పనులకు వెళ్లడం మమ్మల్ని ఆందోళన పరిచింది. తమ ఆరోగ్యభద్రత కోసం కనీసంగా కూడా జాగ్రత్తలు తీసుకోలేక పోతున్నారు. వాళ్ల అలసత్వం, నిర్లక్ష్యానికి కారణం చైతన్యం లేకపోవడం తోపాటు జాగ్రత్తలు తీసుకోవడానికి తగిన వెసులుబాటు లేకపోవడం. కనీసం మాస్కు అయినా ఇవ్వగలిగితే మంచిది కదా అనుకున్నాం. మా పేరెంట్స్ మాకు ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులో కొంత తీసి మాస్కులు కొని పంచాం. ఒకసారి మురికి వాడల్లోకి అడుగుపెట్టిన తర్వాత ఆశ్చర్యం కలిగించే ఎన్నో విషయాలు తెలిశాయి. వాళ్ల ఆరోగ్యం పట్ల కనీస జాగ్రత్తలు కూడా పాటించడం లేదని తెలిసి హెల్త్ క్యాంపులు పెట్టి ఉచితంగా మందులిచ్చాం. సమాజానికి చేయాల్సిన సేవ చాలా ఉందని తెలిసి 'వారియర్స్ వితవుట్ ఏ కాజ్' పేరుతో ఎన్‌జీవో ప్రారంభించాం. చదువు అవసరాన్ని తెలియచేయాల్సిన పరిస్థితి ఇంకా దేశంలో నెలకొని ఉందంటే నమ్ముతారా? చదువు జీవితాన్ని మెరుగుపరుస్తుందని వివరించినప్పటికీ వారిలో ఏదో నిర్లిప్తత. హెల్త్ అవేర్‌నెస్, ఎడ్యుకేషన్ అవేర్‌నెస్‌తోపాటు రుతుక్రమ పరిశుభ్రత కూడా నేర్పించాల్సిన అవసరం ఉంది. వీటితోపాటు ఫైనాన్షియల్ లిటరసీ కోసం వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నాం. మేము సర్వీస్ అందిస్తున్న వాళ్లలో చాలామందికి తమకు చేతనైన పని చేసి ఓ వంద రూపాయలు సంపాదించుకోవడం తెలుసు. కానీ పని దొరకని రోజు కూడా భోజనం చేయాలంటే ఈ రోజు సంపాదించిన వందలో ఓ పది రూపాయలు దాచుకోవాలని తెలియదు. పని దొరక్కపోతే పస్తులుండడమే ఇంతవరకు వాళ్లకు తెలిసిన జీవితం. అలాంటి కుటుంబాలలో మహిళలను సమీకరించి వాళ్లు చేసే పనులతోనే డబ్బు సంపాదించుకునే వెసులుబాటు కల్పించాం. ఉత్తరాది రాష్ట్రాల్లో ఆడవాళ్లందరికీ ఊలుతో స్వెట్టర్లు, టోపీలు అల్లడం వచ్చి ఉంటుంది. వాళ్లను సంఘటిత పరిచి క్రోషియో నిట్టింగ్ బ్యాగ్‌లు, ఊలు ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించాం. ఆ మహిళలను స్థానికంగా ఎగ్జిబిషన్‌లు



నిర్వహించే సంస్థలతో అనుసంధానం చేయగలిగాం. ఈ ఏడాది 'బీట్ ద హీట్' క్యాంపెయిన్ చేపట్టాం. ఇందులో భాగంగా రోడ్డు పక్కన బండి పెట్టుకుని పుచ్చకాయ ముక్కలమ్మేవాళ్లు ఇతర చిన్న చిన్న వస్తువులమ్ముకునే వాళ్లకు మొత్తం ఐదువేల మందికి గొడుగులిచ్చాం. పండ్లు, సోడాలమ్ముకునే వాళ్ల కంటే స్టవ్ పెట్టి వండే వాళ్ల పరిస్థితి ఇంకా ఘోరం. ఎర్రటి ఎండలో బండి మీద స్టవ్ పెట్టుకుని బ్రెడ్ ఆమ్లెట్, బజ్జీలు వేసే వాళ్ల తల కూడా పెనంతో సమానంగా వేడెక్కి పోతుంటుంది. అలాంటి ఎందరో మేమిచ్చిన గొడుగును వాళ్ల బండికి కట్టుకుని రోజంతా హాయిగా పని చేసుకుంటున్నారు. మా సర్వీస్‌ని ఢిల్లీ, నోయిడాల నుంచి దేశంలోని బెంగళూరు, చండీగఢ్, ముంబయి, హైదరాబాద్‌లకు విస్తరించాం. ఇంకా అన్ని రాష్ట్రాల్లో మా నెట్‌వర్క్‌ను విస్తరిస్తాం'' అని చెప్పారు.

నేర్చుకోవాలనే తపన ఉంటే... అదే తపస్సు. ఆ తపస్సు ఫలితాలు ఊరకే పోవు.
విజయాలకు బలాన్ని ఇస్తాయి. ఎలాంటి డిగ్రీలు, అనుభవం లేకుండానే ఎంటర్‌టైన్‌మెంట్ ప్రపంచంలోకి అడుగుపెట్టింది స్నేహిల్ దీక్షిత్ మెహ్రా.
వేగంగా నేర్చుకోవాలనే తపన ఆమె బలం.
సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, రైటర్, కంటెంట్ క్రియేటర్, యాక్టర్, క్రియేటివ్ డైరెక్టర్‌గా బహుముఖ ప్రజ్ఞను సొంతం చేసుకుంది.

ఇంజినీర్ టు క్రియేటివ్ డైరెక్టర్

మల్టీ టాలెంట్
స్నేహిల్ దీక్షిత్ మెహ్రా



జర్నలిస్ట్ కావాలనుకుంది స్నేహిల్. 'అదేం కుదరదు. ప్రొఫెషనల్ డిగ్రీ ఉండాల్సిందే' అన్నారు తల్లిదండ్రులు. దీంతో భోపాల్‌లో ఇంజినీరింగ్ చేసింది. చదువు పూర్తయిన తరువాత ముంబైలోని ఒక ఐటీ సంస్థలో పనిచేసింది. ఉద్యోగం చేస్తున్న మాటేగానీ తన మనసంతా టీవీ రంగంపైనే ఉండేది. ఒక ఫైన్ మార్నింగ్ ఉద్యోగానికి రాజీనామా చేసి ఒక చానల్‌లో ట్రైనీగా చేరింది.

తల్లిదండ్రులు ఆందోళన పడ్డారు.'జర్నలిజంలో ఎలాంటి డిగ్రీ లేకుండా నెగ్గుకు రావడం కష్టం' అన్నారు.

ఆ తరువాత తల్లి మాత్రం 'ఫరవాలేదు' అన్నట్లుగా మాట్లాడింది. అండగా నిలబడింది. ముంబైలో ఉండే సోదరుడు ప్రోత్సహించాడు.

కొత్త ప్రయాణంలో స్నేహిల్‌కు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

'ఓటమిని దరి చేరనివ్వవద్దు' అని బలంగా అనుకునే స్నేహిల్ ఎప్పుడూ వెనకడుగు వేయలేదు. సవాళ్లను విజయవంతంగా అధిగమిస్తూ వెళ్లింది. సవాళ్లను అధిగమించే శక్తి తనకు త్వరగా నేర్చుకునే నైపుణ్యం నుంచి వచ్చింది.

స్టోరీ టెల్లింగ్‌పై ఉన్న పాషన్‌తో టెలివిజన్ నుంచి ఓటీటీకి అక్కడి నుంచి సోషల్ మీడియాకు వచ్చిన స్నేహిల్ ప్రతిచోటా తనను తాను నిరూపించుకుంది. ఎన్నో షోలు చేసి రైటర్‌గా, క్రియేటివ్ డైరెక్టర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. 'అప్‌హరణ్' వెబ్ సిరీస్‌లో నటించడం ద్వారా నటిగా కూడా మంచి మార్కులు తెచ్చుకుంది. ఇదంతా ఒక్క ఎత్తయితే 'హీరా మండీ' కోసం డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ టీమ్‌లో చేరడం మరో ఎత్తు.

కలల దారిలో...

కలలు కనడం అనేది నాకు చిన్నప్పటి నుంచే అలవాటు. కల కనడం గొప్ప ఉత్సాహాన్ని ఇస్తుంది. అయితే ఉత్సాహం దగ్గర మాత్రమే ఆగిపోకుండా నా కలను సాకారం చేసుకోవడానికి కష్టపడ్డాను. నేర్చుకోవాలనే ఉత్సాహం, నిరంతర కష్టం మనకు విజయాన్ని చేకూరుస్తాయి.

– స్నేహిల్ దీక్షిత్ మెహ్రా

రైటింగ్ విభాగంలో పనిచేసిన స్నేహిల్‌కు సంజయ్ లీలా భన్సాలీ కొన్ని సీన్‌లను డైరెక్ట్ చేసే అవకాశం ఇచ్చాడు. ఆ సీన్‌లు బాగా చేయడంతో 'హీరామండీ' సిరీస్‌కు అడిషనల్ డైరెక్టర్‌గా ప్రమోట్ అయింది.

'ఇది పదిహేడు సంవత్సరాల కష్టఫలితం. భన్సాలీతో పని చేయడం వరంలాంటిది. ఫిల్మ్‌మేకర్, ప్రొడ్యూసర్‌గా ఆయనకు మూడు దశాబ్దాల అనుభవం ఉంది. ఆయన అనుభవాల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఆయనతో పనిచేయడం అంటే ఫిల్మ్ స్కూల్‌లో చేరి ఎన్నో విషయాలు నేర్చుకోవడంలాంటిది' అంటుంది స్నేహిల్.

ఇక ఇన్‌ఫ్లుయెన్సర్‌గా తన అనుభవాన్ని గురించి చెబుతూ...

'కామెడీ అనేది రిస్క్. కొన్నిసార్లు ప్రేక్షకులకు ఏది నచ్చుతుందో, ఏది నచ్చదో ఊహించలేము. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా నా వీడియోల నుంచి ఇన్‌స్టంట్ ఫీడ్‌బ్యాక్ తెలుసుకునేదాన్ని. ఫలానా వీడియో అభ్యంతరకరంగా, నొప్పించేలా ఉంది అనే కామెంట్స్ కనిపిస్తే వెంటనే ఆ వీడియోను తొలిగించేదాన్ని. ఎవరినీ నొప్పించకుండా అందరూ హాయిగా నవ్వుకునేలా కంటెంట్‌ను రూపొందించడం అనేది నిజంగా సవాలే' అంటుంది బహుముఖ ప్రజ్ఞాశాలి స్నేహిల్ దీక్షిత్ మెహ్రా.

బ్యూటిప్స్

మూడు నిమ్మకాయలు, టేబుల్ స్పూన్ చక్కెర, టీ స్పూన్ బాదం నూనె, పది నుంచి పదిహేను పుదీన ఆకులు తీసుకోవాలి. నిమ్మకాయలను ముక్కలు చేయాలి. పుదీన ఆకులు, నిమ్మకాయ ముక్కలను (తొక్కతో సహా) మిక్సీలో గ్రైండ్ చేయాలి. అందులో చక్కెర, బాదం నూనె కలిపితే పాదాలకు స్క్రబ్ రెడీ. దీనిని పాదాలు, మడమలు, వేళ్ల మధ్య పట్టించి ఆరిన తర్వాత చేత్తో ఐదు నుంచి పది నిమషాల సేపు వలయాకారంగా మర్దన చేసి గోరు వెచ్చటి నీటితో శుభ్రం చేయాలి. ఇది అన్ని కాలాల్లోనూ అవసరమే. వర్షాకాలంలో పాదాలు నాని ఇన్ఫెక్షన్‌లు సోకకుండా ఉండడానికి ఈ స్క్రబ్‌లో చిటికెడు పసుపు కలుపుకోవాలి.



సాగుబడి
రోహిణి కార్తె : జూన్ 8 వరకు
మృగశిర కార్తె : జూన్ 9 నుంచి

లానినా వస్తోంది...
పంట ఏదైనా.. ఎత్తుమడులే మేలు!

భరించలేని ఎండలతో జనాన్ని భీతిల్లజేసిన ఎల్‌నినో ముగిసింది. అధిక వర్షాలతో కూడిన లానినా ప్రారంభం కానున్న నేపథ్యంలో అధిక వర్షాలకు పంటలు తట్టుకునే వ్యూహాలు అవసరం. అందులో ముఖ్యమైనది.. ఎత్తుమడులు లేదా బోదెల (రెయిజ్‌డ్ బెడ్స్)పై పంటలు విత్తుకోవటం. అది ఎర్ర నేలైనా, నల్ల నేలైనా.. పత్తి, కంది, మిర్చి, పసుపు, సోయా, వేరుశనగ, కూరగాయలతో పాటు ఇంకా ఏ ఇతర ఆరుతడి పంటలైనా సరే


ట్రాక్టర్ ద్వారా ఇలా ఎత్తు మడులు/బోదెలు తోలుకోవాలి


మధ్య నుంచి వర్షపు నీరు కాలువల ద్వారా బయటకు వస్తుంది

ఎత్తుమడులపై విత్తుకుంటే నీటి ముంపు నుంచి, ఉరకెత్తటం, అతివృష్టి/ అనావృష్టి బాధల నుంచి రక్షణ పొందవచ్చని ఆదిలాబాద్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డా. ప్రవీణ్‌కుమార్ రైతులకు సూచిస్తున్నారు. వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా.. వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజుల వ్యవధి వచ్చినా.. నల్ల రేగడైనా, ఎర్ర నేలైనా, బంక మట్టి అయినా సరే.. ఎత్తు మడులు చేసి లేదా బోదెలు తోలి పంటలు విత్తుకోవటం మేలని డా. ప్రవీణ్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా రైతులకు చెబుతూ వస్తున్నారు.

పత్తి సాగులో ఎత్తు మడి లాభాలు:

అతివృష్టి సమయాల్లో పంటల సంరక్షణకు సమర్థవంతమైన మురుగు నీటి పారుదల వ్యవస్థ కీలకం. ఎత్తు మడుల పద్ధతిలో పత్తి సాగు చేయడం ద్వారా సమస్యలను అధిగమించవచ్చు. ఎత్తుమడులు చేసుకోవడానికి ట్రాక్టర్‌తో అనుసంధానం చేసే రిడ్జర్ లేదా బెడ్ మేకర్‌ను ఉపయోగిస్తారు. పత్తికి ఉద్దేశించిన మడి 15-20 సెం.మీ.ల ఎత్తు ఉంటుంది. మడి వెడల్పు నేల స్వభావం, ఆ ప్రాంతంలో నమోదయ్యే వర్షపాతాన్ని బట్టి ఎంత కావాలంటే అంత పెట్టుకోవచ్చు. పత్తి సాళ్ల మధ్య 180/ 150/ 120 సెం.మీ., మొక్కల మధ్య 30/20/30 సెం.మీ.ల దూరంలో పత్తి పంటను సాగు చేయవచ్చు. సాధారణంగా ఒక ఎకరంలో ఎత్తు మడులు చేయడానికి సుమారు 45 నిమిషాల నుంచి ఒక గంట సమయం పడుతుంది. ఎత్తు మడుల మీద విత్తిన విత్తనం సాధారణ పొలంలో కన్నా ఒకటి రెండు రోజులు ముందే మొలకెత్తుతుంది. సాంప్రదాయ పద్ధతితో పోలిస్తే, మొలక శాతం ఎక్కువ. దాదాపు 90 శాతం విత్తనాలు మొలుస్తాయి. ఎత్తు మడుల వలన మురుగు నీటి వ్యవస్థ మెరుగవుతుంది. వర్షపు నీరు పొలంలో నిలవకుండా, కాలువల ద్వారా బయటికి వెళ్లిపోతుంది. దీనివలన తొలిదశలో మొక్క పెరుగుదల కుంటుపడదు. భారీ వర్షాలు కురిసినప్పుడు నల్లరేగడి నేలల్లో వరద పారుతుంది. ఆ ప్రవాహంలో మొక్కలు కొట్టుకుపోకుండా ఎత్తు మడులు కాపాడుతాయి. వర్షాభావ పరిస్థితుల్లో మడుల్లో నిల్వ ఉండే తేమ పంటకు ఉపయోగపడుతుంది. సాంప్రదాయ పద్ధతిలో పత్తి మొక్కల కింది కొమ్మలకు మొదట్లో వచ్చే 5 నుండి 10 కాయలు కుళ్లిపోతూ ఉంటాయి. ఎత్తు మడులు చేయడం వల్ల గాలి, వెలుతురు బాగా తగిలి కాయకుళ్లు, ఇతర చీడపీడల ఉధృతి తక్కువగా ఉంటుంది. యాంత్రీకరణ ద్వారా కలుపు యాజమాన్యం సులభమవుతుంది. సాధారణ పద్ధతితో పోలిస్తే ఎత్తు మడుల పద్ధతిలో 10-20 శాతం అధిక దిగుబడులు సాధించవచ్చు. నల్లరేగడి నేలలు, తేలికపాటి ఎర్రనేలల్లో ఎత్తు మడుల పద్ధతిలో పత్తిని సాగు చేయవచ్చు. పత్తిలో అంతరపంటగా కందిని విత్తు కుంటే, ఒకవేళ ఏ కారణంగానైనా ఒక పంట దెబ్బతింటే, మరో పంట రైతును ఆదుకుంటుంది.


డా. ప్రవీణ్ కుమార్

ఇతర వివరాలకు డా. ప్రవీణ్ కుమార్‌ను 99896 23829 నంబరులో సంప్రదించవచ్చు.

ఎత్తు మడులపై పత్తి పంటను విత్తుకునే మెళకువలను తెలిపే వీడియో 'కేవీకే ఆదిలాబాద్' యూట్యూబ్ ఛానల్‌లో ఉంది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేసి చూడొచ్చు.

ప్రకృతి ఆహారం పక్కా లోకల్!

- ఏపీలో ప్రకృతి వ్యవసాయదారుల పంటలకు స్థానిక మార్కెట్లు, రైతుబజార్లలో మంచి గిరాకీ
- ప్రతి సోమవారం జిల్లా, మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లో నేరుగా ప్రజలకు విక్రయిస్తున్న రైతులు
- ప్రయోగాత్మకంగా 5 చోట్ల 'కంటెయినర్ రైతుబజార్లు'... త్వరలో మరో 33 ఏర్పాటుకు సన్నాహాలు

తొలకరితో పాటే వచ్చే అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం (జూన్ 5) ఈ ఏడాది లక్ష్యం: 'భూముల పునరుద్ధరణ, ఎడారీకరణను, కరువును తట్టుకునే దిశగా పనిచేయటం'. మట్టిలో సేంద్రియ కర్బనం 0.3%కి పడిపోయింది. దీన్ని పెంపొందించుకోవటానికి, పనిలో పనిగా భూతాపాన్ని తగ్గించడానికి సేద్యం మొత్తాన్నీ ప్రకృతి/సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లించటం తప్ప మరో మేలైన దారి లేదన్నది నిపుణుల మాట. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సంఖ్యలో చిన్న, సన్నకారు రైతులు భూమిని శాశ్వతంగా బాగుచేసుకుంటూ ఆరోగ్యదాయకమైన ఆహారాన్ని పండిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు.. వారు పండించిన అమృతాహారాన్ని స్థానిక మార్కెట్లలోనే నేరుగా ప్రజలకు అమ్ముతున్నారు. ఈ విధంగా ప్రకృతి/సేంద్రియ రైతులతో పాటు ఈ ఆహారాన్ని కొనుగోలు చేస్తున్న వినియోగదారులు కూడా పర్యావరణ పరిరక్షణకు పరోక్షంగా దోహదపడుతున్నారు. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని ఆహార రంగంలో చోటు చేసుకుంటున్న గుణాత్మక మార్పుల గురించి ప్రత్యేక కథనం..!

ప్రకృతి వ్యవసాయంలో మన దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. ఏపీలోని అన్ని జిల్లాల్లో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) విస్తారంగా సాగవుతోంది. రసాయనాలు వాడకుండా ఆరోగ్యదాయకంగా పండించిన ధాన్యం, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను స్థానిక మార్కెట్ల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మార్కెటింగ్ శాఖ తోడ్పాటుతో ఏపీ రైతు సాధికార సంస్థ కృషి చేస్తోంది. ప్రకృతి వ్యవసాయంలో స్థానిక రైతులు పండించిన ఆహారోత్పత్తులను స్థానిక ప్రజలకే తొలుత అందుబాటులోకి తేవాలన్నది లక్ష్యం. స్థానిక మార్కెట్లలో, రైతుబజార్లలో, వైఎస్సార్ చేయూత మహిళా రూరల్ మార్ట్‌లలో రైతుల ద్వారా నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు కృషి చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం ఎన్టీఆర్ జిల్లా నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. విజయవాడ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయోత్పత్తులను విక్రయిస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజలు తరలి వస్తారు కాబట్టి అదే రోజు నమ్మకమైన ఆరోగ్యదాయక ఆహారోత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని, సాధారణ మార్కెట్‌తో పోల్చినప్పుడు ఇక్కడ 10-15% అదనపు ధర రైతులకు లభిస్తోందని ఏపీ రైతు సాధికార సంస్థ సీనియర్ మార్కెటింగ్ లీడ్ బి. ప్రభాకర్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.


బి.ప్రభాకర్
సీనియర్ మార్కెటింగ్ లీడ్
ఏపీ ఆర్‌వైఎస్ఎస్

427 మండల కేంద్రాల్లో అమ్మకాలు

ఏపీలోని 26 జిల్లా కేంద్రాలకు గాను 22 చోట్ల, 663 మండలాలకు గాను 427 మండల కేంద్రాల్లో ప్రతి సోమవారం ప్రకృతి వ్యవసాయోత్పత్తులను రైతులు అమ్ముతున్నారని ప్రభాకర్ వివరించారు. అదే విధంగా, 113 మునిసిపాలిటీలకు గాను 24 మునిసిపాలిటీలలోనూ తాము పండించే ఉత్పత్తులను గత 2-3 నెలలుగా ప్రకృతి వ్యవసాయదారులు విక్రయిస్తున్నారు. వైఎస్సార్ చేయూత మహిళా గ్రామీణ మార్ట్‌లు 47 ఉండగా ఇప్పటికి 32 మార్ట్‌లలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను అందుబాటులోకి తెచ్చారు.

ఆకర్షిస్తున్న 'కంటెయినర్ రైతుబజార్లు'

ఏపీలో 96 రైతుబజార్లు పట్టణ ప్రాంత వినియోగదారులకు నిత్యావసరాలను అందుబాటులోకి తెస్తున్నాయి. వీటిలో ఇప్పటికే 47 రైతుబజార్లలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించే స్టాల్స్ ఏర్పాటయ్యాయి. 3 ఉత్తరాంధ్ర జిల్లాల్లో 5 రైతుబజార్లలో మార్కెటింగ్ శాఖ తోడ్పాటుతో అవని ఆర్గానిక్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా ప్రయోగాత్మకంగా ప్రత్యేక కంటెయినర్లు ఏర్పాటు చేసింది. వీటిలో ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, పప్పులు, కూరగాయలు, ఆకుకూరలను విక్రయించటం ఇటీవలే ప్రారంభించారు. పట్టణ ప్రాంతీయులను ఈ కంటెయినర్ రైతుబజార్లు విశేషంగా ఆకర్షిస్తున్నాయని, మరో 33 రైతుబజార్లలో జూన్ రెండో వారంలో కంటెయినర్ దుకాణాలను ప్రారంభించనున్నామని ప్రభాకర్ వివరించారు. ముమ్ముందు దశలవారీగా ప్రతి రైతుబజారులోనూ కంటెయినర్ దుకాణాలు తెరుస్తామన్నారు.



వైజాగ్ సీతమ్మధార రైతు బజార్‌లోని 'కంటెయినర్ రైతుబజార్'


జిల్లా, మండల కేంద్రాల్లో ఉత్పత్తులు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయదారులు

లోకల్ మార్కెటింగే మా వ్యూహం!

రసాయనాలతో పండించిన ఆహారోత్పత్తులతో పోల్చితే.. ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన ఆహారోత్పత్తుల్లో అధిక పోషక విలువలు ఉండటమే కాకుండా ఆరోగ్యకరమైనవి కూడా. ఈ ఆహారోత్పత్తులను స్థానిక మార్కెట్ల ద్వారా సాధారణ ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తేవటమే మా మార్కెటింగ్ వ్యూహం. మార్కెటింగ్ శాఖ, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో మాకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– టి. విజయకుమార్,
ఎక్స్‌అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ,
కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు,
ఏపీఆర్‌వైఎస్ఎస్.



గ్రామాల్లో 'ఫుడ్ బాస్కెట్లు'!

ఏపీలో ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా స్వయం సహాయక బృందాలు కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ బృందాల సభ్యుల కుటుంబాలలోని వారందరికీ అవసరమయ్యే అన్ని రకాల ఆహారోత్పత్తులను ప్రకృతి వ్యవసాయంలో పండించినవే అందించాలన్న లక్ష్యంతో ఫుడ్ బాస్కెట్స్ కార్యక్రమానికి రైతుసాధికార సంస్థ 7 నెలల క్రితం శ్రీకారం చుట్టింది. ప్రస్తుతానికి 76 గ్రామాల్లో ఈ ఫుడ్ బాస్కెట్ స్కీమ్ ప్రారంభమైందని, త్వరలో 129 గ్రామాలకు విస్తరించనున్నామన్నారు. వీరికి ఆయా గ్రామాల్లో పండించేవి చాలకపోతే, పక్క గ్రామాలు, మండలాల నుంచి సేకరించి అందిస్తున్నారు.

గ్రామీణులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలన్న లక్ష్యంతో ఈ ఫుడ్ బాస్కెట్స్ అందిస్తుండటం విశేషం. తిరుమల తిరుపతి దేవస్థానానికి ప్రకృతి వ్యవసాయంలో పండించిన బియ్యం, బెల్లం, శనగలను సరఫరా చేస్తున్నారు. అమరావతిలోని ఏపీ సచివాలయంలో సిబ్బంది, సందర్శకులకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులన్నిటినీ విక్రయించేందుకు జూన్ రెండో వారం నుంచి ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించనున్నామని ప్రభాకర్ (97714 63539) చెప్పారు. స్థానిక మార్కెట్ల ద్వారా స్థానిక ప్రజలకు ప్రకృతి ఆహారాన్ని విస్తృతంగా అందుబాటులోకి తేవటం సంతోషదాయకం.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



ప్రజ్ఞానంద, వైశాలి, హంపి పరాజయం

నార్వే చెస్ టోర్నమెంట్‌లో ఆరో రౌండ్ భారత గ్రాండ్‌మాస్టర్లు ప్రజ్ఞానంద, వైశాలి, కోనేరు హంపిలకు కలిసి రాలేదు. ఈ ముగ్గురు భారత గ్రాండ్‌మాస్టర్లు తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓటమి చవిచూశారు. పురుషుల విభాగంలో ఫిరూజా అలీరెజా (ఫ్రాన్స్)తో జరిగిన క్లాసికల్ గేమ్‌ను ప్రజ్ఞానంద 34 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్ నిర్వహించగా... తెల్ల పావులతో ఆడిన ఫిరూజా 60 ఎత్తుల్లో గెలిచాడు. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్‌తో జరిగిన క్లాసికల్ గేమ్‌లో ప్రజ్ఞానంద సోదరి వైశాలి 102 ఎత్తుల్లో ఓడిపోయింది. పియా క్రామ్లింగ్ (స్వీడన్)తో జరిగిన క్లాసికల్ గేమ్‌ను కోనేరు హంపి 37 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. విజేతను నిర్ణయించేందుకు 'అర్మగెడాన్' గేమ్‌ను నిర్వహించగా... తెల్ల పావులతో ఆడిన హంపి 60 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. దాంతో 'అర్మగెడాన్' గేమ్ నిబంధనల ప్రకారం నల్ల పావులతో 'డ్రా'గా ముగించిన పియా క్రామ్లింగ్‌ను విజేతగా ప్రకటించారు.




డేవిడ్ వీస్

ఉత్కం'టై'న పోరులో నమీబియా 'సూపర్' గెలుపు

విజయం దోబూచులాడిన మ్యాచ్‌లో ఒమన్ ఓటమి • డేవిడ్ వీస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన

సూపర్ ఓవర్‌కు ముందు...

నమీబియా గెలిచేందుకు 6 బంతుల్లో 5 పరుగులు కావాలి. క్రీజులో పాతుకుపోయిన ఫ్రయ్‌లింక్ (48 బంతుల్లో 45; 6 ఫోర్లు) ఉండటంతో నమీబియా గెలుపు లాంఛనం. కానీ మెహ్రాన్ ఖాన్ అద్భుతమైన బౌలింగ్ వల్ల ఆఖరి బంతి బౌల్ అయ్యేసరికి ఒమన్ గెలవాలి! ఫ్రయ్‌లింక్, గ్రీన్ వికెట్లు తీసిన మెహ్రాన్ 4 పరుగులే ఇచ్చాడు. చివరి బంతికి 2 పరుగులపుడు మెహ్రాన్ చక్కని బంతి వేయగా... వికెట్ కీపర్ మిస్ ఫీల్డింగ్, మిస్ త్రో వల్ల ఒక పరుగు వచ్చి స్కోరు 'టై' అయింది. తుది ఫలితం కోసం మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

సూపర్ ఓవర్లో...

ఒమన్ బౌలర్ బిలాల్ ఖాన్ వేసిన ఈ ఓవర్‌లో నమీబియా బ్యాటర్లు డేవిడ్ వీస్ తొలి నాలుగు బంతుల్లో 4, 6, 2, 1 కొట్టగా... చివరి రెండు బంతులు ఆడిన ఎరాస్మస్ 4, 4 బాదడంతో ఆ జట్టు వికెట్ కోల్పోకుండా 21 పరుగులు చేసింది. విజయం సాధించేందుకు 22 పరుగులు చేయాల్సిన ఒమన్ జట్టు నసీమ్ (2) వికెట్ కోల్పోయి 10 పరుగులే చేయడంతో నమీబియా 'సూపర్' విక్టరీ నమోదు చేసింది.

బ్రిడ్జ్‌టౌన్: లాంఛనమైన (ఆఖరి ఓవర్ 6 బంతుల్లో 5 పరుగులు) విజయానికి దూరమైన నమీబియా 'సూపర్ ఓవర్'తో చేజారిన విజయాన్ని చేజిక్కించుకుంది. ఒమన్ పేసర్ మెహ్రాన్ (3-1-7-3) అసాధారణ బౌలింగ్‌ను... డేవిడ్ వీస్ 'షో' సూపర్ ఓవర్లో మాయం చేసింది. 'సూపర్ ఓవర్'లో 13 పరుగులు చేసిన వీస్ వెంటనే బౌలింగ్‌కు దిగి వికెట్ కూడా తీసి 10 పరుగులిచ్చాడు. 20 జట్లు బరిలో ఉన్న ఈ టి20 ప్రపంచకప్‌లో 'బోర్' మ్యాచ్‌లే బోలెడనుకున్న క్రికెట్ ప్రేక్షకులు, విశ్లేషకుల అంచనాల్ని గ్రూప్ 'బి'లోని ఈ మ్యాచ్ తారుమారు చేసింది. బోరా అనిపించేలా ఈ కూనల తక్కువ స్కోర్ల మ్యాచ్ వరల్డ్‌కప్‌కే వన్నె తెచ్చింది. సూపర్ ఓవర్లో నమీబియా గెలిచినా... మ్యాచ్ చూసిన ప్రతి మదిని ఒమన్ పోరాటం తాకింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ జట్టు 19.4 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. ఖాలిద్ కైల్ (39 బంతుల్లో 34; 1 ఫోర్, 1 సిక్స్), జీషాన్ (20 బంతుల్లో 22; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. నమీబియా బౌలర్లలో రూబెన్ ట్రంపుల్‌మన్ (4/21), వీస్ (3/28), కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్ (2/20) అదరగొట్టారు. తర్వాత నమీబియా కూడా నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 109 పరుగులే చేయడంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. జాన్ ఫ్రయ్‌లింక్‌తో పాటు నికోలస్ డేవిన్ (31 బంతుల్లో 24; 2 ఫోర్లు, 1 సిక్స్) చెప్పుకోదగ్గ స్కోరు చేశాడు.

3 టి20 ప్రపంచకప్ చరిత్రలో 'సూపర్ ఓవర్'లో ఫలితం తేలిన మ్యాచ్‌లు. శ్రీలంక ఆతిథ్యమిచ్చిన 2012 ప్రపంచకప్‌లో సెప్టెంబర్ 27న న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక జట్టు.. అక్టోబర్ 1న న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు 'సూపర్ ఓవర్'లో విజయం సాధించాయి.

టి20 ప్రపంచకప్ విజేతకు రూ.20.35 కోట్లు

న్యూయార్క్: అమెరికా, వెస్టిండీస్‌లు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ప్రస్తుత టి20 ప్రపంచకప్ విజేతకు ఈసారి గతం కంటే రెట్టింపు ప్రైజ్‌మనీ లభించనుంది. కప్ గెలిచిన జట్టుకు రూ. 20.35 కోట్లు (2.45 మిలియన్ అమెరికా డాలర్లు), రన్నరప్ జట్టుకు రూ. 10.63 కోట్లు (1.28 మిలియన్ డాలర్లు) అందజేస్తారు. సెమీఫైనల్స్‌తోనే ఆగిపోయిన ఇరుజట్లకు రూ. 6.54 కోట్లు (7,87,500 మిలియన్ డాలర్లు) చొప్పున ఇస్తారు. ఈనెల 29వ తేదీన ముగిసే ఈ టోర్నీలో తొలిసారి 20 జట్లు పోటీపడుతున్నాయి. ఈ టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 93.48 కోట్లు (11.25 మిలియన్ డాలర్లు)గా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) సోమవారం ప్రకటించింది. ఇది గత 2022 ప్రపంచకప్ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 46.53 కోట్ల (5.6 మిలియన్ డాలర్లు)కి రెట్టింపు మొత్తం. ట్రోఫీ గెలిచిన ఇంగ్లండ్‌కు రూ. 13.29 కోట్లు (1.6 మిలియన్ డాలర్లు) లభించాయి.

టి20 ప్రపంచకప్‌లో నేడు

అఫ్గానిస్తాన్ X ఉగాండా
వేదిక: గయానా; ఉదయం గం. 6 నుంచి

ఇంగ్లండ్ X స్కాట్లాండ్
వేదిక: బ్రిడ్జ్‌టౌన్; రాత్రి గం. 8 నుంచి

నెదర్లాండ్స్ X నేపాల్
వేదిక: డాలస్; రాత్రి గం. 9 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

దక్షిణాఫ్రికా బోణీ

- శ్రీలంకపై 6 వికెట్లతో విజయం
- 7 పరుగులిచ్చి 4 వికెట్లు తీసిన నోర్జే


నోర్జే

న్యూయార్క్: మెరుపుల్లేవు... విధ్వంసక షాట్లు అసలే కనిపించలేదు... రెండు పెద్ద జట్ల మధ్య జరిగిన టి20 వరల్డ్ కప్ నాలుగో మ్యాచ్ కనీస వినోదాన్ని అందించలేకపోయింది. అనూహ్య బౌన్స్‌తో బ్యాటింగ్‌కు ఏమాత్రం అనుకూలంగా లేని పిచ్‌పై స్వల్ప స్కోర్లతో మ్యాచ్ ముగిసింది. ముందుగా శ్రీలంక పేలవ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చగా, చిన్న లక్ష్యాన్ని ఛేదించేందుకు దక్షిణాఫ్రికా కూడా చాలా సమయం తీసుకుంది. మొత్తం 35.3 ఓవర్ల మ్యాచ్‌లో పోరులో కేవలం 6 ఫోర్లు, 3 సిక్స్‌లు మాత్రమే వచ్చాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి ఆడిన 214 బంతుల్లో 127 డాట్ బాల్స్ ఉన్నాయి. టి20 వరల్డ్ కప్ చరిత్రలో ఎక్కువ డాట్ బాల్స్ ఆడిన మ్యాచ్ ఇదే కావడం గమనార్హం.సోమవారం నాసా కౌంటీ క్రికెట్ స్టేడియంలో జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక 19.1 ఓవర్లలో 77 పరుగులకే కుప్పకూలింది. టి20ల్లో లంకకు ఇదే అత్యల్ప స్కోరు. కుశాల్ మెండిస్ (30 బంతుల్లో 19; 1 ఫోర్), ఏంజెలో మాథ్యూస్ (16 బంతుల్లో 16; 2 సిక్స్‌లు), కామిందు మెండిస్ (11) మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆన్రిచ్ నోర్జే (4/7) తన స్పెల్‌లో ఓవర్‌కు ఒకటి చొప్పున నాలుగు వికెట్లు పడగొట్టడం విశేషం. కేశవ్ మహరాజ్ వరుస బంతుల్లో 2 వికెట్లు తీసి లంకను దెబ్బ కొట్టాడు. అనంతరం దక్షిణాఫ్రికా 16.2 ఓవర్లలో 4 వికెట్లకు 80 పరుగులు సాధించింది. డి కాక్ (27 బంతుల్లో 20; 1 సిక్స్), క్లాసెన్ (22 బంతుల్లో 19 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) గెలుపు తీరం చేర్చారు. హసరంగకు 2 వికెట్లు దక్కాయి.

క్వార్టర్ ఫైనల్లో సబలెంకా, రిబాకినా


సబలెంకా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా (బెలారస్), ప్రపంచ నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్) క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సబలెంకా 6-2, 6-3తో ఎమా నవారో (అమెరికా)పై, రిబాకినా 6-4, 6-3తో స్వితోలినా (ఉక్రెయిన్)పై గెలుపొందారు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో జాస్మిన్ పావోలిని (ఇటలీ) 4-6, 6-0, 6-1తో ఎలీనా అవానెస్యాన్ (రష్యా)పై, మిరా ఆంద్రీవా 7-5, 6-2తో వర్వారా గ్రచెవా (ఫ్రాన్స్)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు.

మెద్వెదెవ్‌కు చుక్కెదురు

పురుషుల సింగిల్స్‌లో ఐదో సీడ్ మెద్వెదెవ్ (రష్యా) ప్రిక్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగాడు. అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా) 4-6, 6-2, 6-1, 6-3తో మెద్వెదెవ్‌ను ఓడించి ఎనిమిదో ప్రయత్నంలో ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-7 (2/7), 6-3, 7-6 (10/8)తో శ్రీరామ్ బాలాజీ (భారత్)-మిగెల్ వరేలా (మెక్సికో) జోడీని ఓడించి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది.

వైదొలిగిన సాత్విక్-చిరాగ్ జోడీ

జకార్తా: ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీ నేడు ప్రారంభంకానుంది. పురుషుల డబుల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్స్, ప్రపంచ నంబర్‌వన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) చివరి నిమిషంలో ఈ టోర్నీ నుంచి వైదొలిగింది.



పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ కూడా ఈ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. మంగళవారం జరిగే పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రియాన్షు రజావత్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్; వెంగ్ హాంగ్ యాంగ్ (చైనా)తో కిరణ్ జార్జి తలపడతారు. బుధవారం జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో వెన్ చి సు (చైనీస్ తైపీ)తో పీవీ సింధు ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో సింధు గెలిస్తే ప్రిక్వార్టర్ ఫైనల్లో ఒలింపిక్, ప్రపంచ మాజీ చాంపియన్ కరోలినా మారిన్ (స్పెయిన్) ఎదురయ్యే అవకాశముంది.

క్రికెట్‌కు కేదార్ జాదవ్ వీడ్కోలు



పుణే: భారత క్రికెటర్ కేదార్ జాదవ్ ఆటకు గుడ్‌బై చెబుతున్నట్లు ప్రకటించాడు. అన్ని ఫార్మాట్‌ల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించిన కేదార్... ఎమ్మెస్ ధోని శైలిలో తన రిటైర్మెంట్ ప్రకటన చేశాడు. 'నా కెరీర్‌లో అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. 1500 గంటల సమయం నుంచి నేను రిటైర్ అయినట్లుగా గుర్తించగలరు' అని ట్వీట్ చేశాడు. మహారాష్ట్రకు చెందిన కేదార్ 2014లో భారత్ తరఫున తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. 73 వన్డేల్లో 42.09 సగటుతో 2 సెంచరీలు, 6 అర్ధసెంచరీలు సహా 1389 పరుగులు చేశాడు. 9 టి20ల్లో 122 పరుగులు సాధించాడు. తన 'స్లింగ్' తరహా ఆఫ్‌స్పిన్ బౌలింగ్‌తో అతను 27 వికెట్లు కూడా పడగొట్టాడు. కేదార్ అత్యుత్తమ ప్రదర్శన సొంతగడ్డ పుణేలో వచ్చింది. ఇంగ్లండ్‌తో జరిగిన వన్డేలో అతను 76 బంతుల్లోనే 12 ఫోర్లు, 4 సిక్స్‌లతో అజేయంగా 120 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. 2019 వన్డే వరల్డ్ కప్ ఆడిన అతను చివరిసారిగా 2020లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో కేదార్ ఢిల్లీ, కొచ్చి, చెన్నై, హైదరాబాద్ జట్ల తరఫున ఆడాడు.

సినిమా


రజనీకాంత్

వారం తర్వాత కూలీగా...

'కూలీ'గా మారిపోవడానికి రెడీ అవుతున్నారు రజనీకాంత్. ఆయన హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ సంస్థ నిర్మించనున్న చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో సత్యరాజ్, శోభన కీలక పాత్రల్లో నటించనున్నారని, కమల్‌హాసన్ ఓ అతిథి పాత్రలో కనిపిస్తారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. కాగా 'కూలీ' సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 10న ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని ఇటీవల ఓ ఆధ్యాత్మిక గురువు దగ్గర పేర్కొన్నారు రజనీకాంత్. తొలి షెడ్యూల్ చిత్రీకరణ చెన్నైలో ప్రారంభం కానుందని తెలిసింది. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనున్న 'కూలీ' సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది. అలాగే రజనీకాంత్ హీరోగా నటించిన మరో చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను అక్టోబరులో విడుదల చేయనున్నట్లుగా చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. కాగా 'వేట్టయాన్'ను అక్టోబరు 10న విడుదల చేసే ఆలోచనలో ఉన్నట్లుగా కూడా రజనీకాంత్ పేర్కొన్నారు.


శోభన

పద్దెనిమిదేళ్ల తర్వాత...

ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. కాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుక ఈ నెల 7న ముంబైలో ఉండొచ్చనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ఇక ఈ సినిమాలో నాని, దుల్కర్ సల్మాన్, విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ అతిథి పాత్రల్లో నటించారనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో శోభన పేరు కూడా చేరింది. అయితే ఈ పాత్రల గురించి ప్రస్తుతానికి చిత్రబృందం రహస్యంగా ఉంచుతోంది. 'కల్కి 2898 ఏడీ'లో శోభన ఓ కీలక పాత్రలో కనిపించనున్నారట. 2006లో వచ్చిన 'గేమ్' సినిమా తర్వాత శోభన తెలుగులో మరో సినిమా చేయలేదు. ఒకవేళ 'కల్కి 2898 ఏడీ'లో ఆమె నటించినది వాస్తవం అయితే పద్దెనిమిదేళ్ల తర్వాత శోభన నటించిన తెలుగు సినిమా ఇదే అవుతుంది.

పడమ్ బిగిన్స్


సూర్య

కొత్త సినిమా షురూ చేశారు సూర్య. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో సూర్య హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జోజూ జార్జ్, జయరామ్, కరుణాకరన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ అండమాన్‌లో ఆరంభమైంది. సూర్య కెరీర్‌లోని ఈ 44వ చిత్రం చిత్రీకరణ మొదలైనట్లుగా చెబుతూ, 'పడమ్ బిగిన్స్' (సినిమా ఆరంభమైంది) అంటూ చిన్న వీడియోను 'ఎక్స్'లో షేర్ చేశారు కార్తీక్ సుబ్బరాజ్. ప్రేమ, యుద్ధం, నవ్వు అంశాల నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలోని సూర్య లుక్‌ని బట్టి ఇది పీరియాడికల్ మూవీ అని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్స్ చేస్తున్నారు.

థ్రిల్... కామెడీ

వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'వాట్ ది ఫిష్'. 'వెన్ ద క్రేజీ బికమ్స్ క్రేజియర్' అనేది ట్యాగ్‌లైన్. విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ముఖ్య తారాగణంగా అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్ల, సుస్మితా ఛటర్జీ, సత్యలను ఎంపిక చేసినట్లు సోమవారం చిత్రబృందం పేర్కొంది. ''ఇప్పటికే విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్‌ల ఫస్ట్ లుక్ పోస్టర్‌లకు మంచి స్పందన వచ్చింది. యునిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ కూడా ఉంది. వివిధ భాషల్లో చిత్రీకరిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తాం'' అని చిత్ర యూనిట్ తెలియజేసింది. ఈ చిత్రానికి సంగీతం: శక్తికాంత్ కార్తీక్.


సుస్మితా ఛటర్జీ

కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'సత్యభామ'. ఓ కీలక పాత్రలో నవీన్‌చంద్ర నటించారు. సుమన్ చిక్కాల దర్శకత్వంలో బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం విలేకర్ల సమావేశంలో ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాకాల మాట్లాడుతూ– ''ఓ పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీయే ఈ చిత్రం. థ్రిల్లర్ మూవీస్

ఆ ఇమేజ్ ఇబ్బందిగానే ఉంది

- సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల



ఇష్టపడేవారికి 'సత్యభామ' చిత్రం బాగా నచ్చుతుంది. ఈ సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి. కాజల్, నవీన్‌చంద్రల మధ్య 'కళ్లారా చూసాలే..' అనే లవ్ సాంగ్ ఉంటుంది. అలాగే 'వెతుకు వెతుకు' పాట ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో ఉంటుంది. ఈ పాటను కీరవాణిగారు పాడారు. గతంలో 'ఆపరేషన్ గోల్డ్ ఫిష్' సినిమాకు నా మ్యూజిక్‌లో కీరవాణిగారు పాడారు. 'సత్యభామ' పాటకు ఆయన స్టూడియోకు వస్తూనే 'నేను పాడిన ఏ పాట విని నన్ను నీ పాటకు పాడేందుకు పిలిచావ్' అని అడిగారు. లిరిక్స్ అందించిన చంద్రబోస్‌గారు కూడా పాట పూర్తయ్యేంతవరకు చర్చిస్తూనే ఉన్నారు. 'సత్యభామ'లో ఓ ఇంగ్లిష్ సాంగ్ కూడా ఉంది. ఇతర పాటలను త్వరలోనే విడుదల చేస్తాం. నేను థ్రిల్లర్ మూవీస్‌కు ఎక్కువగా పని చేస్తాననే పేరొచ్చింది. ఈ ఇమేజ్ నాకు ఇబ్బందిగానే ఉంది. ఎందుకంటే మొత్తం థ్రిల్లర్ మూవీస్‌కు నేనే సంగీతం అందించడం లేదు. చెప్పాలంటే.. 'కృష్ణ అండ్ హిస్ లీల, డీజే టిల్లు, గుంటూరు టాకీస్' వంటి లవ్ అండ్ కమర్షియల్ చిత్రాలకూ సంగీతం అందించాను. కానీ థ్రిల్లర్స్ మ్యూజిక్ డైరెక్టర్ అనే ముద్ర వచ్చేసింది. నాకైతే అన్ని జానర్ సినిమాలకూ సంగీతం అందించాలని ఉంది. ప్రస్తుతం 'గూఢచారి 2'కు పని చేస్తున్నాను. మరో నాలుగైదు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.


అనన్యా పాండే

టీనేజ్ గుర్తొచ్చింది!

టీనేజ్ జ్ఞాపకాలు గుర్తొచ్చాయని సంబరపడిపోతున్నారు బాలీవుడ్ యంగ్ హీరోయిన్ అనన్యా పాండే. హఠాత్తుగా అనన్యా పాండేకు టీనేజ్ జ్ఞాపకాలు గుర్తుకు రావడానికి కారణం 'ఇన్‌సైడ్ అవుట్ 2' అనే అమెరికన్ యానిమేటెడ్ ఫిల్మ్. కెల్సీ మన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హాలీవుడ్ తారలు అమీ పోహ్లర్, ఫిలిస్ స్మిత్, లూయిస్ బ్లాక్, టోనీ హేల్ వంటి వారు ఈ సినిమాలోని హ్యాపీ, సాడ్‌నెస్, యాంగర్ వంటి ఎమోషన్స్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చారు. రిలే ఆండర్సన్ అనే ఓ 13 ఏళ్ల టీనేజ్ అమ్మాయి పాత్రకు హిందీ వెర్షన్‌లో వాయిస్ ఓవర్ ఇచ్చారు అనన్యా పాండే. సినిమాలో కెన్సింగ్టన్ తాల్మన్ ఈ పాత్ర చేసింది. రిలే ఆండర్సన్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చిన సందర్భంగా అనన్యా పాండే మాట్లాడుతూ– ''పిక్సర్ అండ్ డిస్నీ స్టూడియోల యానిమేషన్ చిత్రాలకు నేను అభిమానిని. ఈ సంస్థల నుంచి వస్తున్న 'ఇన్‌సైడ్ అవుట్ 2'కి వాయిస్ ఓవర్ ఇవ్వడం హ్యాపీగా ఉంది. రిలే పాత్రకు వాయిస్ ఓవర్ చెబుతున్నప్పుడు నాకు నా టీనేజ్ గుర్తొచ్చింది'' అని పేర్కొన్నారు. కాగా 'ఇన్‌సైడ్ అవుట్ 2' ఈ నెల 14న రిలీజ్ కానుంది.

యూత్‌ఫుల్ లవ్

ఓ వాస్తవ ఘటన ఆధారంగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఇంటర్మీడియట్ టీనేజ్ లవ్‌స్టోరీగా రూపొందిన ఈ చిత్రంలో ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞ శ్రీ వేణున్, రామ్ పటాస్, తేజ గౌడ్, బాంబే పద్మ, శ్రీమునిచంద్ర, మండపేట మల్లిక జాగుల ముఖ్యపాత్రల్లో నటించారు. ''ఈ చిత్రంలోని ప్రేమకథ ప్రేక్షకుల మనసులను హత్తుకునేలా ఉంటుంది'' అని శ్రీనాథ్ పులకురం అన్నారు. ''ఇప్పటివరకు విడుదల చేసిన మా సినిమా టీజర్, రెండు పాటలకు మంచి స్పందన లభించింది. మా సినిమాని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ శంకర్ పిక్చర్స్ ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయనుంది. ఈ లవ్‌స్టోరీ యూత్‌ని ఆకట్టుకుని, మంచి వసూళ్లు రాబడుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు భువన్ రెడ్డి.


షాజ్ఞ, ప్రణవ్

క్రైమ్ రీల్‌కు విజయం దక్కాలి

- సముద్ర ఖని

సిరి చౌదరి, పింక్ పాక్ సూర్య, జబర్దస్త్ అభి, భరత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'క్రైమ్ రీల్'. అన్నే క్రియేషన్స్ పతాకంపై సంజన అన్నే తెరకెక్కించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. జూన్ 14న ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు నటుడు-దర్శక-నిర్మాత సముద్ర ఖని ముఖ్య అతిథిగా హాజరై, ఈ సినిమా ప్రేక్షకులను అలరించి, విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. సంజన మాట్లాడుతూ – ''సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత ఏ విధంగా చెడిపోతున్నారో తెలియజేసే చిత్రం ఇది'' అన్నారు.


సంజన, సముద్ర ఖని

సాక్షి **బిజినెస్**
మంగళవారం
4-6-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	2,507	76,469
నిఫ్టీ ▲	733	23,264

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,735	▲ 1
డోజోన్స్	38,375	▽ 311
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,263	▽ 13
డాక్స్	18,608	▲ 110
షాంఘై	3,078	▽ 8
నికాయ్	38,923	▲ 435

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	71,776
బంగారం (99.5 స్వచ్ఛత)	71,489
వెండి (కేజీ)	90,217

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.61	83.63
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.63	107.19
€	యూరో	ఎస్‌బీఐ	89.02	91.38
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.28	53.43
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.31	56.24
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.27	63.96
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.28	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.35	12.43

మేలో తయారీ మందగమనం



ముంబై: భారత్ తయారీ రంగం మే నెల్లో నెమ్మదించింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) ఏప్రిల్‌లో 58.8 వద్ద ఉంటే, మేలో 57.5కు తగ్గింది. మార్చిలో సూచీ 16 నెలల గరిష్ట స్థాయి 59.1ని చూసిన సంగతి తెలిసిందే. కాగా, సూచీ 50పైన ఉంటే దానిని వృద్ధి ధోరణిగానే పరిగణిస్తారు. ఈ దిగువకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు.

హైదరాబాద్‌లో క్యాష్‌ఈ ఎక్సలెన్స్ సెంటర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫిన్‌టెక్ సంస్థ క్యాష్‌ఈ హైదరాబాద్‌లో కొత్తగా టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది. రుణాలు, బీమా, వెల్త్ మేనేజ్‌మెంట్ తదితర సర్వీసులు అందిస్తున్న తమ టెక్నాలజీ అవసరాల కోసం ఇది ఉపయోగపడనున్నట్లు సంస్థ సీఈవో యశోరాజ్ త్యాగి తెలిపారు. దీనికోసం 150 మందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు, ఈ ఏడాది ఆఖరు నాటికి మొత్తం మీద 300 మంది ఉద్యోగులను తీసుకోనున్నట్లు వివరించారు.

ఆరిజీన్ ఫార్మా కొత్త ఫెసిలిటీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌కు చెందిన ఆరిజీన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ తాజాగా బయాలాజిక్స్ ఫెసిలిటీ ప్రారంభించింది. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో 70,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇది ఏర్పాటైంది. ఆరిజీన్ ఫార్మా కాంట్రాక్ట్ రిసర్చ్, డెవలప్‌మెంట్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో ఉంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-6-2024	
విశాఖ	450-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	450-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	505-00
వరంగల్	507-00
రిటైల్ ధర	5.65

ఎగ్జిట్ పోల్ జోష్..

కుమ్మేసిన బుల్స్

- 2,507 పాయింట్ల పోల్‌వాల్ట్
- కొత్త రికార్డ్ 76,469కు సెన్సెక్స్
- నిఫ్టీ 733 పాయింట్ల హైజంప్
- చరిత్రాత్మక గరిష్టం 23,264కు
- 5 ట్రిలియన్ డాలర్లకు మార్కెట్ల విలువ



ముంబై: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి మోదీ 3.0 ప్రభుత్వం ఏర్పాటు కానుందని వెలువడిన ఎగ్జిట్ పోల్ అంచనాలతో మార్కెట్ కొత్త శిఖరాలకు పరుగులు తీసింది. ఎన్‌డీఏ భారీ మెజారిటీని సాధించనుందన్న అంచనా కొనుగోళ్ల జోరుకు దారిచూపింది. ఒక్కసారిగా ఊపందుకున్న పెట్టుబడులతో స్టాక్ బుల్ లాభాలతో కుమ్మేసింది. దీంతో సెన్సెక్స్ 2,507 పాయింట్ల(3.5 శాతం) పోల్‌వాల్ట్ చేసింది. 76,469 వద్ద ముగిసింది. నిఫ్టీ 733 పాయింట్లు(3.3 శాతం) ఎగసి 23,264 వద్ద స్థిరపడింది, బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలో అన్ని రంగాలూ లాభాలతో ముగిశాయి. గతంలో 2021 ఫిబ్రవరి 1న బడ్జెట్ రోజున సెన్సెక్స్, నిఫ్టీ 5 శాతం చొప్పున జంప్ చేశాయి. అంతక్రితం అంటే 2019 మే 20న సైతం ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ ఎన్‌డీఏ కూటమి రెండోసారి విజయాన్ని అంచనా వేయడంతో మార్కెట్లు 3 శాతానికిపైగా పురోగమించాయి. ఇంట్రాడేలోనూ స్టాక్ మార్కెట్లు సరికొత్త రికార్డు గరిష్టాలకు చేరాయి.

రిలయన్స్ భళా..

సెన్సెక్స్ 30 షేర్లలో 25 కౌంటర్లు భారీ లాభాలతో నిలవగా.. కేవలం సన్ ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్, నెస్లే, ఇన్ఫోసిస్ నామమాత్రంగా డీలా పడ్డాయి. వీటితోపాటు ఇక నిఫ్టీ 50లో ఐషర్, ఎల్‌టీఐఎం, బ్రిటానియా స్వల్ప వెనకడుగు వేశాయి. ఆయిల్ అండ్ గ్యాస్, రియల్టీ, ప్రయివేట్ బ్యాంక్స్, మెటల్, మీడియా, ఆటో 7-2.5 శాతం మధ్య జంప్‌చేశాయి. హెవీవెయిట్ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 6 శాతం జంప్ చేసి మార్కెట్లకు దన్నునిచ్చింది. రూ. 3,021కు చేరడం ద్వారా రూ. లక్ష కోట్ల మార్కెట్ విలువను జమ చేసుకుంది. దీంతో మొత్తం మార్కెట్ క్యాప్ రూ. 20.44 లక్షల కోట్లను దాటింది. షేరు తొలుత రూ. 3,029 వద్ద రికార్డ్ గరిష్టానికి చేరింది.


మార్కెట్లు కదం తొక్కడంతో ఒకే ఒక్క రోజులో స్టాక్ ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ. 13.78 లక్షల కోట్లు పెరిగింది. ఫలితంగా బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ. 426 లక్షల కోట్లకు చేరింది. వెరసి సరికొత్త రికార్డ్ 5.13 ట్రిలియన్ డాలర్లను తాకింది. ఈ బాటలో

సంపదే సంపద




ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ సైతం 5.09 లక్షల కోట్ల డాలర్ల(రూ. 422.48 లక్షల కోట్లు)కు చేరింది. స్పష్టమైన మెజారిటీతో వరుసగా మూడోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకానుండటంతోపాటు.. గతేడాది(2023-24) దేశ జీడీపీ ప్రపంచ దేశాలలోనే అత్యధికంగా 8.2 శాతం వృద్ధిని సాధించడం ఇన్వెస్టర్లకు ఎనలేని ప్రోత్సాహాన్నిచ్చినట్లు విశ్లేషణ.

ప్రభుత్వ షేర్ల పరుగు



తాజా ర్యాలీలో పలు ప్రభుత్వ రంగ కౌంటర్లు **లాభాల పరుగు** తీశాయి. దీంతో ఎస్‌బీఐ, **ఎన్‌టీపీసీ, పవర్‌**గ్రిడ్, ఓఎన్‌జీసీ, బీపీసీఎల్, కోల్ **ఇండియా 9.5-4.5** శాతం మధ్య దూసుకెళ్లాయి. **ఇతర బ్లూచిప్స్‌లో** శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, **యాక్సిస్ బ్యాంక్,** ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్, ఇండస్ **ఇండ్, టాటా స్టీల్,** ఐసీఐసీఐ బ్యాంక్, జేఎస్‌డబ్ల్యూ **స్టీల్, బజాజ్ త్రయం**, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, గ్రాసిమ్, కొటక్ బ్యాంక్ 7-2.5 శాతం మధ్య ఎగశాయి. పీఎస్‌యూ బ్యాంక్స్‌లో బీవోబీ, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ ఒక దశలో 52 వారాల గరిష్టాలకు చేరాయి. పీఎస్‌యూగా ఎస్‌బీఐ తొలిసారి రూ. 8 లక్షల కోట్ల మార్కెట్ విలువను సాధించడం విశేషం!

విదేశీ పెట్టుబడుల జోరు



బీఎస్‌ఈ నగదు విభాగంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లుతాజాగా రూ. 6,851 కోట్ల పెట్టుబడులను పంప్ చేశారు. డీఐఐలు సైతం రూ. 1,914 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి. గత వారాంతాన సైతం ఎఫ్‌పీఐలు రూ. 1,613 కోట్లను ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే. బీఎస్‌ఈ సూచీలలో మిడ్ క్యాప్ 3.5 శాతం, స్మాల్ క్యాప్ 2 శాతం చొప్పున బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 2,346 లాభపడితే.. 1,615 మాత్రమే నష్టపోయాయి.

అదానీ షేర్ల మెరుపులు



ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి కేంద్రంలో సుస్థిర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న అంచనాలకుతోడు, జఫరీస్ బ్రోకింగ్ బయ్ రేటింగ్‌తో తాజాగా అదానీ గ్రూప్ కౌంటర్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో గ్రూప్‌లోని అన్ని లిస్టెడ్ షేర్లు 4% నుంచి 16% వరకు భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఫలితంగా గ్రూప్‌లోని మొత్తం 10 కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 19.42 లక్షల కోట్లను అధిగమించింది.

రూపాయి ర్యాలీ



సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ మెజారిటీపై అంచనాలతో స్టాక్ మార్కెట్లతోపాటు దేశీ కరెన్సీ సైతం జోరందుకుంది. దీంతో డాలరుతో మారకంలో రూపాయి 28 పైసలు బలపడింది. తద్వారా 2023 నవంబర్ 15 తదుపరి(24 పైసలు) ఒకే రోజు రూపాయి అత్యధికంగా పుంజుకుంది. వెరసి రెండు నెలల గరిష్టం 83.14 వద్ద ముగిసింది. ఇంతక్రితం మార్చి 21న 83.13 వద్ద నిలిచింది. ఉత్పత్తిని యథాతథంగా కొనసాగించే ఒపెక్ నిర్ణయంతో చమురు ధరలు బలహీనపడటం సైతం రూపాయికి ప్రోత్సాహాన్నిచ్చినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి తొలుత 83.09 వద్ద హుషారుగా ప్రారంభమైంది. ఇంట్రాడేలో 82.95 వద్ద గరిష్టాన్ని తాకగా.. 83.17 వద్ద కనిష్టానికీ చేరింది. చివరికి 83.14 వద్ద స్థిరపడింది. వారాంతాన రూపాయి 13 పైసలు నీరసించి 83.42 వద్ద నిలిచిన సంగతి తెలిసిందే. స్టాక్స్‌లో విదేశీ పెట్టుబడులు, జీడీపీ, జీఎస్‌టీ గణాంకాలు సైతం రూపాయికి దన్నునిచ్చినట్లు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

సెబీ నుంచి అప్‌డేటెడ్ మొబైల్ యాప్ సారథి2.0

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పర్సనల్ ఫైనాన్స్‌పై విస్తృత సమాచారంతో సారథి2.0(Saarthi2.0) మొబైల్ యాప్‌ను విడుదల చేసింది. ఇన్వెస్టర్లకు ఉద్దేశించిన ఈ యాప్‌లో సమీకృత టూల్స్‌కు చోటు కల్పించింది. సంక్లిష్టమైన ఫైనాన్షియల్ కాన్సెప్ట్‌ను సరళతరం చేయడమే లక్ష్యంగా అప్‌డేటెడ్ వెర్షన్‌ను ప్రవేశపెట్టినట్లు సెబీ పేర్కొంది. వినియోగదారులకు సులభరీతిలో అర్థమయ్యే విధంగా సమాచారాన్ని క్రోడీకరించినట్లు తెలియజేసింది. యాప్‌లో ఫైనాన్షియల్ కాల్క్యులేటర్లు, కేవైసీ విధానాలు వివరించే మాడ్యూల్స్, ఎంఎఫ్‌లు, ఈటీఎఫ్‌లతోపాటు స్టాక్ ఎక్స్ఛేంజీలలో షేర్ల కొనుగోళ్లు, అమ్మకాలు, ఇన్వెస్టర్ల సమస్యల పరిష్కార విధానాలు తదితర పలు అంశాలను చేర్చినట్లు వివరించింది.

జపాన్ ఎయిర్‌లైన్స్‌తో ఇండిగో కోడ్‌షేర్ ఒప్పందం

ముంబై: జపాన్ ఎయిర్‌లైన్స్‌తో (జేఏఎల్) కోడ్‌షేర్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు దేశీ విమానయాన సంస్థ ఇండిగో వెల్లడించింది. ఇండిగో నెట్‌వర్క్‌లోని 14 ప్రాంతాలకు జేఏఎల్ సేవలు విస్తరించేందుకు ఇది ఉపయోగపడనుంది. జపాన్ ఎయిర్‌లైన్స్ ప్రస్తుతం అది టోక్యో నుంచి ఢిల్లీ, బెంగళూరుకు ఫ్లయిట్ సర్వీసులు అందిస్తోంది. ఈ భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా పెద్ద నగరాలైన హైదరాబాద్, ముంబై, చెన్నై, కోల్‌కతా, అహ్మదాబాద్, అమృత్‌సర్, కొచ్చి, కోయంబత్తూర్, తిరువనంతపురం, తిరుచిరాపల్లి, పుణె, లక్నో, వారణాసి తదితర ప్రాంతాలకు సర్వీసులు విస్తరించేందుకు వీలవుతుంది. తదుపరి జేఏఎల్ నెట్‌వర్క్ రూట్లలో తమ సేవలు విస్తరించేందుకు ఇండిగో కోడ్‌షేర్ కుదుర్చుకోనుంది.



భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ట్రిపుల్‌ఐటీ బాసరలో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రం నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్‌జీయూకేటీ).. 2024-25 విద్యాసంవత్సరంలో ట్రిపుల్ ఐటీలో ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

» **కోర్సు:** ఇంటిగ్రేటెడ్ బీటెక్(ఇంటర్ + బీటెక్)
» **మొత్తం సీట్లు:** 1500
» **అర్హత:** ఈ సంవత్సరం పదో తరగతి ఉత్తీర్ణులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
» **వయసు:** 31.12.2024 నాటికి 18 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 21ఏళ్లలోపు ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారి పదో తరగతి గ్రేడ్‌కు 0.40 స్కోర్ కలుపుతారు. మొత్తం సీట్లలో 85 శాతం రాష్ట్ర విద్యార్థులకు కేటాయిస్తారు. మిగతా 15 శాతం సీట్లకు తెలంగాణ రాష్ట్ర విద్యార్థులతోపాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 01.06.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 22.06.2024
» **వెబ్‌సైట్:** http://rgukt.ac.in

నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీలో యూజీ, పీజీ కోర్సులు

మణిపూర్‌లోని నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ.. 2024-25 విద్యాసంవత్సరానికి స్పోర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశ పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, గేమ్ ప్రొఫిషియన్సీ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

కోర్సులు- సీట్లు

» **మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్(ఎంపీఈఎస్):** కోర్సు వ్యవధి రెండేళ్లు,సీట్లు-30.
» **బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ (బీపీఈఎస్):**కోర్సు వ్యవధి మూడేళ్లు,సీట్లు-50.
» **మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్:** కోర్సు వ్యవధి రెండేళ్లు, సీట్లు-20.
» **బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ స్పోర్ట్స్ కోచింగ్:** కోర్సు వ్యవధి నాలుగేళ్లు, సీట్లు-80.
» **మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ ఇన్ స్పోర్ట్స్ సైకాలజీ:** కోర్సు వ్యవధి రెండేళ్లు, సీట్లు-15.
» **మాస్టర్ ఆఫ్ సైన్స్ ఇన్ అప్లయిడ్ స్పోర్ట్స్ న్యూట్రిషన్:** కోర్సు వ్యవధి రెండేళ్లు, సీట్లు-15.
» **అర్హత:** కోర్సును అనుసరించి 12వ తరగతి, డిప్లొమా/పీజీ డిప్లొమా, డిగ్రీ తదితరాల్లో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక ప్రక్రియ:** ప్రవేశ పరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్, గేమ్ ప్రొఫిషియన్సీ టెస్ట్, వైవా వోస్ తదితరాల ఆధారంగా ప్రవేశం కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 27.06.2024
» **ప్రవేశ పరీక్ష తేది:** 09.07.2024
» **వెబ్‌సైట్:** www.nsu.ac.in/admission

నిట్ రూర్కెలాలో ఎంఏ

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్).. మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్‌లో 2024-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు గాను ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

» **కోర్సు వివరాలు:** ఎంఏ (డెవలప్‌మెంట్ స్టడీస్)
» **మొత్తం సీట్ల సంఖ్య:** 39
» **అర్హత:** బీటెక్ , బీఏ, బీఎస్సీ, బీకాం డిగ్రీలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. డిగ్రీ హానర్స్ ఉత్తీర్ణులైన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 20.06.2024
» **వెబ్‌సైట్:** http://eapplication.nitrkl.ac.in

నిట్ రూర్కెలాలో పీహెచ్‌డీ

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్).. 2024-25 విద్యా సంవత్సరానికి సెల్ఫ్ ఫైనాన్స్ స్కీం కింద పీహెచ్‌డీ ప్రోగ్రాంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

» **ప్రోగ్రామ్ వివరాలు:** పీహెచ్‌డీ
» **విభాగాలు:** బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, వ్యాలిడ్ గేట్/నెట్/బెట్/ జీప్యాట్ స్కోరు లేదా ఏదైనా జాతీయ స్థాయి అర్హత పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక ప్రక్రియ:** అకడమిక్ రికార్డ్, విద్యార్హత, రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 15.06.2024.
» **రాత పరీక్ష, ఇంటర్వ్యూ తేదీలు:** 28.06.2024.
» **వెబ్‌సైట్:** http://eapplication.nitrkl.ac.in

ఐఐఎంలకు క్యాట్ దారి!

» నవంబర్ 24న క్యాట్-2024
» జూలై నెలాఖరులోపు నోటిఫికేషన్
» క్యాట్ తర్వాత దశలో జీడీ, పీఐలు
» ప్రాక్టీస్‌తోనే సక్సెస్ అంటున్న నిపుణులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. సంక్షిప్తంగా ఐఐఎంలు! ఇవి మేనేజ్‌మెంట్ విద్యలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన క్యాంపస్‌లు. అందుకే ఐఐఎంల్లో చేరితే ఉజ్వల కార్పొరేట్ కెరీర్ ఖాయమైనట్లేనని భావిస్తారు. ఇలాంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.. కామన్ అడ్మిషన్ టెస్ట్ (క్యాట్)!! దేశంలో అత్యంత క్లిష్టమైన పరీక్షల్లో ఒకటిగా భావించే క్యాట్.. ఈ ఏడాది నవంబర్ 24న జరుగనుంది. ఈ నేపథ్యంలో.. క్యాట్ ప్రత్యేకత, పరీక్ష విధానం, సిలబస్, ఐఐఎంల మలిదశ ఎంపిక ప్రక్రియ తదితర వివరాలు..

మేనేజ్‌మెంట్ కోర్సుల విద్యార్థుల్లో అధిక శాతం మంది లక్ష్యం.. ఐఐఎంలు. వీటిల్లో ప్రవేశాలకు నిర్వహించే క్యాట్‌లో విజయం సాధించాలని డిగ్రీ స్థాయి కోర్సుల ఫైనల్‌లో ఉండగానే ప్రిపరేషన్ ప్రారంభిస్తారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 21 ఐఐఎం క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిల్లో ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్, పీహెచ్‌డీ(ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్) కోర్సులను అందిస్తున్నారు. గత ఏడాది వరకు 20 ఐఐఎం క్యాంపస్‌లనే పేర్కొనగా.. ముంబైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రెనింగ్ ఇన్ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ (ఎన్ఐటీఐఈ)కు తాజాగా ఐఐఎం హోదా లభించింది. దీంతో క్యాట్ 2024 ద్వారా ప్రవేశాలు కల్పించే ఐఐఎంల సంఖ్య 21కు పెరిగింది. వీటిల్లో దాదాపు అయిదు వేల సీట్లు ఉన్నాయి.

క్యాట్‌తో ఐఐటీల్లోనూ ప్రవేశం

క్యాట్ స్కోర్‌తో ఐఐఎంలే కాకుండా.. ఇంజనీరింగ్ విద్యను అందించడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఐఐటీల్లోనూ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరే అవకాశముంది. వీటితోపాటు దేశంలోని పలు ఇతర ఇన్‌స్టిట్యూట్స్ సైతం క్యాట్ స్కోర్ ఆధారంగా మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నాయి.

రెండు లక్షలకు పైగా పోటీ

క్యాట్‌ను ప్రతి ఏటా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. దీనికి రెండు లక్షల మందికిపైగా పోటీ పడుతున్నారు. గత మూడేళ్ల గణాంకాలను పరిశీలిస్తే.. క్యాట్-2023కు 2.8 లక్షల మంది; క్యాట్-2022కు 2.22 లక్షల మంది; క్యాట్-2021కు 1.91 లక్షల మంది హాజరయ్యారు.



అర్హతలు

కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు కనీసం 45 శాతం మార్కులు) ఉండాలి. బ్యాచిలర్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఇంటర్వ్యూ సమయానికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.

మూడు విభాగాల్లో పరీక్ష

క్యాట్-2024 తేదీపై స్పష్టత వచ్చింది. దీంతో క్యాట్ పరీక్ష విధానంలో ఏమైనా మార్పులు జరిగే అవకాశం ఉందా అనే సందేహం అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. సాధారణంగా క్యాట్ పరీక్ష మొత్తం మూడు విభాగాల్లో జరుగుతుంది. విభాగం-1లో వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్; విభాగం-2లో డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్, విభాగం-3లో క్వాంటిటేటివ్ ఎబిలిటీలపై ప్రశ్నలు అడుగుతారు.

విభాగాల వారీగా ప్రశ్నల సంఖ్య

క్యాట్-2023లో వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 24 ప్రశ్నలు, డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ నుంచి 20 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ నుంచి 22 ప్రశ్నలు చొప్పున మొత్తం 66 ప్రశ్నలతో.. 198 మార్కులకు పరీక్ష నిర్వహించారు. క్యాట్-2024 పరీక్ష కూడా ఇదే విధానంలో జరుగుతుందని, పెద్దగా ఎలాంటి మార్పులు ఉండకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాత పరీక్షలో బెస్ట్ స్కోర్ ఇలా

వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్

ఈ విభాగంలో స్కోర్ కోసం ఇంగ్లిష్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ గ్రామర్‌పై దృష్టిపెట్టాలి. యాంటానిమ్స్, సినానిమ్స్, బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా ఫ్యాక్ట్స్, ఇన్ఫరెన్సెస్, జంబుల్డ్ పారాగ్రాఫ్స్‌లను ప్రాక్టీస్ చేయాలి. ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడిగే రీడింగ్ కాంప్రహెన్షన్‌లో రాణించేందుకు అసెంప్షన్, స్టేట్‌మెంట్స్‌పై పట్టు సాధించాలి.

డేటా ఇంటర్‌ప్రిటేషన్, లాజికల్ రీజనింగ్

క్యాట్‌లో డీఐఎల్‌ఆర్‌గా పేర్కొనే ఈ విభాగంలో రాణించేందుకు విశ్లేషణాత్మక నైపుణ్యం, తార్కిక విశ్లేషణ పెంచుకోవాలి. టేబుల్స్, గ్రాఫ్స్, చార్ట్స్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. లాజికల్ రీజనింగ్‌లో క్యూబ్స్, క్లాక్స్, నంబర్ సిరీస్, లెటర్ సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలను బాగా ప్రాక్టీస్ చేయాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

మ్యాథమెటికల్, అర్థమెటికల్ స్కిల్స్‌ను పరీక్షించే విభాగం ఇది. ఇందులో అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు గుర్తించాలంటే.. అర్థమెటిక్‌కు సంబంధించి పర్సంటేజెస్, రేషియోస్, టైం-డిస్టెన్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి అల్‌జీబ్రా, మోడ్రన్ మ్యాథ్స్, జామెట్రీలపై దృష్టిపెట్టాలి.

కటాఫ్ పర్సంటైల్

క్యాట్‌లో ప్రతి సెక్షన్‌లోనూ నిర్దిష్ట కటాఫ్ మార్కులు పొందేలా కృషి చేయాలి. ఎందుకంటే.. ఐఐఎంలు మలి దశ ఎంపిక ప్రక్రియకు అభ్యర్థులను పిలిచేందుకు ఓవరాల్ కటాఫ్‌తోపాటు సెక్షనల్ కటాఫ్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఓవరాల్ కటాఫ్ కనిష్టంగా 85, గరిష్టంగా 90 పర్సంటైల్ సాధించాలి. అదే విధంగా సెక్షనల్ కటాఫ్ 75 నుంచి 80 పర్సంటైల్ కోసం కృషి చేయాలి.

కాన్సెప్ట్స్, ప్రాక్టీస్

క్యాట్ అభ్యర్థులు తొలుత సిలబస్‌ను, గత ప్రశ్నపత్రాలను పరిశీలించి.. పరీక్ష విధానంపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత ప్రామాణిక మెటీరియల్ ఆధారంగా ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు ప్రతి టాపిక్ పూర్తయిన తర్వాత ప్రాక్టీస్ చేయడం ఎంతో మేలు చేస్తుంది. క్యాట్ ప్రిపరేషన్‌లో అభ్యర్థులు..ఎక్కువ వెయిటేజీ ఉన్న అంశాలను పరిశీలించి వాటిపై దృష్టి సారించాలి. ప్రతి యూనిట్ తర్వాత ఉండే మోడల్ కొశ్చన్స్‌ను సాధన చేయాలి.

నమూనా, మోడల్ టెస్ట్‌లు

క్యాట్ అభ్యర్థులు మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరుకావడం మేలు చేస్తుంది. మాక్ టెస్టులకు హాజరై.. వాటి ఫలితాలను విశ్లేషించుకోవాలి. తద్వారా తాము ఇంకా పట్టు సాధించాల్సిన టాపిక్స్ గుర్తించి, వాటిపై ఫోకస్ పెట్టాలి. ఇలా ఒకవైపు సబ్జెక్ట్ ప్రిపరేషన్ సాగిస్తూనే.. మరోవైపు నిరంతరం తమ ప్రతిభను పరీక్షించుకుంటూ.. నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి.

మలి దశకు సన్నద్ధత

ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి.. మలిదశలో గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నాయి. వీటికి నిర్దిష్ట వెయిటేజీ కేటాయించే విధానాన్ని అనుసరిస్తున్నాయి. తుది విజేతల ఎంపికలో క్యాట్ స్కోర్‌కు 50 నుంచి 70 శాతం, జీడీ/పీఐలకు 30 నుంచి 50 శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. కాబట్టి క్యాట్‌లో బెస్ట్ స్కోర్ కోసం ప్రిపరేషన్ సాగించే అభ్యర్థులు.. మలిదశ ఎంపిక ప్రక్రియపైనా ఇప్పటి నుంచే అవగాహన పెంచుకోవాలి. ఇందులో రాణించేందుకు సమాంతరంగా ప్రిపరేషన్ సాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

జీడీ, పీఐ

మలిదశలో నిర్వహించే గ్రూప్ డిస్కషన్స్(జీడీ)లో అభ్యర్థులను పలు బృందాలుగా విభజించి.. ఒక్కో బృందానికి ఏదైనా ఒక టాపిక్ ఇచ్చి దానిపై మాట్లాడమంటారు. ఒక్కో బృందంలో ఎనిమిది నుంచి పది మంది అభ్యర్థులు ఉంటున్నారు. జీడీ సమయంలోనే కొన్ని ఐఐఎంలు రిటెన్ ఎబిలిటీ టెస్ట్ నిర్వహిస్తున్నాయి. ఈ టెస్ట్‌లో భాగంగా అభ్యర్థులు నిర్దిష్టంగా ఒక టాపిక్‌పై తమ అభిప్రాయాలను పద పరిమితితో రాయాలని కోరుతున్నారు. ఈ రెండు దశల్లోనూ విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూ సమయంలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరడానికి కారణాలు.. భవిష్యత్తు లక్ష్యాలు, ఆసక్తులు తదితర ప్రశ్నలు అడుగుతున్నారు. అభ్యర్థులు ఇప్పటి నుంచి తొలి, మలి దశ ఎంపిక ప్రక్రియపై అవగాహన పెంచుకొని ప్రిపరేషన్ కొనసాగిస్తే విజేతలుగా నిలిచే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా...

ఉత్పత్తి వ్యయ నియంత్రణ ఆవశ్యకం

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీ



పీడనం తగ్గించే స్టేషన్లను ప్రారంభిస్తున్న డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: ఉత్పత్తి వ్యయ నియంత్రణ స్టీల్ ప్లాంట్‌కు ఎంతో అవసరమని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె.బాగ్చీ చెప్పారు. ఇటువంటి చర్యలు స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్ సాధించడానికి దోహదపడతాయన్నారు. సోమవారం స్టీల్ ప్లాంట్‌లో నత్రజని (నైట్రోజన్) పీడనం తగ్గించే స్టేషన్లను ఆయన ప్రారంభించారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లలో తయారయ్యే హాట్ మెటల్ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి ఈ స్టేషన్లు ఎంతో సహాయపడతాయన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్స్ సిబ్బందిని అభినందించారు.

శేషాచలంలో అటవీ దళాధిపతి పర్యటన

తిరుమల నుంచి తలకోన వరకు పరిశీలన

తిరుపతి మంగళం: తిరుపతి జిల్లా పరిధిలోని శేషాచలం అడవులను అటవీ అధికారులతో కలిపి రాష్ట్ర అటవీశాఖ దళాధిపతి పీసీసీఎఫ్ చిరంజీవిచౌదరి పరిశీలించారు. ఆరునెలల క్రితం పీసీసీఎఫ్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన తొలిసారి శేషాచలం అడవుల్లో పర్యటించారు. తిరుమల నుంచి తలకోన వరకు ఆటవీ ప్రాంతంలో ఉన్న మార్గం ద్వారా ఆయన అధికారులతో కలిసి కాలినడకన ప్రయాణించారు. ఈ సందర్భంగా ఎర్రచందనం ఉండే ప్రదేశాలను, స్మగ్లర్ల రాకపోకలు సాగించే సమస్యాత్మక ప్రాంతాలను, అరుదైన, అంతరించిపోతున్న జాతులకు చెందిన వృక్షాలను, ఔషధ మొక్కలను పరిశీలించారు. అనంతరం ఎర్రచందనం సంరక్షణకు అటవీశాఖ తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎర్రచందనం సంరక్షణకు, స్మగ్లర్లను అడ్డుకోవడానికి, వన్యప్రాణుల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఆయనతోపాటు జిల్లా అటవీ అధికారి సతీష్ రెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ శివకుమార్, ఎస్‌ఆర్వోలు, ఎన్టీవోలు పాల్గొన్నారు.

మావోలకు వ్యతిరేకంగా పోలీసుల దుష్ప్రచారం

మావోయిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి అరుణ

జి.మాడుగుల(అల్లూరి జిల్లా) : మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా పోలీసులే దుష్ప్రచారం చేస్తూ, కిరాయి ఇచ్చి ర్యాలీలు చేయిస్తున్నారని సీపీఐ మావోయిస్టు పార్టీ విశాఖ–అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ ఆరోపించారు. జి.మాడుగుల విలేకరులకు సోమవారం మావోయిస్టుల పేరుతో అందిన లేఖలో పలు అంశాలు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా నేతృత్వంలో ఈ మధ్య కాలంలో పోలీసులు మావోయిస్టులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారని, అందులో భాగంగానే మే 30న మద్దిగరువు వారపు సంతలో మావోయిస్టులారా 'మా అల్లూరి జిల్లాకు రావద్దు' అని బ్యానర్లు, ప్లకార్డులతో ఆదివాసీలు ర్యాలీ నిర్వహించినట్టుగా పత్రికల్లో, టీవీల్లో వార్తలు ప్రచారం చేశారని అరుణ ఆ ప్రకటనలో తెలిపారు. నిజానికి అది ప్రజలు నిర్వహించిన ర్యాలీ కాదని, పోలీసులు కొద్ది మంది ప్రజా వ్యతిరేకులతో, ఇన్‌ఫార్మర్ల కుటుంబ సభ్యులను ముందు నిలిపి ర్యాలీ నిర్వహించి, వారితో మాట్లాడించారని తెలిపారు. కొద్ది రోజుల క్రితం చింతూరులో ఇలానే ర్యాలీ నిర్వహించారని ఆమె పేర్కొన్నారు. పోలీసులు నకిలీ డంపులు సృష్టించి పెద్ద ఎత్తున మావోల డంపులను వెలికితీసినట్టుగా ప్రకటించారని అరుణ ప్రకటనలో తెలిపారు.

గేమింగ్ యాప్ నిర్వాహకుల వేధింపులకు యువకుడు బలి!

సింహాచలం స్టేషన్‌లో రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

గోపాలపట్నం: గేమింగ్ యాప్ నిర్వాహకుల వేధింపుల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సింహాచలం రైల్వేస్టేషన్‌లో సోమవారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెందుర్తిలోని సుజాతానగర్‌కు చెందిన జెన్నేటి వెంకటరమణ కుమారుడు జగన్‌కుమార్ (23) సింహాచలం రైల్వేస్టేషన్ రెండో నంబర్ ప్లాట్‌ఫాంపై ఉదయం వేచి ఉన్నాడు. యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా, ఒక్కసారిగా ట్రాక్‌పై దూకాడు. దీంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. తన కుమారుడు జగన్‌కుమార్ ఉదయం బ్యాంక్‌కు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడని వెంకటరమణ తెలిపారు. మధ్యాహ్నం సింహాచలం రైల్వేస్టేషన్ నుంచి ఫోన్ చేసి తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారని కన్నీటిపర్యంతమయ్యారు. డిగ్రీ చదువుతున్న తన కుమారుడు గేమింగ్ యాప్‌లకు అలవాటుపడ్డాడని, ఆయా యాప్‌ల నిర్వాహకులు రూ.3వేలు నుంచి రూ.5వేలు కట్టాలని వేధిస్తున్నారని చెప్పారు. వారి వేధింపుల వల్లే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఆవేదన వ్యక్తంచేశారు.



'క్రూయిజ్'కు పెరుగుతున్న క్రేజ్

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 4.70 లక్షల మంది పర్యటన

- 2019-20తో పోలిస్తే దేశీయంగా 85 శాతం పెరిగిన ప్రయాణాలు
- రూ.45వేల కోట్లతో వివిధ రకాల క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి ప్రణాళిక
- విశాఖలో రూ.100 కోట్లతో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్

సాక్షి, అమరావతి: పర్యాటకుల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆసక్తి, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రణాళికల ఫలితంగా క్రూయిజ్ పర్యాటకం దేశంలో ఆల్‌టైమ్ రికార్డులు సృష్టిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 4.70 లక్షల మంది క్రూయిజ్‌లో ప్రయాణించడమే ఇందుకు నిదర్శనం. ఇది కరోనా ముందు 2019-20లో 4.20 లక్షల మంది క్రూయిజ్ ఫుట్‌ఫాల్‌తో పోలిస్తే గణనీయమైన పెరుగుదలను చూపిస్తోంది. ఈ క్రమంలోనే 2041 నాటికి 40లక్షల మందిని క్రూయిజ్‌లో పర్యటించేలా కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రణాళిక రూపొందిస్తోంది. లోతైన సముద్ర క్రూయిజ్‌లు, తీర ప్రాంత క్రూయిజ్‌లు, రివర్ క్రూయిజ్‌లు, యాచ్ క్రూయిజ్‌లలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం రూ.45 వేల కోట్ల పెట్టుబడితో రివర్ క్రూయిజ్ టూరిజంను అభివృద్ధి చేయాలని చూస్తోంది. ప్రస్తుతం కోర్డెలియా, కోస్టా క్రూయిజ్ వంటి క్రూయిజ్ లైన్లు ప్రస్తుతం అరేబియా సముద్రంలో దేశీయ విహార యాత్రలను నిర్వహిస్తున్నాయి.

దేశీయంగా పెరుగుదల..

గడిచిన ఆర్థిక సంవత్సరంలో 80 శాతం మంది దేశీయంగానే ప్రయాణించారు. ఇందులో 29వేల మంది మాత్రమే అంతర్జాతీయ పర్యటనలు చేశారు. ఇప్పటికీ అంతర్జాతీయ క్రూయిజ్ టూరిజం ఇంకా కోవిడ్‌కు మునుపటి స్థాయిలో చేరకపోవడంతో విదేశీ పర్యాటకులు తక్కువగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే దేశీయ పర్యాటకులలో క్రూయిజ్‌లకు ఆదరణ పెరుగుతోంది. 2019-20లో 50 శాతం దేశీయ, 50 శాతం అంతర్జాతీయ క్రూయిజ్ పర్యటనలు నమోదయ్యాయి. వాటితో పోలిస్తే తాజాగా దేశీయ పర్యాటకులు దాదాపు 85శాతం పెరిగారు. సింగపూర్ వంటి దేశాలలో క్రూయిజ్ పరిశ్రమకు భారతీయ పర్యాటకులు కీలకంగా ఉన్నారు. అయితే అబుదాబి కూడా భారతీయ పర్యాటకులను తన క్రూయిజ్ ఆఫర్‌లకు ఆకర్షించడానికి ప్రయత్నిస్తోంది.

అందుబాటులో విశాఖ అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్..

దక్షిణ భారతదేశంలో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే దేశీయ, అంతర్జాతీయ క్రూయిజ్ టూరిజం అందుబాటులో ఉంది. విశాఖలో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పర్యాటకులకు విశేష సేవలందిస్తోంది. సుమారు రూ.100 కోట్లతో నిర్మించిన విశాఖ అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ సుమారు 2వేల మంది ప్రయాణికులకుపైగా సామర్థ్యం ఉన్న నౌకలకు వసతి కల్పిస్తోంది.

క్రూయిజ్ పర్యటనలు ఇలా..

ముంబై, గోవా, న్యూ మంగళూరు, కొచ్చి, విశాఖ పోర్టులకు అంతర్జాతీయ క్రూయిజ్ షిప్‌ల రాక పెరుగుతోంది. దేశీయ క్రూయిజ్‌లు ముంబై–గోవా, ముంబై–డయ్యూ, ముంబై–కొచ్చి, ముంబై–లక్షద్వీప్, ముంబై–హై సీస్, చెన్నై–వైజాగ్ మార్గాల్లో అందుబాటులో ఉన్నాయి. నది క్రూయిజ్ టూరిజం కోసం తొమ్మిది జలమార్గాలను గుర్తించారు. వాటిలో గంగానదిపై వారణాసి–హల్దియా, బ్రహ్మపుత్రలోని ధుబ్రి–సాదియా మార్గాలున్నాయి. గుజరాత్ తీర్థయాత్ర పర్యటనలు, పశ్చిమ తీర సాంస్కృతిక, సుందరమైన పర్యటనలు, సౌత్ కోస్ట్ ఆయుర్వేద వెల్నెస్ పర్యటనలు, తూర్పు తీర వారసత్వ పర్యటనలు వంటి థీమ్–ఆధారిత పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేయాలని కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ యోచిస్తోంది.

జూలై 28న గ్రూప్-2 మెయిన్స్

- రేపటి నుంచి పరీక్ష సెంటర్, పోస్టు, జోనల్ ఆప్షన్స్ నమోదు
- 899 పోస్టుల భర్తీ గత ఏడాది డిసెంబర్ 7న నోటిఫికేషన్
- ఫిబ్రవరి 25న ప్రిలిమ్స్.. ఏప్రిల్ 10న ఫలితాల ప్రకటన
- 1:100 చొప్పున అభ్యర్థులకు అవకాశం
- మెయిన్స్‌కు 92,250మంది అర్హత



సాక్షి, అమరావతి: గ్రూప్–2 మెయిన్ పరీక్షలను జూలై 28వ తేదీన ఏపీపీఎస్సీ నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి అభ్యర్థులు ఈ నెల 5 నుంచి 18వ తేదీ వరకు పరీక్ష కేంద్రంతోపాటు తమ పోస్టు, జోనల్/జిల్లా ప్రాధాన్యతను సమర్పించాలని సర్వీస్ కమిషన్ సూచించింది. జూలై 28వ తేదీ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌లో ఆఫ్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని ప్రకటించింది. ఈసారి మెయిన్స్ పరీక్షకు 92,250 మంది హాజరు కానున్నారు. ఏపీపీఎస్సీ 899 గ్రూప్–2 పోస్టుల భర్తీ కోసం గత ఏడాది డిసెంబర్ 7న నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి 25న ప్రిలిమినరీ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. పరీక్ష నిర్వహించిన 45 రోజుల రికార్డు వ్యవధిలో ఏప్రిల్ 10న ప్రిలిమ్స్ ఫలితాలను కూడా వెల్లడించింది. గతానికి భిన్నంగా ఎక్కువ మంది నిరుద్యోగులకు మేలు చేసేందుకు మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసింది. చివరిగా 2018లో నిర్వహించిన గ్రూప్–2 ప్రిలిమ్స్ రాసినవారి నుంచి 1:12 నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేశారు. అయితే, నిరుద్యోగుల నుంచి ఏపీపీఎస్సీకి అందిన విజ్ఞప్తుల మేరకు ఎక్కువ మందికి మెయిన్స్ రాసేందుకు అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో ఒక పోస్టుకు 100 మంది చొప్పున ఎంపిక చేశారు. గ్రూప్ పరీక్షలకు 1:100 విధానంలో ఎంపిక చేయడం సర్వీస్ కమిషన్ చరిత్రలో ఇదే తొలిసారి కావడం విశేషం. దీంతో 899 పోస్టులకు గాను 92,250 మంది మెయిన్స్ రాయనున్నారు.

ఇవీ పోస్టుల వివరాలు...

ఏపీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్–2 నోటిఫికేషన్‌లో 114 డిప్యూటీ తహసీల్దార్, 150 ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, గ్రేడ్–3 మున్సిపల్ కమిషనర్ పోస్టులు 4, గ్రేడ్–2 సబ్ రిజిస్ట్రార్ 16, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ 28 పోస్టులతోపాటు 59 శాఖల్లో 331 ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉండగా, నాన్ ఎగ్జిక్యూటివ్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఏవో), సీనియర్ ఆడిటర్, ఆడిటర్ ఇన్ పే అండ్ అకౌంట్స్, వివిధ సెక్షన్లలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 566 ఉన్నాయి. ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే మెయిన్స్ పరీక్షలో పేపర్–1, పేపర్–2లకు 150 మార్కులకు 150 చొప్పున ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులు తమ పరీక్ష సెంటర్, ఎంపిక చేసుకున్న పోస్టుల ప్రాధాన్యత, జోనల్/జిల్లా ప్రాధాన్యతలకు కమిషన్ వెబ్‌సైట్ http://www.psc.ap.gov.inలో బుధవారం నుంచి నమోదు చేయాలి.

'మధ్యవర్తిత్వం'పై రెండో విడత శిక్షణ తరగతులు ప్రారంభం

- త్వరలో మార్పులు చేసిన మధ్యవర్తిత్వ చట్టం– 2023 అమలు
- ఎంసీపీసీ న్యూఢిల్లీ నుంచి హాజరైన ఇద్దరు జడ్జిలు



ప్రసంగిస్తున్న వి.కె.బన్సల్, పక్కన మన్మోహన్‌శర్మ

నగరంపాలెం: గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని ఒకటో అదనపు జిల్లా జడ్జి (ఏడీజే) హాల్లో సోమవారం సుప్రీంకోర్టు మీడియేషన్/కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ–న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై రెండో విడత 40 గంటల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. గుంటూరు జోన్‌లోని గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఏపీ రాష్ట్ర హైకోర్టు ఎంపిక చేసిన న్యాయాధికారులు హాజరయ్యారు. ఈనెల 3 నుంచి 7 వరకు తరగతులు కొనసాగనున్నాయి. శిక్షణ అధికారులుగా ఎంపికైన సుప్రీంకోర్టు మీడియేషన్/ కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ ఢిల్లీ నుంచి వీకే.బన్సల్ (జిల్లా జడ్జి), మన్మోహన్‌శర్మ (జిల్లా జడ్జి) హాజరయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, ఒకటో అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వై.గోపాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మధ్యవర్తిత్వం వివాదాల పరిష్కారం జరగడంలేదన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలు పరిష్కరించుకునే ప్రక్రియను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం మధ్యవర్తిత్వ చట్టం–2023లో పలు మార్పులు చేసిందని తెలిపారు. ఆ చట్టం త్వరలోనే అమల్లోకి వస్తుందని చెప్పారు. గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల సివిల్ జడ్జిలు (జూనియర్, సీనియర్ డివిజన్), జిల్లా జడ్జిలు పాల్గొన్నారు.

తెలంగాణ

మరోసారి జగన్ సీఎం కావాలంటూ తెలంగాణలో పూజలు

- జగన్ సీఎం అయితేనే ప్రజలకు మేలు జరుగుతుందంటున్న వైఎస్సార్ అభిమానులు

ఖమ్మం మయూరిసెంటర్/కరీంనగర్: ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్ అభిమానులు సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో పూజలు చేశారు. ఖమ్మం ముస్తఫానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు, అర్చన, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అభిమాని తుమ్మా అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి పరితపించే జగన్ మళ్లీ సీఎం అయి ప్రజలకు అండగా నిలవాలని పూజలు చేసినట్లు తెలిపారు. జగన్ పాలనలో లక్షలాది నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. కార్యక్రమంలో మర్రి శ్రీనివాస్, ఆదూరి రాజవర్ధన్‌రెడ్డి, మందడపు వెంకటరామిరెడ్డి, గుండపనేని ఉదయ్‌కుమార్, వాలూరి తిరుపతిరావు, మందడపు వెంకటేశ్వర్లు, గణపరపు సురేష్, యర్రా నాగారాజ్‌రెడ్డి, జక్కుల కరుణాకర్, కొదాటి నరసింహారావు, ఉడుగు సుధాకర్, ఎన్నిక వీరస్వామి, నాగుబండి వెంకటేశ్వర్లు, పి.విజయ్‌కుమార్, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, గంగా రాజు, ఆళ్ల ఉపేందర్‌రెడ్డి, వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోడె మొక్కు చెల్లింపు..

ఏపీకి జగన్ రెండోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకురాలు సింగిరెడ్డి ఇందిరా భాస్కర్‌రెడ్డి కోడె మొక్కు చెల్లించుకున్నారు.

లిక్కర్ స్కామ్ నిందితుల ఆస్తులు జప్తు చేయండి

ప్రత్యేక కోర్టును కోరిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన ఆర్థిక నేరంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భాగస్వామ్యం రూ.292.8 కోట్లు అని ఈడీ ఆరోపించింది. ఈ కుంభకోణంలో మొత్తంగా రూ.1,100 కోట్ల ఆర్థిక నేరం జరిగిందని పేర్కొంది. కవితతో పాటు ఇతర నిందితుల ఆస్తులు జప్తు చేయాలని, కోర్టు విచారణ ప్రారంభించాలని కోరింది. కవిత, చరణ్‌ప్రీత్ సింగ్, ప్రిన్స్‌కుమార్, అరవింద్ సింగ్, దామోదర్ శర్మలపై ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటును సోమవారం రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరి బవేజా పరిగణనలోకి తీసుకున్నారు. దీనిపై విచారణను జూలై 3కు వాయిదా వేశారు. అప్పటివరకు కవిత తీహార్ జైలులో ఉండనున్నారు. మరోవైపు లిక్కర్ స్కామ్‌పై సీబీఐ కేసు విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి.. కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 7 వరకు పొడిగించారు. 7న సీబీఐ చార్జిషీటు దాఖలు చేయనుంది. ఉదయం ఈడీ కేసు విచారణకు కవిత భౌతికంగా హాజరుకాగా మధ్యాహ్నం సీబీఐ కేసుకు వర్చువల్‌గా హాజరయ్యారు. ఈడీ కేసులో కోర్టుకు హాజరైన సమయంలో కవిత జై తెలంగాణ, జై భారత్ నినాదాలు చేశారు. భర్త, పిల్లల్ని కలవడానికి కోర్టు అనుమతించడంతో వారితో కవిత కొద్దిసేపు మాట్లాడారు.

కవితపై అభియోగాలు

ఈడీ అనుబంధ చార్జిషీటులో నిందితులపై తీవ్రమైన అభియోగాలు మోపింది. కుంభకోణంలో కవిత కీలక వ్యక్తి (కింగ్‌పిన్)గా ఉన్నారని ఆరోపించింది. సౌత్‌గ్రూపు ప్రతినిధులతో కలిసి ఆప్ నేతలతో కుమ్మక్కయ్యారని తెలిపింది. కవిత డిజిటల్ ఆధారాలు ధ్వంసం చేశారని, ఫోన్లలోని సమాచారం డిలిట్ చేశారని పేర్కొంది. ఫార్మాట్ చేసిన ఫోన్లకు సంబంధించి ఎలాంటి సమాచారం కవిత చెప్పలేదని ఆరోపించింది. సాక్షులను ప్రభావితం చేసే చర్యలకు కూడా కవిత పాల్పడ్డారని పేర్కొంది. కాగా కవిత గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను కూడా ఈడీ అనుబంధ చార్జిషీటులో పొందు పరిచింది.

టాలీవుడ్ నటి హేమ అరెస్టు

- రేవ్ పార్టీ కేసులో అదుపులోకి తీసుకున్న బెంగళూరు పోలీసులు
- వైద్య పరీక్షలు..నేడు కోర్టులో హాజరు పరచనున్న సీసీబీ
- డ్రగ్స్ సరఫరా చేసిన బెంగళూరు వాసి ఇమార్ షరీఫ్ కూడా అరెస్టు



బురఖాలో ఉన్న నటి హేమకు వైద్యపరీక్షలు

బనశంకరి (బెంగళూరు): బెంగళూరు నగరంలో గత నెల 18వ తేదీన జరిగిన రేవ్ పార్టీ కేసులో తెలుగు నటి హేమను సోమవారం బెంగళూరు సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు అరెస్టు చేశారు. పార్టీ జరుగుతున్న ఫామ్‌హౌస్‌పై దాడి చేసిన పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. అలాగే వివిధ రకాల మాదక ద్రవ్యాలను కూడా స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. కాగా పార్టీలో సుమారు 150 మంది పాల్గొనగా, డ్రగ్స్ తీసుకున్నారనే అనుమానంతో రక్త పరీక్షలు చేయించారు. ఇందులో నటి హేమతో పాటు 86 మంది డ్రగ్స్ సేవించినట్లుగా తేలిందని పోలీసులు ప్రకటించడంతో కలకలం రేగింది. అయితే హేమ తాను ఆ పార్టీలో పాల్గొనలేదని, డ్రగ్స్ సేవించలేదని పేర్కొంటూ వీడియోలు విడుదల చేసి తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడంతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే విచారణకు హాజరు కావాలంటూ రెండుసార్లు నోటీసులు జారీ చేశారు. అయితే రెండుసార్లూ అనారోగ్యం పేరిట ఆమె హాజరుకాలేదు. దీంతో ఈ నెల 3న రావాలంటూ మూడోసారి నోటీసులు జారీ చేయడంతో.. హేమ సోమవారం సీసీబీ ఎదుట హాజరయ్యారు. అయితే ఆమె తనను ఎవరూ గుర్తు పట్టకుండా బురఖా ధరించి వచ్చారు. కాగా అధికారులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకపోవడంతో హేమను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. సాయంత్రం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేశారు. మంగళవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు సీసీబీ అధికారులు తెలిపారు. ఆమె కస్టడీని కోరి విచారించే అవకాశం ఉందని సమాచారం. ఇలావుండగా రేవ్ పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసిన బెంగళూరు డీజే హళ్లి నివాసి ఇమార్ షరీఫ్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఇతని వద్ద 40 ఎండీఎంఎ డ్రగ్స్ మాత్రలు లభించాయని తెలిపారు.



ఇంతుల ఆరోగ్యం మరింత మెరుగ్గా...

ప్రత్యేక చార్టు రూపొందించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్

- తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, లీన్ ప్రోటీన్లు ముఖ్యమని సూచన
- వ్యాయామం చేయలేని మహిళలకు ఈ ఆహారం తప్పనిసరి
- పోషక విలువలు పెంపొందించేలా వంట చేసే విధానం అవసరం

కుటుంబ సంరక్షణలో తలమునకలయ్యే మహిళలు సొంత ఆరోగ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంటారు. సరైన పద్ధతిలో ఆహారం తీసుకోకపోవడం... అందులోనూ పోషకాహారం లోపించడం... అవసరమైన మేరకు వ్యాయామం లేకపోవడం... సమయపాలన పాటించకపోవడం... ఇలాంటి సమస్యల వల్ల వారు లేనిపోని రుగ్మతలకు గురవుతుంటారు. నిత్యం వ్యాయామం లేకపోయినా... ఓ పద్ధతిలో ఆహారం తీసుకోవడం ద్వారా ఫిట్‌గా ఉండటానికి కొన్ని పద్ధతులు పాటించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) చెబుతోంది. అందుకోసం ఓ డైట్ చార్ట్‌ను కూడా రూపొందించింది. దీని ద్వారా వారు చాలా వరకూ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని అభిప్రాయపడింది.

సాక్షి, అమరావతి: మహిళలు సంపూర్ణ పోషకాలు పొందేలా ప్రత్యేక ఆహారాన్ని తీసుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) చెబుతోంది. ఇందుకోసం రోజుకు 1670 కిలో కేలరీలు అందించే భోజనాన్ని సిఫారసు చేస్తోంది. తాము చేసే సూచనల ద్వారా బరువును అదుపులో ఉంచడంతో పాటు గుండె జబ్బులు, మధుమేహం, కొన్ని రకాల క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులనుంచి దూరంగా ఉండవచ్చని చెబుతోంది.

వంట చేయడానికీ ఓ పద్ధతుంది

దేశంలో 56.4శాతం వ్యాధులు అనారోగ్యకర ఆహారపు అలవాట్లతోనే వస్తున్నాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) చెబుతోంది. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల స్థూలకాయం, మధుమేహం, కరోనరీ హార్ట్ డిసీజ్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని స్పష్టం చేసింది. సమతుల్య ఆహారంతో పాటు రోజువారీ దినచర్యల్లో చిన్నపాటి శారీరక శ్రమ తప్పనిసరిగా అలవర్చుకోవాలని ఐసీఎంఆర్ సూచిస్తోంది. ముఖ్యంగా మెట్లు ఎక్కడం, విరామ సమయంలో చిన్నపాటి నడక, శరీర కదలికలతో కూడిన ఇంటి పనులు చేయాలని అభిప్రాయపడింది. తగినంత సమయం నిద్రపోవడం, శారీరక, మానసిక ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారానికి దూరంగా ఉండాలని చెబుతోంది. దీనికోసం వంట చేయడానికి ఓ పద్ధతి అవసరమని స్పష్టం చేసింది. తినే ఆహారాన్ని స్టీమింగ్, ఉడకబెట్టడం, బేకింగ్ వంటి పద్ధతుల్లో వండాలనీ తద్వారా పోషక విలువలు కాపాడుకోవచ్చని వివరించింది.

ఐసీఎంఆర్ సిఫారసు చేసిన డైట్ ఇలా..

- **అల్పాహారం కోసం (ఉదయం 8–10 గంటల మధ్య):** నానబెట్టిన/ఉడకబెట్టిన తృణధాన్యాలు(60గ్రా), ఉడకబెట్టిన నలుపు/ఎరుపు బీన్స్, లోబియా(బ్లాక్–ఐడ్ బఠానీలు)/చిక్‌పీస్(30గ్రా), పచ్చి ఆకు కూరలు(100గ్రా), గింజల(20గ్రా)తో కూడిన భోజనం చేయాలని. దీనిద్వారా ఉదయం 470 కిలో కేలరీలు లభ్యమవుతాయి.
- **మధ్యాహ్న భోజనం (మధ్యాహ్నం 1–2 గంటల మధ్య):** తృణధాన్యాలు(80గ్రా), గింజలు/విత్తనాల నూనెలతో వండిన కూరగాయలు(150గ్రా), పప్పు/మాంసం(20గ్రా), పెరుగు/పనీర్(150 మి.లీ), చివర్లో పండ్లు (50గ్రా) తినుకోవాలి. ఈ భోజనం రోజుకు 750 కిలో కేలరీలు అందజేస్తుంది.
- **సాయంత్రం స్నాక్స్ కోసం (సాయంత్రం 5 గంటలకు):** శరీరానికి శక్తిని అందించడానికి ఎల్లప్పుడూ ఒక గ్లాసు పాలు తాగడం మంచిది. 50 మిల్లీలీటర్ల పాలు ఒక మహిళ శరీరానికి 35 కిలో కేలరీలు అందిస్తుంది.
- **రాత్రి భోజనం (రాత్రి 7–8 గంటల మధ్య):** మధ్యాహ్నం మాదిరిగానే రాత్రి భోజనంలో తృణధాన్యాలు(60గ్రా), పప్పులు (15గ్రా), గింజలు/విత్తనాల నూనె (5గ్రా), పెరుగు (100 మి.లీ), పండ్ల (50గ్రా)లో తీసుకోవాలి. ఇవి రోజుకు మొత్తం 415 కిలో కేలరీలు అందజేస్తాయని నివేదికలో పేర్కొంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు

హొసపేటె: కర్ణాటక ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలు సోమవారం విజయనగర జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. విజయనగర జిల్లాలో మొత్తం 18,233 మంది ఓటర్లు ఉండగా జిల్లాలోని 6 తాలూకాల్లోని 21 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించగా, మహిళలు, పురుషులు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకొన్నారు. హొసపేటె నగరంలో చిత్తవాడిగి ప్రభుత్వ పీబీఎస్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓటర్లు ఓటు వేశారు. ప్రతి ఎన్నికల పోలింగ్ బూత్‌ల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శృతి పోలింగ్ బూత్‌లను సందర్శించి పరిశీలించారు.

6న శాంతి హోమం

హుబ్లీ: ధార్వాడ ఉదయ్ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో లోక కళ్యాణార్థం శనేశ్వర జయంతి శుభ సందర్భంగా ఈనెల 6న ఉదయం 9 గంటలకు పండిత్ రామాచార్ అధ్యాపక్ నేతృత్వంలో శాంతి హోమం జరగనుంది. మకర, కుంభ, మీన, తులా, కర్కాటక రాశుల భక్తులు స్త్రీ శని, శాంతి హోమ ప్రయోజనం పొంది దోష పరిహారం చేయించుకోవాలని, మరిన్ని వివరాలకు 9448775299 నెంబరులో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

కదం తొక్కిన కార్యకర్తలు



కలబురిగిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎల్‌కేజీ, యూకేజీలను కేటాయించాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లాధ్యక్షురాలు పద్మ డిమాండ్ చేశారు. సోమవారం కలబుర్గి డివిజనల్ విద్యా శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వహించే కార్యకర్తలకు ఇప్పటికే ఎల్‌కేజీ, యూకేజీ బోధనకు సంబంధించిన శిక్షణ ఇచ్చారన్నారు. అయినా ప్రభుత్వం కళ్యాణ కర్ణాటకలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

మోకాళ్ల నొప్పులకు చికిత్స శిబిరం

హుబ్లీ: నగరంలోని పాత హుబ్లీ హెగ్గేరిలోని ఆయుర్వేదిక్ వైద్య కళాశాల ఆస్పత్రిలో మోకాళ్ల నొప్పులు, మోకాళ్లు పట్టుకోవడం, వాపు లేక వాపు వల్ల బాధలు పడుతున్న రోగులకు అవసరమైన చికిత్సా శిబిరం సోమవారం ప్రారంభం అయింది. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం ద్వారా పంచకర్మ విభాగం సేవలు పొందవచ్చు. ఈ నెల 8 వరకు ఆసక్తి గల రోగులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు డాక్టర్ శిల్పాశ్రీని 6361046045 అనే నెంబర్‌లో సంప్రదించాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ ప్రశాంత్ ఓ ప్రకటనలో కోరారు.

విక్రయ కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

బళ్లారిఅర్బన్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే దిశలో వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం విత్తన, సాగు పరికరాల విక్రయ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. జిల్లాలో ఇంతవరకు 92 విక్రయ కేంద్రాలను సందర్శించి తనిఖీ చేపట్టారు. 71 విక్రయ కేంద్రాల బాధ్యులకు నోటీసులను జారీ చేశారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు తదితరాల నమూనాలను సదరు ప్రయోగాలయానికి పంపించారు. జిల్లా వ్యవసాయ శాఖ జేడీ తిరుమలేష మాట్లాడుతూ జిల్లాలో ఎలాంటి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల కొరత లేదన్నారు. రైతులు సాగు పరికరాలను అధీకృత విక్రేతల నుంచి కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు, రసీదులు తీసుకోవాలని ఆయన సూచించారు.

నేటి కౌంటింగ్‌కు ఆంక్షలు అమలు

హొసపేటె: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలు- 2024 కౌంటింగ్ కోసం జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు సీఆర్‌పీసీ-1973 సెక్షన్- 144 ప్రకారం విజయనగర జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిషేధాజ్ఞల అమలుకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లాధికారి దివాకర్ తెలిపారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ముగిసిన తర్వాత కూడా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ ఆదేశాలు అమలులో ఉంటాయని తెలిపారు. జిల్లా అంతటా అమలులో ఉండే ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై భారత శిక్షాస్మృతిలోని సెక్షన్-188 ప్రకారం ప్రాసిక్యూట్ చేస్తారన్నారు. అయితే కౌంటింగ్, పోలీసు అధికారులు, ఎన్నికల సిబ్బంది ఈ ఉత్తర్వు వర్తించదని తెలిపారు.

అభ్యర్థుల భవితవ్యం తేలేది నేడే

- పోలింగ్ కేంద్రం చుట్టుపక్కల 144 సెక్షన్ అమలు
- ఆర్‌వైఎంఈ కళాశాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు
- నెల రోజులుగా ఉన్న నెలకొన్న ఉత్కంఠకు ఇక తెర
- కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

సాక్షి,బళ్లారి: మే 7వ తేదీన ముగిసిన లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు నేడు మంగళవారం జరగనుంది. దాదాపు నెల రోజుల పాటు స్ట్రాంగ్ రూంల్లో భద్రంగా ఉన్న ఈవీఎంలను నేడు తెరిచి ఓట్ల లెక్కింపు చేపట్టే ప్రక్రియ నగరంలోని రావ్ బహుద్దూర్ వై.మహాబలేశ్వరప్ప ఇంజినీరింగ్ కాలేజీ(ఆర్‌వైఎంఈసీ)లో జరిపేందుకు జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ విధులకు నియమితులైన అధికారులు, సిబ్బంది కూడా కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకున్నారు. బళ్లారి లోక్‌సభ పరిధిలోని బళ్లారి, బళ్లారి గ్రామీణ, హొసపేటె, హడగలి, హగరిబొమ్మనహళ్లి, కూడ్లిగి, కంప్లి, సండూరు నియోజకవర్గాల అన్ని ఈవీఎంలను ఎన్నికలు ముగిసిన రోజు నగరంలోని ఆర్‌వైఎంఈసీకి తరలించి గట్టి బందోబస్తు మధ్య ఉంచారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ ప్రారంభం కావడంతో అభ్యర్థుల భవితవ్యం మరికొన్ని గంటల్లో తేలనుంది. ఉదయం 12 గంటల లోపు బళ్లారి లోక్‌సభ సారథి ఎవరో దాదాపుగా తేలనుంది. బీజేపీ అభ్యర్థిగా శ్రీరాములు, కాంగ్రెస్ అభ్యర్థిగా తుకారాం పోటీ చేశారు. ఇరువురూ హోరాహోరీగా ప్రచారం చేశారు. ఇద్దరూ సమఉజ్జీలే కాకుండా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే. బీజేపీ అభ్యర్థి ప్రధాని మోదీ హవాను నమ్ముకుని గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తుండగా, కాంగ్రెస్ అభ్యర్థి తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక అమలు చేసిన ఐదు గ్యారెంటీలతో పొందిన జనాదరణతో కచ్చితంగా తామే గెలుస్తామని నమ్మకంతో ఉన్నారు. జూన్ 1వ తేదీన వెలువడిన ఎగ్జిట్‌పోల్స్ సర్వేలతో రెండు పార్టీలకు ఊపిరాడనంతగా ఉత్కంఠ నెలకొంది. గెలుపుపై రెండు పార్టీలకు చెందిన అభ్యర్థులు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా ఓట్ల లెక్కింపు జరిగే వరకు రెండు పార్టీల్లోను టెన్షన్ కనిపిస్తోంది.

ఫలితాల వెల్లడి తర్వాత సంబరాలకు బ్రేక్

ఓట్ల లెక్కింపు నేడు జరగనున్న తరుణంలో అభ్యర్థుల భవితవ్యం కూడా మరి కొన్ని గంటల్లో బయటపడనుండటంతో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నగరానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించి పోలీసులు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత పెద్ద ఎత్తున చేసే సంబరాలకు బ్రేక్ వేశారు. బాణసంచా పేల్చడం కూడా నిషిద్ధం అని ప్రకటించారు. ప్రతి ఎన్నికల్లోను ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత సంబరాలు, బాణసంచా పేల్చడం నిషేధించినా గెలిచిన అభ్యర్థులు ఎవరైనా హోరెత్తిన సంబరాలు చేసుకుంటున్నా పోలీసులు అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈసారి ఎన్నికల నిబంధనల మేరకు గెలిచిన అభ్యర్థులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకునేందుకు అనుమతి ఇస్తారా?పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తారా? అన్నది చర్చనీయాంశమైంది.



రాయచూరులో ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

నేడు కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

రాయచూరు రూరల్: నగరంలో మంగళవారం రాయచూరు లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు అన్ని రకాల ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. రాయచూరు, యాదగిరి జిల్లాల పరిధిలో విస్తరించిన లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు 159 మంది సూపర్‌వైజర్లు, 159 మంది సహాయకులు, 168 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. రాయచూరు, రాయచూరు గ్రామీణ, మాన్వి, లింగసూగూరు నియోజకవర్గాల ఓట్లు లెక్కింపును ఎస్ఆర్‌పీఎస్ కళాశాలలో, దేవదుర్గ, యాదగిరి, సురపుర, శహాపుర నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును ఎల్‌వీడీ కళాశాలలో లెక్కించనున్నారు.

గెలుపు ఆశలు ఫలించేనా?

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలో మంగళవారం ఓట్ల లెక్కింపునకు శ్రీకారం చుట్టడంతో విజయ దరహాసం కోసం అభ్యర్థులు ఉవ్విళ్లూరుతున్నారు. ఎగ్జిట్ పోల్ అంచనాలతో ఆయా పార్టీల నాయకుల మద్దతుదారులు, కార్యకర్తలు గెలుపుపై బెట్టింగ్‌ల జోరు అధికంగా ఉంది. రాయచూరు లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్ రెండోసారి విజయానికి కాంగ్రెస్ అభ్యర్థి కుమార నాయక్ కళ్లెం వేస్తారేమోననే అనుమానాలున్నాయి. కొప్పళలో కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాళ్, బీజేపీ అభ్యర్థి బసవరాజ్‌ల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఈనేపథ్యంలో ఆయా నియోజకవర్గాల్లో ఎవరెవరు అభ్యర్థులు విజయం సాధిస్తారో వేచి చూడాల్సిందే.

ఉత్తమ విద్యకు జ్ఞాపక శక్తి అత్యవసరం

హుబ్లీ: ధార్వాడలోని ఎస్‌డీఎం వైద్య కళాశాల శరీర క్రియా శాస్త్ర విభాగం ద్వారా ఏర్పాటు చేసిన జ్ఞాపకం, మరుపు అనే ప్రత్యేక వర్క్‌షాపును ఆ సంస్థ వైస్ చాన్సలర్ డాక్టర్ నిరంజన్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జ్ఞాపక శక్తి మానవుడికి ఎంతో విలువైన ఆయుధం, చెడు జ్ఞాపకాలు మరవడం ఒక వరం అన్నారు. గందరగోళం ఎక్కువ కావడం, ఏకాగ్రత తగ్గిపోవడం మంచి లక్షణాలు కావని అన్నారు. ఉత్తమ విద్య సాధనకు ఉపాధ్యాయులు మంచి జ్ఞాపకశక్తి కలిగి ఉండాలన్నారు. ఉత్తమ జ్ఞాపక శక్తి, మంచి జ్ఞానం జీవితంలో పునరావృతం అవుతుండాలన్నారు. ఆ సంస్థ ఎండీ పద్మలతా నిరంజన్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ సిద్దేంద్ర శెట్టర్, డాక్టర్ నాగలక్ష్మీ, డాక్టర్ గ్రామోపాధ్యాయ భూషణ, డాక్టర్ సచిన్, డాక్టర్ మల్లికార్జున గౌడ పాల్గొన్నారు.

ప్రశాంతంగా విధాన పరిషత్ ఎన్నికలు



బళ్లారిలో ఓటేసిన మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ సతీష్



బళ్లారిలో ఓటేసిన స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



రాయచూరులో ఓటు వేసేందుకు వరుసలో నిలబడిన పట్టభద్రులు

- చల్లబడిన వాతావరణం, 6న ఓట్ల లెక్కింపు
- అక్కడక్కడ వర్షంతో పోలింగ్‌కు అంతరాయం

సాక్షి,బళ్లారి: ఈశాన్య పట్టభద్రుల నియోజకవర్గం విధాన పరిషత్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గం పరిధిలోని బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు, యాదగిరి, కలబురిగి, బీదర్ అనే ఏడు జిల్లాల్లో ఓటు హక్కు ఉన్న పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడు జిల్లాల పరిధిలో మొత్తం 1,40,427 మంది ఓటర్లు ఉండగా, ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు జరిగిన పోలింగ్‌లో దాదాపు 70శాతం పైగా పట్టభద్రులు తమ ఓటు వేశారు. వాతావరణంలో కూడా మార్పులు రావడంతో ఎండల తీవ్రత తగ్గిపోవడంతో చల్లని వాతావరణంలో ఓటర్లు ఉల్లాసంగా బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అక్కడక్కడ వర్షాలు కూడా రావడంతో ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేందుకు అవాంతరాలు కూడా ఏర్పడ్డాయి. బళ్లారి జిల్లా వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు బారులు తీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ముగ్గురి మధ్యే పోటాపోటీ

ఈశాన్య పట్టభద్ర నియోజకవర్గ పరిధిలో 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా బీజేపీ అభ్యర్థి అమరనాథ్ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ పాటిల్, స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డిల మధ్య గట్టి పోటీ నెలకొంది. ముగ్గురు అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల రోజున కూడా తమ తమ మద్దతుదారులతో ఓటును వేయించుకునేందుకు వారి వారి మద్దతుదారులు పోటీ పడ్డారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రధాన పార్టీలకు చెందిన ప్రముఖ నేతలు, కార్యకర్తలతో పాటు స్వతంత్ర అభ్యర్థికి చెందిన నాయకులు, కార్యకర్తలు కూడా టెంట్లు వేసుకుని ఓటర్లకు చీటీలు రాసిస్తూ తమకే ఓటు వేయాలని అభ్యర్థించడం కనిపించింది. బళ్లారి నగరంలో జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రాతో పాటు స్వతంత్ర అభ్యర్థి నారా ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, విధాన పరిషత్ సభ్యుడు వై.ఎం.సతీష్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు శాంతియుతంగా జరగడంతో ఈనెల 6వ తేదీన కలబుర్గిలో ఓట్ల లెక్కింపు జరగనుంది. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే పట్టభద్రులకు ఆయా పార్టీలకు చెందిన వారు ప్రలోభాలకు గురి చేశారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తూ తమకు ఓటు వేయాలని కోరడం చర్చనీయాంశంగా మారింది.

పోలింగ్ ప్రశాంతం

రాయచూరు రూరల్: కళ్యాణ కర్ణాటకలోని ఈశాన్య పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం పోలింగ్ సోమవారం రాయచూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ఓటింగ్ కేంద్రాలను జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్ పరిశీలించారు. జిల్లాలో 20,317 మంది ఓటర్లున్నారు. 30 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటింగ్ కేంద్రాన్ని జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎస్పీ నిఖిల్ పరిశీలించారు.

జిల్లాలో ముగ్గురికి ఎమ్మెల్సీ స్థానాలు

రాయచూరు రూరల్: విధానసభ నుంచి విధాన పరిషత్‌కు ఈనెల 13 న జరగనున్న ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం జిల్లా నుంచి ముగ్గురికి ఎమ్మెల్సీ స్థానాలు కేటాయించినట్లు తెలిసింది. మంత్రి ఎన్ఎస్ బోసురాజుకు రెండోసారి ఎమ్మెల్సీ పదవిని కల్పించింది. బోసురాజుకు రాహుల్ గాంధీ, సీఎం సిద్దరామయ్య మద్దతు ఉండగా, కేపీసీసీ కార్యాధ్యక్షుడు వసంత్ కుమార్‌కు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మద్దతుతో ఎమ్మెల్సీ పదవి లభించింది. ఇక రాష్ట్ర యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జిల్లాలోని సింధనూరుకు చెందిన బసనగౌడ బాదర్లికి కూడా రాహుల్ గాంధీ, సీఎం సిద్దరామయ్యల మద్దతుతో ఎమ్మెల్సీ పదవి దక్కింది.

భారీ వర్షం.. వణికిన జనం



ఎస్ఎన్‌పేట్ అండర్ బ్రిడ్జిలో నిల్వ చేరిన వాన నీరు



వర్షపు నీటితో చిత్తడిగా మారిన ఓ ప్రధాన వీధి

బళ్లారిఅర్బన్: నైరుతి రుతుపవనాల రాకతో ఆకాశంలో మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో కూడిన గాలి బీభత్సంతో భారీ వర్షం కురిసింది. సోమవారం తెల్లవారు జామున 2 గంటల నుంచి ఉదయం వరకు భారీ వర్షం పడడంతో ఉరుములకు స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మరో వైపు విద్యుత్ అంతరాయం కలగడంతో ప్రజలకు నిద్రాభంగం కలిగింది. ఈ వర్షం ప్రభావంతో పంట పొలాల్లోకి నీరు చేరుకొని రైతన్నలకు ఊరట లభించింది. నగరంలో ప్రధాన రోడ్లపై ప్రవహించిన నీరు లోతట్టు ప్రాంతాల్లోకి చేరుకొని కొన్ని వీధులు జలావృతమయ్యాయి. ఎస్ఎన్‌పేట్ బ్రిడ్జి కింద భారీగా నీరు నిలిచి పోవడంతో రాకపోకలు స్తంభించాయి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల ప్రాంగణాల్లో వర్షపు నీరు నిలవడంతో బురదమయంగా మారింది.

కుంభవృష్టితో పంటలు జలావృతం



హంపీ రహదారిలో నిల్వ చేరిన వర్షం నీరు

హొసపేటె: నగరంలో ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి పంట పొలాల్లోకి నీరు చేరింది. రాత్రి 1 గంట నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నగర శివార్లలో ఉన్న రాయర చెరువు కింద ఉన్న వందలాది ఎకరాల్లో పండించిన అరటి, చెరుకు, మొక్కజొన్నతో పాటు ఇతర పంటల్లోకి వర్షపు నీరు చేరి జలావృతమైంది. పొలాల్లో ఉన్న పంటలు నీట మునిగాయి. కష్టపడి సాగు చేసిన పంటల్లోకి వర్షపు నీరు చేరడంతో రైతన్న కంగు తిన్నాడు. అదే విధంగా భారీ వర్షానికి హంపీ వైపునకు వెళ్లే దారిలో ఉన్న కడ్డిరాంపురంలో వర్షం నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు.



ఉప్పొంగిన వాగులో చిక్కుకొన్న ట్రాక్టర్



కారిగనూరు సమీపంలో పొంగిపొర్లిన వాగు



రాయర చెరువులో నీట మునిగిన పంటలు

ఓట్ల లెక్కింపునకు భద్రత కట్టుదిట్టం

- మధ్యాహ్నం కల్లా ఫలితాల వెల్లడికి అవకాశం

హుబ్లీ: ప్రజాస్వామ్య ఓట్ల పండుగ ప్రక్రియ చివరి దశ ఫలితాలు వెల్లడయ్యే శుభ ఘడియలు వచ్చేశాయి. తమ తరపున సమస్యల వాణి వినిపించే ధ్వని ఎవరిదో తేల్చే సమయం ఆసన్నమైంది. మరి కొన్ని గంటల్లో ధార్వాడ లోక్‌సభ ఎంపీ ఎవరన్నది తేలనుంది. కాగా మే 7 జరిగిన ఎన్నికల సంబంధించి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ధార్వాడలోని ప్రముఖ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో కనీవినీ ఎరుగని రీతిలో పోలీస్ భద్రత కల్పించారు. ఓట్ల లెక్కింపు పర్యవేక్షకులు, సహాయకులు తదితరులతో కలిపి మొత్తం 1500 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. అలాగే 697 మంది రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరపున లెక్కింపు ఏజెంట్లుగా రానున్నారు. ఆ మేరకు సోమవారం సాయంత్రం 6 గంటల నుంచే జిల్లా వ్యాప్తంగా నిషేధాజ్ఞలు ప్రారంభం అయ్యాయి. ఈ నెల 5న రాత్రి 10 గంటల వరకు శాంతి భద్రతల పరిరక్షణ కోసం 144 సెక్షన్ మేర నిషేధాజ్ఞలు అమలు చేశారు.

తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసిన తక్షణమే అభ్యర్థులు, రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలకు, బ్యాలెట్ పత్రాలకు సీల్ వేస్తారు. కాగా ఓట్ల లెక్కింపునకు 112 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 20 రౌండ్ల లెక్కింపు ప్రక్రియకు అవసరమైన సమస్తం సిద్ధమైంది. మొత్తం 8 అసెంబ్లీ నియోజకవర్గాలను కలిగిన ధార్వాడ లోక్‌సభ క్షేత్రం మొత్తం 17 మంది అభ్యర్థులు పోటీ చేశారు. వీరిలో ప్రధానంగా బీజేపీ తరపున 5వ సారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి, కాంగ్రెస్ అభ్యర్థి విజయ్ అసోటికర్, ఇతర 15 మంది అభ్యర్థులు తమ భవితవ్యాన్ని మంగళవారం తేలనుంది. మొబైల్‌కు అవకాశం లేకుండా పటిష్ట భద్రత మధ్య ముఖ్యంగా 650 పోలీస్ సిబ్బందిని నియమించారు. ప్రత్యేకంగా వాహన వ్యవస్థను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది, ఇలా ప్రతి వర్గానికి వేర్వేరు అనువైన చోట్ల ధార్వాడ పెప్సీ కోలా కంపెనీ నుంచి ఈ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు.

కనీవినీ ఎరుగని రీతిలో పహారా

ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, ఇబ్బందికర పరిణామాలు తలెత్తకుండా ఈ 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గతంలో ఎన్నడూ లేని రీతిలో పోలీస్ సిబ్బంది పహారా కాయనున్నారు. కాగా రూ.20.37 కోట్ల నగదును ఎన్నికల సందర్భంగా మార్చి 16 నుంచి జూన్ 2 వరకు జప్తు చేశారు. కోడ్ ఉల్లంఘన కేసు ద్వారా రూ.20,37,02,970 నగదుతో పాటు 8.778 కేజీల బంగారు అంటే దీని విలువ రూ.38,50,000 ఉంటుందని అంచనా వేశారు. డ్రగ్స్ తదితరాలు 12.787 కేజీలు అనగా రూ.11,74,180 విలువ చేసే డ్రగ్స్‌తో పాటు మద్యం 11,794.030 లీటర్లు దీని విలువ రూ.37,61,727 విలువ కాగా ఉచిత కానుకలు దుస్తులు, ప్యాంట్లు, చీరలు తదితర వస్తువులకు సంబంధించి మొత్తం రూ.30,07,690 విలువ చేసే వస్తువులను జప్తు చేశారు. మొత్తానికి నగదుతో పాటు రూ.21,54,96,567 విలువ చేసే వస్తువులను జప్తు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లాధికారిణి దివ్యప్రభు తెలిపారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన భద్రత



ఈవీఎంలను భద్రపరిచిన దృశ్యం

కుక్క కాటుపై నిర్లక్ష్యం వద్దు



రేబిస్ వ్యాధిపై చైతన్యం కల్గిస్తున్న డీహెచ్‌ఓ డాక్టర్ రమేష్‌బాబు

బళ్లారిఅర్బన్: పెంపుడు కుక్క, వీధి కుక్కలు కరిచిన వెంటనే నిర్లక్ష్యం చూపకుండా సబ్బు నీరుతో గాయాన్ని, కొరికిన భాగాన్ని శుభ్రంగా కడిగి ఆ వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రేబిస్ టీకాను వేయించుకోవాలని డీహెచ్‌ఓ డాక్టర్ వై.రమేష్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక బండిహట్టి నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వట్టప్పకేరి ప్రాంతంలో ఆయన క్షేత్ర పరిశీలన చేసి ప్రజలకు చైతన్యం కలిగించారు. కుక్క, పిల్లి తదితర పెంపుడు ప్రాణులు కొరికినప్పుడు రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా కుక్కలు కొరకడం వల్ల ఎక్కువ శాతం రోగాలు వ్యాపిస్తాయని, నిర్లక్ష్యం చూపకుండా టీకా తీసుకొని ప్రాణాలను కాపాడుకోవాలని, ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా సంభవించే రేబిస్ మరణాల్లో 36 శాతం భారత్‌లోనే జరుగుతున్నాయన్నారు.

అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో టీకా

ప్రస్తుతం జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో తక్షణమే రేబిస్ టీకా లభ్యమయ్యే దిశలో హ్యాటిరేబిస్ క్లినిక్‌లను స్థాపించామన్నారు. జంతువులకు కొరికినప్పుడు తక్షణమే వైద్యం అందించడానికి వివిధ పథకాల ద్వారా అవసరమైన చికిత్స, మందులను ఆరోగ్య శాఖ సిద్ధంగా ఉంచిందన్నారు. రేబిస్ వ్యాధి ఒక్కసారి వ్యాపిస్తే చికిత్స లేదన్నారు. అందుకే కుక్క కొరికిన వెంటనే 24 గంటల్లోగా ఈ టీకాను తప్పకుండా తీసుకోవాలని ఆయన సూచించారు. అలాగే కుక్కల సంతాన ఉత్పత్తి నియంత్రణపై వివిధ శాఖల సహకారంతో కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. రేబిస్ వ్యాధిని పూర్తిగా నియంత్రించవచ్చునన్నారు. వైద్యాధికారులు డాక్టర్ యాస్మిన్, ఈశ్వర్ హెచ్ దాసప్పనవర్, సిబ్బంది దానకుమారి, శారద, మహాలింగ, ఆశా కార్యకర్తలు పార్వతి, భువనేశ్వరి, గిరిజా పాల్గొన్నారు.

నైరుతి వానలు.. కృష్ణమ్మ పరుగులు



కృష్ణా నదిలో పారుతున్న వరద నీరు



చిత్తడిగా మారిన కాయగూరల మార్కెట్

రాయచూరు రూరల్: నైరుతి రుతుపవనాల రాకతో పడమటి కనుమల్లో వర్షాలు పడుతుండడంతో కృష్ణాతో పాటు పరివాహక ప్రాంత నదుల్లో జలకళ మొదలైంది. ఆదివారం రాత్రి, సోమవారం గంటల తరబడి భారీ ఎత్తున వాన కురిసింది. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర పైభాగంలో, కొంకణ్ ప్రాంతంలో భారీగా నీరు ప్రవహించడంతో కృష్ణా నదిలోకి వరద నీరు వచ్చి చేరుతున్నాయి. ఉత్తర, కళ్యాణ కర్ణాటక జిల్లాల్లో ఎక్కడ చూసినా వాగులు, వంకల్లో వాన నీరు పారుతోంది.

భారీ వర్షం.. లోతట్టు జలమయం

జిల్లాలో భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి, సోమవారం జడి వాన కురిసింది. జిల్లాలో ఎక్కడ చూసినా రోడ్లు బురద గుంటలుగా మారాయి. అరబ్ కాలనీ పక్కనే వంతెన ఉండడంతో వాన నీరు కాలనీలోకి ప్రవేశించాయి. కురిసిన వానలకు రంగ మందిరం వెనుక, జహీరాబాద్ కాలనీలో పెద్ద చెట్లు కూలిపోవడంతో విద్యుత్ కోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూరగాయల మార్కెట్‌లో బురద నీరు చేరడంతో కాయగూరలు తడిసిపోయాయి.